# అనగనగా ఓ మంచికథ

2012 - 2013



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

కౌముది ప్రచురణలు - 84

| | | |
|---|---|---|
| 1. అసలు సమస్య | శారద | 3 |
| 2. మసి మరక | మధురాంతకం రాజారాం | 6 |
| 3. పెసరపప్పు కథ | వసుంధర | 12 |
| 4. కోర్టుకు రాని పక్షులు | రాచకొండ విశ్వనాథశాస్త్రి | 17 |
| 5. ఆకుపచ్చని జ్ఞాపకం | వంశీ | 22 |
| 6. సగటుతండ్రి | దేవరకొండ మురళి | 29 |
| 7. అడల్ట్ స్టోరీ | కె.ఎన్.వై.పతంజలి | 40 |
| 8. సహ్రప్రయాణం | ఆకెళ్ళ | 43 |
| 9. పొరుగింటి మీనాక్షమ్మ | వసుంధర | 47 |
| 10. నీడ వెనుక నిజం | జలంధర | 53 |
| 11. చావు బ్రతుకుల మధ్య దూరం | ద్వివేదుల విశాలాక్షి | 59 |
| 12. అతని కోరిక | బాలగంగాధర తిలక్ | 65 |
| 13. కెరటాలు పలకరించాయి | పోతకూచి సాంబశివరావు | 75 |
| 14. అందచందాలకథ | అవసరాల రామకృష్ణ | 79 |
| 15. ఇంద్రధనస్సులో సంగీతం | కనక్ ప్రవాసి | 87 |
| 16. కవిరాజ విరాజితము | బుచ్చిబాబు | 94 |
| 17. రాధ | 'వసంతమూర్తి | 102 |
| 18. పచ్చగడ్డి | అప్పాజీ | 117 |
| 19. పరివర్తన | తిలక్ | 121 |
| 20. స్వప్నసీమ | ఆలూరి భైరాగి | 128 |
| 21. సహ్రప్రయాణం | ఆకెళ్ళ | 135 |
| 22. పొరుగింటి మీనాక్షమ్మ | వసుంధర | 139 |
| 23. నీడ వెనుక నిజం | జలంధర | 145 |
| 24. అతని కోరిక | బాలగంగాధర తిలక్ | 151 |


కౌముది మాసపత్రికలో 2012 - 2013 సంవత్సరాల్లో ప్రచురించబడిన అలనాటి ఆణిముత్యాలు

# అసలు సమస్య - శారద

అక్టోబర్ 8, 1948 'తెలుగు స్వతంత్ర' లో ప్రచురించబడిన కథ

**"సార్, సారె"..**

కందసామి, బస్‌లోంచే కేకేసేటప్పటికి, వెంకటేశ్వర్లు, చప్పున ఇనపచువ్వ పట్టుకుని బస్‌స్టేషన్ బోర్డుమీద నుంచున్నాడు, కండక్టర్ కసురుకుంటున్నా వినకుండా. బస్ రాయపేట హైరోడ్డు దగ్గిర ఆగినప్పుడు, ఇద్దరు దిగటం వల్ల వెంకటేశ్వర్లు లోపలికి వెళ్ళి, కందసామి దగ్గిర కూచున్నాడు. కందసామి బస్‌లో ఇతరులున్నారనన్నా లెక్కజెయ్యకుండా, వొచ్చీరాని తెలుగులో, వెంకటేశ్వర్లుని పలకరించసాగాడు. కందసామికి, అనేక అలవాట్లున్నయ్. అన్నిట్లోకి ముఖ్యమైనది ప్రతి వాక్యాంతంలోనూ 'సార్' అనటం. ఆఫీస్‌లో మేనేజర్నీ, పెద్ద గుమస్తాల్నీ పది పదకొండేళ్ళనుంచీ అట్లా సంబోధించి సంబోధించి వాడికి ఎవరితో మాట్లాడుతున్నా 'సార్' రాకమానదు. అలవాటు కొద్దీ, వెంకటేశ్వర్లు కూడా ఏదో గుమాస్తా పనే చేస్తున్నప్పటికి, ఆఫీస్‌లోనే తన పనితో పాటు అక్కడి అలవాట్లని కూడా వదిలి వచ్చేవాడు కందసామి. కండక్టర్ దగ్గిర టికెట్లు కొంటూ చిల్లర డబ్బులు కోసం జేబులు తడుముకుని, "ఏదన్నా చిల్లరవుందా సార్! నోటుదా ఉంది. ఇంటిదగ్గర ఇస్తును" అని అడిగాడు స్నేహితుణ్ణి. వెంకటేశ్వర్లు మారు మాట్లాడకుండా, చిల్లర డబ్బులు తీసి కండక్టర్ చేతిలో పెట్టాడు. కందసామి, "తాంక్సు సార్, తాంక్సు. చాలా లేటుగా వచ్చినారేం సార్? ఆఫీస్‌లో పని కాలేదా?" అని సానుభూతితో కనుక్కున్నాడు. వెంకటేశ్వర్లు బస్‌లో, ఇతరులున్నారని బిడియపడుతూ గొంతు తగ్గించి "అవును!" అని మాత్రం అనేసి, కిటికీగుండా బైటికి చూడసాగాడు.

ఇద్దరూ రాయపేట హాస్పిటల్ దగ్గిర దిగి, ఆ పక్కనే ఉన్న కన్నియప్ప మొదలి వీధిలోకి ప్రవేశించారు మౌనంగా. ఆ వీధిలో నాల్గవ ఇల్లే వాళ్ళిద్దరికీ చిన్న పెంకుటికొంప. మొత్తం అద్దెకి కందస్వామి దాన్ని యజమాని దగ్గిర పుచ్చుకుని, రెండోవాటా వెంకటేశ్వర్లు కిచ్చాడు. ఇద్దరూ చెరో పదిహేనూ ఇచ్చుకుంటూ ఇరుకైనా అంతకన్నా వేరే గతేమీ లేకపోవటం వల్ల కాలక్షేపం జరుపుతున్నారు ఎట్లాగొట్లా.

ఆ ఇంటికి నాలుగ్గజాల దూరంలో ఓ కాఫీ హోటల్ ఉంది. ఇద్దరు మిత్రులూ, యథాప్రకారం కాఫీ హోటల్లోకి పోయి, కుర్చీల్లో కూర్చున్నారు. పదినిమిషాల బట్టి ఏమీ మాట్లాడకపోవటం వల్ల కడుపు ఉబ్బిపోయినవాడిలా కందసామి, తొందర తొందరగా,

"ఏమిసార్, పేపర్ చూస్తిరా ఇవాళ?" అని అడిగాడు ఉత్సాహంగా.

"రోజూ చూస్తాను" అని ముక్తసరిగా సమాధానమిచ్చి వెంకటేశ్వర్లు, సప్లయర్ తెచ్చిన కాఫీ చప్పరించసాగాడు.

కందసామి, కాఫీ ఓ గుక్క తాగి, "న్యాయమేనా సార్ ఇది? అని" హఠాత్తుగా ప్రశ్నించాడు కొంపంటుకున్నట్టు పోజ్ చేసి.

"ఏమిటి న్యాయం కాదంటావు?" వెంకటేశ్వర్లు ఆదుర్దాగా కనుక్కున్నాడు తన మిత్రుణ్ణి.

"అదేసార్ అదే, పట్నందా. ఆంధ్రులదేనని పేపర్‌లో చెపుతారు సార్. అది న్యాయమా సార్?" అన్నాడు కందస్వామి చాలా సీరియస్‌గా. అతని గొంతులో తమిళులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ధీమా, బాధ్యతా గోచరిస్తున్నై.

వెంకటేశ్వర్లు కాఫీ సొంతం తాగి, సిగరెట్ వెలిగించబోతూ, "అన్యాయమంటావేమిటి? మద్రాసు తప్పనిసరిగా మాదే అందులో నీకు అనుమానం కూడానా?" అన్నాడు, అతి శాంతంగా. అతని స్వరంలో వందల ఏండ్ల కిందట రాజ్యాలేలిన ఆంధ్రరాజుల గర్వం, హక్కూ ధ్వనించాయి.

కాఫీ కప్పు దభేలున బల్లమీద పెట్టి కందస్వామి "అదేమిసార్ నువ్వూ అట్లా చెపుతారు? దినం మద్రాసు చూస్తిరిగదా. మేముదా ఎక్కువ ఉండే సంగతి మీకు తెలీదా సార్?"

వెంకటేశ్వర్లు పకపకనవ్వి, "ఇదిగో కందసామి, మీ వాళ్ళెంత బూకరించినా మద్రాసు మాత్రం మాదే మేము చెంగల్పట్టువరకూ నివాసంగా ఉంటుంటే, మద్రాసు మీదెట్లా అవుతుందంటావు? పోని ఇటు హిస్టారికల్‌గా చూసినా తెల్లవాళ్ళకి ఈ పట్నాన్ని ఇచ్చిన చెన్నప్ప మావాడు!" అన్నాడు.

కందసామి వక్కపొడి కటకట నవులుతూ, "చెంగల్పట్టుదా మీది అంటారు. రేపు, తంజావూరు వరకుదా మాది అంటారు సార్. న్యాయం ఉండాలి సార్. తిరుపతివరకు మా వాళ్ళే ఉండారని నేను వాదిస్తుమసార్?" అని ఇంకేమంటావు అన్నట్టు వెంకటేశ్వర్లుని ప్రశ్నార్థకంగా చూశాడు.

వెంకటేశ్వర్లుని ప్రశ్నార్థకంగా చూశాడు.

వెంకటేశ్వర్లు కక్షగా కందసామి వంక చూస్తూ, "ఆమాటకొస్తే, మీవాళ్ళు లేనిదెక్కడ? హిమవత్పర్వతం మీద కూడా మీ వాళ్ళ కాఫీ హోటల్ ఉంది! అంతమాత్రం చేత అదంతా మాదేనంటే ఎవడొప్పుకుంటాడోయ్?" అంటూ కుర్చీనుండి లేచాడు. కందసామికి వెంకటేశ్వర్లు ఎత్తి పొడుపు మాటలకి ఒళ్ళుమండి, "చెన్నపట్నం మీకుదా ఎట్లా వస్తాదో, చూస్తును సార్! మేముదా,పైత్యం అనుకుంటావా సార్. చూడు మీ రత్తం వీధిలో ఓడాలి(ప్రవహించాలి) సార్!" అన్నాడు కోపంగా వెంకటేశ్వర్లు వైపు చూస్తూ.

"చూదాంగా" అని, వెంకటేశ్వర్లు కందసామిని తమిళ రెప్రజెంటేటివ్‌గా భావిస్తూ గడప దిగి, బిల్లు చెల్లించడం మరిచిపోవటం వల్ల మళ్ళీ వెనక్కి వెళ్ళి చిల్లర డబ్బులు అయ్యరుకు ఇచ్చి, ఇంటి ముఖం పట్టాడు. కందసామి కూడా కోపంగానే అతడి వెనకాలే తనలో తను ఏదో గొణుక్కుంటూ నడవసాగాడు.

## 2

వెంకటేశ్వర్లు తన భార్య కాంతంతో ఆ రాత్రి భోంచేస్తున్నప్పుడు ఇలా హెచ్చరించాడు: "కాంతం, ఆ కందసామిగాడి పెళ్ళాంతో నువ్వేమీ మాట్లాడబోకు ఈ క్షణం నుంచి."

కాంతం ఆశ్చర్యపడ్డది, ఈ అకస్మాత్తు హెచ్చరికకి, "ఏమండి? ఏమన్నా పోట్లాడేరా ఆయనతో? పొద్దుటిదకా బాగానే ఉంటిరి గదండి?" అని అడిగింది ఆశ్చర్యంగా.

"వాడా? వాడు ఒట్టిరోగ్ అనుకో! మద్రాసు అరవవాళ్ళదే అని పోట్లాట కొచ్చాడు నా మీదికి! రక్తం వీధుల్లో ప్రవహించాలిట! - అదంతా నీకెందుకుగాని, నువ్వు దానితో మాట్లాడబోకు."

"అయ్యో రామా! దీనికేనండి పోట్లాటా? బాగనే ఉంది విడ్డూరం!"

"నీకేం తెలుసునే, చదువూ సంధ్యాలేని దానివి? మద్రాసు ఏ రకంగా చూసినా ఆంధ్రులదే నేను బల్లగుద్ది చెప్పగలను. రూపాయికి పదహారణాల పాళ్ళూ, మద్రాస్ తెలుగే. అరవవాళ్ళు చచ్చిగీపెట్టినా, మద్రాసు వాళ్ళకి పోదనుకో! ఒక్క ఆంధ్రుడు ప్రాణంతో ఉన్నా పోట్లాట సాగల్సిందే!"

"అబ్బపోనిద్దురూ, మద్రాసు ఎవరిదైతే మనకేం ఒరిగిందండి? ఓ గుడ్డముక్క చవకగా వచ్చునా, పసిగా బియ్యపు గింజ దొరకునా? ఎందుకొచ్చిందండి పొరుగువాళ్ళతో పోరూ?"

"నీ బుద్ధి పోనిచ్చావుగాదు. ఆవిడతో ఇక ఎప్పుడన్నా నువ్వు మాట్లాడ్డం చుశానా, వీపు చెడుతుంది" అని వెంకటేశ్వర్లు, విస్తరి దగ్గర నుంచి లేస్తూ, కోపంతో అన్నాడు.

"నాకేం లెండి, మానేస్తాను" - కాంతం, ఏడుపు గొంతు పెట్టూ ఈ మాట అనేసి, వంటింటోంచి బయటకి పోయింది.

వెంకటేశ్వర్లు వసారాలో పక్కపరిచి పడుకుని ఆంధ్రులకి మద్రాసు రావటానికి గల ఆస్కారాన్ని గురించి ఆలోచించసాగాడు.

## 3

ఆ రోజు మొదలు కందసామి, వెంకటేశ్వర్లు ఒకళ్ళకొకళ్ళు ఎదురుపడ్డా కొరకొరా చూస్తూ తప్పుకుని తిరగసాగారు. ఇద్దరిలోనూ, ద్వేషం కూడుకట్టుకుని బలపడుతోంది అనుక్షణమూ. దీనికి తోడు అగ్నిలో ఆజ్యం పోసినట్లు కాంతమూ, కందస్వామి భార్య వళ్ళియమ్మా మధ్యమధ్య కీచులాడుకుని ద్వేషాన్ని పెంచసాగారు. అయితే, వెంకటేశ్వర్లుకు ఒక భయం మాత్రం ఉంటూ వచ్చింది. కందసామి తనను ఇల్లు ఖాళీచెయ్యమంటాడేమోనని. అయితే, కందసామి అలా చెయ్యలేదు. చెయ్యకపోవడానికి ఓ కారణం ఉంది. వెంకటేశ్వర్లు అద్దె సరిగ్గానే ఇస్తూ వచ్చాడు అప్పటి వరకూ అట్లాంటప్పుడు. అకారణంగా ఇల్లు ఖాళీ చెయ్యి అంటే, తన్నటానికి సిద్ధపడతాడేమో అని కందసామి భయపడ్డాడు. పైకి కందసామి గంభీరంగా మాట్లాడినా, రక్తం ప్రవహించాలని ప్రగల్భాలన్నా క్రియకు సాధువూ, పిరికిని.

నెల గడిచిపోయింది ఇట్లాగే. గుమాస్తాల జీవితం ప్రతినెలా సాఫీగా జరగదు. ఏదో వాడినా అద్దె సమయానికిద్దామంటే పడక వచ్చింది ఆ నెల. భార్యని పురిటికి పంపాల్సి వచ్చింది. పైగా హోటల్ భోజనానికి పెట్టుబడి పెట్టాల్సిన అవసరం పట్టింది. కందసామి చేత అడిగించుకోకుండానే, అద్దె ఇవ్వాలని విశ్వప్రయత్నం చేశాడు, వెంకటేశ్వర్లు. ఎంతో మంది స్నేహితుల్ని చే బదులు అడిగాడు. దొరకలేదు. ఎట్లానా భగవాన్! అని దిగాలు పడిపోయి, ఇక ఏమైనా సరేనని నిర్ధారణ చేసుకుని ఊరుకున్నాడు వెంకటేశ్వర్లు.

అయితే, వెంకటేశ్వర్లు అనుకున్నట్లు కందసామి అద్దెకోసం నిలదియ్యకపోవటం చాలా ఆశ్చర్యం కలిగించింది. ప్రతిరోజూ ఇవ్వాళ ఉంది యుద్ధం అనుకోటం, అట్లా కాకపోవటం జరిగింది.

ఇక రేపు ఫస్టు తారీకు అనగా, వెంకటేశ్వర్లు ఆ వేళ సాయంత్రం ఆలస్యంగా ఇంటికి వస్తూ గడప ఎక్కుతుండగా, కందసామి చాలా దిగాలు మొహం వేసుకుని, అరుగుమీద కూర్చుని ఉన్నవాడల్లా వెంకటేశ్వర్లుని చూడగానే లేచి, "సారే ఒకమాట చెపుతాను వస్తురా?" అని దిగులుగా పలకరించాడు.

ఇంటి బాడిగ గురించే కాబోలు. తన పరువు ఈ ఒక్కరోజు నిలబెడితే, రేపు జీతం వచ్చునే? పారేయొచ్చునే! అన్నాళ్ళు ఆగినవాడు ఈ ఒక్కరోజు ఓపిక పట్టకపోవటం కుట్రకాకపోతే, రేపు తనకి జీతం వస్తుందని వాడికి మాత్రం తెలీదు? అని ఐదు నిమిషాలపాటు ఆలోచిస్తో ఆగిపోయినాడు, మాటామంతీ లేకుండా.

ఏమిసార్ యోచిస్తుంటివి? రాసారు. 2వ తారీకున ఇల్లు ఖాళీ చెయ్యాలిసార్" అని మెల్లిగా జ్వరపడ్డవాడిలా అన్నాడు, కందస్వామి.

వెంకటేశ్వర్లు నిలువునా నీరైపోయినాడు. తను అనుకున్నదంతా అయింది. నుంచున్న పళంగా ఇల్లు ఖాళీ చెయ్యమంటే తను ఎక్కడికి పొయ్యేట్టు? ఛట్, ఇట్లాకానేకాదు. ఇల్లు ఖాళీ చెయ్యకపోతే ఏం చేస్తాడు వీడు? అదీ చూదాం అనుకుంటూ, ద్వేషం, పౌరుషం కలగలిసిన గొంతు పెట్టి "నేను ఖాళీ చెయ్యను: ఏం చేస్తావో చెయ్యి" అన్నాడు.

కందసామి, అరుగుదిగి వెంకటేశ్వర్లు దగ్గరికి వచ్చి భుజం మీద చెయ్యివేసి, "అదికాదు సార్. మన ఇంటివాడుండాడే మార్వాడీ, వాడు మొన్న బాడిగకి వచ్చినాడు సార్. వాడికిదా నేను రెండుమాసాల బాడిగ బాకి ఉంటిని. ఏం చేస్తును? మీరే చెప్పుమి. మా భార్యకి జ్వరం వచ్చినాది సార్. మీరు ఇచ్చిన డబ్బుకూడా డాక్టర్ కిస్తిని. అందుకుదా మార్వాడీ, నన్నుగూడదా ఇల్లు ఖాళీచెయ్యమని చెప్పేసినాడు సార్. నేనుదా ఏంచేస్తును సార్?" అన్నాడు చాలా ఖిన్నుడై కన్నీళ్ళు పెట్టుకుంటూ.

వెంకటేశ్వర్లుకి కళ్ళవెంట నీళ్ళు వచ్చినై.అతడు ధైర్యంగా కందసామి చెయ్యిపట్టుకుని ఊపుతో "భయపడకు కందసామి, మనం ఇద్దరం కలిసి నిలబడదాం. మనని ఖాళీ చెయ్యమంటానికి వాడికి ఎన్ని గుండెలో నేను చూస్తాను!" అన్నాడు.

"వద్దు సార్, వద్దు. వాడికి మనకి జగడం ఎందుకు సార్? నేనుదా నిన్ననే వేపేరిలో వేరే పూరిల్లు చూస్తిని. రెండు భాగాలుదా ఉండాది. మనం అక్కడికి పోతుమా?" అన్నాడు కందసామి, సహజంగా దరిద్రులలో ఉండే సహజమైన మానవత్వాన్ని ప్రదర్శించి.

వెంకటేశ్వర్లుకి, నిజంగా చాలా జాలీ దుఃఖమూ వచ్చింది. అనవసరంగా కందసామితో పేచీ పడ్డందుకు విచారిస్తూ "కందసామి, నీతో ఆవేళ పోట్లాడినందుకు ఏమీ అనుకోకు. మద్రాసు నీదీ కాదు, నాదీ కాదు! డబ్బున్నవాడిది! రేపే మనం ఇంటి బాకీ అంతా ఇచ్చేసి వెళ్ళిపోదాం!" అన్నాడు, కృతజ్ఞతావేశంతో బొంగురుపోయిన గొంతు సవరించుకుంటూ.

కందసామి, "నిజంసార్. మీరు చెప్పినది నిజమే సార్, డబ్బు ఉన్నవాడిదే సార్ పట్నం" అన్నాడు, యావత్తు తమిళ ప్రాతినిధ్యాన్ని మరిచిపోయి.

# మసి మరక - మధురాంతకం రాజారాం

**ఆంధ్రజ్యోతి వారపత్రిక - నవంబర్, 1975**

**ఆకాశం నిర్మలంగా ఉంది. వాతావరణం ప్రశాంతంగా ఉంది.** ఉదయం తొమ్మిదిగంటల వేళ. ఆ వేళప్పుడు తుఫాను రావచ్చునని ఊహించడం కష్టమే! నిజం. వచ్చింది తుఫానే! ఎలా వచ్చింది? ఓ మనిషి రూపంలో వచ్చింది.

మాసిపోయిన నాలుగుమూళ్ళ పంచె, గోనెపట్టాలా ఉన్న నీలిరంగు అరచొక్కా, పొట్టి వెంట్రుకల గుండ్రటి తల. కోపంతో కందగడ్డలా జేవురించిన ముఖం. అతడి పేరు కోదండం.

సెకండ్ బెల్ మ్రోగి ప్రార్థన జరిగిన తర్వాత పిల్లల హాజరు గుర్తించి పాఠం చెప్పడం కోసం అప్పుడే పుస్తకం చేతికి తీసుకుంటున్నాను. బోను తలుపు తీయగనే పైకి దూకే తోడేలులా వచ్చిపడ్డాడు కోదండం. కాగిన నూనెలో వేగి ఉబ్బుతున్న మినపగారెలా

మనిషి మనిషంతా కంపించిపోతున్నాడేమో. మాటలు కూడా తడబడుతున్నాయి. "హేమండీ హెడ్డమేష్టరు షారూ! సెప్పండి. ఊళ్ళో ఉండమంటారా లేకుంటే నెత్తిన బట్టేసుకుని మా బిడ్డపాపల్తో మమ్మల్ని ఊళ్ళోనుంచి వెళ్ళిపొమ్మంటారా? మీ కిష్టం లేకపోతే సెప్పేసెయ్యండి."

ప్రతిరోజూ దినపత్రికలు చూచేవాణ్ణి. దొంగనోట్లు, బ్యాంకు దోపిడీలు, అమ్మాయిల్ని తీసుకెళ్ళి అమ్మెయ్యడాలు. రైలు ప్రమాదాలు, నరబలులు మొదలైన వాటిని గురించి పుష్కలంగా విని ఉన్నాను. కానీ ఇష్టమైన వాళ్ళని ఊళ్ళో ఉండమని, మిగిలినవాళ్ళని వెళ్ళిపొమ్మనే హక్కు టీచర్లకుందని మాత్రం వినలేదు.

"అసలేం జరిగిందో ఉన్నదున్నట్టుగా చెప్పవయ్యా బాబూ?" అన్నాను. నా ఎట్టయెదుట బెంచీలపైన కూర్చున్న కుర్రకుంకలు అత్యంత 'సస్పెన్సు' ఘట్టాన్ని చూస్తూ, ఊపిరి బిగబట్టుకున్న ప్రేక్షకుల్లా, బొమ్మలకు మల్లే తయారైపోయి, కోదండం వైపు రిచ్చపడి పోయి చూస్తున్నారు.

"వద్దొద్దు, ఈ నిప్పుల మీద నీళ్ళు చల్లే మాటలొద్దండీ మేష్టారూ! మా బిడ్డలీమాత్రంగానైనా బ్రతికుండడం మీకిష్టంలేదు. అదే మీ ఉద్దేశం! అవునంతేనని సెప్పండి, నేను నోరు మూసుకుని వెళ్ళిపోతాను."

ఇదేం నవ్వులాటగా తుడిచి పెట్టుకపోయే వ్యవహారంలా కనిపించడంలేదు. ఆదమరిచి కూచుంటే నా గొంతుకకే ఉచ్చులా బిగుసుకుపోయేటట్టుంది. అందుకని వీలయినంతగా అప్రమత్తుడినై పోతూ "చూడు కోదండం! పొరబాటు చేయడమనేది మానవ సహజం, కానీ జరిగిన పొరబాటేమిటో తెలిస్తే, అందుకు కారకులైన వాళ్ళని మందలించే అవకాశముంటుంది. అలాంటిదికమీదట జరగకుండా చూచే వీలుంటుంది" అన్నాను.

"చెయ్యి విరిగితే అతికిస్తారటయ్యా మీరు!" గద్దించాడు కోదండం.

నిస్సందేహంగా ఇది శల్యవైద్యుల పని. టీచర్ల తరంగాదు.

"ఏది, ఎక్కడ వాడు?" అంటూ ఒక్క విసురుతో బయటికి వెళ్ళిన కోదండం, అక్కడ గోడచాటున ఎక్కడో నక్కి నిల్చున్న ఓ తొమ్మిదేళ్ళ కుర్రాణ్ణి లోపలికి లాక్కొచ్చాడు. చిన్న నిక్కర్ పైన, గుండీల్లేని పొట్టి చొక్కా ఒకటి వేసుకుని, చింపిరితలతో, జిడ్డోడుతున్న ముఖంతో ఉడుబోతు కాయలా కనిపిస్తున్న ఆ కుర్రాడు వాడి తల్లితండ్రుల సంతానంలో చిట్టచివరివాడు. మొదటివాడేమో - ఇదిగో నామీద పిటపిడుగులా విరుచుకుపడిపోతున్న కోదండం!

ఉడుబోతుకాయ కుర్రాడు - వాడిపేరు చక్రి - ఒక చెయ్యి పైకెత్తి పట్టుకున్నాడు. ఆ చేతిలో చక్రాయుధం లేదు. అంతకంటే భయంకరంగా రెండు వ్రేళ్ళూ కలిపి కట్టిన బాండేజీ ఒకటి కానవస్తోంది.

"ఏమిటిది? ఏమైంది?" అన్నాను కంగారుగా.

"ఏముంది? వ్రేళ్ళు సగందాకా తెగిపోయాయంతే! ఇంకా నయం! తలకాయ బొందపడి ఉండాల్సింది, చేతికడ్డంగా పెట్టుకున్నాడేమో, వ్రేళ్ళు మాత్రమే తెగాయి. వద్దుబాబూ ఎందుకొచ్చిన చదువులు. ఊపిరుంటే ఉప్పమ్ముకుంటాం. ఎందుకైనా మంచిదని మీతో ఒక మాట చెప్పిపోదామని వచ్చాను."

గిరుక్కున వెనుదిరిగి ద్వారం దాకా వెళ్ళినవాడు అక్కడ ఆగి మళ్ళీ నా వైపు చూస్తూ అన్నాడు. కోదండం - "అయితే ఒకటి. ఈ రోజు మాకయింది. రేపొద్దున ఇంకొకరికౌతుంది. ఇంతపని జరిగాక ఇక ఊరుకునేదిన్నీలేదు. దీని అంతేమిటో తేల్చుకోకుండా వదిలిపెట్టేదిన్నీ లేదు. ఇప్పటికింతే నేను చెప్పడం."

"అల్టిమేటం జారీ చేసిన మరుక్షణంలో కోదండం అక్కడ లేడు!"

తుఫాను వస్తుంది. వెళుతుంది. కానీ దాని తాలూకు బీభత్సమైన పరిణామం మట్టుకూ అంత తొందరగా మాసిపోయేదికాదు. కోదండం వచ్చి వెళ్ళాడు సరే! ఇక మీదట అతడేం చేయబోతున్నాడన్న ప్రశ్న గురిపెట్టిన బాణంలా నన్ను భయపెడుతోంది. ఉద్యోగరీత్యా ఈ ఊరికి బదిలీ అయినప్పటినుంచీ నేను కోదండాన్ని ఎరుగుదును. ఒకసారి నేను నోరుజారి "ఏమిటోయ్ కోదండం! ఈ మధ్య కనిపించడంలేదే?" అన్నాను.

"ఏమిటండీ మేష్టారూ! అప్పటికీ ఊళ్ళో బ్రతకలేక నేనెక్కడికైనా పారిపోయి ఉంటాననుకున్నారా?" అంటూ కస్సుమన్నాడు కోదండం. నాలుగేళ్ళ క్రితం జనాభా వివరాలు నమోదు చేయడం కోసం ఊళ్ళో ఇల్లిల్లూ తిరగాల్సి వచ్చింది. సమయానికి కోదండం ఇంట్లో ఉన్నాడు. "వ్రాసుకోండి సార్!, చాలు!" అంటూ విసుక్కున్నాడు. అన్నింటికన్నా చిత్రం. ఊళ్ళో ఏ ఇంట్లో శుభకార్యం జరుగుతున్నా వెళ్ళేది లేదని తన కుటుంబానికొక ఆనవాయితీ ఏర్పరిచాడు కోదండం. అక్కడ మంగళవాయిద్యాలు మ్రోగుతున్నంతసేపూ, ఇక్కడ ఈ ఇంట్లో తలుపులు బిడాయించే ఉంటాయి.

అంతవరకూ ద్వారబంధానికటువైపున తచ్చాడుతూ ఉండిపోయిన ప్యూను సిద్ధలింగం, జంకుతూనే లోపలికి వచ్చి "అయ్యగారూ! సారధి మేష్టార్ని పిలవమంటారా?" అన్నాడు.

"వద్దు" అన్నాను. ఆ మాట కాస్తా బిగ్గరగా అన్నానేమో సిద్ధలింగం ఉలిక్కిపడ్డాడు. బొట్టూ, కాటుకా పెట్టి పిలిచేదాకా వచ్చి సంజాయిషీ చెప్పుకోవడం తన ప్రతిష్ఠకు భంగకరమనుకుంటున్నాడేమో కుర్రపంతులు. అసలీ 'సారధి' అనే అతను ఉండేలు దెబ్బ తినని పిల్లకాకిలా ఇక్కడికి వచ్చి పడ్డాడు. వయసుకు మించిన హుందాతనం ఒకటి ఈ మనిషిలో! ఇందుకు కారణం బహుశా అతడు సంపాదించుకున్న డిగ్రీలో ఉండొచ్చునని నా ఊహ. కాలేజీలో లెక్చరరు కావడానికి అవసరమైనంత చదువు చదువుకున్నప్పటికీ ఉద్యోగావకాశాలకు ఏర్పడిన కక్కుర్తిని బట్టి, కన్సొలేషన్ ప్రయిజు బాపతుగా - స్టయిఫండరీ స్కీము క్రింద అతడీ బడికి పోస్టు చేయబడ్డాడు. తానేమిటో, తన పనేమిటో ఎప్పుడూ ఏ ఇతర లోకాల్లోనో సంచరిస్తూ ఉన్నట్టుంటుంది అతడి వాలకం. కానీ ఇతడిలో ఇంతలావు తలబిరుసుతనం ఉంటుందని మాత్రం అనుకోలేదు. ఇప్పుడంతకన్నా కోదండం కోపాన్ని తగ్గించడం ముఖ్యం. అందుకని "నువ్వెళ్ళి కోదండం ఏం చేస్తున్నాడో చూడవోయ్ సిద్ధలింగం! నచ్చజెప్పి ఇక్కడికి తీసుకురావడానికి ప్రయత్నించు" అన్నాను.

తలనొప్పి తగ్గడానికని ఓ కుర్రాణ్ణి పంపి ఇంటి దగ్గరినుంచి కాఫీ తెప్పించుకున్నాను. గ్లాసు ఖాళీచేసేసరికి సిద్ధలింగం తెచ్చిన వర్తమానం నా తలనొప్పిని ద్విగుణీకృతం చేసింది.

"కోదండం కనిపించడం లేదండీ అయ్యగారూ! ఇంట్లో అడిగాను. బడినుంచి వెళ్ళగానే సీతాపురానికి బస్సెక్కాడట! వాళ్ళమ్మ చెప్పింది"

సీతాపురమా? ఏదో స్వంత పనిమీద వెళ్ళి ఉంటాడు లెమ్మనుకున్నాను. కానీఆ సంతృప్తికూడా క్షణంలో సగం సేపు మాత్రమే!

"మరింక మనూరికి పోలీసు స్టేషనుండడం సీతాపురంలోనే గదండీ!"

నా గుండెలు జల్లుమన్నాయి. బడిలో అలజడిని గురించి పోలీసు స్టేషనులో ఫిర్యాదు -

నా బుర్ర గిర్రున తిరిగిపోసాగింది. కాగితంపైన అక్షరాలన్నీ నల్లగా అలుక్కుపోయినట్టున్నాయి. పాఠం చెప్పాలనిపించడంలేదు. కానీ నా కాళ్ళు నన్ను అప్రయత్నంగా కోదండం ఇంటికే తీసుకెళ్ళాయి. వీధి గుమ్మం దాటుకుని, నడవంతా నడిచి, హాల్లోకి అడుగుపెడుతూ, "అమ్మా" అని పిలిచాను. ప్రత్యుత్తరం వినిపించలేదుగాని భాగ్యమ్మ కనిపించింది. కోపిష్టి చిత్రకారుడు కసి తీర్చుకోడం కోసం గీచిన ఆడ బొమ్మలా భాగ్యమ్మ వంటింటి గుమ్మంలో నిలిచి ఉంది.

కొలిమిలో కాలి చల్లబడిన ఇనుములా కాయవాటు శరీరం భాగ్యమ్మది. మొగుడు పోయిన తర్వాత తల దువ్వుకోలేదేమో, తల మాయల మరాఠీ వేషగాడు వేసుకునే టోపీలా తయారైంది. కళ్ళు చింతనిప్పుల్లా మండుతున్నాయి. నిజం చెప్పొద్దు బుద్ధిమాలి ఆకలిగొనివున్న ఆడపులి దగ్గరికి వచ్చేశానేమోనన్న అనుమానంతో ఓ అడుగు వెనక్కే వేశాను.

''ఏమండీ పంతులుగారూ?'' ఉరిమినట్టుగా ప్రారంభించింది. భాగ్యమ్మ. ''గవర్నమెంటు డబ్బులిస్తోందిగదా అని మీరు ముప్పూటలా మెక్కి కూచుంటే మాకు ఆక్షేపణ లేదు. కండలు బలిసి కొవ్వెక్కి, కళ్ళుకానరాక తల్లక్రిందులుగా నడిచినా మాకు పొయ్యేదేమీ లేదు బాబూ. మాలాంటి నోరులేని వాళ్ళ ఉసురు పోసుకోడం న్యాయమేనా మీకు? రాత్రంతా బిడ్డ కంటిపైన రెప్పవేసి ఉంటే ఒట్టు, ఒళ్ళు కాలిన పెనంలా పెట్లిపోయింది. ఒకటే కలవరింతలు. ఇంటిల్లిపాదికీ శివరాత్రి జాగరమే. ఎందుకండీ మేము ఎవరబ్బ సొత్తుకు వచ్చామండీ? మిమ్మల్ని నిలదీసి అడిగే వాళ్ళెవరూ లేరా? మీ పంతుళ్ళు పసిపిల్లల్ని కొట్టుక తింటున్నారని మీ అన్నయ్య అదెవరికో అర్జీ పెట్టాలన్నాడే బి.డి.వో.నా - డి.ఇ.ఓ.నా, ఎవరే అతను?'

''డి.ఇ.ఓ.'' తడిక ఆవలినుంచీ సవరించి చెప్పింది కూతురు.

''అవునా? ఆ మహానుభావుడికి మా మొర ఎలా వినిపించదో చూస్తాం. వచ్చే వాళ్ళెవరో రాని, చెప్పేవాళ్ళేం చెప్పుకుంటారో చెప్పుకోని, ఇప్పుడాడంగులతో మీకేం మాటలండీ మాష్టారూ, అమ్మీ తాయారూ, అయ్యగారెళ్ళిపోగానే తలుపేసుకోవే?''

వడిసెల రాయిలా భాగ్యమ్మ పెరట్లోకి వెళ్ళిపోయింది.

బిక్కచచ్చిపోయి నేను జీవచ్ఛవంలా బయటికి వచ్చేశాను.

జడుసుకుంటే జ్వరం వస్తుందంటారు. భాగ్యమ్మతో భేటీ అయి ఇంటికి వెళ్ళిన తర్వాత నాకు నిజంగానే జ్వరం వచ్చినట్టు అనిపించింది. భోజనం చేసి పడుకున్నానేమో, లేవడానికి బుద్ధిపుట్టింది కాదు. బడికి వెళ్ళకుండా మంచంపైన పడివుండిపోయాను. ఖాయం. ఎంక్వయిరీలు, ఛార్జిషీటు, ఎక్స్ప్లనేషన్లు, సస్పెన్షన్లూ లేదా ఊష్టింగులు ఇలాంటి తతంగమంతా ఆ పైన తప్పనిసరి! తెలిసో, తెలియకో సారధి ఊబిలో కాలుపెట్టేశాడు. గొంతుకబంటి దాకా కూరుకుపోయాడు. చూస్తూ ఊరుకుంటే బుడుంగున అందులో మునిగిపోతాడు. అబ్బే. అలా జరగడానికి వీల్లేదు. ఎలాగైనా అతడికొక అవకాశం ఇచ్చి చూడడమే సబబు.

ఈనిర్ణయానికి రావడానికి కూడా నా స్వార్థమే కారణమని తెలిస్తే ఎవరైనా విస్తుపోతారు. ఆపదలో నేను గనుక ఇంకొకరిని ఆదుకుంటే - నాకాపద వచ్చినప్పుడు ఇంకొకళ్ళు (వీరిలో దేవుడు కూడా ఉన్నాడు) నన్ను ఆదుకుంటారన్నది నా నిశ్చితాభిప్రాయం.

చేసిన పనికి బెంబేలు పడిపోతూ సారథి తన గదిలో ఖిన్నుడై కూర్చుని ఉంటాడని నేనాశించాను. అలాంటిదేమీ లేకపోయేసరికినాకు కొంత ఆశ్చర్యమో, ఆశాభంగమే కలగక తప్పింది కాదు. బ్రహ్మచారి కొంపగదా, నానా కంగాళీగా ఉంటుందనుకుంటే, ఆ ఇల్లెంతో నీటుగా ఉంది. చెత్తలేదు. మురికి లేదు. బూజు లేదు. లేనివి లేకపోగా ఉండవలసినవన్నీ ఎక్కడివక్కడ పదిలంగా ఉన్నాయి. అలమరా నిండా పుస్తకాలు, ఓ మూలగా ఆయిల్ స్టవ్వు, చెక్కబీరువాలో వంటచేసుకోడానికి కావలసిన పాత్రలు, వస్తువులు. హాలుకు మధ్యగా గోడవార ఓ టేబిలు, కుర్చీ. చదువుకోడానికి వీలుగా టేబులు పైకి వ్రేలాడుతున్న దీపం. బుద్ధిగా కుర్చీలో కూర్చుని తానేదో పుస్తకమే చదువుకుంటున్నాడు.

''రండి మేష్టరుగారూ! మీరా నేనింకా ఎవరో అనుకున్నాను రండి. కూచోండి'' అంటూ లేచి, కుర్చీని నాకిచ్చేస్తూ, తాను వెళ్ళి ఎదురుగా ట్రంకు పెట్టెపైన కూర్చున్నాడు.

అంతలోనే ఏదో జ్ఞప్తికి వచ్చినట్టు -

''రాకరాక నా విడిదికొచ్చేశారు. పాలు కొంచెం మిగిలి ఉంది. కాఫీ చేసి ఇమ్మంటారా?'' అన్నాడు.

రోము నగరం కాలిపోతుంటే ఫిడేలు వాయిస్తూకూర్చున్న నీరోలా సారధి చెక్కుచెదరకుండా ఉండడం చూడ్డానికి విచిత్రంగానే ఉంది. ఇతడు గుండెలు తీసిన బంటా? లేక వట్టి అమాయకుడా!

"పోనీ, పాలే తీసుకోండి" అంటూ పైకి లేవబోయాడు సారథి.

నాకొకవైపున ఒళ్ళు మండిపోతూ ఉంది. "వద్దులేవోయ్ సారధీ! నువ్వు కూచో, నాకిప్పుడు నీ సత్కారాలేమీ అవసరం లేదు. సూటిగా నేను చెప్పవలసిందేదో చెప్పనివ్వు. ముందుగా నువ్వొకలీవు అప్లికేషన్ వ్రాసి నా చేతికివ్వు. అయిదురోజులకు పెడితే అటూ ఇటూ శని, ఆదివారాలు కలసి నువ్వు ఏడెనిమిది రోజులదాకా సెలవు 'అవైల్' చేసుకోవచ్చు."

"సెలవా! నాకా! అబ్బే, అనవసరంగా సెలవు పెట్టడమెందుకండీ?"

ముసుగులో గుద్దులాటకు పూర్తిగా స్వస్తి చెప్పి - "ఎందుకంటే, తెల్లవారేప్పటికి ఇక్కడుండడం నీకు శ్రేయస్కరం కాదు గనుక!" అంటూ తేల్చి చెప్పేశాను.

"ఎందుకండీ మేష్టరుగారూ! మీరెందుకలా అనుకుంటున్నారు?" విస్తుపోతూ ప్రశ్నిస్తున్నాడు సారధి.

"అబ్బాయి సారధీ! మనమెక్కడున్నామన్న విషయం నీకైతే తెలియకపోవచ్చు. ఇది ప్రపంచం. ఇక్కడ నువ్వు చేసేపని ఇతరులచేత గమనించబడడం లేదని, అందరి మంచి చెడ్డలు ఎప్పటికప్పుడు బేరీజు వేయబడవనీ, అందుకు ప్రతిఫలం వడ్డీ వారడితో సహా గిట్టుబాటు కాదని నువ్వనుకున్నట్టయితే అది శుద్ధపొరబాటు. నిన్ననో, మొన్ననో నువ్వొక కుర్రాణ్ణి వ్రేళ్ళు తెగిపోయేటట్టుగా కొట్టావు. దానిపైన పోలీసులకు రిపోర్టు వెళ్ళింది. రేపో మాపో విద్యాశాఖ వాళ్ళకు పిటీషన్ అందుతుంది. ఇదేం అల్లాటప్పా వ్యవహారం కాదు. నేను నీకు శ్రేయోభిలాషిని గనుక ముందుగానే హెచ్చరిస్తున్నాను."

ఈ చోక్రా కుర్రాడు సారధి నా అమాయకత్వాన్ని చూసి జాలిపడుతున్నట్టుగా, సడిచేయని చిరునవ్వు దొంతరల్ని వెదజల్లుతున్నాడు.

దయ్యంతో ముఖాముఖిగా ఇంటర్వ్యూ జరుపుతున్నట్టుగా దిగాలుపడిపోయి నేను చేష్టలు మాని విగ్రహంలా కూర్చుండిపోయాను.

అందాకా గోడకు చేరగిలబడి ఉన్నవాడు సర్దుకుని నిటారుగా కూచుంటూ అడిగాడు సారధి - "మేష్టారుగారూ నేను కొట్టలేదని చెబితే మీరు నమ్మలేరేమో!"

"దాఖలా కనిపిస్తున్నప్పుడు ఏం చెయ్యమంటావయ్యా నన్ను?" నిందించడం మాత్రమే నా వంతయింది.

"దెబ్బను గురించి తరువాత చెబుతాను, మొదట భాగ్యమ్మను గురించి కొంచెం చెప్పాలి"

తాతకు దగ్గులు నేర్పించాలని చూస్తున్నందుకు నాకు పట్టరానంత కోపం వచ్చింది. భాగ్యమ్మను గురించి నువ్వు నాకు చెప్పడమేమిటోయ్ సారధి. తల్లి పుట్టినిల్లు మేనమామకు తెలియకపోతే గదా!

"భాగ్యమ్మకొక భర్త ఉండేవాడు. భాగ్యమ్మను పెళ్ళాడడం అతడు చేసిన నేరం. గంపెడు పిల్లల్ని కనడం భాగ్యమ్మ చేసిన నేరం. ఎలాగైనా లోకంలో బ్రతికిపోవాలన్నది ఆ పిల్లలు చేస్తున్న నేరం. పెద్దబ్బాయి కోదండమున్నాడే, వాడు ప్రతిరోజూ టౌనుకు వెళ్ళి విస్తర్లు అమ్ముకొస్తేగానీ ఆ ఇంటిలో పూటగడవదు. రెండో బిడ్డ తాయారు. ఆ అమ్మాయికి పెళ్ళయివుంటే ఈపాటికి నలుగురు బిడ్డలం తల్లై ఉండేది. ఇలా చెప్పుకుపోతే చాలా పెద్దలిస్టే ఉంది. "

"అంతేనా, ఇంకా ఏమైనా ఉందా నువ్వు భాగ్యమ్మను గురించి చెప్పగలిగింది?"

"అరటి పండు ఒలిచి చేతిలో పెట్టేసినట్టు మీరింత స్పష్టంగా చెప్పేశాక నాకింక ఏం మిగిలి ఉంటుందండీ మేష్టరుగారూ! లేదంటే ఆ ఇంటితో నాకున్న కొద్దిపాటి అనుబంధాన్ని గురించి చెప్పుకోవాళి. ఈ ఊరికి వచ్చిన కొత్తలో నేను భాగ్యమ్మ ఇంట్లో వీధివైపు

గదిలో ఉండేవాణ్ణి. ఆరునెలలు గడవక ముందే నేను వేరే చోటు వెదుక్కోవలసి వచ్చింది. అద్దె విషయంలో పేచీ వచ్చిమాత్రం కాదు. పదో పదిహేనో పాతికో నికరంగా ఇంతే మొత్తమనీ నిర్ణయం ఉంటుంది గనుక, జీతం రాగానే చెల్లించుకోవచ్చు. అలా కాకుండా రెండుగా, మూడుగా, అయిదుగా, పదిగా నెల పొడుగునా ఇచ్చుకోవాలంటే ఎవరికైనా ఇబ్బందే! అందులోనూ స్వల్ప జీతగాణ్ణిగదా. అది నా తాహతుకు మించిన వ్యవహారమైపోయింది. నేనక్కడినుంచి వచ్చేశాక, ఆ గదిలో చేరే వాళ్ళు ఎవరూ లేకపోవడాన భాగ్యమ్మకు రావలసిన అద్దె డబ్బులు రాకుండా పోయాయి. తిరిగి ఇచ్చుకోవలసిన అవసరం లేకుండా అప్పులు దొరికే అవకాశాలు కూడా లేకుండాపోయాయి. అందుకని భాగ్యమ్మకు నాపైన కోపం ఉండడం తప్పుకాదని నేను చెప్పను."

"ఈ శిక్షను మనసులో పెట్టుకుని ఇలా చేసిందని నీ వాదన. పోనీ, అలాగేననుకుందాం. నీ మట్టుకు నువ్వు చేసిన పనేమిటి? వ్రేళ్ళు తెగిపోయి ఉండాల్సిన ఆ దెబ్బను గురించి సంజాయిషీ ఇచ్చుకుంటావయ్యా నువ్వు?" వీలయినంత కర్కశంగానే ప్రశ్నించి, అతడిపైకి రూక్షవీక్షణాలు గుప్పిస్తూ కూర్చున్నాను.

"చూడండి మేష్టరుగారూ ఒక్కొక్కప్పుడు కల్పనకంటే వాస్తవమే చిత్రంగా ఉంటుందనుకోవటం బహుశా ఇలాంటి విషయాలను గురించే కావచ్చు. ఆ కుర్రాడు అదే చెక్రిగాడు జానెడు పొడుగు షరాయిపైన పొట్టంతా కనపడే పొట్టి షర్టు తొడుక్కుని మామూలుగా రెండో గంట కొట్టిన తర్వాత బడికొస్తాడు. ఒరే చక్రిగా, రా, నా ప్రక్కన కూచో అని పలకరించే సహ విధ్యార్ధి ఉండడు. మనిషికీ, మనిషికీ తేడా ఉండగూడదనీ, విచక్షణ చూపడం నేరమనీ మానవుడు గ్రహించి చాలాకాలమైంది. కానీ ఏ కారణం వల్లనో తెల్లటి బట్టపైన దట్టమైన మసి మరకలా క్లాసులో చక్రిగాడొక్కడు మాత్రం ప్రత్యేకంగా కనిపిస్తాడు. పదిమంది పిల్లలు కలిసి జట్టుగా ఆడుకుంటూ ఉంటే దూరంగా నిలబడి బిక్కుబిక్కుమంటూ చూడ్డమే వాడు చేయగలిగింది. కాదని దగ్గరికి వెళితే కసిరి కొడతారు. ఒక కుర్రాడు ఏదో తాయిలం తింటుంటాడు. ఇంకొకడు బొమ్మల పుస్తకం చూస్తుంటాడు. మరొకడు గాలిపటం ఎగుర వేస్తుంటాడు. ఏ ఆనందంలోనూ తనకు వాటాలేదని తెలిసేసరికి వాడికి ఏడుపొస్తుంది. కోపమొస్తుంది. కోపాన్ని వెలిబుచ్చే ఉపాయం లేకపోతే, ఏడిస్తే ఓదార్చేవాళ్ళు లేకపోతే వాడి భావావేశాలన్ని ఏమౌతాయి! వాడిపైకి తిరగబడతాయి. ఆ ఉక్రోషంలో వాడు తన పొడుగాటి గోళ్ళతో తన శరీరాన్నే గిచ్చుకుంటాడు, తన ముఖాన్నే రక్కుకుంటాడు."

శారీరకంగానే కాదు, మానసికంగా కూడా చైతన్యం లుప్తమైపోయిన ఆ స్థితిలో నేను సారధి వైపు తెల్లబోయి చూస్తూ ఉండిపోయాను.

ఒక నిమిషం తర్వాత అతడు పూర్తిచేశాడు.

"చుట్టూరా ఎంతటి నిస్సహాయ పరిస్థితులు క్రమ్ముకుని ఉన్నా వాడికీ వయసు పెరుగుతోంది కదా! పెరిగే వయసుతో బాటుగా వాడు విధించుకునే హింసలో సైతం మోతాదు హెచ్చుతూ ఉండొచ్చునని నా అనుమానం."

ఊరంతా నిద్రపోయిన ఆ నిశిరాతిరి వేళ మా ఇద్దరి మధ్య చాలా సేపటి నాకు మౌనమే నెలకొని ఉండిపోయింది.

●●●

యధాతధంగా నేను సారధి మాటల్ని నమ్మేశానని చెప్పడానికి వీల్లేదు. కానీ ఎన్ని రోజులు గడిచినా పోలీసులకు రిపోర్టు అందినట్టుగానీ, డి.ఇ.ఓ గారికి పిటీషన్ చేరినట్టుగానీ తెలియకపోవడంతో అతడి వాదంలో నిజం లేకపోలేదనిపించింది. ఇంతలో గాయం మానిపోయి, చక్రిగాడు కూడా బడికి రావడం ప్రారంభించాడు. చేజారిపోయిన క్లూ మళ్ళీ దొరికినట్టై వాణ్ణి నా గదిలోకి పిలిపించాను. బెదురుతూ బెదురుతూ వచ్చాడు. బెత్తం చేతికి తీసుకుని జడిపించే సరికి నిజం బయటపెట్టేశాడు.

మునసబుగారు హైదరాబాదుకు వెళ్ళి, తిరిగివస్తూ ఆరుపేనాలున్న ప్లాస్టిక్కు పెట్టెను తెచ్చారు. అందులో ఒకటి తనకిమ్మన్నాడు చక్రిగాడు 'పోరా, పో' అన్నాడు మునసబుగారి అబ్బాయి. 'నువ్వేం చెబితే అదిచేస్తా'నన్నాడు చక్రిగాడు. 'అయితే చేతిని బండపైన పెట్టి పలకతో బలంగా మోదుకో'మన్నాడు మునసబుగారబ్బాయి.

కొత్త పేనా దొరుకుతుందేమోనన్న అడియాసతో అంతపనీ చేశాడు చక్రిగాడు. తత్ఫలితమే ఈ గాయం!

సందర్భానికి అతికిపోయినట్టుంది గదా అని ఆ అబద్ధం ద్వారా సారధిని కొంచెం బ్లాక్ మెయిల్ చేసే ప్రయత్నం మాత్రం జరిగింది. అంతకుమించి భాగ్యమ్మకైనా తన కొడుకుపైన నమ్మకం ఉన్నట్టులేదు.

"నేను కొట్టుకున్నానని చెబితే మా అమ్మకొడుతుంది సార్! అందుకని... అందుకని" మళ్ళీ నేనుకూడా కొడతానేమోనని భోరున ఏడవసాగాడు చక్రిగాడు.

# పెసరపప్పు కథ వసుంధర

**జయశ్రీ డిసెంబర్ । ౯౬౭**

**సుందరం ఒకసారి పరీక్షగా చూశాడు బెంచీమీద కూర్చున్న ఆ అబ్బాయిని** ఆశ్చర్యం కలగ్గా మరోసారి చూశాడు. నిజంగానే ఆ బెంచీమీద కూర్చున్న కుర్రాడు ఎవరో చెబుతుంటే వింటూన్న వాడిలా తలూపుతూ - మౌనంగా శూన్యంలోకి చూస్తున్నాడు.

"రాజారావ్ - ఆ అబ్బాయిని చూడు!" అన్నాడు సుందరం.

రాజారావు ఆ వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయే విషయానికి ఆశ్చర్యపడని మనిషి మీద సుందరానికే కాదు ఎవరికైనా కోపం వస్తుంది - అయినా సుందరం కోపాన్ని చంపుకున్నాడు. రాజారావుకి ఆ అబ్బాయి గురించి తెలిసుండడం వల్లనే ఆశ్చర్యపోవడం లేదని అతను గ్రహించాడు. అందువల్ల అతని కథేమిటో తెలుసుకోవాలనుకున్నాడు.

"ఎవరా అతను? అలా తలూపుతుండడానికి కారణమేమిటి?" కాశీ మజిలీ కథల్లో గోవడు మణిసిద్ధుణ్ణి అడిగినట్లు అడిగాడు సుందరం.

మణిసిద్ధుడు చెప్పడం ప్రారంభించాడు "మొన్ననే మా బాబాయి మద్రాసు నుంచి వచ్చాడు"

మద్రాసు నుంచి వచ్చిన రాజారావు బాబయ్యకీ, ఆ పార్కు బెంచీ మీద కూర్చున్న ఆ కుర్రాడికీ సంబంధమేమిటో సుందరానికి అర్థం కాలేదు. సంబంధమేమిటీ అని అడిగితే రాజారావు ఫోజు కొట్టేస్తాడని భయం వేసి వింటుంటే వాడే చెప్పకపోతాడా అన్న ఉద్దేశం రాగా సుందరం మౌనాన్ని పాటించాడు.

సుందరాన్నించి ప్రశ్ననూహించిన రాజారావు నిరుత్సాహపడ్డాడు. అయినా తన మాటలు సుందరం మీద పని చేశాయని తను గ్రహించినట్లుగా "మద్రాసు నుంచి వచ్చిన నా బాబాయికీ ఆ కుర్రాడికీ సంబంధం లేదనుకుంటున్నావు కదూ? ఇహిహి - ఉంది" అన్నాడు.

"చెప్పు - మరి!" అన్నాడు సుందరం.

"మా బాబాయి మద్రాసులో ఓ తెలిసున్న వాళ్ళింటికి వెళ్ళాడుట. ఆ ఇంటాయన మా బాబాయికేసి చూస్తూ కాసేపు నవ్వుతున్నట్లు ముఖం పెట్టేవాడుట. ఉన్నట్లుండి అంతలోనే తనకు కావలసిన వాళ్ళకు ఏదో ప్రమాదం జరిగిపోతూంటే చూస్తున్నట్లు ముఖం పెట్టేవాడుట. సంభాషణలు మామూలుగానే జరిగిపోయినా ఆ ముఖం మాత్రం అలా క్షణక్షణానికీ మారుస్తూండేవాడుట. ఆయనే కాదు పద్దెనిమిదేళ్ళ ఆయన కూతురూ అంతేట" ఒక్క క్షణం ఆగి రాజారావు మళ్ళీ అన్నాడు "అందుకు కారణం లేదనుకుంటున్నావేమో - ఉంది. విన్నావంటే నవ్వలేక చస్తావ్!" అన్నాడు. కారణం తలచుకోవడం వల్ల కాబోలు అతనికి అప్పుడే నవ్వు వచ్చేస్తోంది.

సుందరం ఆసక్తితో చూశాడు రాజారావు వంక.

నవ్వును ఆపుకోడానికి ప్రయత్నిస్తూ అన్నాడు రాజారావు - "ఆ ఇంటాయన, ఆయన కూతురూ కూడా చాలా స్టంటు సినిమాల్లో ఎక్స్ట్రా వేషాలు వేశారుట. ఎక్కువ సినిమాల్లో వాళ్ళ పోర్షనేమిటంటే దూరంగా హీరో, విలన్‌తో స్టంటు చేస్తున్నపుడు చూడడమన్నమాట. హీరో నెగ్గుతూన్నప్పుడు ఆనందాన్నీ, ఓడిపోయేలా ఉన్నప్పుడు విచారాన్నీ ముఖంలో వ్యక్తం చేయాలట వాళ్ళు. ఈ మధ్య స్టంటు సినిమాలు ఎక్కువై - అటువంటి సీన్లు చాలా, యాక్ట్ చేశారట వాళ్ళు - దాంతో వాళ్ళకా నటన వంటబట్టేసి అప్పుడప్పుడు అనుకోకుండా ఎవరితోనైనా మాట్లాడుతున్నా వచ్చేస్తోంది"

ఈసారి సుందరం నిజంగానే నవ్వాడు - నవ్వుతూండగా అతనికి ఆ బెంచీమీద అబ్బాయి కనిపించాడు అతనింకా తల ఊగిస్తూ అలా శూన్యంలోకి చూస్తూనే ఉన్నాడు. సుందరం నవ్వు ఆగిపోయింది. "ఇంతకీ ఆ కుర్రాడి విషయం చెప్పావు కాదు" అన్నాడు. "అతనా - అతను నా క్లాస్‌మేట్" అన్నాడు రాజారావు - "క్లాసులో మొదటి బెంచీమీద కూర్చుని మేష్టారు చెప్పే ప్రతిదానికీ తలూపడం అతనికి అలవాటు. ఆ స్టంటు సినిమా వ్యక్తుల్లాగే ఇతనికి అదే వంటబట్టేసింది. మా క్లాసులో మొదటి బెంచీమీద కూర్చునే వాళ్ళందర్నీ పెసరపప్పులని పిలుస్తాము. కానీ క్రమంగా ఆ పేరు ఇతనికొక్కడికే స్థిరపడిపోయింది. ఎందుకంటే అటు సూర్యుడు ఇటు పొడిచిన ఓ రోజున కూడా ఇతను ఫస్టు బెంచీమీదే కూర్చున్నాడు. మిగతావాళ్ళకా బెంచీ పట్టింపు అంతగాలేదు"

"అయితే మొదటి బెంచీమీద కూర్చుంటే పెసరపప్పు అన్న పేరు రావడమేమిటి? నాకర్థం కాలేదు"

"ఉంది - పెసరపప్పంటే పప్పుల్లోకల్లా మెత్తనైనది. నానబోసిన పావుగంటలో నానిపోతుంది. అలాగే - సాధారణంగా మెత్తని మనస్తత్వం గల వాళ్ళే కాలేజీల్లో మొదటి బెంచీ మీద కూర్చుంటారు. మెత్తని మనస్తత్వంకు కాలేజీ నిర్వచనం నీకూ తెలుసుగదా - అందుకే వాళ్ళని పెసరపప్పులనడం -"

"ఓహో!" అని ఆ అబ్బాయివంక మళ్ళీ చూశాడు సుందరం. అతనింకా తలుపుతూ శూన్యంలోకి చూస్తున్నాడు. ఇది ఉపోద్ఘాతం..

కథ ఇక్కడే ప్రారంభమవుతుంది.

పెసరపప్పుగా పేరు గాంచిన ఆ అబ్బాయి పేరు సుబ్బారావు. మనిషి చాలామంచివాడు. కానీ అతని పేరు సుబ్బారావని కాలేజీలో ఎవ్వరికీ తెలియదు. తెలిసిన కొద్దిమంది కూడా మరచిపోవడానికి ప్రయత్నించి నిజంగానే మరిచిపోయారు.

ఆ సుబ్బారావు పార్కుబెంచీ మీంచి లేచాడు. అంతసేపూ మననం చేసుకున్న క్లాసు పాఠాలు ప్రసాదించిన తలనొప్పి పోగొట్టుకోవడానికి కాఫీ అవసరమనిపించి తాగటానికి లేచి కాఫీ హోటలుకి నడిచాడు. కానీ అతని దురదృష్టవశాత్తూ హోటళ్ళన్నీ తగని రష్‌గా ఉన్నాయి. అందువల్ల అతను హోటళ్ళకి వెళ్ళలేకపోయాడు. రద్దీగా ఉన్నప్పుడు హోటల్లో కాఫీ తీసుకోవడమన్నా, టిఫిన్ తినడమన్నా సుబ్బారావుకి తగనిసిగ్గు. రద్దీ లేని సమయాల్లో మాత్రమే అతను హోటల్‌కి వెడతాడు.

కాఫీ తాగుదామనుకుని - తాగలేకపోవడంతో తలనొప్పి మరింత ఎక్కువయిందతనికి. కాఫీ తాగాలనుకోవడంతోనే తలనొప్పి మరింత ఎక్కువై కాఫీ అవసరం కనిపించడమూ, ఇప్పుడది లభించకపోవడంతోనే కలిగిన చికాకు వల్ల, మరింత ఎక్కువై కాఫీ లేకపోతే ఎలా అన్నంత పనయిపోయి ఇంటికి వెళ్ళి "అమ్మా - కాఫీ" అన్నాడు.

"బాగానే ఉంది వరస సాయంత్రం ఆరున్నరకి కాఫీ ఏమిటి? పద అన్నం తిందువుగాని - నీకిష్టమని పెసరపచ్చడి చేశాను దా" అంది తల్లి.

"అమ్మా!" శివాజీ గణేశన్‌లా అరిచాడు సుబ్బారావు. తల్లి తనని పరిహసించినట్లయిందతనికి.

కానీ అతనంత గట్టిగా ఎందుకరిచాడో తల్లికర్థం కాలేదు. కొడుక్కుగానీ పైత్యం చేయలేదు గదా అన్న అనుమానం కూడా వచ్చింది ఆవిడకి.

"పెసరపచ్చడి ఎందుకు చేశావు?" గర్జించాడు సుబ్బారావు.

కొడుక్కి పైత్యం చేసిందని ఆవిడకి రూఢి అయింది. ఎందుకా? ఈ పైత్యవికారాలు తగ్గుతాయనే - లేకపోతే ఏమిట్రా అరుస్తావ్ - కొంప మునిగిపోయినట్లు - ఇప్పుడేమయిందని చదివి చదివి వేడి చేసున్నావు కదా అని పెసరపచ్చడి చేశాను. నీకేం తెలుసురా - పెసరపప్పు సంగతి - వంటికి అదెంత మంచిదో తెలుసా?"

"ఇక ఆపు - వస్తున్నాను. భోజనానికి" అన్నాడు సుబ్బారావు. "ఔరా ఏమి ఈ కర్ణకఠోర శత్రుసంకీర్తనము" అని భక్త ప్రహ్లాదలోని ఎస్వీరంగారావులా మనస్సులో అనుకుని -

పెసరపప్పు పేరు విన్నప్పుడల్లా తన్నెవరో గేలిచేసినట్లు ఉలిక్కిపడి ఉడుక్కుంటాడు సుబ్బారావు. ఆ పేరంటే తను ఉడుక్కుంటాడని తల్లికి చెప్పడం అతనికి అసలు ఇష్టం లేదు. అందువల్ల అతనికి అప్పుడప్పుడు ఇలాంటి కష్టాలు వస్తుంటాయి.

సుబ్బారావుని పట్టుకు వేధించే సమస్య ఇదొక్కటే. క్లాసులో ఇంతమంది విద్యార్థులుంటే తనకే ఆ పెసరపప్పున్న పేరెందుకు రావాలి? తను చేసిన పాపమేమిటి?

తను ఒకళ్ళజోలికి వెళ్ళడు. ఎవరినీ అపహాస్యం చేయడు. బుద్ధిగా పాఠాలు వింటాడు. క్లాసుక్లాసంతా ఏకమై పెసరపప్పున్న పేరు పెట్టడం న్యాయమేనా?

కాలేజీలో అతన్ని పెసరపప్పని పిలవడం ఎంత ఎక్కువయిదంటే తన పేరు సుబ్బారావని అతనే మరిచిపోయేటంతవరకూ వచ్చింది. ఎవరైనా "సుబ్బారావుగారూ!" అని పలకరిస్తే అతనికి ప్రాణం లేచి వచ్చినట్లుండి కాఫీ ఇప్పించాలనిపించేది. ఇప్పించడం అంటే అది వేరే సంగతి.

అతనెప్పుడైనా క్లాసుకి రాకపోతే "ఈ రోజు పెసరపప్పు క్లాసుకి రాలేదర్రోయ్" అంటారు. ఆడపిల్లలకు నోట్సు కావలంటే "పెసరపప్పుగారిని అడిగి తీసుకుందామే!" అనుకుంటారు. కాలేజీ ఎలక్షన్సులో ఓటు కావలిస్తే "పెసరపప్పు గారిది మా పార్టీయేరా!" అనుకుంటారు. ఫస్టు మార్కు వస్తే - "పెసరపప్పు ఫస్టు మార్కు కొట్టేశాడ్రోయ్" అంటారు. ఆడపిల్లలకే కాకుండా అతని పేరు సంగతి మేస్టర్లకి కూడా తెలిసిపోయింది.

ఈ సమస్య సుబ్బారావుని ఎంతగా వేధించిందంటే అతనోరోజు రాత్రి "పెసరపప్పు - పెసరపప్పు" అని కలవరించాడు. అతనలా ఎందుక్కలవరించాడో అర్థం కాక కొడుక్కి పెసరపప్పంటే ఇష్టమని దానికోసం కలవరించిపోతున్నాడు కాబోలనుకుని మర్నాడుదయం పెసరపప్పు వండింది అతని తల్లి. వండడమే కాకుండా పక్కింటావిడతో చెప్పింది కూడా - "మావాడు నిద్రలో కూడా పెసరపప్పు అంటూ కలవరించాడండీ ఎంతిష్టమో వాడికి"

పక్కింటావిడ కొడుకు వెంకట్రావు ఈ మాటలు విన్నాడు. అతను సుబ్బారావు క్లాసుమేటే. ఈ వార్తను కాలేజీకి మోసేశాడు. ''పెసరపప్పుకి - పెసరపప్పంటే ఇష్టంట'' అని.

ఈ విధంగా పెసరపప్పు అన్న పేరు సుబ్బారావుకి మరింత స్థిరపడిపోయింది.

ఓ రోజు క్లాసులో సుబ్బారావుకి కూర్చునే సీటు ముందు ఎవరో - చిన్న పెసరపప్పు ముద్ద తెచ్చి పెట్టారు. సుబ్బారావు ఆ రోజు కొంచెం లేటుగా వచ్చి అలవాటు ప్రకారం తన సీట్లో కూర్చున్నాడు, పుస్తకాలు ముందు పెట్టుకుందామనుకునే సరికి ఎదురుగా డస్కుమీద పెసరపప్పు ముద్ద కనిపించింది. క్లాసు క్లాసంతా ఘొల్లుమన్నారు. ఆడపిల్లలతో సహా లెక్చరర్ కూడా చిన్నగా తనలో నవ్వుకోడం గమనించిన సుబ్బారావు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. తను చేసిన పాపమేమిటో అతనికి అర్ధం కాలేదు. ఇంతమంది విద్యార్ధులు కలిసి ఏడిపించడానికి తన్నే ఎందుకు ఎన్నుకున్నారో అతనికి అర్ధమవలేదు. అతని జీవితం క్లాసులో క్షణక్షణగండంలా గడుస్తుంది.

ఏదైనా సందేహం కలిగి, లెక్చరర్ నడుగుదామని లేస్తే చాలు ''కూర్చోండి పెసరపప్పుగారూ'' అని ఎవడో అరుస్తాడు. ఒక్క సుబ్బారావు తప్ప క్లాసంతా నవ్వుతారు.

దేశంలో నిజంగా నాగరికత పెరిగిందా అంటే లేదనే చెబుతాడు సుబ్బారావు. ఎదుటి మనిషిని హింసించడం ద్వారా ఆనందం పొందే తత్వం మానవుడిలో మాసిపోలేదు. అదున్నంతకాలం మనవుడు అనాగరికుడేనని అతని ఉద్దేశ్యం.

అయినా వాళ్ళంతా తనని ఏడిపిస్తే తను మాత్రం ఎందుకేడవాలి? - అనుకున్నప్పటికీ సమయం వచ్చేసరికి ఉక్రోషపడకుండా ఉండలేకపోయేవాడతను.

పెసరపప్పు ముద్దని అలాగే ఉంచి పుస్తకాలు పక్కగా పెట్టుకుని కూర్చున్నాడు సుబ్బారావు.

''అబ్బ - ఇక్కడ పెసరపప్పు వాసన'' అన్నాడు సుబ్బారావు పక్కనే కూర్చున్న ఓ కుర్రాడు. క్లాసంతా నవ్వారు.

''పెసరపప్పు పక్కన - పెసరపప్పు వాసన వేయక పేలాల వాసనేస్తుందేమిటోయ్'' అన్నాడు మరొకడు. ఆ పక్కవాడి పేరు పేలాలు అని అందరికీ తెలుసు. దాంతో క్లాసంతా మళ్ళీ నవ్వారు. ఇక సుబ్బారావు క్లాసులో కూర్చోలేకపోయాడు. తలనొప్పిగా ఉందని లేచి వెళ్ళిపోయాడు.

''పెసరపప్పు తిను - తగ్గిపోతుంది!'' మళ్ళీ ఎవడో అన్నాడు.

''సైలెన్స్'' అన్నాడు లెక్చరర్. వెళ్ళిపోతున్న సుబ్బారావు ముఖం చూసి కదిలి పోయిన వ్యక్తి ఒకడున్నాడు. అతనే రాజారావు. కళ్ళలో నీళ్ళు తిరుగుతూన్న సుబ్బారావు ముఖం చూస్తే హృదయమున్న ఎవడికైనా జాలి కలుగుతుంది. అయితే నేటి విద్యార్ధులవి మరీ లేత హృదయాలు. ఎంత లేతవంటే అసలున్నాయా లేవా అనిపించేటంత లేతవి. అందువల్ల వారిని ఇటువంటి సంఘటనలు కదిలించలేవు.

ఆ సాయంత్రమే రాజారావు సుబ్బారావుని కలిసి ''ఉదయం జరిగిన దానికి చాలావిచారిస్తున్నాను'' అన్నాడు.

''విచారించవలసింది నేను - మధ్య మీరెందుకు?''

''విద్యార్ధులు మరీ మితిమీరిపోతున్నారు. మిమ్మల్ని అంతా ఇలా ఏడిపించడం నాకేం నచ్చలేదు. ఉదయం మీ ముఖం చూస్తే నాకు నిజంగా జాలేసింది.''

సుబ్బారావుకి కోపం వచ్చింది - ''అయితే మీరేం చేస్తారు?''

''కుర్రాళ్ళెవరూ మిమ్మల్ని ఏడిపించకుండా చేస్తాను. మీరు నాతో స్నేహం చేస్తే''

''ఎలా?''

''ముందు మనమిద్దరమూ స్నేహితులమనండి!''

సుబ్బారావు అన్నాడు. ఆ క్షణంలోనే వారిద్దరికీ స్నేహం కలిసింది. స్నేహం కలిసిన కొద్దిక్షణాల్లోనే సుబ్బారావు తన హృదయంలోని బాధంతా రాజారావుకి చెప్పుకున్నాడు. ఎన్నాళ్ళుగానో మధనపడుతున్నాడేమో - ఇన్నాళ్ళకు దొరికిన ఒకే ఒక వ్యక్తికి తన బాధను పూర్తిగా చెప్పేశాడు.

అంతా విని రాజారావు నిట్టూర్చాడు.

"ఈ రోజుల్లో మనం గౌరవంగా మసలాలంటే మామూలుగా ఉండి ప్రయోజనం లేదు. నేను కొన్ని ఉపాయాలు చెబుతాను. ఆ ప్రకారం నడుచుకున్నార మీ జోలికి ఎవరూ రారు.

మొదటిది - మీరు మొదటి బెంచీమీద కూర్చోకూడదు. అలా కూర్చోడం వల్ల తప్పనిసరిగా లెక్చరర్ దృష్టి మీ మీదనే ఉంటుంది. అందువల్ల ఆయన తరచు మీ వంకే చూస్తూండడమూ మీరు తలూపటమూ జరుగుతుంటుంది. అది చూసే వాళ్ళకు వినోదకరంగా ఉండి మిమ్మల్నొక వింతగా పరిగణించే అవకాశం ఉంది.

రెండవది - ఎవరేమన్నా లెక్కచేయకూడదు. మన్ని ఎదుటివాడు ఏడిపించినా చిరునవ్వు నవ్వగలిగితే ఎవ్వరూ ఏమీ చేయలేరు. ఎవరైనా సరే ఏడ్చేవాళ్ళని ఏడ్పించడానికి ప్రయత్నిస్తారు తప్ప - ఏడ్వని వాళ్ళ జోలికి ఎవడూ రాడు.

మూడవది - క్లాసులో పాఠాలు మరీ అంత శ్రద్ధగా వినకూడదు. మిగతా కుర్రాళ్ళు చేసే అల్లరిలో మనమూ పాలుపంచుకోవాలి. అప్పుడే మిగతా వాళ్ళకు మనపట్ల సోదర భావం ఏర్పడి మన జోలికి రావడం మానేస్తారు.

నాల్గవది - ఆడపిల్లని ఇంతో అంతో ఏడిపిస్తుండాలి నిజానికి అలా ఏడిపించే వాళ్ళుంటేనే ఆడపిల్లలకు భయం ఉంటుంది. లేకపోతే వాళ్ళక్కూడా లోకువైపోవలసి వస్తుంది.

అయిదవది - ఎరిగున్న స్టూడెంట్స్ నలుగురయిదుగురి సమక్షంలో ఇంగ్లీషుగానీ, హిందీగానీ సినిమాలు చూడాలి. అలా చూస్తే మనమీద వాళ్ళకు గౌరవం కలిగి ఏమీ అనలేరు.

ఈ సూత్రాలు కాక - మిగతావి - చూసి నేర్చుకోవలసిందే"

సుబ్బారావు అంతా శ్రద్ధగా విన్నాడు. రాజారావు చెప్పినవన్నీ నిజమేనని అతనికి అనిపించింది. ఆ విధంగా తనూ ఆచరించాలని నిశ్చయించుకున్నాడు.

మర్నాటి క్లాసులో సుబ్బారావు ఆరో బెంచీ మీద కూర్చున్నాడని ఫస్టు బెంచీ బాధగా మూలిగింది. క్లాసుక్లాసంతా ఆశ్చర్యంతో ముక్కుమీద వేలేసుకున్నాడు.

"రెండో పీరియడ్ లో సుబ్బారావు పక్కనున్న కుర్రాడు పెసరపప్పు వాసన!" అన్నాడు. సుబ్బారావు నవ్వాడు. ఎలక్షన్ నెగ్గినంత ఆనందంతో నవ్వాడు. పక్కవాడు సిగ్గుపడిపోయి మరీ బఠాణీ గింజంతైపోయాడు.

క్లాసులో మేష్టారు పాఠం చెబుతూంటే సుబ్బారావు కోడికూత కూశాడు. అలవాటులేని పనికావడం వల్ల సుబ్బారావు ఆ పని రహస్యంగా చేయలేకపోయాడు. స్పష్టంగా సుబ్బారావే చేసినట్లు కనిపించినా లెక్చరర్ అతన్ని కేకలు వేయలేదు. తనకళ్ళు పొరబడి ఉంటాయనే అనుకుని ఆ పక్కనున్న కుర్రాడికి ఆబ్సెంట్ మార్కు వేశాడు. ఆ సాయంత్రం ఒంటరిగా నడిచిపోతున్న ఓ అమ్మాయిని తొండ అని పిలిచాడు సుబ్బారావు. అదే రోజు మొదటి ఆటకి నలుగురి సమక్షంలో "క్లియోపాత్రా" సినిమా చూశాడు.

పెసరపప్పు మొదటి బెంచీ వదిలేశాడనీ పెసరపప్పుకూడా ఆడపిల్లల్ని ఏడిపిస్తున్నాడనీ అంతా చెప్పుకోసాగారు. లభించక లభించక అవకాశం లభిస్తే తన ప్రతిభనంతా చూపడానికి ప్రయత్నించే నటుడిలా అతను క్లాసులో అల్లరిలో విజృంభించాడు. అతని విజృంభణ ఇంకా తారాస్థాయికి చేరుకోకుండానే పరీక్షలు వచ్చి అయిపోయాయి.

పెసరపప్పుకు ఫస్టుక్లాసు వచ్చిందని అంతా చెప్పుకున్నట్లు తెలిసిన సుబ్బారావు చాలా బాధపడ్డాడు మనసులో. కానీ అతనా బాధను పైకి తెలియనివ్వలేదు.

అతనూ, రాజారావు కూడా అదే కాలేజీలో బియస్సీలో చేరారు. ఈసారి సుబ్బారావు పూర్తిగా విజృంభించాడు. క్లాసులోని ఆడపిల్లలంతా అతనిని అసహ్యించుకోసాగారు. మేష్టర్లకు అతనిమీద దురభిప్రాయం ఏర్పడిపోయింది. అయినా అతన్నెవరూ ఏమీ చేయలేరు. ఎందుకంటే పరీక్షల్లో మంచిమార్కులు తెచ్చుకుంటాడు.

సుబ్బారావు అల్లరి మితిమీరిపోతోందని గ్రహించిన రాజారావు అందుకు తన బాధ్యత కూడా కొంతవరకూ ఉన్నదనే ఉద్దేశ్యంతో ఓరోజు సుబ్బారావుని హెచ్చరించాడు - "మీరు ఇప్పుడెంత అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారంటే క్లాసులో అమ్మాయిలంతా మిమ్మల్ని అసహ్యించుకుంటున్నారు. మేష్టర్లంతా కూడా అంతే! దేనికైనా ఓ లిమిట్ ఉండాలండీ - మీరు ఇలా ఉండకూడదు."

సుబ్బారావు నవ్వాడు. "ఒత్తి - పెసరపప్పులా మాటాడేరు" అన్నాడు.

రాజారావు తెల్లబోయాడు.

## కోర్టుకు రాని పక్షులు — రాచకొండ విశ్వనాథశాస్త్రి

**ఆంధ్రపత్రిక వీక్లీ, 11 - 6-1952**

**ఆశ్చర్యం!**

జడ్జీగారికి చెప్పలేనంత ఆశ్చర్యంగా ఉంది.

"అది నా భార్య

అగ్నిసాక్షిగా పెళ్ళాడాను దాన్ని,

అది నా దగ్గరికి రావాలి.

నాతో ఉండాలి"

అంటాడు ఒక ఆసామి.

అదీ అతని కేసు.

అతనే వాది ఆ కేసులో.

నల్లగా, పల్చగా, పొడుగ్గా ఉన్నాడతను.

నల్లగా, పొడవుగా, పీచురేగిన జుట్టు అతనిది.

నల్లగా, సన్నగా, పొడువైన మీసాలు అతనివి.

నడివయసులో బలిష్టంగా ఉన్నాడతను.

పుట్టింది లగాయితు నేటి వరకూ నవ్వినట్టులేని ముఖం అతనిది.

పైన వేసుకున్నది ఏ రంగో తెలియని షర్టు.

కాళ్ళమీద జోరాడుతున్నది మాసిన పైజమా.

"నేను వాణ్ణి పెళ్ళాడలేదు.

నేను వాడి పెళ్ళాన్ని కాను.

వాడెవడో నాకు తెలియదు.

నేను వాడి దగ్గరికి వెళ్ళనవసరం లేదు.

వెళ్ళను".

అంటుంది ఆమె.

అదీ ఆమె జవాబు.

ఆవిడే ప్రతివాది ఆ కేసులో.

తెల్లగా, లావుగా, పొట్టిగా ఉన్నదావిడ.

యవ్వనంతో, అందంతో పొగరెక్కిన ముఖం ఆమెది.

నల్లగా వంకులు తిరిగినది ఆమె జుట్టు.

కట్టుకున్నది తెల్లటి చీర.

వేసుకున్నది నల్లటి రవిక.

కొప్పులో పెట్టుకున్నది మందార పువ్వు.

వాది ప్రతివాదులిద్దరూ చెరో వైపూ నిల్చున్నారు.

అందరికీ ఎడంగా, హాలుకి ఒక చివరగా, రెండు గుమ్మాలకీ మధ్యగా, పిడకల కుప్ప ఎక్కిన ఇంటి అల్లుడిలా, ఎత్తుగా డయస్ ఎక్కి కుర్చీలో కూర్చున్నారే, వారే జడ్జీగారు.

"ఎందుకు పెళ్ళాడానా దీన్ని?" అని వాపోతూ ఉంటారు జడ్జీగారు తన భార్య తలుపుకి వచ్చినప్పుడల్లా. ఆవిడ ఎప్పుడూ తలుపుకి వస్తూనే ఉంటుందాయనకి. "పెళ్ళాడకపోతే ఎంత బావుండును; ఎంత హాయిగా ఉండేవాణ్ణి" అని విలపిస్తూ ఉంటాడాయన. పెళ్ళాం అనే పీడ ఎంత వేగిరం వెళితే అంత మంచిదనే నిశ్చితాభిప్రాయానికి ఆయన చాలాకాలం క్రితం వచ్చారు. వచ్చేట్టు చేసింది ఆయన భార్య. ఇప్పటికీ ఆ అభిప్రాయమే జడ్జిగారిది.

రానంటూన్న సైతాన్ని రాకపోతే వీల్లేదనే వాదిని చూసి మెంటల్‌గా ముక్కుమీద వేలేసుకున్నారు జడ్జీగారు.

"రాను మొర్రో అంటూ ఉంటే దాన్ని రమ్మంటావేమిట్రా?" అని వాదిని అడిగాడు కూడాను.

"అగ్ని సాక్షిగా కట్టుకున్నది రాకేం చేస్తుందండి?" అన్నాడు వాది.

"రాకపోతే పోతుంది. నీకెందుకా బాధ?" అన్నారు జడ్జీగారు విసుక్కుని.

"నాక్కాకపోతే బాధ మరెవరికండి? అగ్ని సాక్షిగా నా చేత పుస్తెకట్టించుకున్న ముండా కూతురు రానని కూర్చుందాయెను. రాకపోతే ఏం పోయిందని తమరు సెలవిస్తున్నారాయెను. తమరెలాగైనా సెలవిస్తారు. తమరి సొమ్మేం పోయిందండి." అని కేకలు వేసేవాడిని.

"తగ్గవోయ్ తగ్గు. ఇదేం నీ ఇల్లనుకున్నావా, కోర్టనుకున్నావా? ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసుకున్నావా?" అంటూ హెచ్చరించాడు బెంచి గుమాస్తా.

అంతవరకూ నవ్వుతూ హుషార్‌గా చూస్తూ కూర్చున్న వాది వకీలు అప్పుడు కొంచెం తెలివి తెచ్చుకుని "నువ్వు నోరుముయ్యరా" అంటూ వాదిని కసిరేడు.

వరండాలో జవాను "సైలెన్స్, సైలెన్స్" అని అరిచాడు.

ఒక్క క్షణం ఆగాడు వాది. ఆగి తిరిగి ఆరంభించబోయాడేదో. కానీ ఈలోపున అందుకుంది ప్రతివాది,

"బాబూ తమరాలకిస్తున్నారా, ముండా కూతురని ఎలా తిడుతున్నాడో? చచ్చినాడా, ఎవడ్రా నువ్వూ? ఎవత్తెనా ముండన్నేస్తావూ? నాలికి పీకించేపోతే చూసుకోరా" అంటూ చాలా జోర్ చేసింది ప్రతివాది. ("చచ్చినాడా" వగైరా మాటలు కోర్టువారిని అన్నవి కావు. వాది గురించి చెప్పినవి)

"ఆగవమ్మా ఆగు" అంటూ గాభరాపడి కేకవేశాడు బెంచి గుమాస్తా.

"మొగాడివైతే వాణ్ణి అదమాయించవయ్యా, ఆడదానిమీద కేకలేస్తున్నావు, వాడందర్నీ ముండల్ని చేసి తిడుతూ ఉంటే అప్పుడు నీ నోరు ఏమయిపోయింది. చచ్చిందా ఏమిటి? చాల్చాలు, గొప్ప మొగాడివి" అని చీవాట్లు పెట్టింది బెంచి గుమాస్తాని ప్రతివాది.

వాది తిట్టిన తిట్టుగురించి జడ్జీగారు మాత్రం "ఆహా! ఎంత ముచ్చటగా తిట్టాడు!" అని మనసులో అనుకుని చాలా మురిసిపోయారు. ఒక్కసారి ముచ్చటకైనా తిట్టలేదు జడ్జీగారు తన భార్యని నేటివరకూ.

ఈలోపున, "ఇది చాలా ఘోరం. చాలా అన్యాయం. మిక్కిలి దౌర్జన్యం. కోర్టువారు ఇలా ఊరుకోవడం ఎంత మాత్రం - భావ్యంకాదు. ఆడదాన్ని, ఇలా నలుగుర్లో, కోర్టులో జడ్జీగారి ముందు ఇలా తిట్టడమా! వాది దుర్మార్గాన్ని కోర్టువారు ఎంతమాత్రం సహించకూడదు. కోర్టువారు ఎంతమాత్రం ఉపేక్షించ కూడదు. కోర్టువారు వాదిని.." అని హఠాత్తుగా లేచి ఏమేమో చెప్పి ఇంకా ఏదేదో చెప్పబోతూన్న ప్రతివాది వకీల్ని ప్రతివాది టక్కున ఆపేసి అతగాడి వైపు చురచురచూసి "ఎందుకయ్యా ఇంతసేపూ వాడలా తిడుతూ ఉంటే ముంగిలా కూర్చుని చూస్తున్నావు? ఇప్పుడా ఒచ్చింది తెలివి?" అని సంజాయిషీ అడిగి వకీల్ గారి తెలివి తేటల మీద కామెంట్ చేసింది.

అందుగురించి మిగతా లాయర్సెవరూ ఊండవలేదు. మీదు మిక్కిలి హెచ్చుగా సంతోషించేరు. సహజ శత్రువుల్లో ఒకడైనట్టి వకీల్ని పార్టీలే చిన్నబుచ్చడం జడ్జీగారికి పరమాన్నప్రాయమయింది. ప్లీడరు గుమాస్తాలూ, ప్రేక్షకులూ Were having the time of their lives.

మొత్తానికి ప్రతివాదీ, ఆమె వకీలూ తప్ప మిగతా అంతా సంతోషించేరు. సదరు సందర్భంలో పైన చెప్పిన ప్రతివాది మిక్కిలి కిన్కవహించి "ఓ! ఏం నవ్వుతున్నారయ్యా అంతానూ! మీ ఆడవాళ్ళనే అలా తిడితే ఇలానే నవ్వుతారు కాబోలు. నవ్వడం కాదు బాబూ, ఇక్కడెవడైనా మొగాడన్న వాడుంటే వాడికి చమ్డాలెగరకొట్టండి. అప్పుడు మీ మగతనానికినే కూడా సంతోషించి, నవ్వుతాను" అని అందర్నీ మందలించి, ప్రోత్సహించి, ఛాలెంజి చేసింది.

వాదికి చమ్డాలెగరకొట్టి, ఆ విధంగా తమ మగతనం నిరూపించుకొందికి కోర్టు యావన్మందిలో ఏ ఒక్కడు కూడా సిద్ధపడలేదు. పైపెచ్చు ఆడమనిషినే కూకలేసేరు.

దాంతో ఆవిడ రాగాలు మొదలు పెట్టింది.

ఆవిడ ఏడుపుకి కోర్టుహాలు దద్దరిల్లింది.

అందుమీదట జడ్జీగారు చాలా కంగారు పడ్డారు. ప్లీడర్లెవరూ కంగారు పడలేదు. కోర్టంతా కంగాళీగా తయారయినందుకు ప్లీడరు గుమాస్తాలు తెగ సంతోషించేరు. అంతా కూడా గందరగోళంగా గోల్ మాల్‌గా తయారయింది.

“Under these circumstances I pray for an adjournment” అన్నాడు ప్రతివాది వకీలు.

వీల్లేదన్నాడు వాది వకీలు.

వీలవుతుందన్నారు జడ్జీగారు.

ఆ నాటికి ఆ కేసు వాయిదాలు వేసేసి "అమ్మయ్యా" అనుకున్నారు జడ్జీగారు. పదే పదే వాయిదాలు పడితే కొంతమంది పార్టీలు ఖర్చులు భరించలేక రాజీ చేసుకుంటారని జడ్జీగారికి తెలుసు. ఈ కేసులో ఆ విధంగా జరుగుతుందేమోనని ఆశించేవారు కూడా. కాని పెళ్ళాం కోసం కోర్టుని పట్టుక్కూర్చున్న వాది మిక్కిలి మొండి ఘటం అవడం చేత కాబోలు "దీని అంతేదో చూసెయ్యా"లన్నట్టుగా కోర్టుని పట్టుకు ససేమిరా వదల్లేదు. పార్టీలు, ప్లీడర్లు, గుమాస్తాలు, సాక్షులు, మద్దతుదార్లు వగైరాలు, మొదలైనవారు, ఆదిగా గలవారు అంతా, యావన్మందీ కోర్టుకి వచ్చి వచ్చి, ఇంటికి పోయిపోయి, తిరగ్గా తిరగ్గా ఆఖరికి, చివరికి, కొసాకి ఎలాగయితేనేం కేసు విచారణకి వచ్చింది.

వాదిగారు బోనెక్కారు. ప్రమాణం చేసేరు. సాక్ష్యం చెప్పేరు.

వాది ఈ ప్రతివాదిని అగ్నిసాక్షిగా పెళ్ళాడేట్ట. పెళ్ళి యధావిధిగా, శాస్త్రోక్తంగా జరిగిందట. అప్పుడు చాలామంది వచ్చి, చూసి, సంతోషించేసి వెళ్ళిపోయారట. పెండ్లి కుమార్తెకి చాలా అలంకారాలు పెట్టేట్ట. కానీ వాటి గురించి ఈ కేసులో తగవు చెయ్యడంలేదట. తానయి కానీకట్నం పుచ్చుకోలేదట. ప్రతివాదీ తనూ కొన్నాళ్ళపాటు హాయిగా కాపురం చేశారట. కాపురం చేసేటప్పుడు ఫలానావారింట్లో అద్దెకుండేవారట. తరువాత అకారణంగా ప్రతివాది తనని విడిచి పెట్టి వెళ్ళిపోయిందట. ఆవిడ ఇప్పుడు తన దగ్గరికి వచ్చి తీరవలసిందేనట. అందుకేనట ఈ కేసు.

మొత్తం మీద సాక్ష్యం మాంచి కట్టుదిట్టంగా చెప్పేడు వాది. క్రాసులో వచ్చిన డొంక తిరుగుడు ప్రశ్నలకి టకాటకీమని ఠపీఠపీమని ధాటిగా, ముక్తసరిగా, దొరక్కుండా జవాబులిచ్చేసి చాలామంది చేత "శాబాస్" అనిపించుకున్నాడు.

తరువాత వరసగా, పెళ్ళిచేయించాననే పౌరోహితుడూ, పెండ్లి, కార్యం చూశామనే పెద్దమనుష్యులూ, వాది ప్రతివాదులు తన ఇంట్లో కాపురం చేసేవారని చెప్పే పెద్దమనిషీ వగైరా వారంతా కూడా సాక్ష్యం చెప్పేరు. వాళ్ళల్లో ఏ ఒక్కడూ కూడా తొణకలేదు. బెణకలేదు. తొట్రుపాటు పళ్ళేదు. నీళ్ళు నమల్నే లేదు.

వాది తరపున సాక్ష్యం పూర్తయాక ప్రతివాది బోనెక్కి సాక్ష్యం చెప్పింది.

వాది తరపున వచ్చిన సాక్షుల సాక్షిగా గాని, మరే దేవత దయ సాక్షిగా గాని తనకి ఈ వాదితోగాని మరెవరితోగాని పెళ్ళికాలేదట. ఆమెకి పెళ్ళికానేలేదట. వాదిని తనెప్పుడూ ఎరగనే ఎరగదట. వాణ్ణి కేసులో తప్ప ఇంతకు ముందెప్పుడూ చూడనే చూడలేదట. వాడితో తనెప్పుడూ కాపురం చెయ్యనేలేదట. తను ఫలానా ఫలానా షావుకారు గారి ఆడాలో ఉన్నదత.

తక్కిన డిఫెన్సు సాక్షులు చెప్పేదేమంటే.

వారు ప్రతివాదిని చిన్నప్పటి నుంచీ ఎరుగుదురు. ఆవిడకి ఎన్నడూ ఎవరితోనూ "పెండ్లి జరుగలేదు". పెళ్ళి కావల్సిన అవసరం ఆవిడకి లేదు. ఆవిడికి ఈడు వచ్చినప్పట్నుంచీ, అంటే సుమారు మూడు సంవత్సరాలనుంచీ, ఫలానా ఫలానా షావుకారు ఆవిణ్ణి ఉంచుకున్నారు. షావుకారు పోషణలో కులాసాగా కాలం గడుపుతూన్న ప్రతివాదికి, పూటకి టికాణా ఉన్నట్టు కనిపించని వాదిని పెళ్ళాడవలసిన అవసరం లేదు. ఆవిడ గర్భం దాల్చడం షావుకారుగారి "అనుభవం"లో ఉండగానే జరిగింది. ఇటీవల ఆమె ఒక

కుమారుని కూడా కన్నది. ఈ రీతిగా నడిచింది ప్రతివాది తరపు సాక్ష్యం అయితే ఫలానా ఫలానా షావుకారుగార్ని ప్రతివాది తరపున సాక్షిగా ఎందుకు రప్పించలేదు?

షావుకారు గారు "యూకే" వెళ్ళేరట. అక్కణ్ణించి "యూయస్‌యే" వెళతారట. ఎప్పుడు వస్తారో తెలియదట. ఆయన్ని కమీషన్ మీద విచారణ చేయించడానికి కావలసినంత డబ్బు ప్రతివాది దగ్గర లేదట.

కోర్టువారు కేసుల్లో తీర్పులివ్వగలరు కానీ పార్టీలకి డబ్బివ్వలేరే! పోనీ ఆ ముఖ్యమైన సాక్షి వచ్చేదాకా కోర్టు వారు ఆగకూడదా? అసందర్భం. ఎన్నాళ్ళని ఆగడం. ఆగినా, అతగాడు ఈ దేశం రాకనే పోతే?

అందుచేత ఫలానా ఫలానా షావుకారు గారి కోసం కనిపెట్టుక్కూర్చోకుండా కోర్టువారు దావా విచారణ చేసేరు. సాక్ష్యం విన్నారు. ఆర్గ్యుమెంట్లు విన్నారు. తదుపరి తీరుబడిగా తీర్పు చెప్పేరు. కోర్టువారు సుదీర్ఘంగా చెప్పిన తీర్పులో తెలుసుకోవల్సిన ముఖ్య విషయాలివి.-

"కేసు! ప్రతివాది తన భార్య అనిన్నీ, దావా తేదీకి నెలదినముల ముందు ఆమె తనని అకారణంగా విడిచిపెట్టి వెళ్ళిపోయినదనిన్నీ, ఆమె తన వద్దకు రావలసియున్నదనిన్నీ, అందుచేత ప్రతివాది తన భార్య అనే డిక్లరేషను నిమిత్తమున్ను, ఆమె తనవద్దకు వచ్చే నిమిత్తమున్ను వాది ఈ దావా తెచ్చేయున్నాడు.

తను వాదినిగాని మరెవ్వరిని గాని పెండ్లియాడలేదనిన్ని, తను నేటికిన్ని అవివాహితననిన్ని, వాది ఎవరో తనకు తెలియనే తెలియదనిన్ని, వాది వద్దకు తను వెళ్ళనవసరం లేదనిన్ని ప్రతివాది జవాబు చెప్పియున్నది.

సారాంశములు: వాది ప్రతివాదులకు వివాహం అయినదా? అయినచో వాదిని ప్రతివాది అకారణంగా విడిచి పెట్టినదా? ఏ పరిహారమునకు వాది అర్హుడై యున్నాడు?

సాక్ష్యం: వాది ప్రతివాదిని అగ్నిసాక్షిగా వివాహమాడినట్లు వాది చెప్పడమే కాకుండా, చాలామంది ఆ విషయం గురించి చెప్పియున్నారు. వాది ప్రతివాదులు తన ఇంట్లో కాపురం చేసినట్టు ఒక పెద్దమనిషి మిక్కిలి నిక్కచ్చిగా చెప్పియున్నాడు. పెండ్లికాలమందే కాక, గర్భాదానకాలమందు కూడా తనే పురోహితుణ్ణని చెప్పేడు రెండవసాక్షి.

ప్రతివాది తన సాక్ష్యంలో తాను అవివాహితనని చెప్పి యున్నది. ఆమె మిగతా సాక్షులు కూడా ఆ విధంగానే చెప్పియున్నారు. పెండ్లి జరిగినదని వాది చెప్పే తేదీనాటికి ప్రతి వాదిని ఎవరో ఉంచుకున్నారని డిఫెన్సులో చెప్పియున్నారు. ఉంచుకున్న వారెవరో, సాక్షిగా ముందుకు రాలేదు. "పెండ్లి జరిగింది" అనే పాజిటివ్ ఫాక్ట్ గురించి వాది తరపున గట్టి సాక్ష్యం వచ్చి యున్నది. "పెండ్లి జరుగలేదు" అనే నెగిటివ్ ఫాక్ట్ గురించి సరియైన సాక్ష్యం లేదు. ప్రతివాది ఏ రాత్రి ఏ గుళ్ళో పెళ్ళిచేసుకుందో, చేసుకోలేదో తెలుసుకునేందుకు ఆమెని ఆమె సాక్షులు ఇరవై నాలుగ్గంటలూ అంటిపెట్టుకుని తిరుగరు కదా! అదియునుగాక, లోకంలో ఇంతమంది స్త్రీలు ఉండగా వాది ఈ ప్రతివాదినే పెళ్ళిచేసుకున్నానని ఏల చెప్పవలెను? - నిజంగా పెళ్ళాడితేనే తప్ప. అన్ని విషయములనూ పరిశీలించి చూచినట్లయితే వాది ప్రతివాదులకు శాస్త్రోక్తంగా వివాహము జరిగినట్లు ఈ కేసులో ఋజువైందని కనిపిస్తూయున్నది. వాదిని విడిచివచ్చుటకు తగినంత కారణం ప్రతివాది చూపియుండలేదు.

కాగా, వాది ప్రతివాదులకు వైవాహిక సంబంధము కలదనిన్ని, వాది ప్రతివాదిని శాస్త్రోక్తంగా వివాహమాడినాడినిన్ని డిక్లేరు చేయించుతూ ప్రతివాది ఈ వెంటనే వాదితో తిరిగి కాపురం చేయుటకు వెళ్ళవలసియున్నదని డిక్రీ జారీ చేయబడెను.

పార్టీలు ఎవరి ఖర్చులు వారే భరించవలెను."

అదీ తీర్పు.

తీర్పు తెలుసుకున్న తర్వాత ప్రతివాది కోర్టువార్నీ, కోర్టునీ, వాదినీ, దేవుణ్ణీ, లోకాన్ని బండబూతులు తిట్టింది.

కేసు అయిన తర్వాత ఫలానా ఫలానా షావుకారుగారికి వాది ఒక జాబు రాసేడు.

"..కేసు పూర్తయింది. దాన్ని నేను అగ్నిసాక్షిగా పెళ్ళాడినట్టూ, అది వచ్చి నాతో కాపురం చెయ్యాల్సినట్టూ తీర్పు చెప్పేరు. మన తడాఖాకి ఎవరాగ్గలు చెప్పండి. ఇహ నా ముండ(!) వల్ల మీకే బాధా ఉండదు - అయితే ఇక నేను మీరు చెప్పినట్టుగా -"

వాది, అటుతరవాత  ఎక్కడికిపోయాడో ఎవరికీ తెలియదు.

ప్రతివాది కేసు పర్యవసానం గురించి గోలుగోలుమని ఏడ్చింది.

ఆమెని ఉంచుకుని ఉన్నానని చెప్పడానికి ఫలానా ఫలానా షావుకారు గాని, తన సమక్షాన పెళ్ళి జరగలేదని చెప్పడానికి అగ్ని భగవానుడు గాని సాక్ష్యానికి రాలేదు. వస్తే ఎంత బావుణ్ణు? కానీ ఒస్తారా, మనం అనుకోవడమే.




**ఆటో కృష్ణ**

**ఒబెరాయ్ దాటి డౌన్‌లో** కెళ్ళాక ఎడం పక్కకి కట్ చెయ్యమన్నాడు చందర్. రోడ్ నెంబర్ ఫోర్ చివర ఎకరం నేలలో ఒంటరిగా ఉన్న ఆ బంగళా నిజామ్స్ కాలం నాటిది. గోడలకి తెల్లసున్నం, పచ్చ రంగేసిన కిటికీలు. బంగ్లా ముఖద్వారం ముందు స్కోడా, ఎస్సెంట్ కార్లూ లేండ్ క్రూయిసర్ వేనూ ఆగున్నాయి. ఎక్కడ చూసినా వెల్వెట్ లాన్సూ పూలమొక్కలతో బాగా మెయింటెయిన్ చెయ్యబడుతున్న ఆ బంగళాకి దూరంగా ప్రహరీని ఆన్చి కట్టిన పెద్ద ఔట్ హౌసుంది.

ఆటో దిగి చూస్తున్న చందర్ దగ్గర కొచ్చిన వాచ్‌మెన్ రాములు ఎవరి కోసం వచ్చారన్నాడు.

"జయేందర్ రెడ్డి సాబ్ బంగ్లా ఇదేనా?" అడిగాడు చందర్.

ఇదేగానీ ఆ రెడ్డి చనిపోయి పదేళ్ళయ్యింది. ఇప్పుడిందులో కిషన్ రెడ్డి సాబ్ కుటుంబంతో ఉంటున్నట్టు చెప్పాడు రాములు.

"నేనిప్పుడు వచ్చింది కిషన్ రెడ్డి సాబ్ కోసమే. మాది వాళ్ళూరే" అన్నాడు చందర్.

"రెడ్డి సాబ్‌కి రాత్రిళ్ళు జరా లేటవుద్ది. పొద్దుట సాబ్ తయారై బయటికి రావడానికి గ్యారాబజే" అన్నట్టు చెప్పేడు వాచ్‌మెన్ రాములు.

ఆటోని పంపించేసి సూట్ కేసుతో నిలబడ్డ చందర్‌కి, పదకొండున్నరకి దొరికింది కిషన్ రెడ్డి దర్శనం.

"చాలామంది పెద్ద పెద్ద ఇంజనీర్లూ డాక్టర్లూ అయ్యేరని చెప్పుకుంటారు మనూళ్ళో. ఆ సెంటిమెంటుతోనే వచ్చేను. నాక్కూడా ఇక్కడ కొంచెం చోటిస్తే అందులో ఉండి చదూకుంటాను" అన్నాడు.

రాముల్ని పిల్చిన కిషన్ రెడ్డి ఔట్‌హౌస్‌లో విరిగిపోయిన పాత సోఫాలూ, పాత సామాన్లూ తీయించి శుభ్రం చేయించమన్నాడు.

సాయంత్రానికి అక్కడ సెటిలయిపోయేడు చందర్.

●●●

పాతికేళ్ళ చందర్ అందరు కుర్రాళ్ళలాంటోడు కాదు. ప్రతిరోజూ బ్రహ్మ ముహూర్తంలో లేచి కాలకృత్యాలూ అవీ తీర్చుకున్నాక 'అపవిత్ర పవిత్రోవా' అంటూ సంధ్యావందనం మొదలెట్టి అదయ్యాక గాయిత్రీ మాత విగ్రహం ముందు కూర్చుని వెయ్యీ ఎనిమిది సార్లు జపిస్తాడు.

సూర్యోదయం అయ్యేలోపే తయారయ్యి బయటికెళ్ళిపోయే చందర్ పొద్దుటా సాయంత్రం ట్యూషన్లు ఒప్పుకోడం వల్లరాత్రితొమ్మిది దాటాక గానీ రాడు.

నిర్మలమైన పవిత్రమైన చోట్లలోనే తిరుగుతుంటాడు. ఫ్యూచర్ని తొమ్మిది రంగుల్లో తియతియ్యగా ఊహించుకుంటాడు. ఒక అంశాన్ని నీలం రంగులో ఊహించుకుంటాడు. ఒక నీతికి కట్టుబడి ఉంటాడు.

●●●

రెండేళ్ళు గడిచాయి.

ఈ రెండేళ్ళలో కిషన్ రెడ్డిని ఒకటి రెండుసార్లు మించి చూళ్ళేదు చందర్. ఇక ఇంట్లోపల ఆడవాళ్ళనసలు చూసే ఎరగడు.

ఆ రోజు రాత్రి తనుంటున్న ఔట్ హౌస్‌లో కొచ్చిన రాములు "రేపు కిషన్‌రెడ్డి సాబ్ మీతో కలిసి మాటాడేది ఉందంట. మిమ్మల్ని జరా ఇక్కడనే ఉండమన్నారు" అన్నాడు.

మర్నాడు పదకొండు దాటేక తెల్లటి శిల్కు బట్టలతో పువ్వులాగా తయారయ్యి కాళ్ళకి చడావులేసుకుని పైప్ కాలుస్తా చందర్ దగ్గర కొచ్చిన కిషన్ రెడ్డి, చందర్ చదువుతున్న చదువేంటో కనుక్కుని అదింకా ఎన్నాళ్ళు చదవాలో తెలుసుకున్నాక "ఆ తర్వాత ఉద్యోగం ఎక్కడ దొరుకుతుంది?" అన్నాడు.

"హైటెక్ సిటీ సెకండ్ ఫేజ్‌లో ఒక డచ్ కంపెనీ ఉంది. అందులో నా చదువుకి ఉజ్జోగం వచ్చే అవకాశం బాగా ఉంది. నెలకి లక్షన్నర సేలరీ వస్తుంది" అన్నాడు చందర్.

"ఎంత?" మళ్ళీ అడిగేడు కిషన్ రెడ్డి.

"లక్షన్నర. ఒన్ అండ్ హాఫ్ లేక్. అదీ ప్రారంభంలో. తర్వాత బాగా పెరుగుతుంది" అన్నాడు చందర్.

చందర్‌ని వాళ్ళింటికి ఆహ్వానించేడు కిషన్ రెడ్డి.

హాల్లో ఉన్న పర్షియానిక్ బ్లూ కార్పెట్ల మీదున్న ఖరీదైన సోఫాలో కూర్చున్నాడు చందర్.

కాస్సేపటికి ఒక నలభై అయిదేళ్ళు దాటిన స్త్రీ వచ్చింది అక్కడికి. "ఈవిడ అనిత, నా భార్య" అన్నాడు కిషన్ రెడ్డి. ఇంకాస్సేపటికి నలభై యేళ్ళావిడొచ్చింది. "ఈవిడ సబిత, నా భార్య చెల్లెలు. అయిదేళ్ళ క్రితం భర్త పోవడంతో మా ఇంటికొచ్చేసింది" అన్నాడు. ఇంకాస్సేపటికి చాలా మోడ్రన్‌గా తయారైన ఒకమ్మాయి వచ్చింది. "ఈమె మా అమ్మాయి రేణూ. నిఫ్ట్‌లో ఫేషన్ డిజైనింగ్ చేసింది. దీనికంటే పెద్దవాడు హరీష్ అట్లాంటాలో ఉంటాడు" కిషన్‌రెడ్డి.

ఆ తర్వాత చాలా మర్యాదలు చేసేకా "మా ఔట్ హౌస్‌లో చాలామంది చదువుకుని వెళ్ళేరు. కానీ నీలాంటి వాడ్ని మేమెక్కడా చూళ్ళేదు. గత రెండేళ్ళ నుంచి మా వాచ్‌మేన్ రాములు చెబుతూ వస్తున్నాడు నీ గురించి. మా రేణూని నీకిచ్చి పెళ్ళిచేద్దాం అనుకుంటున్నాం. ఈ విషయం మన రెల్లకుంట్లపల్లిలో ఉన్న మీ పేరెంట్సుకి చెప్పేనాం. చాలా ఆనందపడ్డ వాళ్ళు నీ అభిప్రాయం అడగమన్నారు."

ముందు పెద్ద షాకయిపోయిన చందర్ నెమ్మదిగా నార్మల్ కండీషన్ కొచ్చేకా "నాకు జన్మనిచ్చిన నాతల్లిదండ్రులంటే నాకు చాలా భక్తి. నేనేం చేసినా రుణం తీరదు. కాబట్టి వాళ్ళేం చెపితే నాకది వేదం" అన్నాడు.

ఆ తర్వాత నెల్లో జరిగిన పెళ్ళికి రెల్లకుంట్లపల్లి నించి వచ్చిన చాలామంది జనం 'నీ అంత అదృష్టవంతుడు ఈ ప్రపంచంలో లేడ'ని తెగ పొగిడారు చందర్ని.

చందర్ మకాం ఔటహౌస్ నుంచి మెయిన్ హౌస్‌కి మారింది. బంగ్లాలో ఒక మూల చిన్నగది తీసుకుని అందులో ప్రతిష్ఠించుకున్నాడు పంచలోహాల్తో చేసిన గాయత్రీదేవిని.

●●●

రాత్రుళ్ళు తను ఇంటికొచ్చేసరికి కనిపించేది కాదు రేణూ. అడిగితే పబ్‌లకీ డిస్కోతెక్‌లకీ నగరం చివర రిసార్ట్స్‌కీ వెళ్ళినట్టు చెప్పేవాళ్ళు పనివాళ్ళు. ఒకరోజు రాత్రి రెండింటికెప్పుడో వచ్చిన రేణూ బాత్ రూములో బ్రష్ చేసుకొచ్చి చందర్‌ని లేపి బ్రష్ చేసుకు రమ్మంది. ఆ తర్వాత చాలా రెచ్చిపోయింది. అలా తన కిష్టమంట. అది తన టేస్టంట.

ఆ రోజు ఆదివారం. రేణూ బాత్ రూములో ఉంది. సెల్ మోగితే మాటాడేడు. రహమానంట. ఏకవచనంలో మాటాడుతున్నాడు. కాస్సేపయ్యేక సుధీర్. ఆమె బాత్ రూమునుంచి వచ్చేలోపు మూడుకాల్స్ వచ్చాయి. అన్నీ మగాళ్ళవే.

ఒకరోజు ఎక్కడికీ వెళ్ళకుండా ఇంట్లోనే ఉన్నాడు. రోజూ మొత్తంలో ఎన్నికాల్సు వచ్చాయో లెక్కపెట్టలేక పోయాడు.

మధ్యాన్నం దాటింది. బంగ్లా ముందాగిన కారులోంచి దిగాడొకతను. ఏభై పై నుంటుంది వయసు. ఇన్నాళ్ళూ జెద్దాలో ఉండి వచ్చేడంట. సొంత ఊరు ఎమ్మిగనూరంట. నవ్వుతూ అతనికెదురొచ్చి లోపలికి రమ్మన్న అనితారెడ్డి తన గదిలోకి తీసుకెళ్ళిపోయింది. వాళ్ళు కాలేజ్ డేస్‌లో ఫ్రెండ్స్‌ంట. తలుపు లేసుకుని చాలా సేపు మాటాడుకున్నారు. అతన్ని చూసిన పనివాళ్ళు చెప్పేరు. ఇలా చాన్నాళ్ళ నుంచొస్తున్నాడంట ఆ మనిషి. అది కిషన్‌రెడ్డి సాబ్‌కి తెల్సంట.

సాయంత్రమయ్యింది. లేండ్ క్రూయిసర్‌లో బయటికి బయలుదేరిన కిషన్ రెడ్డి కూడా మరదలు అనితారెడ్డిని తీసుకెళ్ళేడు.

రాత్రి లోపల్నుంచి వైన్ బాటిల్ తెచ్చిన రేణూ "తాగుతారా, ఇది మా ఇంట్లో తయారు చేసిందే వైన్ చెయ్యడంలో చాలా ఎక్స్‌పర్ట్ మామమ్మీ" అంది.

టీ.వీ చూస్తూ తాగుతూ ఫోన్లు మాట్లాడుతూ రాత్రి పదిదాకా గడిపేక "పదండి. పబ్‌కి వెళదాం" అని తీసుకెళ్ళింది.

ఆ పబ్‌లో రేణూ భుజం మీద నడుం మీదా చనువుగా చేతులేసి పలకరించిన మగాళ్ళు ఎంతమందో.

పోను పోను చాలా విషయాలు తెల్సాయి చందర్‌కి. రేణూకి మూడుసార్లు అబార్షన్లయ్యాయంట. ఆ విషయం అందరికీ తెల్సంట. ఔట్‌హౌస్‌లో ఉంటున్న తను ఎంత సాత్వికుడో తెలుసుకున్నాక తనకిచ్చి చేసేరంట.

ఇంకా చాలా విషయాలు తెలుసుకున్న చందర్ ఒకరాత్రి కిషన్ రెడ్డితో గట్టిగా మాటాడదాం అని అతని గది దగ్గర కెళ్ళేసరికి తాగేసుకున్న కిషన్‌రెడ్డి అతని భార్యా దెబ్బలాడుకుంటున్నారు.

వాళ్ళ కొట్లాట విన్న చందర్‌కి ఇంకా చాలా విషయాలు తెలిశాయి.

'ఏమయ్యాయి నీలం రంగు నా కలలు? ఏమయ్యాయి నా గులాబీరంగు గాలిమేడలు? ఏమిటీ ఎరగని మనుషులు ఏమిటీ గిజాటు వాతావరణం? నేనున్న ఈ మాయేదో ఈ గొయ్యేదో చాలా చిత్రంగా ఉంది ఇందులో మునక్కుండా చావకుండా తేల్తున్న నేను చివరికి బతికి నిజంలో కొస్తానా? వెలుగులో కొస్తానా?

ఇన్నాళ్ళు ఒక నీతికి కట్టుబడి ఉన్న నేను దాన్ని తెంచుకుని పారిపోదామంటే అక్కడ పటాపంచలవ్వుద్ది. మా గ్రామాల్లో ఫలానా గడీగల ఒకనాటి పటేల్ జయేందర్ రెడ్డి సాబ్ కొడుకు కిషన్ రెడ్డి అల్లుడిగా మారుమోగిపోయాను. దాంతో అక్కడున్న నా తల్లితండ్రులకి జన్మలో ఎరగని గౌరవం, జన్మలో ఎరగని మర్యాదలు ఇచ్చేస్తున్నారు జనం. ఇప్పుడు నేనేం చేసినా సర్వం తల్లకిందులయిపోతుంది. ఐతే మరైతే ఎలాగ. మరెలాగ. ఈ కాటుక రంగు చీకట్లోంచి వెలుగుని చూసేదెలాగ.'

ఒక విషాదంలోంచి ఒక రకమైన నిర్వేదానికి ఒకానొక వైరాగ్యానికీ లోనయిపోతున్న చందర్ ఎప్పుడో అర్ధరాత్రి పూట వచ్చి తెల్లవారు ఝామున పూజా, జపం చేసుకుని 'చీకట్లోంచి చీకట్లోకి అంటే ఇదేనా' అనుకుంటూ వెళ్ళిపోతున్నాడు. అదే వేదనతో ఎన్నో రోజులు గడిచిపోయాయి.

●●●

రెల్లకుంట్లపల్లి నుంచి చాలామంది జనం వచ్చారావేళ. కిషన్‌రెడ్డికి చాలా దగ్గర బంధువుల పెళ్ళంట. ఇంటిల్లిపాదీ రావాలని గొడవపెట్టారు "రాత్రి కొచ్చేద్దాం వస్తావా?" అని చందర్ని అడిగితే "నేను ఇల్లు చూసుకుంటాన్లే మీరెళ్ళి రండి" అన్నాడు.

అంతా వెళ్ళిపోయాకా ఆ రోజు సాయంత్రం దాకా ఎక్కడన్నా ప్రశాంతంగా గడుపుదాం అనిపించి బయల్దేరాడు.

ఎందుకనిపించిందో సంజీవయ్య పార్కుకి వెళ్దామనిపించి ఆటో ఎక్కేడు.

హుస్సేన్ సాగర్ మధ్యలో వందెకరాల స్థలంలో ఉందా పార్కు. అయిదు రూపాయిలు టిక్కెట్టు కొనుక్కుని లోపలికి నడుస్తుంటే ఎప్పటికపుడు నేలని శుభ్రం చేస్తున్న హుడా పనిమనుషులు, లాన్సని తడిపే డిప్పర్లు చల్లగా హాయిగా ఉంది వాతావరణం. నేలబారుగా ఉన్న సిమెంటు బెంచీల్నిండా జంటలు. ఎక్కువగా బురఖాలు తగిలించుకున్న అమ్మాయిలు. (ఆ బురఖాలు బయటెక్కడో అద్దెకిస్తారంట) విచిత్రం - జంటల్లో వయసులో ఉన్నవాళ్ళే గాకుండా నడివయసు వాళ్ళూ ముసలాళ్ళూ కూడా ఉన్నారు.

పార్కు మధ్యలో కొచ్చాక ఆగేడు చందర్.

ఈ ఏడాది ఆక్షన్ అయిపోడంతో మూసేసి ఉన్న పాత రెస్టారెంట్ ఎదురుగుండా కొత్తగా తెరిచిన పసుపు రంగు రెస్టారెంటు కనిపించింది. ఆ రెస్టారెంట్లో కెళ్ళి టీ ఇమ్మని కుర్రాడ్నడుగుతున్నప్పుడు తన్ని చూసి నవ్వుతూ వెళ్ళిపోయిందా మనిషి.

పరిణీత విద్యాబాలన్‌లా గుంది. పాతికేళ్ళలోపే వయస్సు. నారాయణపేట చీర. పొడుగు ఉండటంవల్ల ఐహీల్ చెప్పులెయ్యలేదు. తెల్లకలువ పూల్లా మెరుస్తున్నాయి కళ్ళు. నవ్వినప్పుడు స్వరోస్కీ క్రిస్టల్స్‌లా మెర్సినియ్యి పళ్ళు.

టీ తాగేక దూరంగా ఉన్న మోదుగ చెట్టు దగ్గరకెళ్ళి దాని మొదట్లో కూర్చున్న కాస్సేపటికి మళ్ళీ కనిపించిన ఆమె "టైమ్ పాస్ కావాలా?" అంది.



కౌముది

అర్థంగాక "ఏంట"న్నాడు.

"ఇక్కడ ఒంటరిగా కూర్చున్నారు కదా. మీకు టైమ్ పాస్ కావాలా అని అనడుగుతున్నాను" అంది కూర్చోమంటే కూర్చుంది.

నవ్వుతా అంది "చీకటి పడేదాకా మీతో మాట్లాడ్తూ గడుపుతాను. మీ మనసులో మాటలు చెపితే విని నాకు తోచిన సలహాలిస్తాను. మీతో చాలా ఫ్రెండ్లీగా ఉంటాను. వెళ్ళేటప్పుడు మీరు ఇవ్వాలనుకున్నది ఇవ్వండి" అంది మృదువుగా.

నవ్విన చందర్‌కి ఈ మధ్య పార్కుల్లో తిరుగుతున్న టైమ్ పాస్ అమ్మాయిల గురించి పేపర్లో చదివిన ఆర్టికల్ గుర్తొచ్చి "తర్వాత?" అన్నాడు.

మాట్లాడ్డం మొదలుపెట్టింది. చందర్ మనసుని చదివినట్టు మాట్లాడింది.. పేరు పరిమళమట. "జీవితం అర్థంకాకుండా ఉందా? పరమహంస యోగానంద ఆత్మకథ చదవండి. ఒక క్లియర్ పాథ్ కనిపిస్తుంది. 'జుజుమురా'కథ చదవండి ఒక ఫీల్ మిమ్మల్ని వెంటాడ్తుంది" ఆ పరిమళ మాట్లాడుతుంటే ఆమె గొంతు 'సాహిబ్ బీవీ ఔర్ గులామ్'లో మీనాకుమారి గొంతులాగా ఒకసారి, మళ్ళీ తీసిన దేవదాస్‌లో జయంతి గొంతులా ఒకసారి వినిపించింది. జీరతో కూడుకున్న ఆ మంద్రస్థాయిలో ఒక ఫీల్, ఒక వేదన.

ఇంకాస్సేపయ్యింది. ఆమె చాలా మాట్లాడింది. ప్రస్తుతం ఉన్న తన మానసిక స్థితికి సంబంధించినవే అవన్నీ. చాలాసేపు గడిచింది. చాలా హాయిగా అనిపిస్తున్న ఆమె మాటలకి ఆ పార్కులో పావురాళ్ళు కూడా పరవశించిపోయి అక్కడ కొచ్చి వాలాయి. వాలడమే కాదు తన భుజం మీదా ఒళ్ళో తలమీదా ఎగిరి కూర్చున్నాయి. వాటితో పాటు రంగురంగుల లవ్ బర్డ్సు రంగు రంగుల పూలు తన చుట్టూ పుట్టాయి. ఎక్కడినించో పరుగెట్టుకొచ్చిన లేడిపిల్ల. ఇంకెక్కడినుంచో ఎగురుకుంటూ వచ్చిన ఆడ నెమలీ పక్షులూ పావురాళ్ళ మధ్యలోకి కలిశాయి.

"బయటికెళ్ళి ఏవన్నా తిందాం" అన్నాడు.

మాట్లాడతానే లేచింది.

బయటికొచ్చిన ఇద్దరూ రోడ్డుకి ఎడం పక్కనే కిలోమీటరు పైన నడుచుకుంటూ ఆ నెక్లెస్ రోడ్లో ఉన్న ఈట్ స్ట్రీట్ (ఆ రెస్టారెంట్ పేరది)లో కెళ్ళారు.

ఎంట్రన్స్ టైల్స్ మీద వైకుంఠపాళీ వేసుంది. డార్క్ మిక్స్‌డ్ కలర్ టైల్సవి. స్థంభాలకి వైలెట్, ఆకుపచ్చ రంగులేసున్నాయి. యూరోపియన్ కంట్రీస్ ఇన్‌ఫ్లూయెన్స్ బాగా కనిపిస్తుంది ఇంటీరియర్ డెకరేషన్‌లో. లోపలికెళితే నిజంగానే స్ట్రీట్‌లాగుంది. సబ్‌వే, పిజ్జా హట్, మినర్వా కాఫీ షాప్, కాఫీ డే, ఓక్ ఆఫ్ హైదరాబాద్, చాక్‌లెట్ హాట్ వాళ్ళ బ్రాంచెస్ వరసగా ఉన్నాయి ఆ వీధిలో. సపరేట్‌గా ఉన్న ఒక స్టాల్‌లో హాట్ అమెరికన్ స్వీట్ కార్న్ అమ్ముతున్నాడో కుర్రాడు. చిలకజోస్యం చెప్పేవాడొకడు తన సరంజామాతో నవ్వుతూ కూర్చున్నాడు. హుస్సేన్ సాగర్‌కి ఎదురుగా చాలా వెడల్పుగా ఉన్న ఆ రెస్టారెంట్‌కి రెండు పక్కలా రెండు ఎల్.జి. ఎక్స్ కేన్వాస్ హోమ్ థియేటర్స్ టీవీలున్నాయి. వాటిలో ఇండియా x జింబాబ్వే క్రికెట్ మేచ్ వస్తుంది. ఇక టేబుళ్ళ మీద పల్చ పల్చగా అమ్మాయిలూ అబ్బాయిలూ డెవలప్ అయిపోతున్న కల్చరంతా అక్కడుంది. రెస్టారెంట్ హుస్సేన్ సాగర్ని ఫేస్ చేసి ఉంది గాబట్టి గాలెలాగూ వస్తుందనేమో ఫేన్లు బిగించలేదు. ఉక్కగా ఉంది. లేక్ అంచున వరసగా ఎరేంజ్ చేసున్న టేబుళ్ళలో ఇద్దరు మట్టుకే కూర్చునే సదుపాయంగల టేబుల్ దగ్గరకెళ్ళి కూర్చున్నారు.

"ఏం తింటారు?" అడిగాడు చందర్.

ఏవన్నా పర్లేదంది పరిమళ.

సబ్ వే షాప్‌కెళ్ళి రెండు ఆల్ వెజ్ ఆలూ పేటీ సబ్స్, డైట్ కోక్ తెచ్చేడు.

తినడం మొదలెట్టిన పరిమళ చందర్ పేపర్ ప్లేట్లోంచి ఆల్‌ఫైనో పీసెస్ తీసుకుని తింటూ "ఇవంటే నాకిష్టం" అంది. 'సెపరేట్‌గా పెట్టానా' అంటే వద్దంది.

అలా ఆ మనిషి తన పళ్ళెంలోంచి చొరవగా తీసుకుంటుంటే అది తనకెంతో ఇష్టమైన పనిలాగనిపించింది.

కాస్త గాలాడక చందర్ నుదురు మీద పట్టి కారుతున్న చెమటని తన చీర కొంగుతో సుతిమెత్తగా తుడిచింది పరిమళ.

చాలా థ్రిల్లయిపోయి చాలా ఎగ్జయిటయిపోయి ఆ మనిషినే చూస్తున్నాడు. తన భార్య ఎప్పుడూ అలా చెయ్యలేదు. ఆమె నేచర్‌కి ఈ రకం స్పృహే తెలీదు. అలాంటిది ఎవరో ఇప్పుడే పరిచయమైన ఈ పరిమళేంటిలాగ? గతంలో ఎక్కడో ఏదైనా సంబంధముందా ఈ మనిషితో అర్థం కావటంలేదు.

తింటుంటే మధ్యలో "మంచినీళ్ళు తెస్తాను ఈసారి మీరు లేవకండి" అనెళ్ళి రెండు ఒన్ లీటరు అక్వాఫినా బాటిల్సు తెచ్చింది.

తినడం, తాగడం అయ్యాక తనకేసి చూస్తూ "మెడిటేషన్ చెయ్యండి. ఒకమ్మాయి ప్రతిరోజూ భగవంతుడికి ఉత్తరాలు రాసేదంట. లెటర్స్ టు గాడ్ అదీ ఒకరకమైన మెడిటేషనే అని ఒక లెక్చరర్ లో అంటాడు ఓషో" అంది పరిమళ.

మాటాడం మొదలెట్టింది పరిమళ. "ఆ ఒంటరితనాన్ని బ్రేక్ చేసే బెర్నార్డో బెర్టూలుచ్చీ తీసిన బి సీజ్డ్, విన్సెంట్ వార్డ్ డైరెక్ట్ చేసిన వాట్ డ్రీమ్స్ మే కమ్ సినిమాలు చూడండి. మీకెప్పుడన్నా అవకాశం ఉంటే ఎక్కడన్నా టైమ్ దొరికితే కాల్ ఆఫ్ ద వేలీ, మొజార్ట్ సింఫనీ నెం.41 జూబిటర్ వినండి. అప్పుడు జీవితం వ్యర్థం అనిపించదు. అర్థం కాదనిపించదు. మీకూ బతకాలనిపిస్తుంది. ఆయుషు పెంచమని ఆ దేవదేవుడ్ని, ఆదిదేవుడ్ని కోరాలనిపిస్తుంది" ఇలా ఆమె పల్లవీ చరణాల నిబంధన లేకుండా ట్యూన్ చేసిన ఒక లాంగ్ పోయెమ్‌ని పాడుతున్నట్టు పోతోంది..

ఒకానొక తన్మయత్వంలో పడిపోయి వింటున్నాడు చందర్. రంగురంగుల లవ్‌బర్డ్స్ తన తలమీద వాలి పాపిట రువ్వి గూడు కట్టుకుంటున్నాయి. మోచేతుల మీద వాలిన బూడిదరంగు పావురాళ్ళు ముక్కుల్తో పొడుస్తున్నాయి. ఇంతలో వచ్చి టేబుల్ మీద వాలిన నెమలి అమాంతంగా పురివిప్పేసి తన మీద ఎండ పడకుండా కాస్తోంది. కుందేళ్ళూ, లేడిపిల్లలు చుట్టూ కల తిరుగుతూ ఆడుకుంటున్నాయి. వీటితోపాటు చల్లటి గాలి రింగులు తిరుగుతా వచ్చింది. వాళ్ళ టేబుల్‌కి అటూ ఇటూ ముందు వెనకా ఉన్న టేబుల్స్ మీది జనం టీవీల్లోంచొస్తున్న డిజిటల్ సరౌండ్ మ్యూజిక్ విని ఎంజాయ్ చేస్తుంటే, పరిమళకీ తనకీ అవేం వినపించడంలేదు.

సాయంత్రం అయ్యింది. గాలి బాగా వీస్తోంది. ఈట్‌స్ట్రీట్ రెస్టారెంట్‌ని ఆన్చి ఉన్న ఏ.పీ. టూరిజం వాళ్ళ బోట్లు తిరగడం మొదలెట్టాయి హుస్సేన్ సాగర్లో

"మనమూ వెళదామా?" అన్నాడు చందర్.

పదమంది.

లేస్తుంటే పావురాళ్ళు నెమళ్ళు గాలిలోకెగిరిపోయాయి. జింకలూ కుందేళ్ళూ పారిపోయాయి. ఆ రెస్టారెంట్ దాటేక హుస్సేన్ సాగర్‌లోకి వేస్తున్న చెక్కవంతెన ఎక్కి టూరిజం వాళ్ళ బోట్ ఎక్కారిద్దరూ. గాలిబాగా ముదిరింది. చాలా జంటలతో పాటు చాలా ఫేమిలీస్ వాళ్ళ పిల్లలు కూడా ఎక్కారు బోట్ మీద. కాసేపటికి జనంతో నిండిపోయింది.

మెలికలు తిరిగి వీస్తున్న గాలిలాగ ఒకటే సందడి. దూరంగా సూర్యాస్తమయమవుతోంది. పక్షులూ, నెమళ్ళు, లేళ్ళు మళ్ళీ ప్రత్యక్షమయ్యాయి.

తనూ పరిమళా సపరేట్‌గా ఉన్న ఒక టేబుల్ మీద కూర్చున్నాక వీస్తున్న గాలినీ చుట్టూ ఉన్న నీళ్ళనీ దూరంగా ఉన్న మల్టీ స్టోర్డ్ బిల్డింగ్స్‌లో వెలుగుతున్న దీపాల్నీ చూస్తా హాయిగా నవ్వుతూ "ఎప్పుడన్నా మదనపల్లి వెళ్ళేరా?" అడిగింది పరిమళ.

"లేదు ఏం?" అన్నాడు చందర్.

"ఐతే హార్స్లీ హిల్సు. ఠాగూర్ జనగణమన ట్యూన్ చేసిన రిషీవేలీ స్కూల్ చూసి ఉండరు" అంది

"చూళ్ళేదు" అన్నాడు.

"ఎందుకు అడుగుతున్నానంటే జిడ్డు క్రిష్ణమూర్తి ప్లేసది. ఒక లెక్చర్లో ఆయనేమంటారో తెల్సా. మొనాటినీని బ్రేక్ చెయ్యమంటారు. నిత్యం అదే గది. అవే గోడలు. అవే బాధలు. అదే భార్య అని మొనాటస్‌గా ఫీలవకండా వాటినే కొత్తగా చాలా ఫ్రెష్‌గా చూడమంటారు. దానికి మెడిటేషన్ అవసరం. అదేగానీ చేస్తే ఏమిటీ జీవితం ఏమిటీ బంధాలూ. ఏమిటీ రోత? అనే ప్రశ్నలుండవు" అంది.

ఇంకా చాలా చెపుతూనే రంగుల లవ్‌బర్డ్సు, పావురాళ్ళు, నెమళ్ళు, జింకలూ, గోరువంకలూ తన చుట్టూ తన శరీరమంతా ఆవరించాయి. సున్నితంగా తనని పొడుస్తున్నయి. ఒక తన్మయత్వానికి గురిచేస్తున్నాయి. ఒకానొక జ్ఞానోదయం కలగజేస్తున్నాయి.

గాలి ముమ్మరంగా వీస్తోంది.. చీకటి పడ్డం మొదలెట్టింది. దూరంగా భవనాల్లో దీపాలకాంతులు పెరుగుతున్నాయి.

పరిమళ శ్రావ్యంగా మాటాడ్తూనే ఉంది.

చాలాసేపు గడిచింది. చీకటి బాగా చిక్కబడింది.

హుస్సేన్ సాగర్ చుట్టూ చాలాసేపు తిరిగిన బోటు ఎక్కడ బయల్దేరారో అక్కడికొచ్చి ఆగింది. అంతా దిగిపోయేరు.

ఆ చీకట్లో దశమినాటి జాబిలిలా నవ్వుతూ శలవు తీసుకుంటున్న పరిమళ కూడా పక్షులూ, కుందేళ్ళూ, నెమళ్ళూ, జింకలూ వెళ్ళిపోయాయి.

ఇప్పుడు తన మనసు నిండా ఆమే. ఆ పరిమళనే తల్చుకుంటా ఇంటికి బయల్దేరాడు.

ఇంటికొచ్చిన కాస్సేపటికి ఊరెళ్ళిన జనం దిగిపోయారు.

మళ్ళీ మాములే. కిషరెడ్డీ భార్యా తాగి కోట్లాడుకుంటున్న మాటలు బయటికి వినిపిస్తున్నాయి. ఇంకో గదిలో మరదలు సబితారెడ్డి వింటున్న పాత హిందీ పాటలు వినిపిస్తున్నాయి.

చాలాసేపు రెడ్ వైన్ తాగిన రేణూకి గ్రీన్ పార్క్‌లో మిడ్‌నైట్ బిర్యానీ తిందామా అని ఎవరో ఫోన్ చేస్తే కారేసుకు బయల్దేరింది.

చందర్ ఆ పరిమళనే తల్చుకుంటున్నాడు. ఆ నవ్వునే తల్చుకుంటున్నాడు. ఆ జ్ఞాపకాల్తోనే ఆడుకుంటున్నాడు. ఆమె చేసిన జ్ఞానోదయాన్నే పొడుకుంటున్నాడు.

మర్నాడు పొద్దుట పూజగదిలో నవ్వుతూ తనని ఆశీర్వదిస్తున్న గాయత్రీదేవి ముఖం కేసి చూసాక ఆశ్చర్యంతో అలాగుండిపోయాడు.

అమ్మవారి ముఖం నిన్న కనిపించి మాయమైన పరిమళ ముఖం ఒకేలాగున్నాయనిపించింది. అది భ్రమో నిజమో అర్థం కావడం లేదు. ఆ తర్వాత ఎన్నిసార్లు సంజీవయ్య పార్కుకెళ్ళి వెతికినా టైమ్ పాస్ అమ్మాయిలు చాలామంది కనిపించారు గాని, నవ్వే ఆ పరిమళ మాత్రం మళ్ళీ కనిపించలేదు.

*(వంశీగారిని ఈ కథ పునర్ముద్రణకి అనుమతి అడగ్గానే వెంటనే అనుమతి నివ్వడమే కాక, ఈ కథకోసం బాపు గారు ప్రత్యేకంగా గీచిన చిత్రాన్ని కూడా పంపించారు. 'కౌముది 'కి ఆత్మీయులు వంశీగారికి మరోసారి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం)*

# సగటుతండ్రి దేవరకొండ మురళి

*జ్యోతి మాసపత్రిక మే 1977*

**శకుంతలకి విసుగొచ్చింది.** పొద్దుగంటనుంచి వెతుకుతున్నా పద్దు పుస్తకం కనపడటంలేదు. ఏ రోజు ఖర్చు ఆ రోజు ఎప్పటికప్పుడూ పుస్తకంలో రాసేస్తుంది. ఇంట్లో ఎవరు ఏగానీ ఖర్చుపెట్టినా అది ఆమె పుస్తకంలోకి ఎక్కాల్సిందే. ఆఖరి ప్రయత్నంగా భర్త గదిలోకి వెళ్లి టేబుల్ సొరుగులాగి చూసింది. పద్దుపుస్తకం కనపడింది. "తగలబడ్డట్టే ఉంది ఈయన జాగ్రత్త" అనుకుని పుస్తకం తీసి న్యూస్ పేపర్ కుర్రాడికిచ్చిన డబ్బు వివరం రాసి పుస్తకాన్ని తిరిగి సొరుగులో ఉంచబోయింది. అప్పుడు పొడుగాటి కవరొకటి శకుంతల దృష్టి నాకర్షించింది. చేతిలోకి తీసుకుని చూసింది. రిజిష్టరు పోస్టులో వచ్చిన కవరది. భర్తపేరు మీద ఆఫీస్ అడ్రెస్‌కి వచ్చింది. అంటే నిన్ననే వచ్చివుండాలి. కవరుమీద పంపిన వారి పేరుకోసం చూసింది. ఒక మూల "వై.మృత్యుంజయరావు, అడ్వకేట్, మచిలీపట్నం" అని ఉంది. మచిలీపట్నం పేరు చూడగానే ఆమె భృకుటి ముడిపడింది. ఆలస్యం చెయ్యకుండా కవరులోని కాగితాలని బయటకి తీసి చదివింది. ఆమెకు ఇంగ్లీషు అంత బాగా రాదు. టైపు చెయ్యబడిన కాగితాలని ఒకటి రెండుసార్లు చదివాక విషయం చూచాయగ బోధపడింది. అంతే. ఆమె ముఖం ఒక్కసారిగా కళావిహీనం అయిపోయింది. నిలుచున్న మనిషి మొదలు నరికిన మానులా నేలకూలింది.

ఆమెకి ఫిట్స్ వచ్చాయి.

తరువాత కాసేపటికి పిల్లలకి కారియర్లు తీసుకెళ్ళేందుకు వచ్చిన పనికుర్రాడు అమ్మగారిని చూసి అదురుకుని తన వెంట వచ్చిన తన తమ్ముడికి అక్కడే ఉండమని చెప్పి తను బైటికి పరిగెత్తాడు.

కారియర్ కుర్రాడు మోసుకొచ్చిన వార్త విని తరణీరావేం తలకిందులవలేదు. విని మౌనంగా ఊరుకున్నాడు. అయితే ఈ రోజు పిల్లలకి భోజనప్రాప్తి లేదన్నమాటే.

"చూడు రాంరతన్" పనికుర్రాడితో అన్నాడు. "ఈవేళ కారియర్లు లేవు. నువ్వు స్కూలుకి వెళ్లి బాబుకి హోటలునుంచి ఏదైనా టిఫిన్ తెచ్చి ఇవ్వు." అని జేబులోంచి డబ్బులు తీసి ఇచ్చాడు. "తర్వాత కాలేజీకి వెళ్లి అమ్మాయిగారిని మధ్యాహ్నం ప్రాక్టికల్స్ లేకపోతే ఇంటికి వచ్చెయ్యమన్నానని చెప్పు."

"జీ సాబ్" అని తలవూపి సైకిలు మీద వెళ్లిపోయాడు రాంరతన్. తరణీరావు కూడా లేచాడు. భార్యకి ఫిట్ రావటానికి కారణం ఏమైవుంటుందా అని ఆలోచిస్తూ.

●●●

కళ్లు తెరిచి చూసింది శకుంతల. ఎదురుగా కుర్చీలో భర్త కనిపించాడు. నెమ్మదిగా లేచి మంచం మీద కూర్చుంది. తరుణీరావు వాచీవంక చూసుకున్నాడు.

"టైమెంత అయింది? " అడిగింది నీరసంగా.

"రెండుంబావు. నువ్వు ముందు హార్లిక్స్ తాగి తర్వాత మాట్లాడు." అన్నాడు.

ఫ్లాస్క్‌ని చూసింది. కొద్దిసేపు ఎవరూ మాట్లాడలేదు.

హార్లిక్స్ తాగుతూ అడిగింది శకుంతల. "నోటీసు చదివారా?"

"చదివాను"

ఇంక ఏడుపు ఆగలేదు శకుంతలకి. హార్లిక్స్ గొంతు దిగలేదు. గ్లాసు పక్కన పెట్టి ఏడుస్తూనే మాట్లాడసాగింది. "అయిపోయింది. అంతా అయిపోయింది. నేనెంతో కష్టపడి దారికి తెచ్చుకున్న నా సంసారం నడిబజారు కెక్కే రోజు. నేను నా పిల్లలు చిప్ప చేత్తోపట్టుకుని అడుక్కు తినే రోజు వచ్చింది. అంతా సర్వనాశనం"

"ష్. గొడవచెయ్యకు." విసుగ్గా అన్నాడు తరణీరావు. "నోటీసివ్వగనే సరిపోయిందా ఏమిటి? నేను వెడుతున్నాను. ఇప్పటికే ఆలస్యం అయింది. తలుపువేసుకో"

"ఎక్కడికి వెళ్లేది?" ఏడుపు మానేసి అరిచిద్మి శకుంతల.

"ఆఫీసుకి" అన్నాడు వెళ్లటానికి ఉద్యుక్తుడవుతూ.

"ఆఫీసు లేదు, అధ్వానం లేదు. పదండి నిత్యానంద్ ఇంటికి."

ఆగిపోయాడు తరణీరావు. ఇది సుగ్రీవాజ్ఞ తిరస్కరించే శక్తి అతనికి లేదు.

●●●

నిత్యానంద్ హైకోర్టు లాయరు. తరణీరావుకి టెన్నిస్ మిత్రుడు. తనకి ఆట అంత బాగా రాకపోయినా ఊళ్లోని "బిగ్ షాట్స్"ని పరిచయం చేసుకోటానికి తరణీరావు ఉపయోగించే అనేక మార్గాలలో టెన్నిస్ ఒకటి.

ఆకస్మికంగా వచ్చిన మిస్టర్ అండ్ మిసెస్ రావుని చూసి కొంచెం ఆశ్చర్యపోయారు నిత్యానంద్. సాధారణంగా ముందు ఫోన్ చేసిగాని లేదా తెలియపర్చిగాని ఒకరినొకరు కలుసుకోరు.

"రండు. రడి. సతీసమేతంగా వచ్చారు. ఏమిటి విశేషం?" అంటూ ఆహ్వానించాడు నిత్యానంద్. మిసెస్ నిత్యానంద్ కూడా పలకరించింది కానీ ముఖం కొంచెం అసహనంగా పెట్టటం పెట్టింది.

వాళ్లు ఎక్కడికో బయలుదేరినట్టు గుర్తుగా కారు పోర్టికోలో నిలిపివుంది.

"పనిమీద వెడుతున్నారనుకుంటాను. మీకు శ్రమ ఇస్తున్నట్టున్నాను." అంటూ నసిగాడు తరణీరావు.

"నో.నో. అదేం లేదు. అంతముఖ్యమైన పనేం కాదులెండి" తేలిగ్గా నవ్వేసి అన్నాడు నిత్యానంద్. "ఇంతకూ ఏమిటి సంగతి? మిసెస్ రావు కూడా వచ్చారు. ఎనీ గుడ్ న్యూస్?"

"గుడ్ న్యూస్ కాదు నా బొంద." తెలుగులో సణుక్కుంది శకుంతల. చిరాకులో ఉన్నప్పుడు ఎదురుగుండా ఎలిజిబెత్ రాణి ఉన్నా అల్లాగే విసుక్కుంటుంది.

"మిసెస్ రావు ఏదో అంటున్నారు." అన్నాడు నిత్యానంద్. అతనికి తెలుగురాదు.

"ఏం లేదు" ఉలికిపాటుని కప్పిపుచ్చుకుంటూ అన్నాడు తరుణీరావు. "ఒక విషయంలో మీ సలహా తీసుకుందామని వచ్చాము"

ఇదేదో లీగల్ వ్యవహారమని కనిపెట్టిన మిసెస్ నిత్యానంద్ వాళ్లవద్ద సెలవు తీసుకుని కారులో వెళ్లిపోయింది.

"లోపలికి వెళ్లి మాట్లాడుకుందాంరండి" అని ఆఫీసు గదికేసి దారితీశాడు నిత్యానంద్. ఆధునికంగా ఉన్న ఆ ఇంటి అందచందాలని పరిశీలిస్తూ లోపలికి వెళ్లింది శకుంతల. ముగ్గురూ వెళ్లి కూర్చున్నారు. ఆ గదిలో సగాన్ని లైబ్రరీ ఆక్రమించింది.

"వెల్! ఇప్పుడు చెప్పండి" అన్నాడు నిత్యానంద్ సావకాశంగా.

శకుంతల చేటంత ఉన్న తన వానిటీ బాగ్‌లోంచి కాగితాలు తీసి నిత్యానంద్ కిచ్చింది. శకుంతలకేసి సాభిప్రాయంగా చూసి కళ్లజోడు పెట్టుకుని కాగితాలు మూలాగ్రం చదవసాగాడు.

మచిలీపట్నం నుంచి మృత్యుంజయరావు అనే వకీలు తరణీరావు తండ్రి తరపున తరణీరావుకి పంపిన రిజిష్టరు నోటీసు అది. అందులో తన క్లయింట్ కొడుకైన తరణీరావు వృద్ధాప్యంలో తన తండ్రిని నిర్లక్ష్యం చేస్తున్నాడని, బతికేందుకు మరేం ఆధారంలేని - తన క్లయింట్‌ని పోషించే బాధ్యత తరణీరావుదేనని. తరణీరావు ఉద్యోగ్యరీత్యా అలహాబాద్‌లో ఉంటున్నందున వృద్ధాప్యంలో అక్కడికి వెళ్లి కొడుకు దగ్గర ఉండటం తన క్లయింట్ ఆరోగ్యానికి సరిపడదని, అందుచేత తరణీరావు తన సంపాదనలోంచి ప్రతినెలా కొంత డబ్బు పంపే ఏర్పాటు చెయ్యాలని ఉంది. నోటీసు అందిన పక్షం రోజుల లోపల తరణీరావు దగ్గర్నుంచి ఏ జవాబు రాని పక్షంలో కోర్టుద్వారా చర్య తీసుకోబడుతుందని ఉంది.

చదవటం పూర్తిచేసి కాగితాలని తరణీరావుకి అందిస్తూ అన్నాడు నిత్యానంద్.

"అయితే మీ తల్లితండ్రులకి మీరొక్కరే సంతానమన్నమాట."

శకుంతల కాగితాలని అందుకుని బాగ్‌లో భద్రపరచింది.

"అవును. కానీ" అంటూ ఏదో చెప్పబోతున్న భర్తని ఆపి మధ్యలోనే అందుకుంది శకుంతల "నిత్యానంద్‌జీ, మా మామగారువట్టి దగాకోరు. వ్యసనపరుడు. ఉన్నది ఒక్కగానొక్క కొడుకైన, తండ్రిగా ఏనాడూ తన బాధ్యతలని నెరవేర్చని మనిషి. మా అత్తగారు చిన్నతనంలోనే పోవటంతో కొడుకుని పోషణకి బంధువుల ఇంట్లో వదిలేసారు.

భూమిమీద ఎన్ని వ్యసనాలున్నాయో అన్నీ ఉన్నాయా పెద్దమనిషికి. పరమ నికృష్టుడు. ఎస్సెల్సీ పాసై వచ్చి మావారు చదువుకుంటానని నోరుతెరిచి అడిగితే, కాదని బట్టలకొట్టు గుమాస్తా ఉద్యోగం చూపించి, చేరమని ప్రాణం తీసి జీవితం నాశనం చెయ్యటానికి పూనుకున్నాడు. ఆ రోజుల్లోనే మా వివాహం జరిగింది. నా ప్రోత్సాహం మీద తండ్రిని కాదని ఆయన బైటికి వచ్చి కొంతవరకు మా నాన్న సహాయంతోను, స్కాలర్ షిప్పులతోను కొంత అప్పులు చేసి చదువుకుని స్వయంకృషితో పైకి వచ్చారు. మా అదృష్టం కొద్దీ ఆ శనిగ్రహం దాపుల్లో లేకుండా ఇక్కడ అలహాబాదులో ఉద్యోగం అయింది. చదువుకున్న రోజుల్లో ఆయనకి వచ్చిన స్కాలర్ షిప్పులు చేసిన అప్పు తాలూకు పత్రాలు ఇప్పటికీ మా దగ్గిర ఉన్నాయి. ఏదో మా బతుకు మేం బతుకుతూ అప్పులన్నీ తీర్చివేస్తూ వచ్చి ఈ మధ్యనే కాస్త నిలదొక్కుకున్నాము. కొడుకు మీద ఎర్ర ఏగానీ ఖర్చు పెట్టని మనిషి, మా సంపాదనకోసం అర్రులు చాస్తున్నాడంటే, ఆఖరికి కోర్టుకెక్కేవరకు వచ్చాడంటే. ఎంత సిగ్గు శరంలేని మనిషో, ఎంత నీచుడో, ఎంతటి పరమ కిరాతక పాతక నికృష్టహీన జన్ముడో మీరే ఊహించండి."

అలహబాద్ చేరి ఇరవై సంవత్సరాలవుతున్నా తరణీరావుకి హిందీలో మాట్లాడటం రాదు. ఆఫీసులో ఇంగ్లీషు తప్ప మరో భాష వినపడదు. ఇంట్లో తెలుగే మాట్లాడుకుంటారు.

శకుంతల హిందీలో గడగడా చెపుతుంటే నిత్యానంద్ నోరు తెరుచుకుని విన్నాడు. ఆమె మామగార్ని హిందీలో తిట్టిన తిట్లు కొన్ని నిత్యానంద్ కూడా వినలేదు.

తరణీరావు విగ్రహంలా కూర్చున్నాడు.

"మీ తండ్రిగారు ఏం చేస్తుంటారు?" ఏదో ఆలోచిస్తూ ప్రశ్నించాడు నిత్యానంద్.

"మచిలీపట్నంలో టీచర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు" నోరు విప్పాడు తరణీరావు.

"రిటైరయి ఎన్నాళ్లయింది?"

"ఎనిమిదేళ్ళవుతుంది" చెప్పాడు.

"మీ నాన్నగారు రిటైరయాక మీరు డబ్బు పంపిస్తూ ఉండేవారా?"

"లేదు"

శకుంతలకి ప్రశ్నలేవీ రుచించటంలేదు. భర్తనీ, నిత్యానంద్‌నీ మార్చి మార్చి అసహనంగా చూడసాగింది.

"ఆశ్చర్యంగా ఉందే?" అన్నాడు నిత్యానంద్. "ఎనిమిదేళ్లనుంచీ మాట్లడని మనిషి ఇప్పుడు నోటీసు ఎందుకు ఇచ్చినట్టు?"

"నిత్యానంద్ జీ!" ఖంగుమంది శకుంతల కంఠం. "నోటీసు ఎప్పుడు పంపింది ఎలా పంపింది అనవసరం. ముందిది చెప్పండి. కొడుకు భవిష్యత్తుకి ఏమాత్రం సహాయపడని మనిషికి, ఇరవై ఏళ్ల కిందట మాతో తెగతెంపులు చేసుకున్న వ్యక్తికి మా సంపాదన ఆశించే అర్హత ఎక్కడిది?"

అవును ఎక్కడిది?

కొద్దిసేపు నిశ్శబ్దం రాజ్యమేలింది ఆ గదిలో, గోడగడియారం చేస్తున్న 'టి - టిక్' శబ్దం తప్ప మరేమీ వినిపించటంలేదు. తరణీరావు ఏదో ఆలోచిస్తూ బల్లమీద చూపు వేలితో 'ఏంటీక్లాక్' దిశలో వృత్తాలు చుడుతున్నాడు.

●●●

నాలుగు దశాబ్దాల క్రిందట

"సుందరీ నేను వచ్చేశాను. కళ్లు తెరవవూ?" విహ్వలంగా పిలిచాడు రామానందరావు.

బాధతో మెలికలు తిరిగిపోతున్న సుందరి కళ్లు తెరిచి చూసింది. ఆమె ముఖం చెమటతో తడిసిపోతోంది. తనని చూసి బెంబేలెత్తిపోతున్న భర్తని చూసి అంత బాధలోను నవ్వటానికి ప్రయత్నం చేసింది.

భార్యని హాస్పిటల్‌లో జేర్పించి, బయట కారిడార్‌లో దిగాలుపడి కూర్చున్నాడు రామానందరావు. కాసేపటికి నర్స్ వచ్చి డాక్టర్ పిలుస్తున్నారని చెప్పి వెళ్లింది. లోపలికి వెళ్లాడు.

"మీరేనా రామానందరావు?" నిరసనగా చూస్తూ అడిగాడు డాక్టరు.

"అవున"ని ఆందోళనగా తల ఊపాడు. లోపల లేబర్‌రూంలోంచి వినిపిస్తున్న మూలుగు అతని గుండెల్ని ముక్కలుగా తరుగుతోంది.

"మీ భార్యకు ప్రెగ్నెన్సీ రావటం ఎన్నోసారి?" నెమ్మదిగా అడిగినా అడిగే అడిగే తీరు కలవరపెట్టింది.

"నాలుగోసారి."

"నాలుగుసార్లూ ఏమైంది?"

"నిలవలేదు. ఎబార్షన్స్ అయ్యాయి" తల వంచుకుని చెప్పాడు.

"నాలుగోసారి ఎబార్షన్ అయినప్పుడు డాక్టర్లేం చెప్పారు?"

రామానందరావు అయోమయంగా చూశాడు. నాలుగోసారి సుందరి స్వగ్రామంలో ఉండగా ఎబార్షన్ అయింది. ప్రతిసారి పుట్టెడు ఆశతో ప్రయాణమై వెళ్లేది. నాలుగోసారి తనకి శెలవు దొరకకపోవటం చేత వెళ్లి తీసుకురాలేదు.

"ఏం చెప్పారక్కడ డాక్టర్లు? నిజం చెప్పండి" కోపంగా అడిగాడు డాక్టరు. "అయిదోసారి ప్రెగ్నెన్సీ వస్తే ప్రాణాలకి ముప్పు అని చెప్పారా లేదా?"

"అబద్ధం" అని అరిచాడు రామానందరావు. డాక్టరు అంటున్న ప్రతిమాటా అతనికి సమ్మెట దెబ్బలా తగులుతోంది. నెలలు నిండినా, ఎబార్షన్ అయే సూచన కనిపించకపోవటంతో ప్రతిసారి పుట్టింటికి ప్రయాణమయ్యే సుందరి ఈసారి ఇక్కడే ఉంటానని పట్టుపట్టటం, చివరికి కన్నవాళ్లకి కబురు చేసేందుకు కూడా వీల్లేదని పట్టుబట్టటం, హాస్పిటల్‌లో చేర్చాక, స్ట్రెచర్ మీద పడుకుని లోపలికి వెళ్లిపోతున్నప్పుడు చూసిన చూపు. ఒకదాని తరువాత మరొకటి గుర్తుకువచ్చాయి. కుప్పలా కూలిపోయాడు.

"ఎందుకు మిష్టర్ గొంతుచించుకుని అరుస్తావు?" అసహ్యంగా చూస్తూ అన్నాడు డాక్టరు. "చదువుకున్నవాళ్లు, అందులో నలుగురికి చదువు సంస్కారం నేర్పే ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న నీలాంటివాళ్లే ఇలా ప్రవర్తిస్తే, మీ భార్యలు మీతో కాపురం చేసేకంటే రైలు కింద తలపెట్టటం మంచిది. కనీసం ప్రాణం తేలిగ్గా పోతుంది."

లోపల లేబర్ రూంలో ఇంజక్షన్ తీసుకుని నర్స్ చెప్పినట్టు "ఒకటి, రెండు, మూడు' అని లెక్కపెడుతున్న సుందరికి డాక్టరు మాటలు లీలగా వినిపించాయి. ఒక్కసారి డాక్టరుగారికి పిల్చుకు రమ్మని నర్స్‌ని బతిమాలింది. అప్పటికి ఆమెకి స్మృతిపోయిందనుకున్న నర్స్ తెల్లముఖం వేసి డాక్టరుని పిలిచింది. డాక్టరు పరుగెత్తుకు వచ్చాడు ఏం కొంపమునిగిందోనని. రామానందరావు కూడా లోపలకి వెళ్లాడు.

మూసుకుపోతున్న కనురెప్పలని బలంగా ఎత్తి డాక్టరుని చూసి చేతులు జోడించింది సుందరి. "డాక్టరుగారూ, ఇందులో ఆయన తప్పులేదు. ఆయన్నేమీ అనొద్దు. పిల్లలమీద వెర్రి మమకారంతో నేనే ప్రాణాలకి తెగించాను. డాక్టర్లు ప్రమాదం అని చెప్పిన విషయం ఆయనకి చెప్పలేదసలు. ఆయనకేం తెలీదు" పైకెత్తి జోడించిన చేతులు పట్టుజారి క్రిందకి దిగుతున్నాయి.

"నన్ను మోసం చేశావు సుందరీ" కళ్లనీళ్లు తుడుచుకుంటూ అన్నాడు రామానందరావు. ఆమె భర్త ఉనికిని గమనించలేదు. డాక్టరు అలాగే నిలబడి చూస్తున్నాడు.

సుందరి చేతులు పూర్తిగ కిందకు దిగి ఎత్తుగా ఉన్న ఆమె కడుపుమీద ఆగి కిందకు జారాయి. తృప్తిగా నవ్విందామె. మాటలు ముద్దగా వస్తున్నాయి. "నేనేమైపోయినా పర్వాలేదు. పిల్లవాణ్ణి మాత్రం క్షేమంగా" తర్వాత ఆమె కళ్లు మైకంలో మూతపడ్డాయి. పెదవులింకా కదులుతూనే ఉన్నాయి.

"పిల్లవాణ్ణి క్షేమంగా"

డాక్టరుకి అర్థమైంది. చివరికి మృత్యువు కూడా ఆమె కోర్కెకి ఎదురు నిలవలేకపోయింది. డాక్టరుగా ఆమె కోర్కె నెరవేర్చగలడు. కానీ మనిషిగా తన కర్తవ్యం? తల పంకించాడు. రామానందరావు భుజం మీద అనునయంగా చెయ్యివేసి "పదండి" అన్నాడు.

చేతులతో ముఖం కప్పుకుని బైటకి నడిచాడు రామానందరావు.

ఊరిలో పేరుమోసిన సర్జన్లని మరి ఇద్దరిని పిలిపించాడు డాక్టరు.

ముందు సిజేరియన్ చేసి శిశువుని బైటకి తీశారు.

"మీ భార్య కోరుకున్నట్టు మగపిల్లవాడే" అన్నది నర్స్ ఆపరేషన్ థియేటర్‌లోంచి బయటకి వస్తూ. ఆమె చేతుల్లో పొత్తిళ్లలో పిల్లవాడు ఉన్నాడు.

విరక్తిగా నవ్వాడు రామానందరావు. కొడుకుకేసి కన్నెత్తి చూడలేదు. రామానందరావుని వింత జంతువుని చూసినట్టు చూసి పిల్లవాణ్ణి తీసుకెళ్లి వేరేగదిలో పడుకోబెట్టి తిరిగి ఆపరేషన్ థియేటర్లోకి వెళ్లింది నర్స్.

తలుపులు మూసుకున్నాయి.

మూడుగంటలసేపు మృత్యువుతో పోరాడారు డాక్టర్లు. వారి ప్రయత్నం ఫలించింది. సుందరి మరణించలేదు.

కానీ ఆమెపడ్డ వేదనకి మెదడులో నరాలు దెబ్బతిన్నాయి. ఆమెకి మతిభ్రమించింది.

సుందరి పిచ్చి సుందరమ్మ అయింది.

పిల్లలకోసం తపించిపోయిన సుందరమ్మ కొడుకుని గుర్తించలేని స్థితిలో పిచ్చితో ఇంటిని నరకప్రాయం చేసింది. ఒకనాడు ఆమెని ఉంచే గది తలుపు బైట గడియపెట్టటం మర్చిపోవటంతో అర్ధరాత్రి చడీచప్పుడు చెయ్యకుండా వెళ్లి నూతిలో దూకింది. ఆమె బతుకు అంతటితో ముగిసింది.

కొడుకుని బడిలో వేయిద్దామని తీసుకెళ్లిన రామానందరావుకి అప్పటివరకు పిల్లవాడికి పేరుపెట్టలేదన్న సంగతి గుర్తుకి వచ్చింది. ఒక్క నామకరణమే కాదు, భార్య ఉన్నన్నాళ్ళు ఏ వేడుకా చెయ్యలేకపోయాడు.

కొడుకుని బడిలో చేర్పించి స్కూలు రిజిష్టరులో కొడుకు పేరు "తరణీరావు" అని రాయించాడు.

●●●

"రిజర్వేషన్ సంగతి ఏం చేశారు?" భర్త స్వెట్టరుకి గుండీలు కుడుతూ అడిగింది శకుంతల.

"రిజర్వేషన్ కింకా టైముంది." తల దువ్వుకుంటూ అన్నాడు తరుణీరావు.

"అయినా ఈసారి నేనొక్కడినే కదా! రిజర్వేషన్ లేకపోయినా ఎలాగో అలా వెళ్లిపోగలను" మూడేళ్లకోసారి డిపార్ట్‌మెంట్ ఇచ్చే పాస్ మీద తరణీరావు కుటుంబంతో సౌత్‌కి వెళ్లి నెలరోజులు గడిపి రావటం పరిపాటి. అలా వెళ్లినప్పుడు హైదరాబాదులో ఉండే మామగారింట్లో దిగుతాడు. నెలరోజులూ అక్కడే గడిపివేసి తిరిగి వచ్చేస్తారు.

"ఏమిటీ, మీరొక్కరూ వెళ్లటమా. అందులో ఆ ముదనష్టం దగ్గరకా?" గుండెలమీద చెయ్యివేసుకుని కళ్లు పెద్దవి చేస్తూ అంది శకుంతల. "నా కంఠంలో ఊపిరుండగా మిమ్మల్ని ఒక్కరినీ పోనివ్వను. నేను కూడా మీతోపాటు మచిలీపట్నం వస్తున్నాను."

"ఏమిటి నీ చాదస్తం?" విసుగ్గా అన్నాడు తరణీరావు. "ఓ ప్రక్క కేసు కోర్టుకెక్కితే డబ్బు మంచినీళ్లలా ఖర్చయిపోతుందని గుండెలు బాదుకుంటున్నావు. మళ్లీ నా వెంట నువ్వుకూడా ఎందుకు డబ్బు దండుగ."

భర్తకి వివరణలు ఇచ్చే అలవాటు లేదు శకుంతలకి. గుండీలు కుట్టటం పూర్తిచేసి స్వెట్టరుని భర్తకి అందిస్తూ అంది. "రాం రతన్‌ని స్టేషన్‌కి పంపి రిజర్వేషన్ సంగతి నేను చూస్తాను. మీ పనులు మీరు చూసుకోండి."

స్వెట్టరులో తల దూరుస్తూ అన్నాడు. "బాబుకి పరీక్షలని, నువ్వు లేకపోతే ఇల్లు గడవదని మర్చిపోయావా?"

"ఫర్వాలేదు. పెద్దది ఉందిగా. అది ఇల్లు చూసుకుంటుంది. వాళ్లకీ ఇలాంటప్పుడే తెలిసిరావాలి బాధ్యతలు. ఎల్లకాలం మనం అంటిపెట్టుకుని ఉండాలంటే కుదరదు"

పిల్లలకి చెప్పవలసిన జాగ్రత్తలు చెప్పి భర్తతో రైలు ఎక్కింది శకుంతల.

●●●

మచిలీపట్నంలో శకుంతల స్నేహితురాలైన అరుంధతి ఇంట్లో దిగారు తరణీరావు దంపతులు. ఊళ్లో దిగాక సరాసరి తండ్రి దగ్గరకే వెడదామని అన్నాడు తరణీరావు. శకుంతల ససేమిరా అంది. ఎక్కడికెళ్లాలో, ఎప్పుడు వెళ్లాలో, ఎప్పుడు ఏం చెయ్యాలో తనకి బాగా తెలుసునని, సలహాలివ్వద్దని కసిరింది. చేసేదిలేక భార్యని అనుసరించాడు.

అరుంధతి ఎల్.ఐ.సి. ఆఫీసులో ఉద్యోగం చేస్తోంది. ఆమె భర్త అహోబలరావు ఏదో పెద్ద ఫార్మాసూటికల్ కంపెనీకి మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. నెలకి ఇరవైరోజులు కాంప్ మీద తిరుగుతూ ఉంటాడు. అరుంధతి మామగారు వయోవృద్ధుడు. వేళకు


కౌముది

అన్నం తిని ఇంట్లో ఒకమూల గదిలో పడక కుర్చీలో కూర్చుని ఏవేవో పుస్తకాలు చదువుతుంటాడు. ఇంటి విషయాలుగానీ, ఇంట్లో తిరిగే మనుషుల గురించిగానీ ఏమాత్రం పట్టించుకోడు.

శకుంతలని, తరణీరావుని సాదరంగా ఆహ్వానించింది అరుంధతి. ఒకగంటసేపు స్నేహితురాలితో కబుర్లు చెప్పి మధ్యాహ్నం తన భర్త వస్తాడని, తను ఆఫీసవగానే సాయంత్రం వచ్చేస్తానని, అంతవరకు విశ్రాంతి తీసుకోమని చెప్పి ఆఫీసుకి వెళ్లిపోయింది.

భోజనాలవనిచ్చి భర్తని తమకి నోటీసిచ్చిన లాయరు మృత్యుంజయరావు దగ్గరికి పంపింది శకుంతల. వెళ్లిన పావుగంటకే ముఖం వేళ్లాడేసుకుని తిరిగి వచ్చాడు తరణీరావు. అయనసలు నాతో సరిగా మాట్లాడటంలేదు. నే చెప్పింది వినటంలేదు. నేనేం చెప్పినా తిరిగి ఒకటే మాట చెపుతున్నాడు - "ముందు మీ ఫాదర్‌ని కలుసుకుని తరువాతే నా దగ్గరికి రండి" అని.

"అలాగా" అంటూ మొదలుపెట్టి లాయరుని పదినిమిషాలసేపు తిట్లతో తూర్పారపట్టింది శకుంతల. "మనదారిన మనం బతుకుతుంటే చూసి కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్న వెధవలంతా కలిసి ఏదో పెద్ద కుట్రే చేస్తున్నారు. వీళ్ల అంతుచూసిగానీ నేను నిద్రపోను" అని శపథం చేసింది.

తరణీరావు ఆవలించి చిటికెలు వేశాడు. ఎండలో తిరిగిరావటంచేత అతనికి నిద్రతో కళ్లు మూతలుపడుతున్నాయి.

ఈ లోపల భార్యాభర్తల సంభాషణకి లోపల గదిలో పడక్కుర్చీలో కూర్చుని దీక్షగా చదువుకుంటున్న వృద్ధునిలో చలనం కలిగింది. కుర్చీలోంచి నెమ్మదిగా లేచి వచ్చాడు. "అయితే అబ్బాయ్, మీ నాన్న పేరేమిటన్నావ్?"

శకుంతలకి అర్థంకాలేదు. ముసలాయనకేసి అనుమానంగా చూసింది.

"రామానందరావు" చెప్పాడు తరణీరావు.

ఆయన కళ్లు ఆలోచనతో చిన్నవైనాయి.

వృద్ధాప్యం వల్ల శక్తి ఉడిగి ప్రాక్టీసు మానేసినా, ఆయన జ్ఞాపకశక్తి తగ్గలేదు. ఆయన కళ్లు తిరిగి పెద్దవైనాయి. "అయితే నువ్వు పిచ్చి సుందరమ్మ కొడుకువి కాదూ?"

శకుంతల భర్తకేసి హేళనగా చూసింది. - "ఈ ఊళ్లో మీకెంత గొప్ప పేరుందో చూశారా?" అన్నట్టు

అరుంధతి మామగారి ప్రశ్నకి అవును. కాదు అన్నట్టు సందిగ్ధంగా తలఊపాడు తరణీరావు

"చాలా సంతోషం నాయనా! చాలు. ఇంకలేవండి."

"ఎక్కడికి?" ఒకేసారి అన్నారు భార్యాభర్తలు.

"ఎక్కడికో నాకు తెలీదు. మొదట ఈ ఇంట్లోంచి బైటికి."

"ఏమిటి మీ ఉద్దేశం?" కోపంతో బుసలుకొడుతూ అడిగింది శకుంతల.

"ఇంటికొచ్చినవాళ్లని ఇలా అవమానించటం మీకు అలవాటా? అయినా నేను అరుంధతి స్నేహితురాల్ని. ఈ ఇంటి కోడలు ఆమె. మమ్మల్ని పొమ్మనటానికి మీకేం అధికారం ఉంది?"

శకుంతలకేసి కన్నెత్తి కూడా చూడలేదు అరుంధతి మామగారు. తరణీరావు వంక చూస్తూ అన్నాడు. "చూడు నాయనా ఆడవాళ్లతో మాట కలపటం నాకలవాటు లేదు. నే చెప్పదలచుకున్నవి రెండే ముక్కలు. నీకు జన్మనివ్వటానికి ప్రాణాలకి తెగించి, నిన్ను భూమి మీద పడెయ్యటానికి పిచ్చిదైంది మీ అమ్మ. నువ్వు ఈ ప్రపంచంలో ఊపిరిపోసుకుని నిలబడటానికి ఆ నాడు, ఆ రోజు డాక్టరుగా నా సర్వశక్తుల్నీ ధారపోశాను. ఈనాడు నేను జీవితంలో చేసిన పొరపాట్లలో అది ఒకటి అనుకుంటున్నాను. ఇకపోతే పుత్రుడైనందుకు పున్నామనరకం నుంచి తప్పిస్తావని, వైతరణి దాటిస్తావని, నీకు తరణీరావని పేరుపెట్టుకున్నాడు మీ నాన్న. నీ భార్య నీ ముందుంచిన

రంగుటద్దంలోంచి చూసి తండ్రికి తోడుగ ఉండటం నరకంగా భావించి, కొడుకుగా నీ బాధ్యతలని కప్పదాటువేసి త్రివేణీసంగమం చేరి సరిగంగ స్నానాలు చేస్తూ మోక్షం సంపాదిస్తున్న సుపుత్రిడివి నువ్వు."

మొఖాల్లో కత్తివాటుకి నెత్తురుచుక్క లేకుండా నిలబడ్డారు తరణీరావు, శకుంతల. అవమానంతో ముఖం నల్లగా కమిలిపోయింది శకుంతలకి. తిరిగి అన్నారు అరుంధతి మామగారు. "మ కోడలు స్నేహితురాలు వస్తోందంటే ఎవరో అనుకున్నానుగానీ రామానందరావు కోడలనుకోలేదు. పాలు తాగి పొదుగు కోసే తరానికి చెందినవాళ్లు మీరు. వెళ్లండి. మీకీ ఇంట్లో స్థానంలేదు." చేష్టలుడిగి నిలబడ్డారు భార్యాభర్తలు.

"ఇంక కొంచెం సేపట్లో మా అబ్బాయి క్యాంప్ నుంచి వస్తాడు. వాడు వచ్చేసరికి మీరు వెళితే మంచిది. మీ నీడ కూడా వాడిమీద పడటం సహించను నేను" చెప్పవలసింది చెప్పేసి లోపలికి వెళ్లి యధాప్రకారం పడక కుర్చీలో కూర్చుని ప్రశాంతంగా చదువుకోసాగాడు.

"అయిందా, ఇంకేమైనా మిగిలిందా?" అన్నట్టు భార్యవంక చూశాడు తరణీరావు. ఆ చూపుకి మళ్లీ మాములు మనిషైంది శకుంతల. రోషంతో మనసు ఉడికిపోసాగింది. కళ్లు నిప్పులు కురుస్తుంటే భర్తతో ఏదో చెప్పబోయింది. ఇంతలో బైట హారన్, కారు ఆగిన చప్పుడు అయింది. గేటువంక చూశారు ఇద్దరూ.

గ్లాస్కో పంచెమీద ఖరీదయిన ఖద్దరు సిల్కు లాల్చీ తొడిగి, నాలుగువేళ్లకి ఉంగరాల్తో. మెడలో పులిగోరు ఉన్న బంగారుగొలుసు వేసుకున్న వ్యక్తి లోపలికి వచ్చి "నమస్కారం నా పేరు నర్మదరావు. ఊళ్లో నర్మదా టెక్స్‌టైల్స్ మేనేజింగ్ పార్టనర్‌ని" అని తన్నితాను పరిచయం చేసుకున్నాడు.

ప్రతినమస్కారం చేస్తూ అన్నాడు తరణీరావు. "కూర్చోండి. అహోబలరావు కాంప్‌కి వెళ్లారు. ఇంట్లోవారి నాన్నగారు ఉన్నారు పిలవమంటారా?" నర్మదరావు నవ్వి అన్నాడు. "నేను మీకోసమే వచ్చాను. మీ తండ్రిగారు రామానందరావుగారు ఇప్పుడు నా దగ్గరే ఉంటున్నారు."

నర్మదరావుని పరిశీలనగా చూస్తూ అంది శకుంతల. "ఆయనకి మీకు ఏమిటి సంబంధం?"

ఆమెవంక చూసి ముఖం పక్కకి తిప్పుకున్నాడు. "చెపుతాను ముందు మీరు బయలుదేరండి"

●●●

కారుని నెమ్మదిగా పోనిస్తూ చెప్పసాగాడు నర్మదరావు. "నేనీనాడు ఉన్నత స్థితిలో ఉన్నానంటే దానికి మాష్టారే కారణం. చదువులో ఎప్పుడూ వెనకబడి ఉండేవాణ్ని. స్కూల్ ఫైనల్ తప్పి బ్రతుకు తెరువుకోసం చెప్పులరిగేలా తిరుగుతున్న నన్ను తీసుకెళ్లి మాష్టారు బట్టల కొట్టులో గుమాస్తాగా చేర్పించారు. దానితో ఊపిరి పీల్చుకున్నాను. కాలం గడుస్తున్నకొద్దీ వ్యాపారంలో మెలుకవలు తెలియసాగాయి. అదృష్టం కూడా కలసివచ్చింది. క్రమంగా వాటాదారునయ్యాను. ఇదంతా మీ చలవేనని అంటే మాష్టారు ఒప్పుకోరు. పైగా నవ్వుతూ 'ఈ ఉద్యోగం చూపించినందుకే నా వాళ్లకి నేను శత్రువునయాను నర్మదరావూ' అంటూ ఉంటారు అప్పుడప్పుడూ. "

తరణీరావు, శకుంతల ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. శకుంతల హిందీలో సణుక్కుంది. "సందేహం లేదు. వీడిక్కూడా కుట్రలో భాగం ఉంది"

తరణీరావు యధాప్రకారంగా నాలిక్కరుచుకున్నాడు.

కారు ఇంద్రభవనంలా ఉన్న ఇంటిముందు ఆగింది. గూర్ఖా సలాం చేసి గేటు తెరిచాడు. కారు వెళ్లి పోర్టికోలో నిలిచింది.

"లోపలకు రండి" కారు దిగి ఆహ్వానించాడు నర్మదరావు. తరణీరావు, శకుంతల కారు దిగి లోపలికి వెళ్లారు.

నర్మదరావుతోపాటు ఆ గదిలో అడుగు పెట్టాడు తరణీరావు. మామగారి మీద ప్రయోగించబోయే తిట్ల పదజాలాన్ని మననం చేసుకుంటూ భర్తని అనుసరించింది శకుంతల.

మంచమ్మీద కళ్లు మూసుకుని పడుకుని ఉన్న తండ్రిని చూసి దిగ్భ్రాంతి చెందాడు తరణీరావు. అంతవరకు అతనికి ఆరడుగుల పొడవులో, పచ్చని దేహచ్ఛాయతో ఖద్దరు బట్టలలో భుజం మీద జరీ కండువాతో సింహంలా ఉండే తన తండ్రి రామానందరావు మాత్రమే తెలుసు. కానీ ఇప్పుడు అతను చూస్తున్న వ్యక్తి వేరు. మాసిన పంచె బొడ్డుకిందకు జారి పక్కటెముకలు పొడుచుకు వచ్చి కనిపిస్తున్నాయి. ఊపిరి విడుస్తుంటే డొక్క ఎగిరిపడుతోంది. శరీరం శుష్కించి నల్లకప్పు వేసుకుపోయింది. నుదుటిమీద ఎముకలు కూడా కనిపిస్తున్నాయి. నీళ్లులేని గోతుల్లో పారేసిన గవ్వల్లా గుంటలలో కళ్లు మూతలు పడి ఉన్నాయి.

శకుంతల చిత్తరువై చూడసాగింది. తన ఆజన్మ శత్రువుని ఆ స్థితిలో చూసేసరికి ఆమెకి నోటమాట రాలేదు. తన మామగారు ఆ మనిషేనంటే నమ్మశక్యంగా లేదు. ఆమె మనసులో ఒకే ఒక ప్రశ్న తేనెటీగలా రొదపెట్టసాగింది.

కాటికి కాళ్లు చాపిన మనిషి కోర్టు నోటీసు ఎందుకిచ్చినట్టు?

నర్మదరావు మంచం దగ్గరకి వెళ్లి ముందుకు వంగి చెవిలో చెప్పాడు. "మాష్టారూ తరణీ వచ్చాడు. నేను చెప్పినట్టే వచ్చాడు చూడండి."

సరైన కాంబినేషన్ పెట్టి కీ తిప్పగా తాళం తెరుచుకున్నట్టు తెరుచుకున్నాయి రామానందరావు కళ్లు. పగటిపూట వెలిగే ఎలక్ట్రిక్ బల్బులా కాంతిహీనంగా ఉన్న ఆ కళ్లు మొదట శకుంతలని చూశాయి.

భర్త చెయ్యి గట్టిగా పట్టుకుంది శకుంతల. ఆమెకి ఎందుకో వణుకుపుట్టింది.

రామానందరావు దృష్టి కొడుకుమీద పడింది. కళ్లు క్రమంగా కాంతిని పుంజుకున్నాయి. తరణీరావు అలాగే నిశ్చలంగా చూస్తున్నాడు. నర్మదరావు కూడా మాష్టారి కేసి రెప్పవాల్చకుండా చూస్తున్నాడు.

రామానందరావు చూపుల్లో దైన్యం లేదు. పశ్చాత్తాపం లేదు. పుత్రప్రేమలేదు. ప్రాణభీతి లవలేశమైనా లేదు.

తన క్లాసులో మార్కుల్లో ఎప్పుడూ వెనకబడి ఉండే కుర్రాడు ఒక్కసారి క్లాసంతటికీ మొదటివాడుగా వస్తే ఉపాధ్యాయునిలో కలిగే భావం ఆయన చూపుల్లో వ్యక్తమైంది. ఆయన ఏదో చెపుతున్నట్టు నోరు కదిలించసాగాడు.

తరణీరావు అయోమయంగా నర్మదరావుకేసి చూశాడు.

"మాట పడిపోయి మూడురోజులైంది" అన్నాడు నర్మదరావు తిరిగి మంచం కేసి వంగుతూ. రామానందరావు ఏవో శబ్దాలు చెయ్యసాగాడు.

శకుంతలకి నిలబడలేక పడిపోతానేమోననిపించింది. మానసికంగా ఆమె చాలా బలహీనురాలు మృత్యుముఖంలో ఉన్న మనిషిని అంత దగ్గిరగా చూడటం ఆమెకి అదే మొదటిసారి.

నర్మదరావు అంటున్నాడు "మీరు నిశ్చింతగా ఉండండి మాష్టారూ అంతా మీరు చెప్పినట్టే జరుగుతుంది" ఈ మాటలని అతను శకుంతలకేసి చూశాడు.

రామానందరావు కళ్లుమూసుకున్నాడు. ఆయన ముఖంలో ఇప్పుడు ప్రశాంతత గోచరిస్తోంది.

"నిద్రపోతున్నారు. ఒక అరగంటలో మెలుకువ వచ్చేస్తుంది మళ్లీ వద్దాం అప్పుడు" అన్నాడు నర్మదరావు గదిలోంచి బైటికి దారితీస్తూ. ముగ్గురూ వెళ్లి హాలులో సోఫాలమీద కూర్చున్నారు. కాసేపు ఎవరూ మాట్లాడలేదు. మొదట నర్మదరావే ప్రారంభించాడు.

"మీరు మాష్టారితో ఏం మాట్లాడినా వద్దని చెప్పే హక్కు నాకు లేదని తెలుసు. అయినా నేనో షరతు పెడుతున్నాను. మీరందుకంగీకరిస్తేనే మాట్లాడనిస్తాను. మాష్టారిప్పుడు నా సంరక్షణలో ఉన్నారు కనుక ఇలా చెప్పాల్సిన అవసరం వచ్చింది."

శకుంతల ఏం మాట్లాడలేదు. శారీరకంగానూ మానసికంగానూ అలసిపోయిందామె. వచ్చినదగ్గర్నుంచీ ప్రతివిషయంలోను తను అనుకున్నదానికి పూర్తి విరుద్ధంగా జరుగుతోంది. జరుగుతున్నవాటిని కళ్లప్పగించి చూడటం తప్ప తనేం చెయ్యలేదిప్పుడు.

తరణీరావు అన్నాడు. "అలాగే మీ షరతేమిటో చెప్పండి."

నర్మదరావు చెప్పాడు. "మీరు లాయరు నోటీసు సంగతి ఆయన దగ్గర ఎత్తకూడదు."

ఎందుకని అడగలేదు తరణీరావు. అర్థం చేసుకోటానికి ప్రయత్నిస్తున్నాడు.

తిరిగి నర్మదరావే అన్నాడు నెమ్మదిగా "లాయరు చేత మీకు మాష్టారి తరపున నోటీసు ఇప్పించింది నేను. ఆయనకు తెలీదసలు."

శకుంతల మస్తిష్కం కదిపిన తేనెతుట్టిలా అయింది.

"నేనిది ఊహించాను" అన్నాడు తరణీరావు నెమ్మదిగా. శకుంతల భర్త కేసి చూసింది.

నర్మదరావు చెప్పుకుపోతున్నాడు. "మాష్టారు ఆరోగ్యం పాడయ్యాక మీకు చాలా ఉత్తరాలు రాశారు. అవి మీదాకా వచ్చాయో, లేదో, ఏమయ్యాయో ఊహించగలను నేను. ఆయన మీకు రాసిన చివరి ఉత్తరం నా దగ్గిరే ఉంది. పోస్టు చెయ్యమని నాకిచ్చారు. అదిరానాకే గుండెలో తీవ్రంగా నొప్పివచ్చి పడిపోయారు." అతని కంఠం రుద్ధమయింది. కళ్లు తుడుచుకుని చెప్పసాగాడు. "వంటి మీద స్పృహ ఉన్నంతవరకు ఎవరి సహాయాన్ని కోరని అభిమానపరుడు. ఆఖరికి నా సహాయాన్ని కూడా నవ్వుతూ నిరాకరించేవారు. ఈ స్థితిలో ఆయన్ని ఇంటికి తీసుకురాగలిగాను. ఆయన పోస్టుచెయ్యమని ఇచ్చిన ఉత్తరం నా దగ్గరే ఉండిపోయింది. ఆలోచించాను. ఈ ఉత్తరం మీరు చేరవచ్చులేదా మిగిలిన ఉత్తరాలకి పట్టినగతే దీనికీ పట్టవచ్చు. ఒకవేళ ఉత్తరం మీ చేతుల్లో పడినా మీరు బయలుదేరిరావటానికి ఎంత అవకాశం ఉందో, రాకపోవటానిక్కూడా అంతే అవకాశం ఉంది. ఏమైనా, మాష్టారి విషయంలో రిస్క్ తీసుకోటానికి నాకు ఇష్టంలేకపోయింది. అందుకే, ఉత్తరం బదులు మీకు లాయర్ నోటీసు అందేటట్టు చేశాను. మిమ్మల్ని ఇక్కడికి రప్పించటానికి ఇంతకంటే మార్గం తోచలేదు నాకు. తను రాసిన ఉత్తరం చూసుకునే మీరు వచ్చారనుకుంటున్నారు మాస్టారు. ఆయనకా సంతృప్తిని చివరివరకు మిగిలిపోనివ్వండి"

"ఉత్తరాలు.. ఉత్తరాలు" అంటూ గొణుక్కున్నాడు తరణీరావు. భార్యకేసి నిశ్చలంగా చూశాడు.

జీవితంలో మొదటిసారి భర్తచూసిన చూపుకి నిలువెల్లా వణికింది శకుంతల.

ఆమె తల భూమిలోకి కుంచించుకుపోయింది.

జేబులోంచి ఒక కవరు తీసి ఇచ్చాడు నర్మదరావు. "ఇదిగో ఆ ఉత్తరం. దీన్ని మీకు అందజేయటం కూడా నా బాధ్యతలలో ఒకటి"

తరణీరావుకి కవరు లోపల ఉత్తరంకాక మరేదో ఉన్నట్టుగా అనిపించింది.

కవరు తెరిచి లోపల చెయ్యిపెట్టి బైటికి తీశాడు.

బాగా నలిగిపోయి, మాసిపోయివున్న నోట్లు అవి. ఒకటి రెండు చిరిగేందుకు సిద్ధంగా ఉన్నాయి.

వణికే చేతులతో మడతని కవరులోంచి పైకితీసి ఉద్వేగాన్ని అణుచు కుంటూ ఉత్తరాన్ని చదివాడు.

**"చిరంజీవి తరణీరావుకి,**

నువ్వు, కోడలు పిల్లలు క్షేమమని తలుస్తాను. నా ఆరోగ్యం క్షీణించాక నీకు దాదాపు పది ఉత్తరాలైనా రాసివుంటాను. అవి నీకు అంది ఉంటాయన్న ఆశ అడుగంటింది. అయినా ఇప్పుడు ఈ ఉత్తరం రాస్తున్నాను.

చూడు తరణీ, నాకు కోడలంటే కోపం లేదు. సానుభూతి తప్పు. ఆమె మనిషన్న వాడిని చేస్తే నమ్మదు. మంచిని ఎక్కడా చూడలేదు. అవే తెలివితేటలని నువ్వు భావిస్తూ ఉంటావు. మంచిదేగాని ఆ రకం మనుషులు వాళ్లు సుఖపడరు. తోటివారిని మనశ్శాంతిగా బతకనివ్వరు.

నేనేదో నీమీద ప్రేమ చంపుకోలేక, రక్తపాశాన్ని తెంచుకోలేక, లేదా కొడుకుగా నీ బాధ్యతలని నీకు గుర్తుచెయ్యటానికి ఈ ఉత్తరం రాస్తున్నాననుకోకు. అది పొరపాటు. తండ్రిగా నన్ను నువ్వెంత అపేక్షిస్తున్నావో. కొడుకుగా నిన్ను నేనంతే అపేక్షిస్తున్నాను. ఒకప్పుడు నాలోనూ ప్రేమానురాగాలుండేవి కానీ మీ అమ్మ వాటిని తనతోపాటు తీసుకెళ్లిపోయింది. మొదటినుంచి కావాలనే నిన్ను నాకు దూరం చేసుకుంటూ వచ్చాను. ఇరవై ఏళ్ల క్రితం కోడలు, నాతో ఘర్షణపడి, 'జన్మలో నా ముఖం చూడనని, నిన్ను చూడనివ్వన'ని శపథం చేసి వెళ్లినప్పుడు నాలో నేను నవ్వుకున్నాను. ఇప్పటికీ నవ్వు కుంటాను. బ్రతికినంత కాలం ఎవరి సహాయం ఆశించలేదు నేను. ఆశించను కూడా. కానీ ఇంకెంతకాలమో నేను బతకనని తెలిశాక నాలో ఒక కోరిక నాకు తెలియకుండానే బీజం నాటుకుని వేళ్లుతన్ని మహావృక్షమై కూర్చుంది. నా జీవితంలో ఎన్నో సెంటిమెంట్స్‌ని తోసి రాజన్నాను. అలాగే మనసు మళ్లించుకుందామని విశ్వప్రయత్నం చేశాను. సాధ్యంకాలేదు. ఈ దేశంలో పుట్టటమే అందుకు కారణమేమో.

నాలాగే కాలం చెల్లిన నా మిత్రులు కొందరు నాతో అంటూ ఉండేవారు. "నీకేమోయ్, నీ కొడుకు అలహాబాద్‌లో ఉన్నాడు. ఒకవేళ సమయానికి రాకపోయినా, నీ ఉత్తరక్రియలు గంగాతీరంలోనో, త్రివేణి సంగమంలోనే చేసేస్తాడు. నీకు జన్మరాహిత్యం కలుగుతుంది. అదృష్టవంతుడివంటే నువ్వే" అని. వాళ్ల మాటల్లో నేను మరణించినా నువ్విక్కడికి రావు అన్న శ్లేషకూడా ఉండేది.

తరణీ..! వాళ్లన్నట్టు, నువ్వు నేను పోయాక ఏ గంగాతీరంలోనో లేక త్రివేణీ సంగమంలోనో నాకు ఉత్తరక్రియలు జరిపితే జరపవచ్చు. నేను కావాలనుకుంటే నర్మదరావు నా శరీరాన్ని చందనపు కట్టెలతో దహనం చేస్తాడు. కానీ నా కవి రెండూ సంతృప్తినివ్వవు. నేను మరణించాక ఉత్తరక్రియలు ఇక్కడే నా కొడుకు చేతిమీదనే జరగాలి. నా శరీరం ఇక్కడే నా పూర్వీకులు కలిసిపోయిన చోటే మట్టిలో కలిసిపోవాలి. తండ్రిగా నిన్ను నేనుకోరే, మొదటికోరిక, ఆఖరికోరిక కూడా ఇదే

**ఇట్లు, నీ తండ్రి రామానందరావు.**

**షరా:-** నేను మరణించాక కర్మకాండకి అయ్యే ఖర్చు నిమిత్తం కావలసిన డబ్బుని నర్మదరావు దగ్గర జాగ్రత్తచేసి ఉంచాను. అడిగితీసుకో. ఆ ఖర్చు తన పద్దు పుస్తకంలోకి ఎక్కదని కోడలికి చెప్పు.

# అడల్ట్ స్టోరి కె.ఎన్.వై.పతంజలి

**గదినిండా ఉన్న ఊదారంగు, వెలుతురు కళ్ళకు చల్లగ ఉంది.** తిరుమలరావు దిండుకానుకుని కూచుని భార్యకేసి చూస్తున్నాడు.

'నీలపు వెలుతురులో స్నానం చెసిన పువ్వులాగున్నావు' అన్నాడు.

కుర్చీమీద కూచుని చిన్ని మంచం మీద పడుకున్న చిట్టికొడుక్కేసి చూస్తున్నదల్లా భర్తకేసి చూసి చిరునవ్వు నవ్వింది సుభద్ర.

'తిరుమలరావు భార్యలా గర్వంగా, గ్లోరియస్‌గా ఉన్నావు' అన్నాడు తిరుమలరావు.

'బడాయి' అంది సుభద్ర, లేచి అక్కడ నుంచి కదిలి మంచం మీద కూచుంటూ.

'పొగడ్తలకి పొంగిపోయి దగ్గరి దగ్గరకి చేరుతున్నావు' అన్నాడు తిరుమలరావు అల్లరిగా.

'ఏం కాదు. నాకు నిద్రొస్తోంది. పొగడమని మిమ్మల్ని అడిగానా ఏమిటి?' అంది సుభద్ర.

'మూడు సంవత్సరాల క్రిందట ఇదే రోజున ఉహూ అలా కాదు కథ చెప్పటం నాకు రాదు'

'బతికించారు. మన పెళ్ళయి మూడు సంవత్సరాలయిందని నాకు చెబుతార్లా ఉంది. లెండి బాబూ. నేను పడుకోవాలి' సుభద్ర దుప్పటి సర్దింది.

'అలాకాదు. లెండి బాబూ అనకూడదు. రండి బా..' సుభద్ర లంచం ఇవ్వడంతో మిగతా మాటలు అనలేదు తిరుమలరావు 'పువ్వుని ముద్దెట్టుకుంటే పుప్పొడి, పెళ్ళాన్ని ముద్దెట్టుకుంటే కుంకుమా పెదాలకు అంటుకుంటాయి' అన్నాడు.

'అబ్బో కవిత్వమూ శృంగారమూ మంచి జోరుగా ఉంది'

'అప్పుడేనా?' అని భార్యని చేతుల్లోకి తీసుకున్నాడు. పడుచు రాత్రి పరవశించింది.

అతని చెంపలు మైనమైతే ఆమె ఊపిరి వేడికి కరిగిపోను. ఆమె ఏ వీణో ఆ రాత్రి సంగీత ఝరిలో తడిచిపోను - 'నీ కన్నులయాన నీ వలపు కస్తూరి నామముతోడు' అన్నాడు. 'ఉరోజాల మీద శిరోజాల సాక్షిగా' అన్నాడు.

ఒట్టిగా కోరిక మాత్రమే కాదు. ద సెలబ్రేషన్ ఆఫ్ సోల్స్. ఆత్మల పండుగ. మానవుడి కంటే ప్రాచీనమైన ప్రేమ. వానకు తడిచిన భూమి నుంచి పరిమళం లాగా ప్రేమలో స్వప్నిస్తున్న శరీరాల నుంచి సుగంధం మూడు సంవత్సరాలయింది పెళ్ళయి. తొలికాన్పు పంట. అక్కడ మరో చిన్న మంచం మీద నిద్రపోతున్న పసిడిగంట.

ఆ రోజు ఆఫీసుకు శెలవు పెట్టేడు. మధ్యతరగతి జాగ్రత్తకు దేవిడీమన్నా చెప్పాడు. నాలుగు చేతులతో తీసిన జీవితపు చెలమలోంచి ఊరిన దోసెడు తీపి పాయసంతోనూ వాళ్ళిద్దరూ సంతోషం చేసుకున్నారు. ఆ ఇంటి కిటికీల్లోంచి రంగుల కబుర్ల చిలకలు ఎగిరి వీధిలో చక్కర్లు కొట్టాయి. ఎంతో హుషారుగా గడిచింది పగలు.

మంచం మీదినుంచి క్రిందకు పడింది తలదిండు. జడలోంచి పడిన పూలదండ నోరుమూసుకుని చప్పుడు చెయ్యకుండా కాళ్ళవైపు నక్కింది.

మాటలు కరువై బట్టలు బరువయ్యాయి. తిరుమలరావు జ్ఞాపకపు ముళ్ళ కొరడా స్మృతి మీద చెళ్ళుమనగా గభాలున లేచి అల్మరా నుంచి చిన్న పేకట్ తీసి తెచ్చాడు.

'ఏమిటది.?'

చూపించాడు మంచం మీదకి చేరబోతున్న తిరుమలరావు.

ఒక్కదగ్గరకి చేరిన అనుభూతి పాదరసం మీద చెల్లాచెదురు చేసే దెబ్బ.. వేయి అలల బాహువులతో చెలరేగిన నదిలాంటి సుభద్ర ముడుచుకుపోయింది. 'నో..' అని అరిచింది. నిద్రలోని చంటివాడు ఉలిక్కిపడ్డాడు. ఆశ్చర్యంగా చూసాడు తిరుమలరావు. సుభద్ర విరుచుకుపడింది -

'నో.. ఐ హేటిట్.. అదంటే అసహ్యం నాకు. దాన్ని చూస్తే బతుకులోని కృత్రిమత గుర్తొస్తుంది నాకు. బతుకులోని భయం జ్ఞాపకం వస్తుంది. బతుకులోని దుర్మార్గతా, కక్కుర్తీ జ్ఞాపకం వస్తుంది నాకు. ఐ హేటిట్ విత్ ఎవ్విరి ఫైబర్ ఇన్ మై బీయింగ్; ఐ హేట్.. ఐ హేట్ ఏం సౌఖ్యం? సుందరత ఎక్కడికి పోయిందండి? ఎందుకింత దౌర్భాగ్యంగా బతుకుని మార్చుకోవటం? అయ్యో పుట్టినవాళ్ళకి కాక, పుడతారేమోనని మన నెత్తుటి ఫలాల్ని చూసి మనం భయపడిపోవటం సిగ్గుచేటండీ. నాకు గుండెల్ని పిండేస్తున్నది. ఈ రోజు మన పెళ్ళిరోజండీ. ఈరోజూ భయమే. ఈ రోజూ కక్కుర్తే. ఈ రోజూ పిరికితనమే. ఏవండీ మనం ఎందుకిలాగ అయిపోవాలి? ఏం అలాగయిపోయారు? అయ్యో? మిమ్మల్ని ఏమీ అన్లేదు నేను - పిరికితనాన్ని ఎముకల మూలుగుల్లోకి సైతం పంపేసిన బతుకునంటున్నానండీ. పిల్లల్ని పోషించుకోలేం. నిజమే కానీ ఎందుకంత దౌర్భాగ్యపు బతుకులు అయిపోయాయి మనవి? ఇలాగ బతుకెంత అవకాశమిస్తే అందులోనే, కుంటు కుక్కలాగ, జూలోని జంతువులాగ ఒబీడియంట్‌గా బతక్కపోతేనేం?'

ఆవేశాన్నీ, కృత్రిమతనూ భయాన్నీ తట్టుకోలేక పోయింది. భరించలేక పోయింది. అతని ఛాతీమీద వాలి వెక్కి వెక్కి ఏడ్చింది సుభద్ర.

బిక్క చచ్చిపోయాడు తిరుమలరావు. బెంగటిల్లిపోయాడు. సుందరంగా హిమాలయ గుహాముఖాన గడ్డకట్టిన మంచులతలు ఎండ వేడికి ఏడ్చుకుంటూ కరిగిపోయినట్టు ఆవేశమూ, జీవితంలోని హైన్యాన్నీ, లోపాల్ని దాచి ఉంచే యవ్వనపు మరుపుదనమూ సుభద్ర ఆవేశానికి మాయంకాగా..

చేతులు మొహానికి ఆన్చుకుని కళ్ళు మూసుకున్నాడతను. ఆలోచనలు కదలటానికి సైతం భయపడే చోటు.. ఎంత భయంకరం?

కోపమూ, దుఃఖమూ కలగలేతనికి -

జరిగిపోయిన అసహజమయిన సంఘటన కలిగించిన జుగుప్స, అసహ్యమూ అతన్ని నిండా నింపాయి.

సుభద్ర మాట్లాడదు. గది లోపలి వెల్తురు కదలదు.

అయిదు నిమిషాలు పైగా అలాగ పడున్నాడతను. తరువాత తలత్రిప్పి సుభద్రకేసి చూసాడు.

మొహం నిండా భయంతో, సిగ్గుతో, ఎరుపుదనంతో అసహ్యాకరంగా ఉంది.

'క్రూయల్.. షేమ్‌లెస్ విచ్! డర్టీ.. డర్టీ.. విచ్!' గొణుక్కుని చివుక్కున మొహం తిప్పేసుకున్నాడు. వెంటనే తనమీద తనకే అసహ్యం కలగగా మొహం ఏం చేసుకోవాలో తోచక గొంతు పుండై, కనుగుడ్లు సడిలి వాంతి చేసుకోవాలన్న బలమైన కోరిక - సముద్రపుటలల్లాగ చిన్న, పెద్ద పెగులు.. 'ఓ..కే' వాంతి కాలేదు - లేచి కూచున్నాడు -

'కడుపులో తిప్పుతూందా?' కాలుతూ సుభద్ర గొంతు.

తిరుమలరావు మాట్లాడలేదు. తలన్నా తిప్పలేదు.

'మాట్లాడరేమండీ?' అర్థాంగిగా, ఒకే కొట్టంలోని పశువుగా సుభద్ర ఆతృత.

పెదాలు కొరుక్కున్నాడు తిరుమలరావు. లేచి వెళ్ళి మొహం కడుక్కుని, తుడుచుకుని వచ్చి మళ్ళీ పడుకున్నాడు -

'నేను బీదవాడ్ని. పిల్లల్ని పోషించుకోలేనేమోనన్న భయంతో ఉన్న పిరికి మొగుణ్ణి, ఇంకా విను.. సుందరతా, సున్నితమూ పట్టవు నాకు. భయాలే తప్ప సెంటిమెంట్లు లేవు - కక్కుర్తీ, నీచత్వమూ తలొంచుకున్నాను గనక భరించగలను - సిగ్గుపడను'.

సుభద్ర బెక్కుతోంది.

'ఏడుపు కూడా రాదు నాకు. ఏడవాల్సిన ప్రత్యేక సమయాలని గుర్తించలేను' అన్నాడు. కాని కనుకొలకులెందుకు సలుపుతున్నాయో తనకి తెలీకపోదు.

సుభద్ర అతని గుండెలమీద తలాన్చుకిని పడుకుని బెక్కుతూంది.

ఆమె బెక్కులు తీగలాగ సాగుతున్న తిరుమలరావు ఆలోచనలపై నొక్కులు.

కొంతసేపు పోయాక, ఉద్రిక్తత తగ్గిన కొన్ని నిమిషాలయక, సుభద్ర మౌనంగా ఉన్నప్పుడు..

సుభద్ర కొంచెం కొంచెంగా అర్థం కాసాగింది తిరుమలరావుకు. పెళ్ళయిన మూడేళ్ళకు పెళ్ళాన్ని అర్థం చేసుకోవటం ఆరంభించాడు తిరుమలరావు.

వ్రేలు సోకటాన్నీ, తీగపలకటాన్నీ, సంగీతం ఒలకటాన్నీ ఒక క్రమంలో అతను ఊహించుకోగలిగాడు.

చేతులతో ఆమె తలను గుండెలకు హత్తుకుని.. 'సుభా! మైపూర్ వీక్‌లింగ్! మై పూర్ వైఫ్!' అన్నాడు.

సుభద్ర మాట్లాడలేదు గానీ కళ్ళు మాత్రం మూసుకుంది.

తిరిగి ఆమెకు మెలుకువ వచ్చేసరికి -

తిరుమలరావు ఆమె మెడమీద ముద్దుపెట్టుకుంటున్నాడు.

కొన్ని క్షణాల తరువాత - సుభద్ర లేచి, కిటికీ అల్మారాలోంచి పేకెట్ తీసి తెచ్చి తిరుమలరావు చేతిలో పెట్టింది.

ఆమె బుగ్గ కొరికాడు తిరుమలరావు.

సుభద్ర మూలిగింది - అతడ్ని చుట్టుకుంటూ.

# సహప్రయాణం ఆకెళ్ళ

ఫిబ్రవరి '83 విజయ మాసపత్రిక

**ఆకాశంలో నల్లటి మబ్బులు గుంపులు గుంపులుగా** ఉన్నాయి. వర్షం పూర్తిగా తగ్గలేదు. ఆకాశాన్ని కత్తితో చీలుస్తున్నట్టు ఉండుండి ఓ మెరుపు మెరుస్తోంది. అరుగు చివర కొచ్చి నిలబడ్డాడు యాజి. కను చూపు మేరలో కావల్సిన వ్యక్తి కనపడకపోవడంతో నిరాశగా వెనక్కి తిరిగేడు.

ఊరి చివరనున్న ఆ రంగుల మేడ వయసుడిగిన ముత్తయిదువుల్లా ఉంది. రంగులు వెలిసిపోయాయి. ప్రహరీ కూలి పోయింది. ఆ మేడలో పాతికేళ్ళుగా ఉంటున్న యాజికి, అదే ఇంద్ర భవనం. తక్కువ అద్దెకు అంతకన్న పేలస్‌లు దొరకవుగా?

ఆందోళనగా అరుగు మీద తిరుగుతున్న యాజికి సావిట్లోంచి సన్నటి మూలుగు వినిపించింది. ఒక్క అంగలో సావిట్లో కొచ్చి "ఏం కావాలీ?" లాలనగా అడిగేడు.

యాభై ఏళ్ళ ముత్తయిదువు మంచాన్ని అంటిపెట్టుకుని ఉంది. నీరసంగా కళ్ళు విప్పి చూసింది. తిరిగి కళ్ళు మూసుకుంది. ఆరాటాన్ని అణుచుకుంటూ ఆమెకేసి చూశాడు. కట్టుకున్న ముతక చీర ఏరంగో తెలియటంలేదు. పసుపు కొమ్ములా సన్నగా ఉన్న ఆ ముత్తయిదువు మెడలో నల్లపూసలు, దాన్ని అంటిపెట్టుకుని పసుపుతాడు ఉన్నాయి. నయాపైసంత కుంకుమ బొట్టు మాత్రం నీరసమైన ఆ ముఖంలో గంభీరంగా కనపడుతోంది.

యాజి ఆమె కేసి చూడలేక తలతిప్పుకున్నాడు. ముప్పై ఏళ్ళుగా తనతో ఆమె భాగస్వామిగా సహప్రయాణం చేసింది. ఆమెనేవిధంగానూ తను సంతోషపెట్టలేకపోయాడు. తను ఎన్నుకున్న వృత్తి - మరే గృహవిషయాలు పట్టించుకోలేని పరిస్థితిలో ఉంచింది. ఆమెకు కష్టాల్ని కట్టబెట్టింది. తనలో తనే గొణుక్కున్నాడు యాజి. అతని దృష్టి గోడలకు తగిలించబడిన కిరీటాలు, దుస్తుల మీదకు మళ్ళింది. తను జీవితంతో అన్ని వేషాలు వేశాడు. అందరి మన్ననలు పొందేడు. కానీ భర్తగా తన వేషాన్ని తను సంతృప్తిగా నిర్వహించలేకపోయాడు. ఆమెకు అసంతృప్తినే కలిగించాడు. ఆమె మాత్రం ఇన్నేళ్ళుగా గృహిణిగా మెలిగింది తన్ని సహించింది.

పన్నెండో ఏట తొలిసారి తను వేషం వేశాడు. ఆనాటికే తండ్రి వెంకయ్య పగటి వేషాల్లో సుప్రసిద్ధుడు. తండ్రి వేదాలు, మంత్రాలు సర్వం నేర్చుకున్నవాడే అయితేనేం? మరే వృత్తిలేనట్లు పగటి వేషాలు వేయడమే వృత్తిగా స్వీకరించాడు.

తరచుగా తండ్రి అంటూండేవాడు. "నేను మంత్రాలు చదువుతూ కులవృత్తిలో పొట్టపోసుకోగలను. లేదా మూడు వీధులు చెంబెత్తితే సంసారం సాగిపోవచ్చు. ఐతే ఏ వృత్తి ఇవ్వలేని సంతృప్తి వేషాలు వేయడం కలిగిస్తుంది. సమాజంలో అన్యాయాలున్నాయి. మూఢనమ్మకాలున్నాయి. నా వేషంతో వాటిని విమర్శిస్తాను. వాటి పట్ల ప్రజలకు విముఖత కలిగిస్తాను. సంఘ సంస్కర్తలు చేసే పని నా ధోరణిలో నేను చేస్తాను. నా హాస్యంతో విమర్శిస్తాను. ఎవరి ముక్కు మీద మసి వాళ్ళకి తెలియదు. మనం చెప్పాలి. అదే మన వృత్తి. " ఎన్నోసార్లు సగర్వంగా చెప్పేవాడు తండ్రి.

పన్నెండో ఏట తండ్రి వెనుక తను బయల్దేరాడు. అంతా గుంపుగా ఒక ఊరు చేరేవారు. తండ్రి వెళ్ళి ఆ ఊళ్ళో ఉన్న ప్రముఖుల్ని కల్సుకుని మర్నాడు నుంచి వేషాలు వేస్తామని తెలియజెప్పి వచ్చేవాడు.

మర్నాటి నుండి వేషాలు ఆరంభించేవారు. తండ్రి సోమయాజి వేషం వేస్తే, ఒక శిష్యుడు సోమదేవమ్మ వేషం వేసేవాడు. మిగిలిన వాళ్ళు శిష్యులు.

అంతా బయలుదేరి ఏ గృహస్తు దగ్గరకెళ్ళినా పరదేశి బ్రాహ్మణ కుటుంబం అనుకోవల్సిందే కానీ, పగటి వేషాలని గ్రహించలేకపోయేవారు. అంత రమ్యంగా వేష రచన ఉండేది. రాత్రి గ్యాస్ లైట్స్ ముందు వేషాలు వేయడం వేరు. పట్టపగలు వేషం వేసి, వేషం కానట్టు ప్రజలను భ్రమలో ముంచడం వేరు.

తండ్రి సోమయాజి వేషం వేసి సోమిదేవమ్మతో హాస్యరస ప్రధానంగా నడిపిన విసుర్లు విని, కొండు శ్రేష్టి నాలుగో వివాహ ప్రయత్నం విరమించుకున్నాడు. అలాగే గొల్లవాడి వేషంలో గొల్లవారికి నీతులు చెప్పేవారు ఏ వేషంలోనైనా ఏదో పరమార్థాన్ని సాధించేవారు.

పగటి వేషాల వెంకయ్యగా తండ్రి ఆంధ్రదేశంలో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నాడు. తండ్రి రాజు వేషం వేస్తే పిఠాపురం రాజావారు ఆ ఠీవికి దర్జాకి విస్తుపోయారు.

"రాజకుంటుంబాలకే తెలియని రాజసాన్ని, మీ హావభావాల్లో చూపారు" అంటూ ఉంగరాన్ని బహూకరించేరు పిఠాపురం రాజావారు.

తండ్రి తర్వాత అంత కీర్తిని తనూ ఆర్జించగలిగేడు. సోమయాజి, గొల్లవాడు, పోలీసు, పఠాన్, రాజు, ఇలా వరుసగా ముప్పయి రెండు వేషాలు వేసేవాడు. ఏ వేషానికి ఆ వేషమే. ఆఖరికి శారదా వేషంతో వేషాలు పూర్తి అయ్యేవి. ఆనాడు తను ఊళ్ళో ప్రముఖుల్ని కలిసేవాడు. తోచిన డబ్బు ఇచ్చి సంతృప్తిగా వాళ్ళు ఊరి చివరి వరకూ సాగనంపేవారు. మరో ఊరు, మరో వేషం. ఇవ్వగలిగి కూడా ఇవ్వనని మొండి వేషం వేసే వాళ్ళ దగ్గర తనువాళ్ళని నవ్వించి, ఒప్పించి - తాంబూలం తీసుకునేవాడు.

గత ఆలోచనల్లో ఉన్న యాజి పెదవులు సన్నగా విచ్చుకున్నాయి. పరుశురామ నాయుడుగారు గుర్తుకొచ్చారతనికి. తను ఆ ఊళ్ళో వేషాలు వేసినంత కాలం నోరు మెదపకుండా కూర్చున్నాడు. శారద వేషం వేసి, తాంబూలానికి వెళ్ళినరోజు, "నీ వేషం ఏదీ నన్ను భ్రమ పెట్టలేకపోయింది. నేనెందుకు తాంబూలం ఇవ్వాలి" అని ఎదురడిగేడు.

"మీ చేత శభాష్ అనిపించుకున్న రోజునే, ఈ తాంబూలానికి రెట్టింపు మీ దగ్గర తీసుకుంటాను" అని చెప్పి తను వెనక్కి తిరిగేడు.

వారం తర్వాత కోర్టు అమీనాగా, తను రంగప్రవేశం చేశాడు. నాయుడు తన వేషాన్ని గుర్తించలేదు. గజగజలాడేరు. అరగంట నాయుడ్ని ముప్పుతిప్పలు పెట్టి మూడు వందలు లంచం తీసుకుని, వేషం తీశాడు. నాయుడు ఆశ్చర్యంలో మునిగిపోయాడు.

లంచంగా తీసుకున్న మూడు వందలు అతని చేతిలో ఉంచి వెనక్కి తిరిగితే, వెంటపడి ఆ డబ్బు తను తాంబూలంగా తీసుకుంటే కానీ ఊరుకోలేదు. ఆ తర్వాత వరుసగా అన్ని వేషాలు తిరిగి వేయించుకుని ఆనందించేడు.

అర్ధనారీశ్వరుని వేషం తనెన్నో వందలసార్లు ధరించేడు? పెద్దాపురం దివాన్ ఆ వేషానికి మెచ్చి - ఈ రంగుల మేడలో ఆశ్రయాన్ని కల్పించేడు.

కాలం మారిపోయింది. కళాస్వరూపాలు మారిపోయాయి. తమ పగటి వేషాలు చేసే పనని నాటకాలు, చలన చిత్రాలు నిర్వహిస్తున్నాయి. ఒడ్డుకి ఉత్సాహంగా చేరిన కెరటం సముద్రంలో తిరిగి కల్సిపోతుంది. ఆ తర్వాత మరో కెరటం - జీవితం అంతే. జీవనంతో ముడిపడిన కళా అంతే.

కళలు రూపం మారేయి. తన సంసారం పరిస్థితి మారిపోయింది. పెద్దకొడుకుని, గంటకో ఊరు తిరిగే తను చక్కదిద్దలేక పోయాడు. దారి తప్పిన కొడుకు తనదారి వెతుక్కుంటూ ఇల్లు వదిలిపోయాడు. ఉన్న చిన్నాడు - నోట్లో నాలుక లేని వాడయ్యేడు. ఇన్నేళ్ళూ తనతో కష్టాల్ని, సుఖాల్ని, బరువును, బాధ్యతల్ని పంచుకున్న మనిషి, భార్య మంచమెక్కింది.

తను అన్నివేషాలూ ధరించాడు. అందరి మెప్పూ పొందాడు. ఐతే నేం గృహస్తుగా తన వేషాన్ని సక్రమంగా నిర్వహించలేకపోయాడు. ఈ పుణ్యమూర్తికి భర్తగా, తను ఘోరంగా విఫలమయ్యాడు.

యాజి ఆలోచనలు భంగపరుస్తూ పార్వతమ్మ మంచం మీద మెల్లగా కదిలింది. ఆరాటంగా వంగి "ఏంకావాలి పార్వతీ?" మెల్లిగా అడిగేడు. యాజి, అతని మాటకి అతని మనసే మూలిగింది. 'జీవితం అంతా ఆమెకేం ఇవ్వగలిగేవు?ఇప్పుడివ్వటానికి' అంది మనసు.

ఆమె పెదవులు కదిలేయి. బలహీనంగా, పెదవుల మధ్య నుంచి మాట విడిరావటం లేదు. ఆమె స్థితి చూసి యాజి ఎండుటాకులా వణికిపోయాడు. కొంచెం కంగారు పడ్డాడు.

యాజి నరనరాల్లోంచి ఎగదన్నుకొచ్చింది దుఃఖం. మగతగా తననే చూస్తున్న పార్వతమ్మని చూడగానే చేతులు వణికేయి. ఏదో తరుముకొస్తున్నట్టు భయంతో వణికిపోయాడు. భార్య చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని.

"భయం లేదు పార్వతీ అబ్బాయి వెళ్ళేడుగా. డాక్టర్ని తెస్తాడు. వర్షం కదా! " వచ్చే మాటలు దారం తెగిన పువ్వుల్లా రాలి పడుతున్నాయి. ఆమె పెదవులు విరక్తిగా విచ్చుకున్నట్లు తోచింది యాజికి.

ఈ వర్షంలో డాక్టర్ రాడు. ఫీజివ్వలేని ఓ పగటి వేషగాడి ఇంటికి, ఈ వాతావరణంలో రాడు. ఇన్ని వేషాలు వేసిన తను అబద్ధం అందంగా చెప్పలేకపోతున్నాడు. భార్యను నమ్మించలేకపోతున్నాడు.

అందుకే ఆమె నిరాసక్తగా నవ్వింది.

యాజి తలొంచుకున్నాడు. గుండెల్లో మండుతున్న అగ్నిపర్వతం బయట పడేయాలి. ఇన్నేళ్ళ సహచర్యంలో అన్నీ పంచుకుందామె. తన ఆఖరి బాధను, ఆమెకి చెప్పాలి.

ఇదే ఆఖరి బాధనా? ఏమో? ఆమెకి చెప్పుకోవాలి. తలొంచుకుని, ఆలోచనలోంచి తేరుకుని తనకు తనే ఒప్పుకుంటున్నట్లు యాజి మెల్లిగా అన్నాడు.

"పార్వతీ నాతో ఇన్నేళ్ళ నీ జీవితాన్ని పంచుకున్నావు. నేను అసమర్థుణ్ణి. నిన్ను ఏమీ సుఖపెట్టలేదు. నేను కీర్తికోసం సంప్రదాయం కోసం పరుగులెత్తి కళకోసం నిన్ను ముళ్ళబాటలో వదిలేశాను. నీకు కడుపుకి ఆకలి. మనసుకి వేదన మిగిల్చేను... "

యాజి మాటలు పూర్తికాలేదు. వణుకుతున్న ఆమె చేతులు యాజి పెదవుల కడ్డు పడ్డాయి. టక్కున తలెత్తాడు.

లోతుకు పోయిన ఆమె కళ్ళలో నిండుగా నీళ్ళున్నాయి. గుండెలు ఎగిసి పడుతున్నయి. చేతులు వణుకుతున్నాయి. కంటితో దగ్గరగా రమ్మన్నట్టు సైగచేసిందామె. కంటిలోపాప ఏదో అగాధాల్లోకి చేరిపోతున్నట్టు ఊగిసలాడుతోంది. గాలిలో దీపంలా ఊగుతోంది. ఆమె ఏదో చెప్పాలని ప్రయత్నిస్తోంది.

యాజి ఆమె మీదకి వంగాడు. ఆమె ఏదో అంటోంది. అతి బలహీనంగా పెదవులు కదిలాయి. పెదవుల కదిలిక యాజి చెవిని చేరింది. యాజి నిశ్చేష్టుడయ్యాడు. "ఏమిటి? ఏమిటి పార్వతి అనేది" - తను సరిగ్గా విన్నాడా? అనుమానంతో భార్యకేసి చూశాడు. ఆమె కన్నీళ్ళతో తల ఊపింది.

ఎక్కడో మెరపు మెరిసింది. యాజి మహావేదాంతిలా చావు బతుకుల మధ్య ఊగిసలాడుతున్న భార్య మంచం పక్కన కూర్చున్నాడు. చకచకా సగభాగం పరమేశ్వరుడవుతున్నాడు. సగభాగం గౌరీ దేవిగా రూపు దిద్దుకుంటున్నాడు. మనసులో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి.

ఇదా ఆమె కడపటి కోరిక? అర్ధనారీశ్వరుడుగా ఆంధ్రదేశమంతా తను తిరిగాడు. కానీ ఏ నాడు తన భార్య మనసులో తన వేషం మీద ఉన్న మక్కువ గ్రహించలేకపోయాడు. ఇన్నేళ్ళ సహచర్యంతో భార్య మనసులో కళల పట్ల ఇంతటి ఆదరణ ఉందని తమ గ్రహించలేక పోయేడు. తను చేసే వృత్తి మీద భార్యకింతటి మమకారం ఉందని ఊహించలేకపోయాడు.

ఇన్నేళ్ళుగా... ఆమె మనసులో దాచుకున్న కోరిక ఇదా? తనని అర్ధ నారీశ్వరుడుగా చూడాలనేది తన భార్య కడపటి కోరికా?

తన భార్య మనసులో ఏవుందో గ్రహించలేని తను అర్ధనారీశ్వరుని వేషానికి అర్హుడా? లేదు. తనెన్నడు కాలేడు.

వెలవెలబోయే రంగులు పూసుకోవడం మినహాయించి తను ఆదిశంకరుడు కాలేడు. భార్యకు సగం శరీరం, మనసు పంచి ఇచ్చిన పార్వతి పతి కాలేడు. అలంకరణ పూర్తి అయ్యింది. అర్ధనారీశ్వరుడు అవతరించేడు. ఆమూల చీకటి గదిలో పార్వతమ్మ చూపు నిలిపి చూస్తోంది. లోకంలో భార్యా భర్తల స్థానాన్ని రూపుదిద్ది చెప్పిన ఆదిదంపతులు అవతరించేరు.

శంఖం నోటికి ఆనించి ఊదేడు. ఆమె చేతులు జోడించింది. మెల్లిగా లేచింది.కంటి నిండుగా ఆ రూపాన్ని చూస్తోంది.చూస్తూనే తూలింది. ఒక్క ఉదుటున యాజి ఆమె దగ్గిరకు చేరి ఆమెను పొదివి పట్టుకున్నాడు, ఆ అర్ధనారీశ్వరుని గుండెమీద పార్వతమ్మ ఒదిగిపోయింది. అలాగే గౌరి రూపం మీద పార్వతమ్మ తలవాల్చేసింది. అలౌకికమైన స్థితిలో అరనిమిషం పాటు ఊగిసలాడిన యాజి తేరుకున్నాడు.

పార్వతి చేతులు, పాములా యాజి మెడను పట్టుకుని అలాగే ఉండిపోయాయి.

అన్నేళ్ళ సహస్రప్రయాణంలో ఆమె పొందిన ఆనందానికి సంకేతంగా ఆమె చేతులు అలా బిగుసుకునే ఉండిపోయాయి.

# పొరుగింటి మీనాక్షమ్మ - వసుంధర

మార్చ్‘77 జ్యోతి మాసపత్రిక

**నేను మునిమాణిక్యంగారి** దాంపత్యోనిషత్తు చదవలేదు. ఎందుకంటే ఆ అవసరం నాకు కనిపించలేదు. భార్యవద్ద ఎలా మసలుకోవాలో నేను వివాహానికి ముందే నిర్ణయించేసుకున్నాను. వివాహానంతరం ఆ ప్రకారమే నడుచుకుని ఆమె మన్ననకు పాత్రుడనయ్యాను.

నేను నడుచుకున్న విధానమంటారా - ఆమెను ఒసేవ్ అనికాకుండా, పేరుతో పిలవడం; నేను సంపాదించేదంతా ఆమె చేతుల్లోనే పోసి - నా కష్టాలన్నీ ఏకరువు పెట్టుకోడం, ఆమెను నా నా అర్ధశరీరంగా భావించి - ఆఫీసుకూ, అభ్యంతర ప్రదేశాలకూ తప్ప మరెక్కడికెళ్ళినా కూడా తీసుకెళ్ళడం, ఆమెతో అవసరమున్నప్పుడు కోపంగా ఉండడమూ, అవసరం లేనప్పుడు అభిమానంగా మాట్లాడడమూ, ఆమె దగ్గర లేనప్పుడు విరహంతో పేజీలు నింపి పోస్టు చేయడం... ఇంకా చాలా ఉన్నాయి. ఇవన్నీ ఆమెకు నా మీద గౌరవాన్ని, అభిమానాన్నీ పెంచగా - నా జీవితం ఆమెద్వారా స్వర్గధామమైంది.

మేమిలా చిలకాగోరింకల్లా, చూడముచ్చటగా కాపురం చేస్తూంటే చాలామంది ఎదురుగా మెచ్చుకుని చాటుగా అసూయపడ్డారు. నా వల్ల కొంతమంది భర్తలు ఇరుకున పడ్డారు. నేనొక ఆదర్శపతిగా పేరుపొందాను. మాది ఆదర్శదాంపత్యంగా విలసిల్లుతోంది. అందుకు తగ్గట్లుగానే మాకు అమ్మాయీ, అబ్బాయీను.

ఇదిలావుండగా మా పొరుగింట్లో ఓ మీనాక్షమ్మగారు దిగింది. దిగిన వారం రోజులు బాగానే ఉంది కానీ అనంతరం మా కష్టాలు ప్రారంభమయ్యాయి.

నాకు తెలిసినంతవరకూ మీనాక్షమ్మగారి భర్త ‘నల్లనివాడు పద్మనయనంబులవాడు, చల్లని చూపులవాడు‘ కాని మా ఆవిడకు ఆయన్ను గురించి అంతకంటే ఎక్కువ తెలిశాయి. కారణం - నాకు ఆయనతో పరిచయం. భర్తను గురించిన వివరాలు - భర్తకంటే కూడా ఆ భర్త - భార్యకు తెలుస్తాయి కదా!

మీనాక్షమ్మ గారి భర్త భార్యకు అర్ధశరీరం కాదుట. పూర్తి శరీరాన్ని ఇచ్చేశాడట. ఆవిడను అర్ధాంగి అని కాక పూర్ణాంగి అని పిలుస్తాట్ట.

"ఆవిడ కాస్త లావు కదా మరి. అందుకనేమో." అని నేనంటే "మీరంతే అన్నింటికీ అలానే అంటారు. ఆయనకి భార్యే జీవన సర్వస్వమటండీ" అంది మా ఆవిడ. అలా అంటున్నప్పుడు శ్రీమతి కళ్ళల్లో మొదటిసారిగా కొంత అసంతృప్తి చూశాను.

ఆ అసంతృప్తి నన్ను బాధించింది. ఆదర్శపతిగా భాసిల్లుతున్నానన్న నా అహంకారాన్ని దెబ్బకొట్టింది.

"రేపట్నుంచీ టానిక్కులిప్పిస్తాను. నువ్వు కూడా పూర్ణాంగివే అవుదువుకాని." అన్నాను. శ్రీమతి మూడు వంకరలు తిప్పింది.

మర్నాడు శ్రీమతి పేరంటానికి వెళ్ళింది. పిడుగులాంటి పిల్లవాణ్ణి నా మీద వదిలేసి పిల్లదాన్ని నడిపించుకుంటూ హాయిగా వెళ్ళిపోయింది. సాయంత్రం ఐదున్నరకు వెళ్ళిన మనిషి మళ్ళీ రాత్రి ఎనిమిది దాటిన తరువాత దర్శనమిచ్చింది. ఈలోగా మా పిడుగు

నన్ను ముప్పతిప్పలూ పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించగా నేను ఆయాసంతో మంచం మీద పడిపోయి నిస్సహాయుడనై వాడు చేసే దారుణ నాశన కాండను తిలకిస్తూ ఊరుకున్నాను.

శ్రీమతిని చూస్తూనే నాలో మళ్ళీ ఎక్కడలేని బలమూ పుంజుకోగా ఒక్కసారి విరుచుకుపడిపోయాను. పేరంటానికని వెళ్ళి ఇంతసేపా అన్నాను. పిల్లడు ఇక్కడున్నాడన్న జ్ఞానముండక్కర్లేదా అన్నాను. ఇలా నోటికొచ్చినవి చాలా అని అసలు నీ బుద్ధే ఇంత అని కొన్ని పాత ఉదాహరణలు కూడా ఇచ్చాను. ఇంకా అందును కానీ పిల్లాడ్ని ఆడించలేక నీరసమొచ్చింది. ముందు వంట కానీయమని కూడా అన్నాను.

నన్ను పూర్తిగా వాగనిచ్చి శ్రీమతి అంది.

"నీరసమొచ్చి మాట్లాడలేనంటున్నారు. కాబట్టి ముందా మాట మీద నిలబడి నేను చెప్పినవన్నీ మాట్లాడకుండా వినండి. పేరంటానికి వెళ్ళేటప్పుడు ఇద్దరు పిల్లల్ని తీసుకుని ఎలా వెళ్ళను? మీ పుత్రికారత్నం మూడ్‌ని బట్టి నడుస్తుంది. అది ఎత్తుకోమంటే ఎత్తుకు తీరవల్సిందే కదా! పేరంటానికి వెళ్ళకుండా ఉండాలి కానీ వెళ్ళాక తిరిగిరావడమన్నది నా చేతిలో ఉన్న విషయం కాదుకదా!. అప్పటికీ రెండుమూడుసార్లు అననే అన్నాను. - కుర్రాడితో ఆయనేం ఇబ్బంది పడుతున్నారో ఏమో అని. అంటే మీనాక్షమ్మగారు తెలుసుకదా మీకు. ఆవిడ నవ్వేసి మా వాడికంటే అల్లరి వాడు కాదుకదా మీవాడు. మా ఆయన మాత్రం భరించడంలేదా? అయినా నేను కూర్చోవడంలేదా అనేసింది. ఉన్న ఒక్క కొడుకునీ ఎంచక్కా ఇంటి దగ్గర వదిలేసి చేతులూపుకుంటూ పేరంటానికొచ్చిందావిడ - ఒక్కపిల్లే ఉన్నప్పుడు ఎప్పుడైనా పేరంటానికి ఒక్కత్తినీ వెళ్ళనిచ్చారా నన్ను. ఇద్దరు పిల్లలుంటే మీనాక్షమ్మగారి మొగుడయితే ఇద్దర్నీ ఇంటిదగ్గరే ఉంచేసుకునేవాడు." శ్రీమతి ఒక్కసారి గుక్క తిప్పుకుని మళ్ళీ మొదలెట్టింది. "చచ్చి ఎనిమిది గంటలకి తిరిగొస్తే, వంట చేయమని తొందర పెడుతున్నారు మీరు. మీనాక్షమ్మగారూ నేనూ పేరంటం నుంచి బయటకు వచ్చేశామా. నేను తిన్నగా ఇంటికొచ్చేసేను కానీ ఆవిడ ఇంకా పెత్తనాలు చేస్తోంది. ప్రస్తుతం ఆవిడ రమణిగారింట్లో ఉంది. ఎందుకంటే ఆవిడ మొగుడు పిల్లాణ్ణి చూసే బాధ్యతతో బాటు, వంటచేసే బాధ్యతను కూడా స్వీకరించాడట. ఆవిడ మరీ ఆలశ్యంగా వచ్చే మాటయితే తన వాటా తను తినేసి పడుకుంటానని కూడా అన్నాడట. ఎందుకూ మీరూ ఉన్నారు."

అన్నమాట మీద నిలబడి, అన్నం తినేవరకూ నేనేం మాట్లాడలేదు. కానీ నన్నో ఆశ్చర్యం బాధిస్తోంది. బాబిగాణ్ణి ఆడించేసరికి నీరసమొచ్చి సోలిపోయాను నేను. మీనాక్షమ్మగారి మొగుడు, తన కొడుకుని చూసుకుంటూ వంట ఎలా చేయగలిగాడు? బాగా ఆలోచించిన మీదట సమాధానం తట్టకపోలేదు కానీ, అన్నమాటకు కట్టుబడడం కోసం అన్నం తినేవరకూ ఆగవలసి వచ్చింది.

కూరా, అన్నం తిన్నాక నెమ్మదిగా అన్నాను. "మీనాక్షమ్మగారికి పెత్తనాలు అలవాటు గదా. సెలవురోజుల్లో కూడా ఆవిడ కొడుకు నొదిలేసి పెత్తనానికి వెడుతుందని నువ్వే ఒకసారి అన్నట్టు గుర్తు. అందువల్ల ఆవిడ భర్తకు కొడుకును చూసుకుంటూ పనులు చేసుకోవడమన్నది ఒక్కసారిగా నేర్చుకున్న విద్యకాక, క్రమంగా అలవడినదై ఉంటుంది. అందువల్ల రేపట్నించీ నువ్వు కూడా ఒక్కత్తివీ పెత్తనాలకు వెళ్ళు. నేను పిల్లల్ని చూసుకుంటాను. ఓ నెల్లాళ్ళలో వంట చేయలేకపోను."

"చాల్లెండి" అంది శ్రీమతి "పెత్తనాల మీద నాకు ఇంటరెస్టు లేదనీ, మిమ్మల్ని వదిలి రోజూ వెళ్ళననేగదా మీ ధీమా. అయినా పెళ్ళాం మీద జాలి అనేది ఉండాలి కానీ, ఈ మాత్రం దానికి అభ్యాసం కావాలా. మీనాక్షమ్మగారు రాత్రి నిద్రపోతే మరి లేవదట. మధ్యలో కొడుక్కి పాలు పట్టించవలసిన బాధ్యత తండ్రిదేనట."

"మరి మనవాడికి పోతపాలు కాదుకదా, ఈ విషయంలో నేనెలా సహాయం చేసేదీ" అన్నాను.

"చెప్పేది వినకుండా ప్రతిదానికీ అలా విపరీతార్థాలు తీస్తారెందుకండీ" అంటూ విసుక్కుంది శ్రీమతి. "ఆవిడ ఉదయం లేచేసరికి ఆయన కాఫీ కలిపేసి తను త్రాగేసి ఆవిడ మటుకు ఫ్లాస్కులో పోసి ఉంచేస్తాడట. ఎందుకంటే భార్యా భర్తలిద్దరికీ లేవగానే కాఫీ కావాలి. ఎటొచ్చీ అయిదున్నరకే లేవడం ఆయనకలవాటు. ఏడుదాటితే కానీ ఆవిడకు మెలుకువరాదు. లేవగానే భర్త కలిపిన కాఫీ తాగాకనే ఆవిడ వరుసగా ఇంటి పనులన్నీ మొదలెడుతుందిట. అదృష్టం చూడండి, పెళ్ళయినా ఆవిడ తన పాత అలవాట్లను మానుకోనవసరం లేకపోయింది. నా సంగతి చూడండి, ముఖ్యంగా నిద్ర విషయంలో.."

"నిన్ను గురించి నాకు బాగా తెలిసింది వివాహమైన మొదటి రాత్రి నాడే గదా. ఆ అనుభవాన్నిబట్టి అట్టే నిద్రపోని మనిషివనుకున్నాను నేను" అన్నాను.

నా మాట అనుకున్న ఫలితాన్ని సాధించింది. "ఎప్పుడూ మీకు అదే దృష్టి -" అంటూ సిగ్గుపడింది శ్రీమతి.

ఈ విషయంలో మీనాక్షమ్మగారి ఉదహరణలేవీ ఇవ్వకపోవడం అప్పటికి నా అదృష్టం సంగతలాగుంచితే అప్పుడే నేను ప్రమాదాన్ని పసిగట్టవలసింది. కానీ అలా జరగలేదు. రెండు మూడురోజుల అనంతరం శ్రీమతి మరో వార్త మోసుకొచ్చింది. "ఇది విన్నారా?" అంటూ.

"ఆ ఇది ఏదో తెలిస్తే విన్నదీ లేనిదీ చెబుతాను" అన్నాను విసుగ్గా.

చెప్పింది శ్రీమతి. మీనాక్షమ్మగారి భర్త తనే స్వయంగా చాకలి పద్దు వేస్తాట్ట. ఎంత పకడ్బందీగా వేస్తాడంటే - తెల్లటి బట్టలకు కూడా పద్దులో ఏవో గుర్తులు పెట్టుకుంటాడట. ఆ కారణంగా ఆవిడ కాపురానికి వచ్చేక ఇంతవరకూ ఎన్నడూ ఒక జేబురుమాలు కూడా పద్దులో తేడా రాలేదట.

ఈ వార్త మా శ్రీమతి మోసుకురావడానికి కారణం లేకపోలేదు. నేను కొంచెం పరధ్యానం మనిషిని. ఏదో ఆలోచిస్తూ ఏదో పనిచేస్తూంటాను. అందువల్ల అనేక తప్పులు చేశాను నేను. చాలా తప్పులు శ్రీమతి క్షమించింది కానీ చాకలి పద్దు విషయంలో మాత్రం క్షమించలేదు. ఒకసారి నేను వేసిన చాకలిపద్దు ప్రకారం మా శ్రీమతివి రెండే రవికలు రావాలి. కానీ వాడు ఆరు తెచ్చాడు. ఆరూ తనవేనని మా శ్రీమతి బట్టలను చూసి గుర్తుపట్టింది. నా తప్పిదం వల్ల వాటిని స్వంతం చేసుకోడానికి శ్రీమతి చాకలితో కాసేపు వాదించవలసి వచ్చింది. మరోసారి పద్దు ప్రకారం నావి ఆరు బనీన్లు రావాలి కానీ వాడు మూడే వచ్చాయి. చాకలివాడు ఇంతే ఉన్నాయి మొర్రో అన్నాడు. వాడి గోలలో అర్థం లేకపోలేదు. నాకున్నవి అప్పటికి సరిగ్గా అయిదు బనీన్లు. ఒకటి తొడుక్కున్నాను. ఒకటి పెట్లో ఉంది. అంత ఖచ్చితంగా బనీన్ల లెక్క ఎలా తెలుసంటే - నెల్లాళ్ళ క్రితం ఎవడో ప్లాస్టిక్ వాడొస్తే - శ్రీమతి కళ్ళకి ఇంట్లో ఉన్న నా బనీన్లన్నీ పాతవిగా అయినాయి. తొడుక్కున్నది మిగలగా మిగతావన్నీ ప్లాస్టిక్ సామాన్లవాడి పరమయ్యాయి. (అప్పుడు దురదృష్టవశాత్తూ మా చాకలి ఊళ్ళో లేకపోవడం వల్ల మాసిన బట్టలన్నీ ఇంట్లోనే ఉన్నాయి) అందువల్ల ఆ రోజు సాయంత్రమే షాపుకి పరుగెత్తి ఓ నాలుగు బనీన్లు కొనుక్కోవలసి వచ్చింది.

ఇంతకీ నాకున్నవి అయిదే బనీన్లయినప్పుడు - పద్దులో ఆరెలాగుంటాయని చాకలివాడితో తర్కించి బట్టలు సరిగానే వచ్చినట్లు తేల్చాను. చాకలివాడు వెళ్ళిపోయాడు. శ్రీమతి నా తెలివితక్కువతనాన్ని ఏకేసింది. పద్దు సరిగా వేయకపోవడం ఒక తప్పయితే - చాకలాడి ముందా విషయాన్నంగీకరించడం ఇంకా పెద్ద తప్పట. శ్రీమతి చెప్పిన మాటల్లో నిజం లేకపోలేదు. చాకలి నా పద్దుకు అతీతుడై బట్టలు తేవడం ప్రారంభించాడు ఫలితంగా గృహిణిగా తనకున్న బాధ్యతల్లో చాకలి పద్దును కూడా చేర్చుకోవలసి వచ్చింది శ్రీమతి.

ఈ మీనాక్షమ్మగారి మొగుడు అసాధ్యుడిలాగున్నాడు. భార్య మన్ననకు పాత్రుడైనవాడు నా దృష్టిలో అసాధ్యుడే అయితే అలా మన్ననకు పాత్రుడు కావడానికి అతను చేసే కృషి కూడా సామాన్యమైనది కాదు. అతన్ని గురించి ఆ రోజే కొద్దిగా ఆలోచించాను. నా ధర్మపత్ని స్థానాన్ని అతడాక్రమిస్తున్నట్లు నాకు తోచింది. అయితే నేనేం చేయాలి?

ఆ రోజుకి కొద్దిగా ఆలోచించినా ఆ విషయాన్ని నేనంత సీరియస్‌గా తీసుకోలేదు. కానీ క్రమంగా సీరియస్‌గా తీసుకోవలసిన అవసరం కనబడింది.

వారం రోజులు తిరక్కుండా మీనాక్షమ్మ మొగుడిలో ఉన్న అనేక సుగుణాల వివరాలు నా శ్రీమతి సంపాదించింది. అందుకోసం మా ఆమె పడ్డ కష్టమేమీ లేదు. మీనాక్షమ్మగారే స్వయంగా ఆమె చెవిన వేసింది.

మీనాక్షమ్మ మొగుడు వాసన చూసి కూరలు లేతవో, ముదురువో చెప్పగలడట. దేనికీ ఎన్నడూ కోపగించుకోవడమన్నది ఎరుగడట. ఈ ఓరిమి గుణం వల్లనో ఏమో అతడనేక విద్యల్లో ప్రావీణ్యం సంపాదించాడంట - వాటిల్లో వడ్రంగం కూడా ఉంది. దేవదారు పెట్టెల సహాయంతో అతడు చేసిన అలమారాను తలచుకున్నప్పుడల్లా శ్రీమతి పరవశించిపోతూంటుంది. అంతేకాదు - అతనుండే క్వార్టర్లో బాత్‌రూం తలుపులు పాడైపోతే - దేవదారు పెట్టె చెక్కలతో అతనొక తలుపును తాత్కాలిక ప్రయోజనార్థం తయారు చేశాడు. ఇంట్లో అన్ని తలుపుల్లోకీ అతను చేసిందే బాగుందిట.

"అవును మరి - గవర్నమెంటు క్వార్టర్సు కదా - తలుపులన్నీ నాసిరకంగానే ఉంటాయి" అన్నాను అమాయకంగా శ్రీమతి ఉద్దేశ్యాన్ని గ్రహించని వాడనై. నా అమాయకత్వానికామె అసూయ అని పేరు పెట్టేక అసలు విషయం అర్థమైంది.

"అసూయ నాకెందుకూ? నేనూ ఓ తలుపు తయారుచేస్తే - ఆ తలుపు ఆయన చేసిన తలుపుకంటే బాగుండకపోతే - అప్పుడు కలగాలి అసూయ -.." అని ఇంకా ఏదో అనబోతూండగా "చాల్లెండి, తలుపు చేయడం కూడాను -" అనేసింది శ్రీమతి.

నాక్కొంచెం ఉడుకుమోత్తనం రాగా "బాగుంది, ఎవరికొచ్చే విద్యలు వారి కొస్తాయి. పోనీ మీనాక్షమ్మగారి మొగుణ్ణో కథ రాయమను చూస్తాను" అన్నాను.

శ్రీమతి అనవసరంగా నవ్వింది. "ఏం చెప్పారండీ - కథలు రాయడం కూడా ఒక విద్యేనా? పనీపాటూ లేనివాళ్ళే కథలు రాస్తారు. రోజూ ఓ గంట మీరు పిల్లల్ని చూశారంటే వారం రోజుల్లో నవల రాయగలను నేను. అసలు కథలు రాయడం వల్లనే మీరీ స్థితికి వచ్చారు. ఎంతసేపూ ఎవరిని వేళాకోళం చేద్దామా అనే ఉంటుంది మీ దృష్టి. లేకపోతే మీరూ మీనాక్షమ్మగారి మొగుడిలాగే ఉండేవారు."

నాకు కోపం వచ్చింది. కానీ ప్రకటించలేదు.

మరో రెండు రోజుల్లోనే నేను మీనాక్షమ్మ మొగుణ్ణి చూసి అసూయపడవలసిన అవసరం నిజంగానే వచ్చింది.

మేము అన్ని తెలుగు మాస, వారపత్రికలూ కొంటూంటాం. కొన్న అన్నింటిలోంచీ కథలూ, సీరియల్సూ కట్ చేసి పుస్తకాలు కుడుతూంటాం. కటింగ్ శ్రీమతి వంతు. కుట్టడం నా వంతు.

అలా కుట్టబడిన పుస్తకమొకటి మా ఇంట్లోంచి మీనాక్షమ్మగారు తీసుకెళ్ళింది. తీసుకెళ్ళిన ఆ పుస్తకం అట్ట ఆవిడ పుత్రరత్నం చేతిలో పడి నలిగి చిరిగిపోయిందట. అందుకు మీనాక్షమ్మ మొగుడు చాలా నొచ్చుకుని - పుస్తకానికింకో అట్టవేసి మళ్ళీ కుట్టి బైండింగ్ చేశాడుట. కుట్టేటప్పుడు ఆయన నేను కుట్టిన కుట్టు చాలా బలహీనంగా ఉందనీ అదెంతో కాలం ఉండదనీ భార్యతో అన్నాడుట.

ఏది ఏమైనా మీనాక్షమ్మ మొగుడి శక్తి సామర్థ్యాలకు నిదర్శనంగా ఆ పుస్తకం ముందు నేను కుట్టిన పుస్తకాలన్నీ వెలవెలబోతున్నాయి. మరి అసూయపడక చావనా?

ఏమనాలో తెలియక వ్యక్తి దూషణకి దిగాను. అతని రంగు నలుపన్నాను.

"మీరేమైనా తెల్లని తెలుపా?" అంది శ్రీమతి.

అతన్నీ నన్నూ పోల్చడంలో నీ ఉద్దేశ్యమేమిటనన్నాను.

నేనెం పోల్చలేదు, మీరే పోల్చుకున్నారంది.

అయినా అంత చదువుకున్న వాడికివేం లేకి బుద్దులు - అన్నాను. మగవాడు వంట చేయడాన్ని గర్హించాను. పెళ్ళాన్ని మరీ నెత్తి కెక్కించుకుంటే చాలా ప్రమాదమనీ - ఆ సంసారం హెచ్చిల్లదనీ ఉదాహరణలతో సహా చెప్పాను.

కానీ శ్రీమతి లాయరుగారమ్మాయి. నా పాయింట్లన్నీ ఆమె తర్కం ముందు వీగిపోయాయి. ఇంటిపనుల విషయంలో శ్రద్ధ వహించడం లేకితనమెలాగవుతుందని అడిగిందామె. సహజీవనాన్ని కోరే భార్యాభర్తల్లో అవసరాన్ని బట్టి ఎవరు వంట చేస్తేనే అందామె. ఆఖరున శ్రీమతి అన్నమాట నాకు పిడుగుపాటే. "మీనాక్షమ్మగారి మొగుడు పెళ్ళాన్నేం నెత్తికెక్కించుకోలేదు. ఆయన కాదన్న పని చేయడానికి ఆవిడ హడలి పోతుంది. ఎటొచ్చీ మగవాడుగా ఆయన వ్యవహార దక్షతను మాత్రమే మీకు తెలియచేశాను."

అప్పటికి నాకు బుద్ధి వచ్చింది. అసూయ నన్నెంతకు దిగజార్చిందో అర్థమయింది. వ్యక్తి దూషణ అల్పులు చేయవలసిన పని. అయినా తనకు తానై మీనాక్షమ్మ మొగుడు నాకు చేసిన అపకారమేమీలేదు. పైగా పాపం నేను కనబడ్డప్పుడల్లా ఆప్యాయత ఒలకబోస్తూ నవ్వుతూంటాడు ఆఫీసులో.

కానీ ఎంత నిగ్రహించుకుందామన్నా నా వల్ల కావడంలేదు. మీనాక్షమ్మ మొగుణ్ణి చూసినప్పుడల్లా నా ఒళ్ళు కంపరమెత్తిపోతోంది. ఆఫీసులో సాధ్యమైనంత వరకూ అతన్ని తప్పించుకుని తిరుగుతున్నాను. కనబడ్డప్పుడు తప్పనిసరి అయితే తప్ప నవ్వడం మానేశాను. నాలోని ఈ మార్పు కొట్టొచ్చినట్లు కనపడకుండా ఉండటానికి తగినంత జాగ్రత్త తీసుకున్నాను. ఎంత లేదన్నా ఎంతో కొంత సంస్కారమేడిసింది కదా మరి.

నా సంగతి ఇలా ఉండగా నా శ్రీమతికతన్ని గురించి ఇంకా ఇంకా వివరాలు లభించేస్తున్నాయి. అతగాడు చేసే పనులన్నీ కూడా నాకు అసాధ్యమైనవి. నేర్చుకుందామన్నా కుతూహలం లేనివి.

ఆడవాళ్ళు కొంతమంది కలిసి ఒకరోజు సినిమా ప్రోగ్రాం పెట్టుకున్న రోజున మీనాక్షమ్మ టైము చూసుకోకుండా జంతికలు వేయడానికి సిద్ధపడింది. తీరా మొదలెట్టబోయే సరికి టైమయిపోయిందని తెలిసింది. అప్పుడు మొగుడావిడ కభయహస్తాన్నిచ్చి ఆవిణ్ణి పంపించేసి తను జంతికలు వేసేశాడు. ఈవార్త నన్ను నిశ్చేష్టుణ్ణి చేసింది. మగవాడికి జంతికలు వేయడమన్నది సామాన్యమైన విషయం కాదు. ఒక వంక గొట్టాలని నొక్కుతూ, మరోవంక గొట్టం మొత్తాన్ని తిప్పుతూ చక్కని ఆకారంలో జంతికలు వేయాలి. తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుడి చుట్టూ తిరిగే భూమి ప్రజ్ఞకు ఇదేమీ తీసిపోదు.

మొట్టమొదటిసారిగా ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ ఫీలయ్యాను నేను. అప్పుడే నన్ను మరో విషయం బాధించింది. నా భార్య దృష్టిలో నేను అల్పుణ్ణి. మీనాక్షమ్మ మొగుడు అధికుడు. వచ్చే జన్మలో తనకలాంటి మొగుడు రావాలని అంతరాంతరాల్లో ఆమె కోరుకుంటున్నదేమో - ఒక భారతీయుడిగా ఈ విషయాన్ని నేను ఆమోదించలేను.

అదీగాక నా భార్య దృష్టిలో నా స్థానం పెరగాలి అందుకోసమని నేను నన్ను మీనాక్షమ్మ మొగుడితో పోల్చుకోవడం ప్రారంభించాను.

మరీ పొడగరి కాకపోయినా మీనాక్షమ్మ మొగుడు నాకంటే పొడుగే. అతగాడు మీసాలను అందంగా కట్ చేసుకుంటాడు. భౌతికంగా అతనిలో కనిపించే ప్రత్యేకతలు ఇవేనని గుర్తించాను నేను. అయితే పాతికేళ్ళు దాటిపోయేక పొడుగు అవడం కష్టంగదా - ఆ మార్పు నేను సాధించలేనిది. మీసాలుంచుకోవడం నాకు బోరు. మీసాలు లేకపోవడం వల్లనే నా షేవింగుకు పది నిమిషాలు కూడా పట్టదు. మీసాలు పెంచడం మొదలు పెట్టి ఆ సౌఖ్యాన్ని కాలదన్న దల్చుకోలేదు నేను.

అయితే ఏం చేయాలి?

వెంటనే సమాధానం తోచలేదు. కానీ ఏదో చేసి తీరాలని మాత్రం గ్రహించాను. ఎందుకంటే శ్రీమతిలో ఇటీవల నా పట్ల దారుణంగా అసంతృప్తి పెరిగిపోయింది. ఏ విషయానికీ నన్నూ నా సమస్యలను అర్థం చేసుకోవడం మానేసింది. ప్రతిదానికీ మీనాక్షమ్మ మొగుడయితేనా అంటూంటుంది. అన్నింటికంటే నన్ను బాధించేది ఈ పోలికే!

చిట్టచివరకు నాకు ఒకే ఒక ఉపాయం కనిపించింది. అదేమిటంటే మీనాక్షమ్మ మొగుడి దగ్గరకు స్వయంగా వెళ్ళి గీతోపదేశాన్ని పొందడం. ముఖ్యంగా ఆయన ఎప్పుడు ఏ పరిస్థితుల్లో వంట, వడ్రంగం నేర్చుకున్నాడో తెలుసుకోవాలి. వాటిలో ప్రావీణ్యత సంపాదించే అవకాశం నాకున్నదో లేదో తెలుసుకోవాలి.

ఆడవాళ్ళ మనస్తత్వం గురించి నాకింకా బాగా అర్థం కాలేదనీ, అవే నా కష్టాలకు అసలు కారణమనీ అప్పటికి నాకింకా అర్థంకాలేదు. ఆ విధంగా చూస్తే మీనాక్షమ్మ మొగుడి దగ్గర నేను గీతోపదేశం పొందాననే చెప్పాలి.

ఒకరోజు సాయంత్రం ఆడవాళ్ళందరూ లేడీస్ క్లబ్‌లో సమావేశమైన సందర్భంలో నేను నా పుత్రరత్నాన్ని ఎత్తుకుని మీనాక్షమ్మ ఇంటికి బయలుదేరాను. నేను వెళ్ళేసరికి మీనాక్షమ్మ మొగుడూ చంకలో పిల్లాడినెత్తుకుని ఇంటి తలుపు తాళం వేస్తున్నాడు. అరే ఒక్క నిమిషమాలశ్యమైతే ఎంత ప్రమాదమయ్యేది - అనుకుంటూ పలకరించానతన్ని.

నన్ను చూస్తూనే అతని ముఖం వికసించింది. అతను మళ్ళీ తాళం తీసి "రండి రండి. నేను బయల్దేరుతున్నది మీ ఇంటికే, మీరే వచ్చేశారు" అన్నాడు.

ఆశ్చర్యపోతూ నేను లోపల అడుగుపెట్టి "మా ఇంటికే బయల్దేరారా - ఏమిటి విశేషం?" అనడిగాను.

"కూర్చోండి చెబుతాను. మీతో చాలా మాట్లాడాలి -"

ఇద్దరం కూర్చున్నాము. మా కుర్రాళ్ళిద్దరూ ఆటల్లో పడ్డారు.

"మిమ్మల్ని నేను చాలా విషయాలడిగి తెలుసుకోవాలనుకుంటున్నాను. కానీ ముందుగా ఇది చెప్పండి. మీరు కథలు ఎలా రాస్తారు? నేను కథలు రాయడం మొదలు పెట్టాలంటే ఏం చేయాలి?"

ఇదీ మీనాక్షమ్మ మొగుడి ప్రశ్న!

కాబట్టి - పొరుగింటి మీనాక్షమ్మల వల్ల బాధపడే భర్తలూ - మీనాక్షమ్మ అంటూ పొరుగున ఉండాలేకానీ మీ శ్రీమతి ఆ మీనాక్షమ్మకు ఏమీ తీసిపోదన్న నిజాన్ని గ్రహించండి. మీ శ్రీమతి చేసే పరపురుష స్తోత్రానికి కారణం ఆమెకు మీ పట్ల గల అసంతృప్తి కాదనీ అది మగువల మనస్తత్వమనీ గ్రహించంది. అందుకు విరుగుడు కావలంటే మీరూ ఓ పక్కింటి పంకజాక్షిని ఎన్నుకుని స్తోత్రం ప్రారంభించండి. ఈ విరుగుడు తప్పక పనిచేస్తుందని అనుభవం మీద చెబుతున్నాను.

# నీడ వెనుక నిజం - జలంధర

**వనిత - జనవరి 1990**

**సుధాకర్ కెమెరా కొన్నాడు.** ఆ విషయం దాచడానికి అతడేమీ ప్రయత్నించలేదు. పైగా వీలైనంతగా ఎదుటివారికి తెలియపర్చాలనే ప్రయత్నంలోనే ఉన్నాడు. బొంబాయి మహానగరం నుంచి దాదాపు ఆరడుగుల సమున్నత విగ్రహం, అందమైన వర్చస్సు, ఉంగరాల జుట్టు, చిలిపి కళ్ళు కల సుధాకర్ తన రంగుకు మాచ్ అయ్యేట్లు వేసుకున్న నీలం రంగు స్వెట్టర్, కూలింగ్ గ్లాసెస్, ఎయిర్ బాగ్‌తో పాటు పెట్టెలో ఖాళీ ఉన్నా అందరికీ తెలియజెప్పే ఉద్దేశ్యంతోనే కెమెరా మరో భుజానికి తగిలించుకుని, వీలైనంతమందికి దార్లో దాని గుణగణాలు తెలియచెప్పి, సిరిపురంలాంటి చిన్న ఊర్లో దిగాడు. మొనాటనీతో విసిగిపోయిన అతని పాతికేళ్ళ వయస్సు, ఆకుపచ్చ చీరకట్టుకున్న అందగత్తెలాంటి ఆ ఊరిలో పాదం మోపగానే ఏదో తెలియని అడ్వంచర్ కోసరం ఉరకలు వేసింది.

"ఇన్ని వేలుపోసి ఇప్పుడిది కొనకపోతే ఏమిటిరా?" మెల్లగా మందలించే అక్కగారి మాటలకు సమాధానం వెంటనే చెప్పలేదతను. చింతగింజ మునగని చిక్కటి కాఫీ తాగుతూ, తనకు చిన్నప్పటినుంచీ ఉన్న కెమెరా ఫోటోగ్రఫీ పిచ్చి గురించి మరోసారి చెప్పాడు అతను. సంపాదనపరుడు, స్వతంత్రుడు అయిన తమ్ముణ్ణి మరేమీ అనలేక -

"మా ఫోటోలు తీయరా! నాదీ బావగారదీ కలిపి ఒక్కటి కూడా లేదు" అంది అక్క.

"తప్పకుండా అక్కయ్యా!" అని అక్కకు, అలా అడిగిన చాలామందికి ప్రామిస్‌లు చేసేశాడు సుధాకర్.

"నీ ఫోటోలు తీద్దామనే తెచ్చాను కెమెరా!" అని అతనన్నప్పుడు ఎంకిలాంటి మావయ్య కూతురు అనురాధ అంతంత కళ్ళేసుకుని 'అలాగా బావా' అనలేదు. హాయిగా నవ్వేసింది. నీరెండలో తళుక్కుమన్న ఆ నవ్వు, మెరిసిన ఎర్రరాయి ముక్కు పుడక అతణ్ణి ముగ్ధుణ్ణి చేశాయి. "ఎలాగైనా ఈ అందం వేరు" అనుకున్నాడు బొంబాయిలో నీతా మెహతా గుర్తుకు వచ్చి. బిగించి వేసిన కుప్పెలు పెట్టిన జడలో, వాడిన కనకాంబరాలు, ఏమాత్రం మాచింగ్ లేకుండా కట్టుకున్న లేత ఆకుపచ్చ పూల పరికిణి, నీలం రంగు ఓణీ, ఎర్రరంగు జాకెట్టు, ఛామనఛాయ ఇచ్చిన మరింత కళతో, నూతి దగ్గరనుంచి నీళ్ళు తీసుకువస్తున్న అనూను అలాగే ఫోటో తీశాడు. అలా అందంగా కనిపించిన ప్రతి మనిషినీ, దృశ్యాన్నీ ఫోటో తీస్తూ తను ప్రతి ఏడూ చూసే ఈ ఊరిలో ఇన్ని అందాలున్నాయని కెమెరా పట్టుకుంటేనే కానీ అర్థం కాలేదే అనుకున్నాడు.

పాలు తీసే పల్లెపడుచులు, రంగుల రంగవల్లుల మధ్య బంతిపూల గొబ్బెమ్మలు, తాటాకులతో కట్టిన దేముడి రథం, అన్నీ అందంగానే కనిపించాయి అతనికి. జీవితంలో అస్తమయానికి వచ్చి, సహం నెరిసిన జుట్టుతో అలంకరించుకుని తిరిగే మునసబుగారి భార్య "నా ఫోటోలు తీయవు బాబూ!" అని వయ్యారంగా అడిగేటప్పటికి మతిపోయి చూశాడు అతన్ను. "తప్పదు, మునసబుగారి భార్య" అన్నట్లు అక్క చేసిన సౌజ్ఞ చూసి "హతవిధీ" అనుకున్నాడు సుధాకర్. సాయం సంధ్యలో నిర్మానుష్యంగా ఉన్నదారిలో, దేముడి ధ్వజస్థంభం దగ్గర నిలబడి, ఏం చేద్దామా అని నాలుక వేలాడేసి చూస్తున్న ఊరకుక్క పెద్ద వేదాంతిలా అనిపించింది అతని కళాహృదయానికి. 'ఇలాంటి దృశ్యాలకే ఫోటోగ్రఫీ ప్రైజ్ వచ్చేది' అని నూటొక్కసారి అనుకుని కెమెరా క్లిక్‌మనిపించబోయాడు. కుక్క

కళ్ళలో సుధాకర్‌కు కనపడ్డ వేదాంతం తారుమారై అది మీదకొచ్చి పడేటప్పటికి ఒక్క పరుగుతో రోడ్డు ఎక్కాడు. దారిలో పైట చెంగులు అడ్డం పెట్టుకుని నవ్వుతున్న ఆడపిల్లల్ని కూడా లెక్కచెయ్యకుండా ఒక్క ఉరుకులో ఇంటికి వచ్చిపడి, ''డామ్ ఇన్సల్ట్'' అని ఉడుక్కున్నాడు. కొబ్బరి చెట్ల చాటున సూర్యాస్తమయం దగ్గర నుంచి చిన్నారి పాపల బోసి నవ్వుల వరకూ అన్నీ ఫోటోలు తీశాడతను. ఖరీదైన కలర్ ఫిలిం ఉన్న కెమెరాను పక్కపట్నానికి తీసుకువెళ్ళి మరోసారి లోడ్ చేసుకు వచ్చాడు సుధాకర్. ఫోటోలు తీసే మోజులో అతనికి దానికయ్యే ఖరీదు జ్ఞాపకం రాలేదు.

సుధాకర్ అడిగి తీసిన ఆడపిల్లల ఫోటోలు చాలా ఉన్నాయి కానీ, అతన్ని అడక్కుండా అతని చేత ఫోటోలు తీయించుకోవాలని అలంకరించుకుని, అవతల మేడమీద గుడ్డలారేసే నెపంతోనో, ఒడియాలు తీసే నెపంతోనో వచ్చి చూపుల బాణాలు విసిరే కరణంగారి కొత్తకోడలులాంటి వారిని చూస్తే చాలా నవ్వొచ్చేది సుధాకర్‌కు. అతను కెమెరా తీసుకుని ఎదురుపడితే చాలు, వీలైనంత అందమైన భంగిమలో అతనికి కనబడాలనే ప్రయత్నించేవాళ్ళను చూసి.

''ఈ ఆడవాళ్ళూ..'' అనుకునేవాడు సుధాకర్.

''బావా! ఇవ్వాళ ఒంట్లో బాగోలేదు. రేపు చూద్దాం'' అని ఇంకా ఏమిటేమిటో రాసి పంపింది అనూ ఈ రోజు పాలేరుచేత. కెమెరా లోడ్ చేసుకుని అనూ వాళ్ళ మామిడితోటలో రకరకాల ఫోటోలు తీయాలనుకున్న సుధాకర్‌కు ''బాబూ నన్ను కూడా.. ఏదీ.. ఇవాళ'' అంటున్న పాలేరు మాట వినపడగానే ''ఛా ఫో వెధవా!'' అని తిట్టి పంపించేశాడు. ఆ రోజు ఎక్కడికీ వెళ్ళాలనిపించలేదు సుధాకర్‌కు. ఇంట్లో వాళ్ళంతా బయటకు వెళ్ళడం వల్ల అంతగా అలికిడిలేదు డబ్బాలోనుంచి చేగోడీలు తెచ్చి నములుతూ కెమెరా వంక చూస్తూ పడక్కుర్చీలో జారగిలబడ్డాడు అతను.

''ఏమండీ!'' ఏదో బొంగురు గొంతు వినబడి ఉలిక్కిపడి చూశాడు వాకిలికి కట్టిన రంగు రంగుల గాజు గొట్టాలు, పూసలతో అల్లిన తెర అల్లల్లాడింది. వాటి సందునుంచి తొంగిచూస్తున్నారు. ఎవరో?

''ఎవరది? ''

''నేనండి శ్యామలను. నా ఫోటో తీస్తారేమోనని అడుగుదామని వచ్చాను.'' గొంతుకను విని ఉలిక్కిపడ్డాడు సుధాకర్ నల్లటి ఛాయ, బక్కచిక్కిన శరీరం, లోతు బుగ్గలు మెల్లకన్ను, బిగించి కట్టిన ఉంగరాల జుట్టు కరణంగారి అమ్మాయి శ్యామల. ''ఖర్మరా బాబు'' అనుకున్నాడు సుధాకర్. ఎలాంటి ఎలాంటివాళ్ళో ఫోటోలు తీయించుకుందామనుకుంటారుగానీ, ఇలాంటి పిల్ల కూడా ఫోటో తీయించుకుంటుందని అతని ఊహకు తట్టలేదు.

''మాట్టాడరేమండి. నేను ఫోటోకు బావుండననేగా! అందరూ అందంగా ఉంటారా ఏమిటీ? నాకెన్నాళ్ళ నుంచో ఫోటో తీయించుకోవాలని ఉంది. నీ ముఖానికి అదొక్కటే తక్కువ, అంటుంది మా అమ్మ. ఏమండీ. నేను బావుండనా!'' వెలిసిపోయిన వాయిలు ఓణీ వేలుకు మెలిపెడుతూ, మెల్ల కన్నుతోనూ, భయంకరమైన గొంతుతోనూ మాట్లాడే ఆ అమ్మాయిని చూసి దడుసుకున్నంతపనైంది అతనికి.

''అబ్బే.. అదేం లేదు. తప్పకుండా తీస్తాను'' అన్నాడు తడబడుతూ.

''ఎప్పుడూ తీస్తారూ?'' అంది గొంతు సాగదీస్తూ

''ఎప్పుడేమిటీ? ఎప్పుడైనా తీద్దాం. రేపు లేకపోతే'' ఎవరైనా తనను చూస్తారేమో, నవ్వుతారేమోననిపించి అని తత్తరపడ్డాడు.

''అయితే ఎల్లుండి తీయండి. సాయంత్రం వస్తానేం. ఎల్లుండి మంచి రోజు ఏం?'' అంటున్న ఆ అమ్మాయిని చూసి నవ్వాలో ఏడవాలో అర్థంకాలేదు అతనికి.

"అలాగే.. అలాగే" అంటుండగా వాళ్ళక్క లోపలికి వచ్చింది హమ్మయ్య అనుకున్నాడు.

"ఏమిటీ శ్యామలా, ఇలా వచ్చావు?" అంది నవ్వుతూ, ఆ పిల్లను చూడగానే ఎవరికైనా నవ్వూ, వేళాకోళం, విసుగూ అన్నీ.

"లేదు పిన్నిగారూ! మీ సుధాకర్ ఫోటో తీస్తాడేమోనని ఆపకుండా మాట్లాడుతోంది శ్యామల. అక్కడినుంచి మెల్లిగా దాటుకున్నాడు సుధాకర్.

"ఏమిటక్కయ్యా! ఆ అమ్మాయి.." భోజనాల దగ్గర కదలించాడు మెల్లిగా ఎందుకో ఎంత మర్చిపోదామన్నా ఆ అమ్మాయే గుర్తుకు వస్తోందతనికి.

"ఆః - ముది వయసులోపుట్టిన పిల్లరా ఎదుగూలేదు, బొదుగూ లేదు. పైగా అనాకారి తను. పోనీ కాస్త శుభ్రంగా అన్నా ఉంటుందా అంటే ఆ తల్లికే లేదు శ్రద్ధ. వచ్చిన కొత్త కోడల్ని చూసి మురిసిపోవడంతోనే సరిపోతోంది, సాయంత్రం అయ్యేసరికి తట్టెడు మల్లెపూలు ఇంటిల్లపాదీ పెట్టుకుంటారు. ఆ పిల్లకు తలన్నా దువ్వరు, 'పోనీ, ఏ టానిక్కన్నా ఇవ్వరాదా వదినా' అని చెప్పానురా! శ్రద్దే డుస్తేనా? ఆస్తి ఉంటే చాలనుకుంటున్నారు. కాస్త అందమన్నా ఇవ్వకూడదా భగవంతుడు. అబ్బే.. పగలు చూస్తే రాత్రి కల్లోకి వచ్చేటట్లుంటుంది. ఏం రాత రాసుందో ఆ పిల్లకు.." పులుసు వడ్డిస్తూ అక్క చెప్పిన విషయాలకు జాలేసింది సుధాకర్‌కు.

"ఇంతకూ నీ దగ్గరకెందుకు వచ్చింది మామయ్యా!" పిల్లలు అడిగిన ప్రశ్నకు 'ఫోటో కోసమ్రా' అని సమాధానమిచ్చాడు. ఫకాల్న నవ్వారు పిల్లలు.

"ఆ! దాని ముఖానికి ఫోటో ఒకటి తక్కువ" అంది కంచాలెత్తుతూ అక్కయ్య.

"అయితే బావా శ్యామల నిన్ను ఫోటో అడిగిందా?" మర్నాడు మామిడితోటలో నవ్వాపుకుంటూ అడిగింది అనూ. ఆమె వెనకాల ఉన్న మిత్రబృందం ఆశ్చర్యంగా చూశారు. అంతమంది ఆడపిల్లలు తనను అలా చూసేటప్పటికి రెచ్చిపోయి నిన్నటి దృశ్యాన్ని చిలవలు, పలవలు కలిపించి చెప్పి, వాళ్ళను నవ్వించాడు సుధాకర్. ఇంక ఆ మర్నాడు శ్యామలను ప్రత్యేకంగా పిలిపించి, కూర్చోబెట్టి, అతి అమాయకత్వం నటిస్తూ, "మా బావ నిన్ను ఫోటో తీస్తానన్నాడటగా" అంటూ ప్రారంభించి, చాలాసేపు శ్యామలను వాగించి, వాగించి ఆనందించారు అనురాధ, ఆమె స్నేహితురాళ్ళు.

అదే రోజు సాయంత్రం లేతాకు పచ్చని పట్టుపరికిణీతో సోగకళ్ళతో సంపెంగదండలాంటి అనూ దూసుకు వచ్చింది తోటలోకి.

"బాబోయ్! నీకో విషయం తెలుసా? నీకొక ఆరాధకురాలుంది ఈ ఊళ్ళో." ఫకాల్న నవ్వుతూ అంది.

ఎవరబ్బా! ఆలోచిస్తూ మెల్లగా, "నువ్వా" అన్నట్లు కొంటెగా చూశాడు సుధాకర్.

"ఆశ పాపం.. నిన్నెవరు నమ్మార్లే.. నవ్వులాట కాదు నిజంగా."

"నీ ముఖం"

"నిజం.. ఎవరో తెలుసా? ఊర్వశి శ్యామల"

ఉలిక్కిపడ్డట్టు నటించాడు సుధాకర్, "పాపం శమించుగాక" అని చెవులు మూసుకున్నాడు.

"నిజం. మేము నిన్ను గురించి బాగా ఉన్నవీ, లేనివీ నమ్మేటట్లు చెప్పేశాం. పిచ్చిది కదా నిజం అనుకుంది. ఇంక చూడు, రోజూ నువ్వు తననే చూస్తున్నావట. పొద్దున్న ముఖం కడుక్కునే సాకుతో మేడమీదకు వస్తావట. అసలు నువ్వే 'ఫోటో తీస్తాను శ్యామలా' అని అడిగావట. నిజమా బావా?" చక్రాల్లా కళ్ళు తిప్పుతూ అమాయకత్వం నటిస్తూ అడిగింది శ్యామల.

"ఛా! నోర్ముయ్యి. అసలు ఆ అమ్మాయితో నేను.."

"నాకు తెలుసులే బావా ఏడిపించడానికి అన్నాను. విను మరి. ఇంకా చాలా చెప్పింది. విని విని మన పూజారిగారి రాధకు ఒళ్ళుమండి 'నువ్వేం పెద్ద ఊర్వశిననుకుంటున్నావా? జరిగింది మాకు తెలియదా ఏమిటి? మొన్న ఆయనే చెప్పాడులే' అని నువ్వు మొన్న ఆ అమ్మాయి ఫోటో తియ్యమని అడిగిన ఫార్సంతా చెప్పావే - అదంతా నీ భాషలోనే వర్ణించింది. ఇంక చూడు. దాని నల్లటి ముఖం మరీ మాడిపోయింది. పారిపోయిందనుకో" ఇంకా ఏదో చెపుతోంది అనూ.

ఎందుకో సుధాకర్ మనస్సు కలుక్కుమంది. పాపం, ఏమనుకుందో అమాయకురాలు అనిపించింది. అందవికారమైన ఆడపిల్ల తన 'గొప్ప' ఉందని తృప్తి పరచుకోడానికి ఊహించుకున్న తీయని ఊహలన్నీ నిజాలుగా బైటకు చెప్పిందనే విషయం తెలియకపోయినా ఎందుకో జాలేసిందతనికి.

"అయినా, ఆ పిల్లకెన్నేళ్ళుంటాయి అనూ. నాలుగడుగులు కూడా ఉండదు" అన్నాడతను.

"ఎన్నేళ్ళేమిటి బావా! నా వయసే పద్దెనిమిది. నేను కార్తీకంలో పుట్టాను. అది పుష్యమాసంలో పుట్టింది. అయినా బావా, నువ్వు మేడెందుకు ఎక్కుతున్నావో నాకు తెలియకనా? కరణంగారి కొత్తకోడల్ని చూట్టానికేగా?" అంది నవ్వుతూ.

"ఏయ్ అనూ తంతాను. వాళ్ళ మావ విన్నాడంటే మక్కెలిరగగొడతాడు మనని" అన్నాడు చెయ్యెత్తుతూ.

నాలుకతో ఎక్కిరించి గోరింటాకు చేతులతో టాటా చెప్పేసి, అందకుండా దూసుకుపోయింది అనూ.

మర్నాడు మధ్యాహ్నం నిన్న సాయంత్రం మరచిపోయిన నవల కోసరం భోజనం చేసి మేడెక్కాడు సుధాకర్. ఎర్రని ఎండలో నోరూరించేటట్లున్న వడియాలు తీసుకుని రెండు నోట్లో వేసుకుని వెనక్కి తిరగబోయి ఆగిపోయాడు సుధాకర్. అవతల మేడమీద ఎర్రటి ఎండలో గోడకానుకుని కూర్చుని మోకాళ్ళలో తలదాచుకుని ఏడుస్తోంది శ్యామల. ఆశ్చర్యపోయి ఇవతలి గోడకానుకుని "శ్యామలా" అని పిలిచాడు తనను తాను మర్చిపోయి.

తలెత్తి చూసింది. ఎంతసేపటినుండి ఏడుస్తుందో కళ్ళు - ఎర్రబడి వాచి ఉన్నాయి.

"మీరా? పోండి. నాతో మాట్లాడకండి" అంది బెక్కుతూ చేతుల్లో ముఖం దాచుకుంటూ.

"ఏం? ఎందుకని? ఏమైంది?" మెల్లిగా అడిగాడు. అతనికి తెలియకుండానే అతని గొంతు మృదువుగా మారిపోయింది.

మరి కాసేపు బ్రతిమాలించుకుని అసలు విషయం చెప్పింది శ్యామల.

"మీరు నన్ను గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడారట కదా నిన్న అనూ, దాని స్నేహితురాళ్ళు నన్ను గుళ్ళో ఎలా ఏడిపించారో తెలుసా? నేను ఫోటో తీయించుకుంటానని దానికెందుకు చెప్పారు? ఇష్టం లేకపోతే అప్పుడే చెప్పాల్సింది. అందరికీ తెల్సిపోయి నన్ను ఏడిపిస్తున్నారు. మా అమ్మ 'సిగ్గులేనిదానా? నీ ముఖానికి ఫోటో ఒకటే తక్కువ. సిగ్గూ ఎగ్గూ లేకుండా పరాయి మొగాడ్ని అడుగుతావా?' అని కొట్టింది. ఏమండీ! నేను ఫోటోకు అంత పనికిరానిదాన్నా?" బెక్కుతూ చేత్తో కళ్ళు నులుపుకుంటూ అడుగుతున్న ఆ పిల్లను చూడగానే అతనికి ఆ అమ్మాయి అందవికారం కాని, బొంగురు గొంతుకానీ వినిపించలేదు, కనిపించలేదు. గుండె తరుక్కుపోయినట్లనిపించింది. వెంటనే తనను తాను మర్చిపోయి -

"ఛీ! ఛీ అదేం లేదు శ్యామలా! ఎవరన్నారు అలా? అదంతా అబద్ధం. ఇంకా నువ్వు ఇవ్వాళ ఫోటో తీయించుకుంటానికి రెడీ అవుతావనుకుంటున్నాను. వాళ్ళ ముఖం. వాళ్ళ మాటలేమిటి? రేపు నీ ఫోటో చూడు. ఎంత బావుంటుందో" అన్నాడు.

నమ్మనట్లు తలెత్తి చూసింది శ్యామల, "నిజం.. అబద్ధం కాదు.. సాయంత్రం మరి రెడీగా ఉంటావా? ఫో ముఖం కడుక్కో. అన్నం తినలేదు కదూ. పిచ్చి పిల్లా..వెళ్ళు" అన్నాడు.

మెల్లిగా లేచి పరికిణీతో ముఖం తుడుచుకుని, వెనక్కు తిరిగి చూసుకుంటూ వెళ్ళిపోయింది శ్యామల. ఆమె వెళ్ళిన అయిదు నిమిషాలకు కానీ, తను చేసిన పనేమిటో అర్థం కాలేదు అతనికి. "ఇదెక్కడి కొత్త జంజాటం పెట్టుకున్నానురా దేముడా!" అనుకుంటూ కిందికి వెళ్ళాడతను.

"ఏమండోయ్" సాయంత్రం పడకగది కిటికీ దగ్గర నుంచి శ్యామల గొంతు వినబడి ఉలిక్కిపడి నిద్రలేచాడు.

"నేనేనండీ. మా ఇంట్లో అందరూ పల్లలో ఉన్నారు. మీ అక్కా వాళ్ళు మామయ్యగారింటి కెళ్ళారు. మరి నేను తయారవ్వనా? ఫోటో తీస్తారా?" ఆ గొంతులో ఆశ, ఆ వికృతమైన ఆకారం రెండూ చూసి ఏం మాట్లాడలేక 'ఊఁ' అని, ఖర్మరాబాబూ అనుకుంటూ కెమెరా తీసుకుని మేడెక్కాడు అతను. అంత ఖరీదైన కలర్ ఫిలిం శ్యామల మీద దండగ చెయ్యడం ఏమాత్రం ఇష్టంలేదతనికి. 'ఊరికే క్లిక్ మనిపిస్తే సరి. నమ్మేస్తుంది పిచ్చిది' అనుకున్నాడు. 'భగవంతుడా ఈ ఫోటో తీసే సమయానికి మా అనూ, దాని బృందం రాకుండా చూడు' అని మనస్సులోనే దేముణ్ణి ప్రార్థించాడు. అయినా అతనికి బెరుకు వదల్లేదు.

"ఏమండీ" ఆ గొంతు మళ్ళీ వినబడగానే ఉలిక్కిపడ్డాడు. ఎదురుగా శ్యామల ఆమెను, ఆమె అలంకరణనూ చూస్తే నోటమాట రాలేదతనికి. ముదురు ఎరుపురంగు పరికిణీ, కనకాంబరం రంగు ఓణీ, వాళ్ళ అమ్మది కాబోలు - లూజుగా ఉన్న పట్టు జాకెట్టు, మెళ్ళో ఏవేవో రకరకాల నగలు, చేతినిండా నానా రంగుల గాజులు, ముఖానికి అరంగుళం పౌడరు, కళ్ళు మూసుకుపోయేలా కాటికా, ఎర్రటి అమ్మవారి బొట్టు.. అసలే అందవికారమైన శ్యామల, ఆ అలంకరణలో "బావున్నానా అండీ?" అని నవ్వేసరికి దడుచుకున్నాడు సుధాకర్. ఉన్నపళంగా చేతిలో ఉన్న కెమెరా కిందపెట్టి పారిపోవాలనిపించింది అతనికి.

"ఏమండీ మాట్లాడరేం. నేను బాగాలేనా?" ఆ గొంతు వినగానే మధ్యాహ్నం ఎండలో కుర్చుని ఏడుస్తున్న శ్యామల జ్ఞాపకానికొచ్చింది. ఒక్కసారిగా జాలేసిందతనికి.

"ఏమండీ ఫోటో తీయరూ?" ఏడుపు గొంతుకతో అంది శ్యామల.

అటూ ఇటూ చుశాడు అతను.

"నేను ఎవరికన్నా చెప్తానని భయపడుతున్నారా? నేనెవరికీ చెప్పను లెండి. ఒట్టు" ఆశగా అంటున్న ఆమె గొంతు వినగానే - "ఛా!ఛా అదేంలేదు. అదిగో ఆ పిట్టగోడకానుకుని నుంచో" అని తోచిన అయిడియా చెప్పి, నిజంగానే ఫోటో తీశాడు సుధాకర్. కెమెరాలో రీలు తిప్పుతున్న అతన్ని చూస్తూ "ఏదండీ ఫోటో" ఆశగా చెయ్యిచాచింది.

"ఇప్పుడే రాదు. మా ఊరు వెళ్ళింతరువాత పంపుతాలే. సరే నువ్వెళ్ళు ఇంక" అని వెనక్కు తిరగబోయాడు అతను.

"ఏమండీ"

మళ్ళీ ఏమిటన్నట్లు వెనక్కు చూశాడు.

"అందర్నీ ఫోటో తీస్తారు, మీరు తీయించుకోరా? మీరు ఆ ఫోటోలో ఎంత అందంగా ఉంటారో తెలుసా?"

ఆ అమ్మాయి మాటలకు అదిరిపోయాడు. ఇంతవరకు కెమెరా కొన్న తరువాత ఫోటో తీయించుకునేవాళ్ళే కానీ, అతన్ని గురించి ఆలోచించినవాళ్ళులేరు. ఈ శ్యామల. ఈ అనాకారి పిల్ల. నా ఫోటో గురించి ఆలోచిస్తోందా? అనిపించింది. ఏదో చెప్పాలని మాట్లాడబోయాడు.

"శ్యామలా!" అని వాళ్ళమ్మ గొంతు వినగానే పరుగెత్తింది శ్యామల. దూరమౌతున్న ఆమె పాంజేబు పట్టీల సవ్వడి వింటూ అలాగే చాలాసేపు నిలబడి కిందకు వచ్చేశాడు సుధాకర్.

ఆ తరువాత రెండు రోజులు అతనికి ప్రయాణసన్నాహాలతోనూ, బంధువుల ఇళ్ళల్లో భోజనాలు, అనూ వాళ్ళతో వనభోజనం వీటితోనే సరిపోయింది. ఆ మూడోసాయంత్రం గూడు బండిలో రైల్వే స్టేషనుకు వెడుతున్న అతనికి కరణంగారి వాకిట్లో తారాడిన నీడ శ్యామలలా అనిపించినా, మిగతా అనేక విషయాలలో అదేం పట్టించుకోలేదతను.

బొంబాయి వచ్చిన నెలరోజులకు –

"బావా నీకీ విషయం తెలుసా? కరణంగారి శ్యామల చచ్చిపోయింది. ఏదో డిఫ్తీరియాట. పాపం, ఇరవైనాలుగు గంటల్లో ప్రాణం పోయింది. అది పోయినందుకు వాళ్ళింట్లో ఎవరికీ విచారం లేదనుకో. పోయేముందు నన్ను పిలిచి 'మీ బావను నా ఫోటో అడుగు' అని రాసి చూపించింది. దానికి నువ్వు ఫోటో తీశావా? మాకెవరికీ చెప్పలేదేం బావా! పాపం, అమాయకురాలు" ఈ రకంగా ఉన్న ఆ ఉత్తరం చూడగానే కళ్ళనీళ్ళు తిరిగాయి అతనికి. ఆ రోజే ప్రింటు అయివచ్చిన ఫోటోల కవరు తీసి మెల్లిగా అన్ని ఫోటోలు చూస్తూ, శ్యామల ఫోటో దగ్గర ఆగిపోయాడతను. చాలా క్లియర్‌గా వచ్చింది బొమ్మ. శ్యామలలాగా ఉంది. "ఏమండీ నా ఫోటో బావుందా?" ఎవరో అన్నట్లనిపించింది. అలాగే దాన్నే చూస్తూ కూర్చున్నాడతను చాలాసేపు.

●●●

"ఇంత అందవికారమైన అమ్మాయి ఫోటోకి ప్రైజ్ ఎలా వచ్చిందా అని చూస్తున్నావా? ఆ ఫోటో పరిశీలించి చూడు. అందులో ఏం కనబడుతోంది? లైఫ్. జీవితం, జీవితం మీద ఆశ. ఆ అలంకరణ, ఆ శ్రద్ధ చూడు. అదొక విచిత్రమైన అనుభూతి.. ఆ కళ్ళు.. ముఖ్యంగా ఆ కళ్ళు చూడు. ఎంత స్త్రీత్వం? ఎంతో కోరిక ఎంతో ఇష్టమైన వ్యక్తిని ఎవర్నో ఎంత ఆరాధనగా చూస్తోందో చూడు ఆపిల్ల.. అందుకే అన్నారండీ 'కెమెరా ఐ' అని.

జీవితంలో మామూలుగా ఉండేవాటిని కెమెరే అద్భుతంగా కనిపెడుతోంది. ఏం ఫోటో అండీ? ఊరికే ఇచ్చారటండీ ప్రైజూ?" ఎవరీ ఇద్దరు నడివయస్సు వ్యక్తులు ఇలా ఆ ఫోటో ముందు నిలబడి మాట్లాడుకుంటున్నారు.

అక్కడే కొద్దిదూరంలో ఒక స్థంభానికి ఆనుకుని, చేతులు కట్టుకుని నిలబడి, వారి మాటలు వింటూ ఆ ఫోటో వంకే చూస్తున్నాడు ఒక యువకుడు.

అది ఫోటో ఎగ్జిబిషన్.

ఆ యువకుడు సుధాకర్.

# చావు బ్రతుకుల మధ్య దూరం - ద్వివేదుల విశాలాక్షి

## జ్యోతి మాసపత్రిక దీపావళి సంచిక

**స్ప్రింగ్ డోర్ తెరిచుకుని బయటకి వచ్చేసరికి** తన ఆత్రుత అంతా కళ్ళలో నిల్పుకుని గుమ్మం వైపే తదేక దీక్షతో చూస్తూ అతడు కనిపించాడు. ఎప్పుడూ అరవిచ్చిన మల్లె పువ్వులా అతి సుకుమారంగా, అందంగా కనిపించే మనిషి వడదెబ్బ తిన్నవాడిలా వాడిపోయి ఉన్నాడు. నా పెదవుల మధ్య కదలాడిన చిరునవ్వు అతని ఆరాటాన్ని అదిమిపెట్టి, ధైర్యాన్ని అందించిందేమో, ముఖంలో కొద్దిగా మెరుగు కనిపించింది.

నమ్రతగా చేతులు రెండూ జోడిస్తూ "నమస్తే డాక్టర్" అన్నాడు. వాడిన అతని ముఖం వంక చూస్తూ ప్రతి నమస్కారం చేసాను.

"ఆమెకెలా ఉంది?" ఏమాట వినవలసి వస్తుందో అన్న కంగారు ఆ కంఠంలో పలికింది.

"మీరేం కగారు పడకండి. అంతా సవ్యంగా పూర్తయింది. కొద్దిసేపట్లో తెలివి వస్తుంది. మరేవిధమైన చికాకు లేదు" అన్నాను అతనికి ధైర్యం చెపుతూ.

"పిల్లా...?"

"ఓ.. సారీ, మీకింకా వార్త అందలేదా? మగపిల్లాడు. కంగ్రాట్యులేషన్స్ మిష్టర్ రావు."

"థాంక్యూ డాక్టర్. పిల్లడు ఆరోగ్యంగా ఉన్నాడా?"

"చాలా ఆరోగ్యంగా ఉన్నాడు. వెళ్ళి చూడండి. మీరనుకున్న లెక్కలు సరికావు" అన్నాను.

"చాలా సంతోషం డాక్టర్. మీ దయవల్ల.."

అతని మాట తడబడింది. తొట్రుపడుతూ నన్ను తప్పించుకుని గదిలోకి వెళ్ళాడు.

అతని తొట్రుపాటులో ఏదో చిత్రం, అతని కదలికలో ఏదో కథనం నా మనసులో మెదిలింది. తెర తొలిగిన నాటకంలో ఆరునెలల క్రిందటి సంఘటన కళ్ళకి కట్టింది. సౌదామిని అడిగిన ప్రశ్నకి సమాధానం దొరికినట్లనిపించింది.

నాలుగు సంవత్సరాల క్రిందట సౌదామినిని నర్సింగ్ హోంలో మొదటిసారి చూసినప్పుడు ఆమె ఒక రోగి, నేను ఒక డాక్టరు. అంతకు మించి ఏ భావం నాలో కలుగలేదు. కానీ ఏ నాటికీ లొంగు బాటుకి రాని ఆ రోగంతో ఆమె తరుచు నర్సింగ్ హోంకి రాకపోకలు సాగించడంతో మా ఇద్దరి మధ్య ఏదో ఒక విధమయిన స్నేహం ఏర్పడింది.

సౌదామిని అంటే మెరుపట. పసితనంలోనే ఆ పిల్ల రూపురేఖలు గుర్తించి అంత అందమైన పేరు పెట్టిన ఆమె తల్లిదండ్రుల పట్ల నాకు గౌరవభావం కలిగింది. ఆషాఢ మేఘాలు అంచెలంచెలుగా ఆకాశం మీద పరుగులు పెడ్తున్నప్పుడు ఆ మేఘమాలికల చాటునుంచి తళుక్కున మెరిసే మెరుపు తీగెలా ఉండేది సౌదామిని. ఆమె భర్త పేరు మధుసూదనరావ్. మామిడి చెట్టు, మాధవిలతలా ఉండేవారు దంపతులు.

శాస్త్ర విజ్ఞానం ఇంతగా అభివృద్ధి చెందినా మందులకు, కత్తులకు పూర్తిగా లొంగని జబ్బులు ఇంకా ఉండడం ఆశ్చర్యకరమైన విషయమే. మా అనుభవాల్ని, విజ్ఞానాన్ని అపహాస్యం చేస్తూ ఒకొక్క రోగం, వైద్యశాస్త్రంపై విజయం సాధించినట్లు రోగి ప్రాణాల్ని ఆరగించడం చూస్తుంటే మానవుని శక్తికి అతీతమైనది ఇంకా చాలా మిగిలిపోయి ఉందని ఒప్పుకోక తప్పదు.

రాకపోకలవల్ల కలిగే అలసటని తప్పించడానికి ఆమెని నర్సింగ్ హోంలో జాయిన్ చేసాడు అతడు. స్పెషల్ వార్డుని అనుసరించే నా గది ఉండేది. పనిలేని వేళల్లో ఆమెతో మాట్లాడుతూ గడపడం నాకు ఒక అలవాటుగా మారింది. ఆ విధంగా మా స్నేహలత మారాకు తొడిగింది.

జీవితంలో ఏ చిన్న విషయాన్నీ తేలికగా తీసుకోలేకపోయేది సౌదామిని.

"మనం మనుష్యులం. హెచ్చు తగ్గులు, పొరపాట్లు రావడం సహజం ప్రతిదానినీ అంతలా పట్టించుకోకూడదు" అనేదాన్ని.

నేనెంతగా చెప్పినా ఆమెకి ఆందోళన తగ్గేదికాదు. "జీవితంలో ముఖ్యమనుకున్న విషయాల్లో నేను రాజీ పడలేను డాక్టర్. నాకు పరిపూర్ణమైన జీవితం కావాలి. ముఖం మొత్తేటంత ఆనందం కావాలి. అవి పొందలేనని తెలుసుకున్ననాడు నిండు మనసుతో మృత్యువును ఆహ్వానిస్తాను. ఈ బ్రతుకు కంటే చావు నాకు శాంతిని సంపాదిస్తుంది" అనేది ఆవేశంగా.

ఒక్కొక్క సమయంలో ఆమె ఆలోచనలు తెలుసుకుని జాలిగా నవ్వేదాన్ని. వేరొక సమయంలో ఆ తీక్షణత చూసి భయపడేదాన్ని. ఆ కోమల పుష్పం రేకులన్నీ విచ్చుకుని పరవశించే వేళ ఏ కర్కశ హస్తమో త్రుంచి పోగులు పెట్టదు కదా అనుకునేదాన్ని.

కానీ, నా భయం నిర్హేతుకమనీ, ఆమె జీవితం వడ్డించిన విస్తరిలాంటిదని తెలుసుకుని భారం దింపుకున్నాను. అనారోగ్యం తప్ప ఆమెని వేధించే ఇతర సమస్యలు లేవు. దానిని సరిదిద్దడానికి ఎంత సొమ్మయినా వెచ్చించ కలిగే స్తోమత ఆమె భర్తకి ఉంది.

అతడు వేళ తప్పకుండా రోజూ వచ్చేవాడు. పువ్వులూ, పళ్ళూ తెచ్చేవాడు. గంటకుపైగా ఆమె దగ్గర కూర్చుని కబుర్లు చెప్పేవాడు. ధైర్యవచనాలతో ఆమెని ఉత్సాహపరచేవాడు. ఆమె భయాన్ని ప్రారద్రోలి, ఆశలకి ప్రాణం పోసేవాడు.

ఏమి అపురూప దాంపత్యం? ఎన్ని జన్మల అనురాగబంధం ఇది. ఈ స్థితిలో కూడా భర్త నుంచి ఇంత ప్రేమని అందుకోడానికి ఆమె ఏమి పూజలు చేసి పుట్టింది అనుకునేదాన్ని.

"మీరు అతన్ని ఎప్పుడైనా చూశారా డాక్టర్. అతడు ఆమె పట్ల చూపుతున్న అనురాగంలో, ఆసక్తిలో ఏదో వెలితిఉన్నట్లు అనిపిస్తుంది నాకు. కావాలని తెచ్చిపెట్టుకున్న భావాల్లో నాలిక చివర నుంచి వస్తున్న మాటల్లా ఉంటాయి" అంది నర్స్ పంకజం.

ఆమె ఆ మాట విన్నాక రెండు, మూడుసార్లు అతడు ఆమె గదిలో ప్రవేశిస్తుండగా చూడడం తటస్థించింది.

ప్రకాశవంతంగా వెలుగుతున్న దీపాన్ని ఒక్కసారిగా చిన్నది చేసినట్లు అంతవరకు అతని ముఖం మీద కనిపించే ఆనందం, ఉత్సాహం తొలిగిపోయి, ఆ స్థానంలో జాలి, నిశ్చలత ప్రవేశించేవి. మనిషి నడకలో, మాటలో మార్పు వచ్చేది. పొంగి పొరలుతూండే అతని జీవన వాహినికి అడ్డకట్టలా నిల్చేది ఆ గుమ్మం. క్షణకాలం క్రిందట వరండాలో నిలచిన మనిషికి, గదిలో కాలు పెట్టిన మనిషికి అసలు పోలికే లేనట్లు ఉండేది అతని తీరు.

"ఏమిటీ వ్యక్తి ఎందుకిలా ప్రవర్తిస్తాడు? " అనుకునేదాన్ని.

ఈ విషయాన్ని గ్రహించేక అతడి పట్ల అంతకు ముందులేని కుతూహలం నాలో జనించింది. మొదట్లో రెండు, మూడుసార్లు ఒక అందమైన అమ్మాయి పార్కులోనూ, సినిమాలోనూ అతనితో కనిపించింది. అటు తరువాత ఆమె తరచుగా అతని కారులో కనిపించేది. నర్సింగ్ హోమ్‌కి అతడు వచ్చినప్పుడు కూడా ఉండేది. కానీ అతనితోపాటు లోపలికి వచ్చేది కాదు. అతడు తిరిగి వచ్చేవరకు

కారులోనే కూర్చునేది. లేక ఎదురుగా ఉన్న షాపుల్లో ఇవీ అవీ చూస్తూ కాలం గడిపేది. గంట గడిచి అతడు బైటికి రాగానే కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ ఇద్దరూ వెళ్ళిపోయేవారు.

అందులో అంతరార్థం కొంత బోధపడినట్లే అనిపించేది. అయినా అసలు విషయం అంతు తేలకుండానే మిగిలిపోయేది.

దానికి అతన్ని తప్పు పట్టలేదు. లోకం తీరు అనుకున్నాను. అతడు వయసులో ఉన్న మగాడు. అందం ఆస్తి అన్నీ ఉన్నాయి. అన్నిటినీ మించి అందాన్ని అభినందించడం, ఆనందాన్ని అనుభవించడం అన్న గుణాలు అతనిలో కాస్త హెచ్చు పాళ్ళలోనే ఉన్నట్లు సౌదామిని చెప్పినకొన్ని సంఘటనలను బట్టి తెలుసుకున్నాను.

అందానికి మెచ్చి ఏరికోరి చేసుకున్న భార్య అదృష్టం వక్రించి దీర్ఘరోగిగా తయారయింది. ఆమె ఆ రోగం నుంచి ఎప్పటికి కోలుకుంటుందో, అసలు కోలుకుంటుందో లేదో కూడా చెప్పడం కష్టం. అటువంటి పరిస్థితిలో అందుబాటులో ఉన్న ఎవరో అందమైన అమ్మాయితో అతడు పరిచయం ఏర్పరచు కోడంలో తప్పులేదనిపించింది.

ఈ అభిప్రాయానికి వచ్చిన కొద్దిరోజుల్లోనే ఒకసారి అతడి కారు ముందు నుంచి నేను ఇంకో వార్డుకి వెళ్ళడం జరిగింది. అతడు నా వైపు చూసి, "గుడీవినింగ్ డాక్టర్" అంటూ విష్ చేసి, ఆమెని పరిచయం చేసాడు. "మిస్ మంజులత.. నా మరదలు" అంటూ.

"అంటే సౌదామిని..?"

"చెల్లెలు" అన్నాడు అతడు నా మాట పూర్తిచేస్తూ.

ఏదో వింతైన సమాచారం విన్నట్లు ఆమె వంక అలా చూస్తూ నిలచిపోయాను నేను. ఆశ్చర్యం నా ముఖంలో ప్రశ్నార్థకంగా నిలచి ఉండడం అతడు గ్రహించి ఉంటాడు.

"మంజుకి రోగులన్నా, రోగాలన్నా ఎంతో భయం. అందుకే బైట ఉండిపోతుంది" అన్నాడు.

"ఇది నిజమా?" అనుకున్నాను.

అది నిజమే! ఆమె సౌదామిని చెల్లెలే. అటు తరువాత, ఒకటి రెండుసార్లు లోపలికి వచ్చి అక్కని చూసి వెళ్ళింది. సౌదామినికి చెల్లిలంటే చాలా అభిమానం ఉన్నట్టే అనిపించింది. ఆ పిల్ల వారింటనే ఉండి చదువుకుంటున్నదిట.

ఒకొక్కసారి మమతాను బంధలు ఏ ప్రాతిపదికమీద నెలకొంటాయో, వాటికి మూలం ఏమిటో చెప్పడం కష్టం.

సౌదామిని గురించి నేను పడే ఆరాటానికి నర్సింగ్ హోంలో మిగిలిన డాక్టర్లంతా ఆశ్చర్యపోయేవారు. ముక్కుకి సూటిగా పనిచేసుకుపోతూ మిగిలిన విషయాలేమీ అంతగా పట్టించుకునే అలవాటు లేని నేను ఆ పిల్ల పట్ల చూపించే ఆసక్తికి అర్థం చెప్పుకోలేకపోయేవారు. "పోనీ ఈ వయసులో ప్రేమ జనించిందేమో అనుకునేందుకు మగవాడైనా కాకపోయె.." అంటూ చనువు ఉన్నవాళ్ళు పరిహాసం చేసేవారు.

ఆనాడు ఉదయం చీఫ్ సర్జన్ జగన్నాథ్ పెదవి విరుపులో నేను గుర్తించిన నిరాశ, నర్సు అందించిన ఛార్టులోని ఎగుడు దిగుడు గీతలు నన్నెంతో కలత పెట్టాయి.

"డాక్టర్ అంతేనా?" అన్నాను, నెమ్మదిగా బైటికి వచ్చాక.

"మీరూ కేసుని చూసారు - ఏం చెప్పమన్నారు?" అన్నాడు.

"డాక్టర్ అలా జరగడానికి వీల్లేదు" నాకు తెలియకుండానే నా నోటిలోంచి బాధగా మాట బయటికి వచ్చింది.

ఉండేలు దెబ్బతిన్న పక్షి ఆర్తనాదంలా ఉంది ఆ మాట. అతడు క్షణకాలం నా వంక జాలిగా చూసాడు. ఇటువంటి మమతలు పెంచుకోకూడదు. మన చేతుల్లో ఉన్నదంతా మనం చేస్తున్నాము - అన్నట్లు ఉంది అతడి చూపు.

"అలా జరగకుండా ఉండాలనే కోరుకుంటున్నాను" అన్నాడు నెమ్మదిగా.

నా కన్నీరు అతని కంట పడకుండా ముఖం తిప్పుకున్నాను. నా పరిస్థితి గ్రహించి అతడు మౌనంగా వెళ్ళిపోయాడు.

ఏమిటీ సంబంధం? ఎందుకీ అనుబంధం? నర్సింగ్ హోమ్‌కి వచ్చిన కేసులన్నీ బాగవుతున్నాయా? పసిపాపలు, బిడ్డల తల్లులు, వయసులో ఉన్నవాళ్ళు, ముసలివాళ్ళు.. ఎందరో వస్తుంటారు. కొందరు తిరిగి వెళ్తారు. కొందరు ఇక్కడే కన్ను మూస్తారు. చేయగలిగింది అంతా చేసాము అన్న తృప్తితో వారి చావులు మమ్మల్ని అంతగా బాధించవు. ట్రీట్ మెంటు సరిగా జరక్క ఏదైనా కేసు నష్టపోతే మనసుకి బాధ కలుగుతుంది.

కానీ, సౌదామిని విషయంలో ఆది నుండీ అణుమాత్రం లోపం కూడా జరుగలేదు. అయినా మనసులో బాధ తప్పలేదు.

ఆలోచనల మధ్య తలుపు తట్టి లోపలికి వెళ్ళాలి అన్న ధ్యాస లేకుండా హేండిల్ తిప్పి తలుపు తెరిచాను. ఆ రోజు అతడు రోజుకన్నా ముందుగా వచ్చాడు. ఉదయం జగన్నాథ్ ఆ మాట చెప్పినప్పుడు అతడు ప్రక్కనే ఉన్నాడు. ఆమెతో తను గడపగలిగే కాలం ఇంక కొద్ది గంటలే అని గ్రహించి ఉంటాడు.

అతని ఒడిలో ఆమె తల ఉంది. ఆమె ముంగురులను ఆప్యాయంగా సవరిస్తూ అతడు మాట్లాడుతున్నాడు. కొద్ది గంటలలో ఎదురుపడబోయే మృత్యువు గురించి కాదు. తమకి శాశ్వత వియోగం కలిగించే బాధాకరమైన క్షణాల గురించి కాదు.

అందమైన జీవితం గురించి, ప్రపంచం అంతా పరచుకుని ఉన్న సుందర ప్రకృతి గురించి; తామిద్దరమూ మిగిలిన జీవితంలో జంటగా చూడబోయే అందాల గురించి, ఆ బ్రతుకులో తీపి.. ఆ తీపిలోని ఆనందం.

అతని ఒడిలో ఆమె అరమూసిన కన్నులతో, ఆనందాన్నంతా నింపుకున్న మనసుతో, శాంతంగా వింటున్నది. ఏనాడూ లేని తేజస్సు ఆమె ముఖం మీద ప్రకాశిస్తున్నది.

ఈ ఆఖరి దశలో జీవితం పట్ల ఇతడు ఎందుకింత మమకారాన్ని ఆమెకి రంగరించి పోస్తున్నాడు. అనుకున్నాను. కానీ ఒక విధంగా అతని కోమల హృదయాన్ని మెచ్చుకోకుండా ఉండలేకపోయాను. వేదనామయమైన మరణ సమయంలో కూడా ఆమె ఆనందంగా, శాంతిగా ఆఖరి శ్వాస తియ్యాలని కోరుకుంటున్న అతని అనురాగాన్ని అభినందించాను.

నా అడుగుల సవ్వడి విని అతడు మెల్లగా లేచాడు. తన ఒడిలో ఉన్న ఆమె తలని అతి సున్నితంగా తలగడపై ఉంచాడు. ఆ సమయంలో కాస్త ముందుకి వంగి మెల్లగా ఆమె నుదుటిపై ముద్దు పెట్టుకున్నట్లు అనిపించింది నాకు. అతడి కంటి నుండి ఒకే ఒక కన్నీటి బిందువు రాలి ఆమె పెదవులపై పడింది.

ఆమె దెబ్బతిన్న లేడిపిల్లలా కళ్ళు విప్పి బెదురుతూ చూసింది. అతడు అప్పుడే విచ్చుకుంటున్న కలువ పువ్వులా అందంగా ఆమె కళ్ళలోకి చూసి నవ్వాడు. ఆమె తృప్తిగా ఆ కన్నీటి రుచి చూసింది.

"ఇంటికి వెళ్ళే ముందు ఒకసారి చూసి పోవాలని వచ్చాను. అంతకన్న ఏం లేదు" అన్నాను.

ఎండిన పుల్లలా ఉన్న తన చేతిని దుప్పటి క్రింద నుంచి అతి ప్రయత్నం మీద తీసి నా చేతిని అందుకుంది ఆమె.

నేనంటే మీకెంత అభిమానం డాక్టర్. ఈ అనుబంధం ఎన్ని జన్మలదో - అన్నట్లుంది ఆమె చూపు.

మూడు సంవత్సరాలుగా అలవాటు పడిన ఆ కళ్ళు, బ్రతుకులో ఆత్మీయత అంటే ఏమిటో రుచి చూపించిన ఆ కళ్ళు మళ్ళా చూసే అవకాశం ఉంటుందో, లేదో అన్నట్లు క్షణకాలం అలాగే చూస్తూ ఉండిపోయాను.

నర్సుతో తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పాను. ఆ రాత్రి డ్యూటీలో ఉండే డాక్టరుతో ఏదో చెప్పబోతుంటే నా పెదవులు తడబడ్డాయి.

"మీరేం కంగారు పడకండి డాక్టర్. అంతా నే చూసుకుంటాను. పరిస్థితి ఏపాటి విషమించినా మీకు కబురు చేస్తాను. ఈ పేషెంటు ప్రత్యేకత నాకు తెలుసు" అన్నాడు అతడు ధైర్యం చెపుతూ.

ఏ క్షణాన్నయినా ఫోను మ్రోగవచ్చు అన్నట్లే రాత్రంతా కంటి మీద నిద్రలేకుండా గడిపేసాను. తెల్లవారి ఏడు కాకుండానే డ్రస్సు వేసుకుని బయలుదేరాను. గది బయట వరండాలో రాత్రి డ్యూటీలో ఉన్న డాక్టరు కనిపించాడు.

"కంగ్రాచ్యులేషన్స్ డాక్టర్" అన్నాడు నా చేతిని అందుకుంటూ.

"ఏమయింది? దేనికి?" అర్ధంకాక అడిగాను.

"వెళ్ళి మీరే చూడండి" అంటూ తలుపు తీసి పట్టుకున్నాడు.

మంచంలో తడిసిన గడ్డిపువ్వులా ఉంది సౌదామిని. ఆ పువ్వుకి అందము, సౌరభము కొరతపడి ఉండవచ్చు. కానీ జీవం మాత్రం అణువణువునా నిండుకుని ఉంది. దానికి నిదర్శనంగా ఒక్కొక్క రేకని విప్పుకుంటున్నది.

ఇటువంటి వింతలు చాలా అరుదుగా జరుగుతాయి. జరిగిన సమయంలో అక్కడ ఉండి చూసినవారు తమ కళ్ళని తామే నమ్మలేని స్థితిలో క్షణకాలం ఉండిపోతారు. కాలం గడిచాక ఇంకెవరి నోటనో వింటే నమ్మబుద్ది కాదు.

సౌదామిని విషయంలో అటువంటి విచిత్రమే జరిగింది. అమాయకంగా, ప్రశాంతంగా నిద్రిస్తున్న ఆ పిల్ల నోటిలో ఏ దేవతో దయతలచి ఒక అమృతపు చుక్క రాల్చి ఉండవచ్చు. ముందు రోజు సాయంకాలం భర్త ఆమె కళ్ళ ముందు నిల్పిన అందమైన జీవితంలోని ఏ కాంతి రేఖో ఆమెని దారి తప్పించి ఉండవచ్చు.

డాక్టర్లకి మతిపోయేలా, వైద్యశాస్త్రం ఆ వింత చూసి ఆశ్చర్యంతో తల మునకలు అయేలా, విపరీతమైన వేగంతో రోజురోజుకి కోలుకుంది సౌదామిని. మూడు నెలలు గడిచేసరికి ఇంక ఆమెని నర్సింగ్ హోంలో పెట్టి ఉంచవలసిన అవసరం లేదని డాక్టర్లంతా తీర్మానించారు. "మీరు నాకు ప్రాణం పోసారు డాక్టర్. మీ ఋణం ఎలా తీర్చుకోను" అంది ఆమె కృతజ్ఞత నిండిన కళ్ళతో.

"తిరిగి అందుకున్న ఈ జీవితంలో నువ్వు సుఖంగా, ఆనందంగా ఉండాలి. అంతకు మించి నాకేం కోరికా లేదు. నువ్వు ఇయ్యగలిగిన కానుకా లేదు" అన్నాను ఆమె చెక్కిలిని ఆప్యాయంగా నిమురుతూ.

ఆమె వెళ్ళిపోయాక, ఆడపిల్ల అత్తవారింటికి వెళ్ళిపోతే చిన్నబోయిన ఇల్లులా కనిపించింది నర్సింగ్ హోం. సౌదమిని జ్ఞాపకాలనుంచి తప్పుకోవాలని నాలుగు రోజులు సెలవు పెట్టాను. ఇంటిలో ఒంటరిగా కూర్చుని నాకు ఎల్లవేళలా శాంతి భిక్ష పెట్టే పుస్తకాలతో గడపసాగాను. మూడోనాటికి ఉదయం హాలులో పేపరు చూస్తుంటే పంకజం పరుగుతో వచ్చింది.

"డాక్టర్.. డాక్టర్.. ఆమె తిరిగి వచ్చింది. మీరు వెంటనే రావాలి" అంది.

"ఎవరు పంకజం? ... ఎవరు వచ్చారు?" అన్నాను చేతిలో పేపర్ని మడచి పక్కన పెడుతూ.

"ఆమే డాక్టర్.. సౌదమిని."

"ఎవరు? సౌదామిని... ఎందుకొచ్చింది?"

"జబ్బు తిరగబెట్టింది. ప్రమాద స్థితిలో ఉంది."

బట్టలైనా మార్చుకోకుండా అలాగే బయలుదేరాను. పంకజం చెప్పిన వార్త సరి అయినదే. ఆమె స్థితి ఏమీ బాలేదు. ఎందుకలా అయిందో, అంతలో అంత మార్పు ఎలా వచ్చిందో ఎవరికీ అంతుబట్టలేదు. ఆమె నా మాట వినిపించుకోలేదు.

"డాక్టర్ చావు బ్రతుకులకి అర్థం ఏమిటి? వాటిమధ్య దూరమెంత?" అని ప్రశ్నించింది.

నేనేదో మాట్లాడబోయేంతలో నన్ను వారిస్తూ తనే తిరిగి అందుకుంది - "ఒద్దులెండి డాక్టర్. చెప్పబోకండి. మీరేదో హార్ట్ బీట్, పల్స్ రేట్ అంటూ మొదలు పెడతారు. మీరెవర్నీ ప్రేమించలేదన్నారు. మీకు తెలియదు ఆ పదాలకు అర్థం, వాటి మధ్య దూరం" అంది సౌదామిని మెల్లిగా కళ్ళు మూస్తూ.

అందమైన ఆ కళ్ళు మళ్ళా విడలేదు. ఆమె అడిగిన ప్రశ్నకి ఆనాడు అర్థం తెలియలేదు.

అతడు మంజులతని వివాహం చేసుకున్నాడు అన్న వార్త విని నేను ఆశ్చర్యపోలేదు, కానీ భార్య పట్ల అంత ప్రేమ కనపరచే వ్యక్తి ఆమె మరణించి నెల తిరగకుండానే తిరిగి వివాహం చేసుకోవడం నా కెందుకో వెగటుగా అనిపించింది. ప్రేమ.. ప్రేమ అని మనం ఘనంగా చెప్పుకునే రెండక్షరాల వెనుక దాగి ఉన్న పరమార్థం ఇంతేనా - అనుకున్నాను. బ్రతికి ఉన్న మనుష్యులు మరణించిన ఆప్తుల్ని ఇంత శీఘ్రంగా మరచిపోగలరా అని ఆశ్చర్యపడ్డాను.

ఆరు నెలలు గడిచిపోయాయి సౌదామిని జ్ఞాపకాలను ప్రయత్న పూర్వకంగా మనసులోంచి నెట్టివేస్తున్న తరుణంలో అతడు తిరిగి వచ్చాడు. మొదటిసారి సౌదామినిని నర్సింగ్ హోమ్‌కి తీసుకువచ్చినప్పటిలాగే అందంగా, హుందాగా ఉన్నాడు. ఆమె చావు అతనిలో ఏ విధమైన మార్పు తెచ్చినట్లు అనిపించలేదు.

ఈసారి అతనితో సౌదామినిలేదు, మంజులత ఉంది. అంతవరకే నాకు అతని రాకలో మార్పు కనిపించింది.

"మీ మీద నమ్మకంతో మీ దగ్గరకి తీసుకువచ్చాను" అన్నాడు.

డెలవరీ కేసు. అతి ప్రయాస మీద కానుపు అయింది. తల్లిని పిల్లడిని కాపాడగలిగేనన్న సంతృప్తితో బయటికి వచ్చాను.

"ఏడవ మాసం కూడా రాలేదు. ఏమవుతుందో అని కంగారు పడుతున్నాము అంది మంజులత కేసు వ్రాసుకుంటున్నప్పుడు. కానీ, పుట్టిన పిల్లడు నవమాసాలు తల్లి గర్భంలో పెరిగిన శిశువులా ఆరోగ్యంగా ఉన్నాడు. మీ లెక్కలు సరికావు" అని. ఎందువల్లనో నా మాట అతడిలో తడబాటు కలుగజేసింది. అడుగులు తొట్రుపడ్డాయి. నా నుంచి ఇంకేమీ వినదల్చుకోనట్లు నన్ను తప్పించుకుని గదిలోకి వెళ్ళిపోయాడు.

అతని తడబాటులో ఏదో చిత్రం. అతని కదలికలో ఏదో కథనం నా మనసులో మెదిలాయి. సౌదామిని అడిగిన ప్రశ్నకి సమాధానం దొరికినట్లనిపించింది. ఆరోగ్యంగా ఇంటికి వెళ్ళిన ఆమె అంతలో అటువంటి స్థితిలో తిరిగి రావడంలో ఉన్న అర్థం బోధపడినట్లయింది.

నిండు మనసుతో జీవితాన్ని కాంక్షిస్తే, జీవించాలని కోరుకుంటే అది బ్రతుకు, లేకపోతే ఆ బ్రతుకు చావుకి సమానం. వాటి మధ్య దూరం అతి స్వల్పం.

తన బ్రతుకు సాటి ఆడదాని జీవితానికి అన్యాయం చేస్తున్నదని సౌదామిని గ్రహించింది. భర్త ప్రాణం పోసిన జీవితంలోని ఎగుడు, దిగుడులను గుర్తించింది. బ్రతికి చచ్చేకంటే, చచ్చి బతకడమే మంచిదనుకుంది. ఆమె తన చావులోనే బ్రతుకును చూసింది. చావు, బ్రతుకుల మధ్య దూరాన్ని అధిగమించింది.

"డాక్టర్ మిసెస్ రావుకి తెలివి వచ్చింది. మిమ్మల్ని చూడాలంటున్నది" అంటూ నర్స్ వచ్చింది. ఆమె వెనకనే గదిలోకి వెళ్ళాను.

బాలింతరాలి ప్రక్కనున్న తొట్టిలోని పాపని అతడు ఉత్సాహంగా చూస్తున్నాడు. 'అంతా మీ పోలికే. ఆ సూది గడ్డం, చిన్న ముక్కు..' భర్త వంక అనురాగంగా చూస్తూ అంటున్నది మంజులత.

# అతని కోరిక — బాలగంగాధర తిలక్

'జ్యోతి' మాసపత్రిక *రజతోత్సవ ప్రత్యేక సంచిక (1988)* నుంచి పునర్ముద్రితం

**లక్ష్మీ మోహనరావు** నిద్రనుంచి లేచాడు. లేచి భార్యకేసి చూశాడు. ఆమె ఇంకా నిద్రపోతోంది. ఆమెను లేపడం ఇష్టం లేదతనికి. ఆమెతో పాటు ఎన్నో బాధలూ గాధలూ మేల్కొంటాయని అతనికి తెలుసును. అసలు నిద్రకన్న సుఖకరమైన స్థితి మరొహటి ఏమీ అతనికి ప్రపంచంలో కనపడలేదు. అర్ధాంగి అయిన ఆమెను ఆ సుఖాన్నుంచి దూరం ఎందుకు చెయ్యాలనుకున్నాడు. అతనికి నిద్ర అన్నా, నోవకేన్ ఇంజక్షన్ అన్నా చాలా ఇష్టం. ఇదివరకెప్పుడో తేలుకుట్టి అతనికి కాలంతా మంటలూ పోట్లూ ఎత్తినప్పుడు డాక్టరు ఆ ఇంజక్షను ఇచ్చాడు. దాంతో పాదం తిమ్మిరెక్కిపోయింది. బాధ తెలియలేదు.

నిద్రకూడా అతనికి అలాగే ఉంటుంది. బాధల్నీ ఆ రుచికరమైన సంగతుల్నీ నొక్కి వేసి ఉంచుతుంది. అందరికిలాగా అతనికి నిద్ర గాఢ నిద్రకాదు, సుఖనిద్రా కాదు. ఒహరకం తిమ్మిరి లాంటిది. నిద్రలేవగానే అతనికి మనస్సు సలుపుతున్నట్టు ఉంటుంది.

దొడ్లోకి వచ్చి వేపపుల్ల విరిచి పళ్ళుతోముకున్నాడు. ఆ సమయంలోనే అతనికి జరిగిపోయిన రోజున జరిగిన ముఖ్య సంఘటన జ్ఞాపకం వచ్చింది. నాలుగేళ్ళ కొడుకు చనిపోవడమూ, తాను మోసుకుని స్మశానానికి తీసుకుపోవడమూ, తన భార్య గుండెలు బాదుకుని ఏడ్వడమూ - ఇదంతా నిన్ననే జరిగిందా, ఇదివరలో ఎప్పుడయినా జరిగిందా అన్న అనుమానమూ వచ్చింది అతనికి. అతనికి జ్ఞాపకం లేక కాదు. అతనికేదేనా కష్టం వచ్చినప్పుడు అతనికి మనస్సంతా చిత్రంగా మొద్దుబారిపోతుంది. కాలం అనే డైమన్షన్ ఎక్కడికో తప్పుకుంటుంది. ఏమైనా అతనికి అంతగా ఏడుపు రాలేదు. అంతగా బాధ అనిపించలేదు. అంతే. ఇదీ తిమ్మిరే అనుకున్నాడు.

పళ్ళు తోముకుంటుంటే ఇలాగ ఆలోచనలు మంచు పొగలాగ ఎందుకు ముసురుతాయో అతనికి తెలీదు. వాళ్ళమ్మ చిన్నతనంలో 'దరిద్రుడా' అని తిట్టేది. మరి తనకి లక్ష్మీ మోహనరావు అని ఎందుకు పేరు పెట్టింది? అతనికి అమ్మమీద కోపం వచ్చింది. తనకి ఆ పేరు పెట్టినందుకు కాదు; తనకి లక్ష్మి అనే పేరుగల భార్యను వెతికి తెచ్చి మెడకు కట్టినందుకు. అతను నవ్వుకున్నాడు. అతనికి ఎవరేమన్నా కోపం రాదుకానీ, 'దరిద్రుడా' అంటే కోపం వచ్చేది. తల్లిని అలా పిలవద్దని కసురుకునేవాడు. దరిద్రం యాచనలో ఉంది. సోమరితనంలో ఉంది. కష్టపడేవాడికీ, అభిమానం ఉన్నవాడికీ దరిద్రం ఉండదు. ఎవరూ కూడా ఉందని వేలెత్తి చూపించలేరు. అందుకే అతను దొరికిన ఉద్యోగమల్లా చేసేవాడు. అతనికెప్పుడూ టెంపరరీ ఉద్యోగాలే దొరికేవి. బియ్యం కొట్లో గుమాస్తాగా పనిచేశాడు. ఎలక్ట్రిసిటీ ఆఫీసులో పనిచేశాడు. లాటరీ టిక్కెట్లు అమ్మేవారితో కూర్చుని మైక్ ముందు గొంతు పెట్టి 'రూపాయికి లక్ష రూపాయలు' అని కేకవేశాడు. సినిమాలో గేటు దగ్గర నిలబడ్డాడు. కిరాణా కొట్లవాళ్ళకి పద్దులు రాసిపెట్టేవాడు. ఎప్పుడూ అతని జీతం ముఖ్యావసరాలకి సగం సరిపోయేది.

పై సగం అవసరాలు ఎండిపోయి అతని భార్యకి జబ్బు రూపంలో, తనకి భయం రూపంలో, కొడుక్కి ఆకలి రూపంలో దాగి ఉండేది.

చచ్చిపోయిన కొడుక్కి ఆకలెక్కువ. వాడస్తమానం తిండి కావాలని మారాం చేసేవాడు. వాడికి కడుపునిండా అన్నం పెట్టినా ఇంకా ఇవీ అవీ కావాలనేవాడు. తోచకపోతే మట్టి తినేసేవాడు. ఒక వైద్యుడికి చూపిస్తే లివర్ పెరిగిందన్నాడు. అందుకే పొట్ట అలా ఎత్తుగా వచ్చిందన్నాడు, పొట్ట మీద నీలం రంగు నరాలు పైకి ఉబ్బి భూగోళం మ్యాపు మీద నదుల గీతల్లా ఉండేవి. వాడికి సరిగా మందివ్వక - మందిప్పించలేక చంపేశాడన్నారు లక్ష్మీ మోహనరావుని కొందరు. కానీ అది అబద్ధం. ఎలాగో అలాగ డబ్బు తెచ్చి మందులిప్పించాడు. కొట్టు వాడిని బతిమాలి కొన్ని మందులు అరువు తెచ్చాడు. ఆ జబ్బుకి ఇవి అరువు మందులని తెలిసిపోయి లోకువ చేసి కాస్తయిన తగ్గలేదని అతని అనుమానం.

వాడు బతికి ఉంటే వాళ్ళ మేనమామ అల్లుడు పినతండ్రిలాగా తాసీల్దారయి ఉండే వాడు అని భార్యకీ కూడా గౌరవం, గర్వంగా చెప్పుకోదగిన బంధువు ఈ తాసిల్దారు ఒకడే ఆ తాసీల్దారుని వీళ్ళెప్పుడూ చూడలేదు. ఆయన వీళ్ళనెప్పుడూ చూడలేదు. ఆయన వీళ్ళనెప్పుడూ ఏకార్యానికీ పిలవనూ లేదు. కానీ ఆ తాసిల్దారు మాత్రం ఈ భూమి మీద ఎక్కడో ఉండడం ఖాయం. లక్ష్మి కుళాయి దగ్గర ఏవో మాటల్లో "మా బంధువొకాయన తాసిల్దారు. ఆయనకీ ఊరు బదిలీ అయితే బాగుండును. ఈ కుళాయి నీళ్ళు ప్రత్యేకంగా నేను పట్టుకునేందుకు ఏర్పాటు చేసి ఉండును. వేగలేక చస్తున్నాం ఈ అలగాజనంతో -" అంటుండేది.

అలగాజనంలో తానూ ఒకర్తెనని లక్ష్మికి తెలియలేదు. అయితే లక్ష్మి నమ్మకాలూ ఆశలూ పెట్టుకున్న మనిషి. తన భర్తకి ఏ నాలుగువందల ఉద్యోగమో, ఏ లాటరీ ఫస్టుప్రైజో ఎదో ఒకటి అనతి దూరంలో రెడీగా ఉందని అనుకుంటుంది. ఒకమేడ, ఒక మంచికారు, రాళ్ళ నెక్లెసూ ఆవిడ కనీసపు కోర్కెలు. కానీ లక్ష్మీమోహన రావుకి ఏనాడూ పెద్ద ఆశలు లేవు. అతనికి చిన్న చిన్న సరదాలు ఉండేవి. చిన్నతనంలో అతను పెద్దవాణ్ణయిపోవాలనుకునేవాడు. చిత్రం ఏమంటే నిజంగా కొన్నేళ్ళకి పెద్దవాడయిపోయాడు. నిజానికి అతనికి తీరిన కోరిక ఇది ఒక్కటే. చిన్నప్పుడు కసరత్తు చేసి 'గామా'లా తయారవాలనుకునేవాడు. దానికి బాదం పప్పు, కోడిగుడ్డు మొదలైన పుష్టికరమైన ఆహారం తినాలనేవారు. బాదంపప్పు సమృద్ధిగా సంపాదించుకోగలిగిననాడు కసరత్ ప్రారంభించేయాలనుకోవడం వలన ఈనాటికీ ఆ కోరిక నెరవేరలేదు. సర్కస్ అంటే అతనికి ఇష్టం. నల్లకోటు వేసుకుని పొడుగాటి కమ్చీని చప్పుడు చేస్తూ గుర్రాల్ని గుండ్రంగా పరుగెత్తించే వాడంటే అతనికి భయం, గౌరవం, అభిమానము కూడా. అంత వాడవాలని ఉండేది. తన ఇంటి పెరట్లోకి వచ్చే పోయే రెండు మూడు చచ్చు కుక్కలకి మెడకి నవారు పట్టీ కట్టి వెదురు పుల్లలు ఎత్తుగా అడ్డం పెట్టి వాటిని దుమకమనేవాడు. అవి మొరిగేవి, మూల్గేవి. కరవబోయేవి. వాటిని తన చాంతాడు కమ్చీతో చావకొట్టేవాడు. అవి వెల్లకితలా పడుకుని భోరుమని ఏడ్చేవి. ఇలాగ అతనికి చిన్న చిన్న సరదాలుండేవి. ఆ రోజుల్లో అతను లేనివాడని ఎవరూ అనుకునేవారు కారు. అతనికి కూడా అనిపించేది కాదు. అతని తండ్రి చేసేది గుమాస్తా ఉద్యోగమైనా తెలివిగా, సులువుగా లంచాలు పట్టగలిగిన వాడవ్వడం వల్ల ఇంట్లో ఏ ఇబ్బందీ ఉండేది కాదు. లక్ష్మీ మోహనరావుకి చిరుతిండికీ, సినిమాలకీ లోటు ఉండేది కాదు.

అన్నింటికన్నా అతనికో సరదా ఉన్నట్టుగానే ఉండిపోయింది. అతను పదోక్లాసు చదువుతున్నప్పుడు శ్రీరామనవమి ఉత్సవాలకి పందిట్లోకి వెళ్ళాడు. అక్కడ మంచి మజాగా మేజువాణీ జరుగుతోంది. పళ్ళెత్తుగా ఉన్నదెవత్తో మేళం కడుతోంది. 'ఛా' అనుకున్నాడు లక్ష్మీ మోహనరావు ఆమెను చూసి, కానీ ఇంతలో రసజ్ఞుడైన ఒక కారా కిళ్ళీ ఫ్లస్ కండువా ఆసామి ఫిడేలు వాయించేవాడిని పిలిచి చెవిలో ఏదో చెప్పాడు. పళ్ళెత్తు ఆవిడ గజ్జెలు విప్పి ఇంకో సన్నగా నాజూకుగా ఉన్న ఎర్రని పిల్లకిచ్చింది. ఆ పిల్ల కళ్ళు బాగున్నాయి. బెంగగా ఉన్నాయి. చిన్నగా, జాలిగా నవ్వి ముందుకు వచ్చి 'తూరుపు తెల్లవారె' అని అభినయం ప్రారంభించింది. లక్ష్మీమోహనరావుకి సరదా వేసింది. ఆ కళ్ళనీ, బుగ్గల్నీ ముద్దెట్టుకోవాలనుకున్నాడు.

తర్వాత పెద్దవాడయిన కొలదీ భోగం వాళ్ళంటే ఏమిటో, ఎందుకో తెలిసిపోయింది. రాజమండ్రి మెరక వీధిలో వీళ్ళు ఉంటారని తెలిసింది. వాళ్ళొక మేలిరకం 'హాయిని' ఇస్తారని బతికున్నవాడెవడైనా ఒకసారి ఆ హాయిని పొంది తీరాలని విజ్ఞులైన మిత్రులు కొందరతనికి చెప్పారు. కానీ వాళ్ళు ఒక ఇబ్బందైన మాట కూడా చెప్పారు. వాళ్ళకి డబ్బూ, నగలూ మొదలైనవి ఇస్తేనే రానిస్తారనీ, లేందే గడప తొక్కనివ్వరనీ చెప్పారు.

ఈ షరతు మాత్రం అతనికేమీ బాగాలేదు. ఈ సరదా క్రమ క్రమంగా అతనిలో అడుగున పడిపోయింది. సంఘానికి వీళ్ళు చీడ పురుగులనీ, తప్పనీ, అవినీతి అనీ అందరూ అనడంవల్ల కొంత అతనూ నమ్మాడు. స్వంత ఊళ్ళో మేజువాణీ చూడడానికి సిగ్గువేసినా పొరుగూళ్ళకి వెళ్ళినప్పుడు బెదురుగా, మోతాదుగా చూసి సంతృప్తి పడేవాడు. మొహం కడుక్కొని ఇంట్లోకి వచ్చాడు. అతనికేదో జైల్లో ఉన్నట్టనిపించింది. అసలీ మధ్య అతనికి ఇంట్లో పట్టుమని పది నిమిషాలు ఉండడమే కష్టంగా ఉంది. కొడుకు బతికున్నప్పుడు , అతనికి కొడుకు బతికున్నట్టే అనిపించేది కాదు. కానీ ఇప్పుడు కొడుకు లేడని ప్రతీవస్తువూ సాక్ష్యం ఇస్తున్నట్టు ఉంది. తన భార్య నిద్రలేవకుండానే అతనికి వెళ్ళిపోవాలనిపించింది. పుత్రశోకంతో ఉన్న ఆమెని ఓదార్చడం చాలా కష్టమైన పని అనిపించింది. పక్కింటావిడ నిన్నవచ్చి కష్టంలో ఆదుకుంది. మళ్ళీ ఈ రోజు ఉదయమే తన భార్యనావిడకి వదిలెయ్యడం మంచిదనుకున్నాడు. వీధితలుపు చప్పుడు కాకుండా తెరచి గుమ్మం దాటబోతుంటే అతనికి క్రితం రోజున లక్ష్మి మెళ్ళో మంగళ సూత్రాలు తీసి పిల్లాడికి మందులూ, బియ్యమూ తీసుకురమ్మని చెప్పడం జ్ఞాపకం వచ్చింది. వెనక్కి వచ్చి అల్మారులో మూలగా కాగితం పొట్లంలో కట్టిన మంగళ సూత్రాలు తీసి జేబులో వేసుకున్నాడు. నిన్న వీటి అవసరం లేకుండానే కుర్రవాడికి ప్రాణం మీదికి రావడంతో తాకట్టు పెట్టవలసిన అవసరం లేకపోయింది. ఈ రోజున డబ్బు తెచ్చుకోవల్సిన అవసరం ఉంది. లక్ష్మి చాపమీద సగం, నేలమీద సగం పడుకుని నిద్రపోతోంది. ఆమె నిప్పు సెగకి ఎండి ముడతపడిన పాతకాగితంలా ఉంది. ఒక్కసారి ఆమెను చూసి గబగబా వీధిలోకి వెళ్ళిపోయాడు.

లక్ష్మీ మోహనరావు వీధిలోకి వచ్చి నడవడం మొదలుపెట్టాడు. అతనికొక గమ్యం లేదు. ఇంటికి తిరిగి వెళ్ళకుండా చీకటి పడేవరకూ పొద్దుపుచ్చడమే అతని ప్రస్తుతాశయం. ఎప్పుడో ఒకప్పుడు మంగళసూత్రాన్ని తాకట్టు పెట్టవచ్చును. ఒక వీధినుంచి ఇంకొక వీధికీ, ఒక సందులోంచి ఇంకొక సందులోకీ కులాసాగా నడుస్తున్నాడు. నడవడంలో, ఇటూ అటూ కొట్లనీ, ఇళ్ళనీ, మనుష్యులనీ చూడడంలో అతనికొక విశ్రాంతి లభించినట్టుగా ఉంది. ఒళ్ళూ మనస్సూ ఏదో తేలికపోయినట్టుగా బరువు దిగిపోయినట్టుగా ఉంది. తాను విచ్చలవిడిగా తిరగడానికి ఇంత పెద్ద ఊరు ఏర్పడి ఉండడం ఏదో దైవసంకల్పంలాగా అనిపించింది. రాజమండ్రి ప్రజలనందరినీ పిలిచి ఒక్కసారి అభినందించాలనిపించింది. ఇంతమంది జనాలలో ఎవడికీ తన కొడుకు పోయినట్టు తెలియదు. తెలుసుకోలేరు, తెలుసుకోవాల్సిన అవసరం లేదు. జన ప్రవాహంలో తానొక బిందువు మాత్రమే. నడవగా నడవగా ఆకలి వేసింది. జేబులో ఒక రూపాయికూడా ఉంది. హోటల్‌కి వెళ్ళి ఇడ్లీలు తిని కాఫీ తాగి మిఠాయి కిళ్ళీ వేసుకుని నడక ప్రారంభించాడు. ఎదురుగా ఎవడో నున్నగా క్రాఫింగ్ దువ్వుకున్న ఒక లుంగీదారు ఇతన్ని చూసి ఇకిలించినట్టు నవ్వాడు. గబుక్కున లక్ష్మీ మోహనరావుకి జ్ఞాపకం వచ్చింది తాను తల దువ్వుకోలేదనీ బట్టలు మార్చలెదనీ, పోనీలే అనుకున్నాడు. ఒక దేవాలయం దగ్గర ఎందరో తడిబట్టలతో దేవుడికి మొక్కుకుంటున్నారు. అతను కూడా చేతులెత్తి నమస్కరించాడు. ఒకావిడ చాలా ఖరీదైన పట్టుచీరా, మెడకీ చేతులకీ కొన్ని వందల తులాల బంగారమూ, విశాలమైన కళేబరంతో వెనకాల మొగుడూ పరిచారికా వెంటరాగా దేవాలయంలోకి వెళుతుంటే చూసి నవ్వుకున్నాడు. అంతడబ్బున్న ఆవిడని చూసి దేవుడు నాలుగడుగులు ముందుకు వేసి 'రండి మహాలక్ష్మమ్మగారూ దయచేయండి. మోబోటి వాళ్ళు అస్తమానూ వస్తారా' అంటాడేమో అని కాసేపు నిలబడి చూశాడు. అక్కణ్ణించి సినిమా పోస్టర్లు వరసగా చూస్తూ చదువుతూ ఇన్నీసుపేట వరకూ వెళ్ళాడు. ఒకచోట రోడ్డుకి పక్కగా ఖాళీజాగాలో ఎవడో గారడివాడు తన విద్యని ప్రదర్శిస్తున్నాడు. జనం

గుండ్రంగా మూగివున్నారు. లక్ష్మీ మోహనరావు వాళ్ళల్లోకి చొచ్చుకుపోయాడు. సర్కస్‌లాగా గారడీ అన్నా ఇష్టం. గారడీవాడు తురకాన్నీ తెలుగునీ పసందైన పాళ్ళల్లో కలిపి పంచి పెడుతున్నాడు. కోడిగుడ్డుని ఒక బుట్టతో మూసి కుక్కపిల్లని చేస్తానంటున్నాడువాడు. తనకీ గారడీవస్తే దాన్ని మేకపిల్లని చేసి గారడీవాణ్ణి ఏడిపించవచ్చుననుకున్నాడు. గారడీవాడి కూతురు డబ్బులడుగుతోంది. దాని గడ్డం మీద మచ్చ ముద్దొస్తూందనుకున్నాడు. జేబులోంచి పావలా తీసి దానికిచ్చేశాడు. పక్కవాడు అణాయే ఇచ్చాడు. వాడిని తిరస్కారంగా గర్వంగా చూశాడు.

సూర్యుడు నడినెత్తికి వచ్చాడు. ఎండ చుర్రుమంటోంది. మళ్ళీ ఆకలేసింది లక్ష్మీమోహనరావుకి. సత్రం వేపు బయల్దేరాడు. సత్రం ముందు ఎవడో బొమ్మలున్న గుడ్డ నేలమీద పరచి 'కాయ్ రాజా కాయ్' అంటున్నాడు. సర్కస్ జ్ఞాపకం వచ్చింది లక్ష్మీ మోహనరావుకి గుర్రాలంటే అతనికి ఇష్టం. గుర్రం మీద బేడ కాసేడు. పావలా వచ్చింది. మళ్ళీ రెండోసారి పావలా, బేడ కలిపి కాశాడు. పోయింది. పక్కున నవ్వాడు.

"ఏం నవ్వుతావ్?" అన్నాడు లాటరీవాడు.

"ఈ గుర్రం నిజం గుర్రం కాదు" అన్నాడు లక్ష్మీ మోహనరావు.

"ఊరుకోవయ్యా. ఇది ఫస్టు క్లాసు గుర్రం చూడు. ఈ ఏనుగుని. మైసూరు మారాజా దీన్నే ఎక్కి ఊరేగేవాడు, కాయ్ రాజా కాయ్" అన్నాడు లాటరీవాడు.

"నే కాయను" అన్నాడు లక్ష్మీమోహనరవు.

"ఏం - ఎందుకు కాయవ్? నాది నిజాయితీ అయిన లాటరీ" అన్నాడు లాటరీవాడు.

"ఎందుకో చెప్పనా" అని అడిగాడు లక్ష్మీ మోహన రావు.

"చెప్పవోయ్ చెప్పు. ఏదేనా మోసం ఉందని రుజువుచేస్తే పది రూపాయలు నీకు ఈనాం" అన్నాడు కోపంతో లాటరీవాడు.

"అయితే చెప్తాను విను. నా దగ్గర డబ్బు లేదు. నేనాడను" అని లేచిపోయాడు లక్ష్మీ మోహనరావు. అందరూ ఘొల్లుమని నవ్వారు. లాటరీవాడు పెద్ద అవమానంగా తలచి "ఖలేజా ఉంటే కాయండి. రూపాయకి రెండు రూపాయలు. ఊరికే చూస్తే అదృష్టం రాదు మొగాలకి" అన్నాడు.

లక్ష్మీ మోహనరావు సత్రంలోనికి వెళ్ళాడు. సత్రం గుమాస్తా ఇతన్ని ఎరుగును. బీడీ పొగ పైకి ఊదీ "ఏవంయ్యోయ్ కులాసానా కనపడ్డం మానివేశావ్?" అన్నాడు.

"ఏదీ బీడీ ఉంటే ఒకటియ్" అన్నాడు రావు.

"అరె నీ కలవాటు లేదుగా?"

"చేసుకున్నానులే" అంటూ బీడీ తీసుకుని అంటించాడు లక్ష్మీ మోహనరావు. అతనికి బీడీ అలవాటు లేదు. కానీ ఈవేళ అతనికి ప్రతి పనీ చేసేందుకు స్వంతంత్రం వచ్చినట్టుగా ఉంది.

"కులాసాయేనా? ఏంటి ఇలా వచ్చావ్" అన్నాడు గుమాస్తా.

"ఆఁ ఇలాగ పనిమీద వెళుతున్నాను. ఏదేనా మంచం ఉంటే పడెయ్యి. కాసేపు నడుం వాల్చిపోతాను" అన్నాడు రావు.

గుమాస్తా ఖాళీ గది ఒకటి చూపించాడు. బీడీ కాలుస్తూ ఉక్కిరి బిక్కిరవుతూ దగ్గుతూ మంచం మీద పడుకుని లక్ష్మీ మోహనరావు రకరకాల ఆలోచనల్ని తరుముతున్నాడు. అలసిపోయిన అతనికి తెలీకుండా నిద్రపట్టింది.

సాయంత్రం ఆరుదాటాక గుమాస్తా లేపేవరకూ అతనికి మెలుకువ రాలేదు. మెలుకువ వచ్చాక అతను చాలాసేపు తికమక పడ్డాడు తనక్కడ ఎందుకున్నదీ తెలియక. కొంతసేపటికి అతన్ని అతను గుర్తించడానికి వీలయింది. గుమాస్తాకి థాంక్స్ చెప్పి ఇన్నీసు పేట గోదావరి ఒడ్డుకి వెళ్ళి మొహం కడుక్కుని మెట్లమీద కూర్చున్నాడు. విశాలంగా చల్లగా పారుతూన్న గోదావరి ముందు అతను చటుక్కున ఏకాకిలా ఫీలయాడు. క్రమ్ముకుంటూన్న లేత చీకటిలోకి బద్ధకంగా చూస్తూ కూర్చున్నాడు. అతనికి చిన్ననాటి రోజులు జ్ఞాపకం వచ్చాయి. చుట్ట నములుత్తూ మాట్లాడే తండ్రీ, తులసి కోటకి రోజూ పూజ చేసే తల్లీ, పకోడీల కొట్టూ, సర్కసూ, తెలుగు మేష్టారూ, శ్రీరామ నవమి ఉత్సవాలూ.. అతనికి లోపల్లోపల దాగివున్న కోరిక ఒక్కసారి బయటపడింది. ఒక్కరాత్రి అయినా భోగం దానితో అనుభవించాలని ఉబలాటపడిపోయింది అతని మనస్సు. పుష్పలత అందంగా ఉంటుందనీ బాగా అభినయిస్తుందనీ అంటారు. ఓసారి మెరకవీధిలో వెళుతుంటే పుష్పలత మేడని చూపించారు మిత్రులు. ఈవాళ ఎలాగయినా తాకట్టు పెట్టటానికి టైమయిపోయింది రేపటి సంగతి రేపు చూచుకోవచ్చుననిపించింది. మెరక వీధిలో మేడవుంది. ఇంకేం అనుకున్నాడు లేచి బయల్దేరాడు.

విద్యుద్దీపాల కాంతిలో రాజమండ్రి సందులు చవకరకం ఆడదానిలా మెరుస్తున్నాయి. తికమకగా ఉన్న జుట్టుతో మాసిన చొక్కాతో తిన్నగా పుష్పలత మేడ గుమ్మం ముందు నిలబడ్డాడు. ఏం చెయ్యాలో, ఎలా పిలవాలో అతనికి సరిగ్గా తెలియదు. దగ్గాడు. కొంతసేపయాక మళ్ళీ దగ్గాడు. చివరకి "ఏమండీ" అని పిలిచాడు. అతనికి సిగ్గుగా భయంగా ఉంది. ఇంతలో ఓ గళ్ళచీర కట్టుకున్న యాభై ఏళ్ళ స్త్రీ వచ్చి "ఏం కావాలి?" అంది జుట్టు పల్చబడి ఆమె తల పెంకు అక్కడక్కడ కనిపిస్తూ అసహ్యంగా ఉంది.

"ఈ మేడలో పుష్పలత ఉందా?" అన్నాడు బెరుగ్గా.

"ఆc ఉంది. ఎవరేనా పంపించారా నిన్ను?"

"కాదు. నాకే కావాలి"

"నీకా?!" ఆమె విరగబడి నవ్వింది. నవ్వినప్పుడు గొగ్గిపళ్ళు కనిపిస్తున్నాయి.

"నా దగ్గర అరకాసు బంగారం ఉంది" అన్నాడు ధీమాగా.

ఆమె ఎగాదిగా చూసి, "ఆగు కనుక్కుని చెపుతాను" అని లోపలికి వెళ్ళి కొంత సేపటికి తిరిగివచ్చి "రాత్రి తొమ్మిది దాటాక రండి" అంది.

లక్ష్మీ మోహనరావు ఉత్సాహంగా బజారు వైపు నడిచి ఒక క్షౌరశాలలోకి వెళ్ళాడు. అక్కడ ఎవరూ లేరు, యజమాని తప్ప.

"ఏం సార్ క్రాఫ్ వెయ్యమంటారా?" అన్నాడు వాడు.

"కాదు కొంచెం తలకి నూనె రాసి పెట్టాలి. పౌడరు కూడా కావాలి. డబ్బులు తీసుకు రాలేదు. ఎప్పుడైనా ఇటు వచ్చినప్పుడు ఇస్తాను? " అన్నాడు లక్ష్మీ మోహనరావు ప్రాధేయ స్వరంతో. క్షౌర శాలాధిపతి ఇతన్ని నిదానించి చూసి "ఏం గిరాకీ పంతులూ? " అన్నాడు.

"ఏముంది..?"

"పిల్లేదైనా దొరికిందా?"

ఆశ్చర్యంతో లక్ష్మీ మోహనరావు "నీ కెలా తెలిసింది?" అన్నాడు.

"ఓస్.. అందరి వయినం ఇట్టే పసిగట్టగలను. అనుభవం. అంతే! అనుభవం. నిన్ను చూడగానే అనుకున్నాను. ఈడెవడో నాసిరకంరా బాబూ అని" అన్నాడు కొట్టువాడు.

ఇలా లోకువ చేసి మాట్లాడడం కష్టమనిపించింది లక్ష్మీ మోహనరావుకి. అయినా చేసేది లేదు. తల దువ్వుకుని పౌడరు రాసుకుని తొమ్మిదయేవరకు అక్కడే ఒక బల్ల మీద కూర్చున్నాడు. ఒళ్ళంతా బరువుగా ఉంది. ఒక పక్కన చెయ్యకూడని పని ఏదో చేస్తూన్నట్టు ఉంది. అంతలోనే విపరీత శక్తుల మీద తిరుగుబాటు చేస్తోన్న నాయకుడిలాగా గర్వంగా అనిపించింది. తన ఒక్క కోరిక గర్వంగా అనిపించింది. తన ఒక్క కోరిక ఎందుకు తీర్చకోకూడదు? అతనిలో తెలియని సంతోషం వ్యాపించింది.

ఇదివరకు వెళ్ళిన మెరకవీధి మేడ దగ్గరకు వెళ్ళాడు. ఇందాకటావిడ గుమ్మం దగ్గర కూర్చుని కాళ్ళకి తైలం రాసుకుంటోంది. ఇతన్ని చూ సి "ఆ మెట్లెక్కి పైకి వెళ్ళు, అక్కడుంటుంది" అంది, ఏకవచన ప్రయోగానికి ఒళ్ళు మండింది. కోపంగా చూచి మెట్లెక్కాడు, డాబామీద పిట్టగోడ నానుకుని విలాసంగా నుంచుందొక యువతి. పొడుగాటి వాల్జడ మధ్య బంగారపు చామంతి పువ్వు ఉంది. మెళ్ళో నెక్లెసూ, ఒక ఒంటి పేట గొలుసూ ఉన్నాయి. రొమ్ములు ఎత్తుగా ఉన్నాయి. పౌడరు పూసిన మొహం తెలుపూ చేతుల ఛామనఛాయ రంగు విడివిడిగా అసందర్భంగా ఉన్నాయి.

ఇతన్ని చూసి నవ్వుతూ "రాండి" అంది ఆమె, ఆమె వెనకాలే గదిలోకి వెళ్ళాడు. గది చిన్నదైనా పందిరి పట్టెమంచం, ఒక సోఫా, ఒక డ్రాయరూ ఇరుకుగా సర్ది ఉన్నాయి. పరుపులమీద మొఖమల్ పరచి ఉంది. డ్రాయరు మీద మిఠాయిలూ, అరటి పళ్ళూ, మరచెంబూ, టేబులు ఫానూ ఉన్నాయి. గోడమీద వెంకటేశ్వరుడి పటానికి ఇటూ అటూ సినీతారల బొమ్మలూ, క్యాలండర్లూ ఉన్నాయి. ఓ పక్కగా ఉన్న ఒక్క కిటికీ మూసేసి ఉంది. గదిలోకి వెళ్ళగనే లక్ష్మీ మోహనరావుకి నిలవవున్న గాలి వాసనా, ఒకరకం ముదురు సెంటు వాసనా కలిసి గమ్మత్తుగా ఉంది.

ట్యూబ్ లైటు కాంతిలో ఆమెను తదేకంగా చూస్తూ నిలబడ్డాడు. ఆమె నవ్వి "అలా చూస్తున్నారేం, బావులేనా?" అంటూ దగ్గరకు వచ్చి చెంపల్ని తాకి సోఫాలో కూర్చోపెట్టింది. అతనికి ఒళ్ళు పులకరించింది. ఆమె అంత అందంగా కనబడలేదు. అయినా ఆమె చొరవలో, చనువులో ఉద్రేకపరిచే గుణం ఉంది.

తనని పరీక్షగా చూస్తోందని తెలుసుకుని "మీ పేరు పుష్పలతేనా?" అని అడిగాడు.

కిలకిల నవ్వి ఆమె అతని పక్కగా కూర్చుని "ఇలాంటి చోటుకి రావటం మీకు కొత్తా?" అంది.

"ఏం?"

"నన్ను 'మీరు' అని గౌరవిస్తున్నారేం?"

"మిమ్మల్ని గౌరవించకూడదా?"

"ఊహూఁ -" అని కళ్ళు కుంచించి అతని మీదికికొంచెం ఒరిగి "మీది ఈ ఊరు కాదా?" అని అడిగింది.

"కాదు!" అబద్ధమాడాడు లక్ష్మీ మోహనశావు.

"మరి ఏ ఊరు?"

"అమలాపురం"

"ఏం చేస్తోంటారు?"

"వ్యవసాయం - అక్కడ నాకు భూములున్నాయి"ధైర్యంగా అనేశాడు.

ఆమె తీవ్రంగా చూచి మళ్ళీ నవ్వుతూ "ఈనాందార్లన్నమాట. ఏమాత్రం కమతం ఉందీ?" అంది.

"యాభై ఎకరాలు" తనని లోకువ కట్టేస్తుందేమోనని నిచ్చెన మెట్లెక్కి పోతున్నాడు లక్ష్మీ మోహనరావు.

"మరి ఈ మాసిన బట్టలూ వేషమూ ఇలాగే వస్తారా మా దగ్గరికి? అయ్యో రామ" అని చెంగు నోటికి అడ్డం పెట్టుకుని నవ్వుతోంది.

"పెట్టె బెడ్డింగూ పోయాయి వస్తోంటే. ఈ ఊర్లో పనుంది మరి ఏం చెయ్యను" కంగారు పడ్డాడు లక్ష్మీ మోహనరావు.

"ఊహూఁ-" ఆమె ఏదో ఆలోచిస్తున్నట్టు ఉంది.

"పుష్పలతంటే మా వైపు మంచి పేరు."

"నేను పుష్పలతని కాను."

"మరి నువ్వా.."

"నన్ను పాప అంటారు. పుష్పలత మా అక్కయ్య. ఓ లక్షాధికారి మా అక్కయ్యను సొంతంగా ఉంచేసుకున్నాడు."

"ఓహో!" అన్నాడు లక్ష్మీ మోహనరావు. పోనీ ఇదైతేనేం దాని చెల్లెలేకదా అని సమాధాన పరచుకున్నాడు.

"నన్ను కూడా మీరు తీసుకుపోయి ఉంచుకోరాదూ?" చిలిపిగా నవ్వుతూ అడిగింది.

"నేనా - ఎక్కడ ఉంచుకోవటం? ఎలాగ?" తడబడుతూ అన్నాడు లక్ష్మీ మోహనరావు.

ఆమె ఏదో పసిగట్టినట్టు "భోంచేశారా?" అంది.

"లేదు."

"ఏం?"

అతను జవాబివ్వలేదు. ఎందుకో అతని మనసంతా కలత పడిపోయింది. అతనికి కొడుకుని శ్మశానికి మోసుకుపోవడం జ్ఞాపకం వచ్చింది ,

"మరి బంగారం ఏదీ?" అడిగిందామె.

"బంగారం ఏఁవిటీ?" అన్నాడతను.

"మా పిన్ని చెప్పింది అరకాసు బంగారం ఉందని."

"ఓహ్ అచ్చా - ఓహ్ మర్చిపోయాను" జేబులోంచి మంగళసూత్రాలు పొట్లం తీసి ఆమెకిచ్చాడు.

"భలేవారే మీరు. ఇంతవరకూ ఇవ్వకుండా నన్నాడిస్తున్నారా" అంటూ ఆమె పొట్ల విప్పి చూచింది. పసుపుతాడుకి మంగళ సూత్రాలు కట్టబడి ఉన్నాయి. అప్రయత్నంగా ఆమె "సరే!" అంది. ఆమె చెక్కిళ్ళలోంచి రక్తం దిగిపోయింది. సందేహంగా అతనికేసి చూసింది.

"అరకాసు ఉండదనా నీ సందేహం?" అని అడిగాడతను.

"ఉంటయ్యేమోలే -" ఆమె పొట్లం కట్టి చేత్తో పట్టుకుని "కొంచెం మిఠాయి తినండి. ఇప్పుడే వస్తాను" అని గదిలోంచి వెళ్ళి పోయింది.

అతనికి ఉత్సాహం తగ్గిపోతున్నట్టని పించింది. మధ్యాహ్నంలో భోజనం లేని కారణాన ఏమో అనుకున్నాడు. మంచి చలాకీనే ఈ పాప. తనని లేనివాడని కనిపెట్టేసిందా. అయితేనేం, బంగారం ఇచ్చాడుగా, ఇంకేం అనుకున్నాడు. టేబుల్ మీద పళ్ళెంలో మిఠాయి తీసుకుని తాపీగా తిన్నాడు. కింద నుంచి ఏవో కేకలు వినిపిస్తున్నాయి. పాప ఎవరిమీదో బహుశా ఆ గొగ్గిపళ్ళ పిన్నిని తిడుతుందేమో అనుకున్నాడు. రెండు చక్కరకేళీ అరటి పండ్లు ఒల్చుకుని తిన్నాడు.

క్రమంగా అతనికి బలం వచ్చింది. దాంతో అతని మీద అతనికి నమ్మకం కలిగింది. ఇందాకట్నుంచీ నీరసం వల్ల కాబోలు అలా బెదురుగా ఉన్నాననుకున్నాడు. ఇప్పుడు చూడమను తన ప్రజ్ఞ తనూ చమత్కారంగా మాట్లాడగలడు. పాపచేత జావళీ అభినయింప చెయ్యాలి 'తూరుపు తెలవారె' అంటే అతనికి ఇష్టం. మరచెంబు తీసి నీళ్ళు తాగి తేన్చాడు. రాబోయే సుఖాన్ని తలచుకుంటుంటే అతనికి ఒళ్ళు మళ్ళీ పులకరించింది. లేచి వెళ్ళి మంచం మీద పడుకున్నాడు చిరునవ్వు నవ్వుకున్నాడు తృప్తిగా.

గదిలోకి గొగ్గిపళ్ళావిడ వచ్చింది. ఇదొచ్చిందేమిటి అని కంగారు పడ్డాడు లక్ష్మీ మోహనరావు.

"లేలే పంతులూ మంచం మీద దొరలాగా పడుకున్నావు కాని" అంది మోటుగా ఆవిడ.

"ఏం?"

"ఇనస్పెట్టరొత్తున్నాడు. కబురొచ్చింది. ఎల్లుబాబూ నువెల్లిపో -"

"ఎక్కడికి వెళ్ళను?" కోపం వచ్చింది లక్ష్మీ మోహనరావుకి. "నేనెందుకు వెళ్ళాలి?" అన్నాడు.

"సాల్లే - ఇనస్పెట్టరొస్తే నన్నూ నిన్నూ జెయిల్లోకి తోస్తాడు. దయచెయ్యి పంతులూ పంతులూ ఇదిగో నీ బంగారం -" ఆమె పొట్లం మీదికి విసిరింది.

"పాప ఏదీ? ఇలా రమ్మను" మెల్లగా అడిగాడు రావు.

"పాపే చెప్పింది నిన్ను పంపించెయ్యమని, నడు నడు ఊఁ" అంది.

కోపంతో పొట్లం తీసుకుని లక్ష్మీ మోహనరావు గబగబా కిందికి దిగాడు. ఇటూ అటూ చూశాడు. గుమ్మం పక్కగా పాపనుంచుని ఉంది.

"నన్ను పొమ్మన్నావేం - వాడెవడు ఆ ఇనస్పెక్టరు, నాకేం భయం!" అన్నాడు గట్టిగా.

పాప నవ్వి "కోప్పడకు పంతులూ, మళ్ళీ ఎప్పుడైనా ఒద్దువుగానిలే, నా మాట విని వెళ్ళు."

"ఏం?"

"ఇదిగో - ఈ పది రూపాయలూ దగ్గరుంచుకో, నాకూ తెలుసు కష్టం ఏమిటో!"

ఎందుకో ఏ అవ్యక్త స్మృతివల్లనో చటుక్కున అతని కోపం పోయి సిగ్గుతో అవమానంతో తన మీద తనకి జాలితో బలహీనుడైపోయాడు లక్ష్మీ మోహనరావు. ఆమె జేబులో పదిరూపాయలు పెడుతూంటే తోసి వేయాలనుకున్నాడు కానీ, అతని నరాలూ, ఇంద్రియాలూ స్తంభించిపోయాయి. అలాగే నుంచునిపోయాడు. కోపంగా కేకలేద్దామనుకున్నాడు. కానీ మాట రావడంలేదు.

"వెళ్ళు పంతులూ" - పాప జాలిగా చూసి అంది.

లక్ష్మీ మోహనరావు జేబులోంచి నోటు తీసి ఆమె మీదకు విసిరివేశాడు. ఒళ్ళంతా అవమానంతో దహించుకుపోతోంది. నిర్జనంగా ఉన్న రాజమండ్రి రోడ్లమీద నడచిపోతున్నాడు. లక్ష్మివారం పేట, తుమ్మలా నడిచిపోయాడు. పాప జాలిగా చూడడం అతనికి మరీ మరీ గుర్తుకు వస్తోంది.

తను దరిద్రుడని తెలిసిపోయింది. తన శక్తి అంతా ఈ ప్రమాదం రాకుండా ధారపోసినా లాభం లేకపోయింది. తనకి వ్యభిచరించే అర్హత కూడాలేదు. ఎంత దూరం ఆ చీకట్లో అలా నడిచాడో తెలియదు. కానీ అతను తనకి తెలియకుండానే తన ఇంటికి వెళ్ళాడు. అతని ఒంట్లోంచి సత్తువంతా ఎవరో తోడేసినట్లయింది. కాళ్ళు వణికాయి. తన ఇంటి మెట్లమీద చతికిలపడ్డాడు. మొహం చేతులతో కప్పుకున్నాడు. అతని గొంతు నుంచి మూలుగు హీనస్వరంతో బయటికి వచ్చింది.

ఇంటి తలుపు తెరిచి భాగ్యలక్ష్మి తొంగి చూసింది. "ఇంతదాకా ఎక్కడెక్కడున్నారు? రండి లోపలికి - అలా బెంగపడి పోతే ఎలాగ" అంటూ అతని చేయి పట్టుకుని లోపలికి తీసుకువెళ్ళింది.

"మీరు కూడా ఏమయ్యారో అని భయంతో ఛస్తున్నాను. చచ్చిన కొడుకెల్లానూ రాడు. మీరు కూడా.." ఆమె కంఠం రుద్ధమయింది.

"పడుకోండి ఇలాగ" అంటూ అతన్ని మంచం మీద పడుకోబెట్టింది.

లక్ష్మీ మోహనరావు కళ్ళు మూసుకుని పడుకున్నాడు. కనుకొలకుల నుంచి కన్నీటి బిందువులు రాలుతున్నాయి. లక్ష్మి అతని కళ్ళు తుడిచి "కాస్త విశ్రాంతి తీసుకోండి" అని తన కళ్ళు తుడుచుకుంది. లక్ష్మీ మోహనరావుకి కాస్సేపటికి నిద్రపట్టింది.

## కెరటాలు పలకరించాయి - పోతకూచి సాంబశివరావు

*(యువ డిసెంబర్ 1961 సంచిక నుంచి పునర్ముద్రితం)*

**రామగోపాలం ఆఫీసుమేడ దిగుతున్నాడు**

హఠాత్తుగా ఏదో ఆలోచన కలిగింది వెనుతిరిగి, మెట్లు లెక్కపెట్టాడు. ఏడు.

ఆ ఏడుమెట్లు ఎన్నోసార్లు ఎక్కాడు తన ఆఫీసు గదిలోకి పోయి పనిచేసుకోడానికి.

ఆఫీసు పనిలో ఎంతో శ్రద్ధాభక్తులు చూపించే రామగోపాలం తన విద్యుక్త ధర్మాన్ని పూజిస్తున్నట్లు కనిపిస్తాడు.

ధర్మమనేది భగవంతుని అంశ అయితే, దాన్ని అంటుకుని, ఆదుకుని నిలబడడమే తన కర్తవ్యమనుకున్నాడు రామగోపాలం.

కొన్ని దర్యాప్తులు చెయ్యడానికి తిరుపతి వెళ్ళమని ఆనాడే ఒక ఆజ్ఞ అందింది. ఆ ఆలోచనల్లో మెట్లులెక్క పెట్టాడు. ఆ ఏడు మెట్లు ఎక్కి తన విద్యుక్త ధర్మాన్ని పూజిస్తున్నట్లు తిరుపతి వెళ్ళే అవకాశం లభించడంతో ఏడుకొండలు ఎక్కి తిరుపతి దేవుని కూడా కొలవవచ్చుననుకున్నాడు రామగోపాలం.

ధూమ శకటం కొండల మధ్య నుంచి నడిచి తాపీగా తిరుపతి చేరింది - మెల్లిగా ఆలస్యంగా, దైవసాన్నిధ్యం తొందరగా లభించదన్నట్లు.

రైలు దిగి రామగోపాలం సత్రవులోకి చేరాడు. పదిలంగా ఒక గదిలో తన సామాన్లు దింపుకున్నాడు. హోరుమనే వాన.

ఎక్కడ చూచినా స్త్రీ పురుషభేదం లేకుండా - శిరోముండనాలు రద్దీ జనం - అందరూ తిరుపతి స్వామి భక్తులే. వారి కళ్ళల్లో ఏదో వింత కోరికలు, చింతలు, మిలమిల మెరుస్తున్నాయి. ఎవరి హృదయంలో ఏముందో ఆ పరమాత్మకే తెలియాలి. సత్రవలో వరండా అంతా క్రిక్కిరిసి ఉంది. రకరకాల ఆసనాల్లో, భంగిమల్లో భక్తులంతా వరండాల్లో గందరగోళ పడుతున్నారు. ముసుగున్న వితంతువు ప్రక్కనే

శిరోముండనం చేసుకున్న పునిస్త్రీ. బట్టతల తాత ప్రక్కనే మొక్కుచెల్లించుకున్న మనుమడు - పిల్లలకోసం కలిసి జుట్టు తీయించుకున్న దంపతులు.. వింత జంటల్లా కదిలారు రామగోపాలం ఆలోచించాడు - జాతిలో ఒక్కొక్క ధర్మం - ఒక్కొక్క మూఢ నమ్మకం - అయినా కర్మకాండలో నమ్మకమున్న వ్యక్తులు.

తనకోసం వచ్చిన జీప్‌లో ఊరు తిరిగి, తన ఆఫీసు కార్యక్రమం పూర్తి చేసుకున్నాడు సాయంత్రం కొండమీదకు ప్రయాణమైయాడు.

కొద్ది చలిగాలి. బస్సు రోకలి బండలా కొండమీద ఆయాసంగా ప్రాకుతోంది. మొక్కల తుప్పలతో పచ్చగా మెరుస్తున్న కొండలు ప్రతివాణ్ణి ఏదో ప్రశ్నిస్తున్నట్లు నిక్క చూస్తున్నయి పూజారుల్లా. బస్సులో ఒక ఆసామికి త్రిప్పువచ్చి కక్కుకున్నాడు. మరొక వితంతువు పటికబెల్లం, లవంగాలు నమిలేస్తోంది తన అలవాటు తిరుపతి కొండ ఎక్కడానికే చేసుకున్నట్లు. ఎవరో పండితుడు ఏదో కొండల దర్శనం కాగానే ఏదో శ్లోకం వల్లించాడు గట్టిగా 'భోజనకాలే గోవిందా' అన్నట్లు భోజనం ముందు - ఆయన శ్లోకంలో ఆనందించారు తోటి ప్రయాణికులు.

తిరుపతి మహిమలు కథలుగా చెప్పుకుంటున్నారు బస్సులోని తిరుపతి బంధువులు.

'ఆయన మహిమ అపూర్వం - ఎవరికి ఏది కావాలంటే అది ఇస్తాడు.'

కావచ్చు అనుకున్నాడు రామగోపాలం.

'ఏమీ కోరకపోతే? ఏమిస్తాడో!' నవ్వుకున్నాడు రామగోపాలం.

భగవద్గీతలోని నిష్కామకర్మ దృష్టికి వచ్చింది - అక్షరాలా పాటిస్తానని ఒట్టుపెట్టుకున్నాడు రామగోపాలం.

బస్సు ప్రయాణీకులను వెక్కిరిస్తున్నట్లు పాదయాత్ర చేస్తున్నారు మరి కొందరు మహాభక్తులు కొండ ఎక్కడానికి.

ఏడుకొండలు ఎక్కే బస్సు, ప్రేయసిని చేరే ప్రియుడి గుండెలా కొట్టుకుంటుంది - శబ్ధంతో.

ప్రేయసిలో కనిపించే సౌందర్యమంతా ఏడుకొండల్లో కనిపించింది రామగోపాలానికి, ఏమిటో విచిత్రమైన ఆలోచనలు కదిలాయి.

హఠాత్తుగా చేతిలోని సంచి విసిరేసి, కట్టుబట్టలతో ఆ దట్టమైన కొండల మారుమూలల్లోకి చొచ్చుకుపోయి, ప్రశాంత చిత్తంతో తపస్సు చేసుకుంటే ఎంత హాయిగా ఉంటుంది అనుకున్నాడు రామగోపాలం -

'ఇక్కడ పెద్దపులులు తిరుగుతాయాండి?' అని ఒక బస్సు ప్రయాణీకుని ప్రశ్న.

'పెద్దపులులేమిటి. సింహాలు కూడా!' నోరావలిస్తూ చెప్పాడు మరొక బస్సు స్నేహితుడు.

ఆ కొండల్లో తపస్సు చేసుకుంటే ఏదో పులి ఎక్కడినుంచో సింహం మీదబడి కొరికి - ముక్కలు చేసి రక్తపాతం ఆ ఆకుపచ్చటి కొండలు ఎర్రగా మారిపోవు?

'అయినా అవి ఎవరికీ హాని కలిగించవండి.' అంతా స్వామి మహిమ అన్నట్లు ఉద్ఘాటించాడు మరొక భక్తుడు.

ఆ భక్తుని అభయహస్తంతో, రామ గోపాలానికి ఆ కొండలు మరీ సౌందర్యవంతంగా కనిపించాయి ఆ కొండల మీద ఒంటరిగా, మేఘాలతో ఆడుతూ సంచరిస్తూంటే, ప్రవరాఖ్యుడికి వరూధిని కనిపించినట్టు తనకు ఎవరైనా అప్సరస కనిపిస్తే మధుర వీణా నిక్వాణాలు ప్రక్కనున్న సెలయేటి గలగలతో గొంతు కలిపి ఆ జవ్వని బంగారు గాజుల గలగలలు మనుచరిత్ర స్మృతిపథంలో తిరిగింది -

ఆయాసం పడే బస్సు ఆస్మా రోగిలా చివరికి గమ్యస్థానం చేరింది -

'దిగండి' అన్నాడు బస్ కండక్టరు.

రామగోపాలం ఆలోచనల్లోంచి తేరుకున్నాడు.

అయితే బస్సులో కళ్ళజోడు పెట్టుకున్న పొట్టి అమ్మాయి అద్దాల మిలమిలలు. బంగారం తొడుగులతో మెరిసి పోతున్న ఒక భక్తురాలు. తన కేసి పరీక్షగా చూస్తూ డిటెక్టివ్ నవల పతిస్తున్న నాగరిక విద్యార్థిని - బస్సు దిగినా కళ్ళెదుట సాక్షాత్కరించారు. కొండల్లో ఎవరో వరూధిని బదులు వీరిలో ఏ ఒక్కరైనా వరూధిని అయిపోతారేమో. కావచ్చు ఎప్పుడు ఏం జరుగుతుందో అంతా దైవలీల. డిటెక్టివ్ నవల చదువుతున్న అమ్మాయి బస్సు దిగి సామాను ఎత్తి ఒక యువకుణ్ణి చెప్పుతో దవడమీద కొట్టింది 'ఈడియట్' అని అరుస్తూ.

బస్సు దిగిన ప్రయాణీకుల్లో సంచలనం కలిగింది.

'ఏం జరిగిందని?'

సామాను నెత్తిమీద పెట్టుకున్నప్పుడు, ఆమె కొంగు పట్టుకున్నాడుట - ఆమె వాదన.

'కాదండి - పెట్టె కొక్కానికి తగిలి ఆమె కొంగు నా చేతిలోకి వచ్చింది' - అంటాడు ఆ నౌకరు.

పెద్దమనుషులైన ప్రయాణీకులు ఆ రభస చల్లార్చి ఆమెకు మరొక నౌకర్ని నియమించి, మెల్లిగా సాగనంపారు. బిగిసిపోయిన రామగోపాలం కొంచెం తెరిపిగా ఊపిరి పీల్చుకున్నాడు ఈ అమ్మాయిలో ఇంత డేంజరు ఉందా అనుకుంటూ తన ఆలోచనలు ఒక్కసారి ఝాడించాడు. దేవుడి సన్నిధిలో - పాపపు తలుపులు పంజరంలో చిలకను బంధించినట్టు మనస్సును కళ్ళెం వేసి బిగించేయాలనుకున్నాడు.

కొండ దక్షిణ భాగాన తనకిచ్చిన బసవైపు నడిచాడు. జగత్తులో అంతర్లీనమై ఉన్న దివ్యజ్యోతి మానవాతీతమైన శక్తి ఏదో అతని మనస్సుకు తట్టింది - రామగోపాలం భయంతో, భక్తితో వణికిపోయాడు.

తన బసలో సామాను దించి, ఒక సిగరెట్టు ముట్టించాడు. లైటు వెలిగించి, సాయంత్రం ఆరున్నర దాటింది - గోడమీద ఏవో మసకలు.. మసకలు వెల్లవేసి రెండేళ్ళు కావచ్చు ననుకున్నాడు. బస సౌకర్యంగానే కనిపించింది. ఒకటి రెండు రోజులు కులాసాగా, ఒంటరిగా, ప్రశాంతంగా, హాయిగా, ఆత్మపరిశీలన చేసుకుంటూ కొండమీద తిరిగితే మనస్సుకు ఆహ్లాదం కలుగుతుందని ఆశించాడు రామగోపాలం.

స్నానం పూర్తిచేసి వెంకటేశ్వరుని ఆలయంవైపు నడిచాడు పరిశుభ్రమైన వస్త్రాలు ధరించి ఆలయం ఎదుట వ్యాపించిన బజారు, 'లైట్లకాంతుల్లో కనుల పండువుగా' ఉంది. వెంకటేశ్వరుని బొమ్మలు, బొమ్మలున్న గవ్వలు, విసినకర్రలు, బూరలు, యాత్రీకులంతా కొంటున్నారు.

ఆలయంలోని విగ్రహం గంభీరంగా ప్రశాంతంగా ఎంతో విస్తృతంగా కనిపించింది. గోపాలం ఒక్క నిమిషం చూసి, ఏదో తన్మయతలో ఆరాధనలో పడ్డాడు. ఆ తృటిలో అతని మనస్సులో కోరికలు ఏవీ ఉద్భవించలేదు తిరుపతి కొండలు. కొండమీద దేవుడు ఆ విచిత్ర వాతావరణం - మానవుడి మనోపరిమితి గురించి ఏవో విచిత్రమైన ఊహలు అల్లుకున్నాయి ఆలోచనల్లో. గుడి బయటకు రాగానే తిరుపతి స్వామిని చెక్కిన రెండు గవ్వలు కొన్నాడు. భోజనం చేసి మగతతో, ఆయాసంతో, బసకు వచ్చి, పరుపుచుట్ట పరిచి, విలాసంగా ఒరిగాడు ఒక నిమిషం.

కందమూల ఫలాలు తిని అరణ్యాల్లో ఆశ్రమాలు నిర్మించుకుని గడిపే పురాతన ఋషులకు, దేవాలయాల చుట్టూ భక్తి భజనలు చేసే నేటి కలియుగ యాత్రీకులకు, విజ్ఞాన సంపాదన మార్గాల్లో మార్పులు విభిన్నంగా, వికృతంగా గోచరించాయి.

చీకటి వెలుగుల నీడల్లో రోడ్లమీద బసకు దూరంగా ఒంటరిగా సంచరించాడు. మిణుగురు పురుగులు చీకట్లో ఎగురుతున్నాయి చెట్లు గాలిలో ఊగుతూ, రొజుతూ శబ్దం చేస్తున్నాయి ఆకాశంపైన కొండమీది దీపాలకు పోటీగా తారలు తళుక్కుమంటున్నాయి. ఈ జగత్తు మహత్తు ఏమిటో అర్థం కాని అనంతం అనిపించింది గోపాలానికి.

పది గంటలు దాటింది. లైట్లు ఆర్పి నిద్రకు ఒరిగాడు గోపాలం. ఒక గంట గడిచింది. ఒళ్ళంతా ఏవో కుడుతున్నట్లు బాధపడ్డాడు లేచాడు లైటు వెలిగించాడు. తెల్లదుప్పటిమీద నల్లులు లేచి పరుగెత్తాయి పట్టుకు నలిపేశాడు కసిగా రామగోపాలం. విచిత్రమనిపించింది శరీరం నిండా కాట్లు ఒక్క క్షణంలో. చీమలేమో అనుకున్నాడు. లైటు వెలిగిస్తే, తెల్లదుప్పటి మీద నల్లులు గుంపులుగా చేరాయి. చిత్రమనిపించింది. దుప్పటి బయట దులిపి మళ్ళీ మేనువాల్చాడు రామగోపాలం మళ్ళీ శరీరం నిండా పోట్లు. లైటు వెలిగించాడు. గోడలమీదకి దృష్టిపోయింది. గోడలనిండా నల్లులు, కురుక్షేత్ర సంగ్రామానికి ఆయత్తమైన కౌరవ పాండవ సైన్యాల్లా బారులు తీర్చి గోడ తెలుపు ఏమిటో తెలియకుండా, అదంతా నల్లుల గోడలు తయారై భయంకరంగా కనిపించింది. అన్ని నల్లులు సైన్యమా ఒక్కసారి గోడమీద చూడడం రామగోపాలానికి చాలా చిత్రమనిపించింది. మరుక్షణంలో తిరుపతి దైవం జ్ఞప్తికి వచ్చాడు. ఇంకో క్షణంలో 'బలవంతమైన సర్పము చలిచీమల చేతజిక్కి చావదె సుమతీ!' పద్యం కదిలింది మనస్సులో లైటు కాంతితో. ఆ కాంతికి మించిన ఎరుపు కళ్ళతో, పిచ్చివాడిలా పక్కమీద కూర్చున్నాడు రామగోపాలం. నల్లులు అతన్ని కూర్చోనివ్వలేదు. గోడలమీద యాత్రాసంరంభం మానలేదు ఒకటా రెండా వేలకు వేలుగా ఉద్భవిస్తున్నాయి ఈ నల్లుల సైన్యం చూసి భయంతో వణికిపోయాడు గోపాలం.

తలుపులు, పాపాల తలపులు. ఏవన్నా ఉంటే అవి హతమార్చుకుని నిజమైన భక్తుడు ఒకసారి ప్రార్థన చేసి ఆక్రోశించాడు. ఆ జాగరంలో ఆ ఆరాధన జాగృతిలో ఎప్పుడో మైకం కమ్మి ఉదయకాలంలో ఒక్కసారి వాలిపోయి కన్నుమూసాడు. కలవరింతల్లో లేవగానే తెల్లవారింది. పూర్తిగా కంగారుగా గోడలవైపు చూశాడు ఒక్క నల్లి కనిపించలేదు. పరుపుపట్టి పరిశీలించాడు నల్లివాసనలేదు. జరిగింది కలా అని భ్రమపడ్డాడు. కానీ తాను చంపిన నల్లుల రక్తపు మరకలు గోడలమీద కనిపించాయి. చిత్రమనిపించింది. ఏది వాస్తవికతో నమ్మలేక పోయాడు రామగోపాలం. రెండు రోజులు ఆ కొండమీద ఉందామనుకున్న నిశ్చయం మార్చుకున్నాడు. తక్షణం సామాను కట్టి బస్సు ఎక్కేశాడు.

నిద్రలేని ఎర్రటి చింత నిప్పుల్లాంటి కళ్ళు ఎవరికి కనిపించకుండా నల్ల కళ్ళజోడు పెట్టుకున్నాడు. కండక్టరు ఇచ్చిన టిక్కెట్టు అందుకుంటూ చుట్టూ ఉన్న వాతావరణం సాఫీగా కలయచూశాడు. నల్లకళ్ళ జోడు ఎదురుగా సన్నని నాజూకు వనిత మధ్యవయస్కురాలు రాత్రి యాత్ర శ్రమనుంచి తేరుకోని వదనం, రేగే జుట్టు వంకీలు మెడలో గొలుసు కళ్ళకు జోడు ఏమిటో సూటిగా చూస్తోంది. తనవైపు తనకళ్ళు ఆమెకు కనిపించడంలేదనే ధీమాతో రామగోపాలం ఒక్క నిమిషం తన్మయత చెందాడు. తరువాత కంగారు పడ్డాడు. ఆ కొండ పవిత్రత జ్ఞాపకం వచ్చి రాత్రి నల్లుల సైన్యం బాధలు మదిలో మెదిలాయి. భయం వేసింది. తిరిగి శిక్షా? బస్సు దిగుతోంటే ఏదో లోయలో జారి కొండలమీద దొర్లి, తల్లబద్దలై ఆకస్మికమైన బలవంతపు చావు సంభవిస్తుందేమో గుండె దద్దరిల్లింది. ఒక క్షణం ఆమెవైపు చూడడం మానేశాడు.

బస్సు నడుస్తోంది

అమ్మలక్కలు అనుకుంటున్నారు తిరుపతి దేవుని మహిమల గురించి. పది సంవత్సరాల శూలనొప్పి ఎలా పోయిందీ - పన్నెండేళ్ళ తరువాత పిల్లలు ఎలా పుట్టిందీ - ఒక లక్షాధికారి దేవుడి ప్రసాదం తినకపోవడంతో ఎలా భిక్షాధికారి అయిపోయిందీ - ఒక మనిషి కలలో కనిపించి నిక్షేపాల రహస్యం ఎలా చెప్పిందీ. వింత వింత మహత్తు కథలు, చెవుల్లో పడుతున్నాయి.

రామగోపాలం ఎదురు సీటులో కూర్చున్న ఆమె తనవైపే చూస్తోంది. వరూధిని ఆ తలుపులో మరీ తన్మయత చెందాడు. రామగోపాలం చేతిలో అమృతాంజనం తీసుకుని తలకు రాసుకుంటోంది. అవును అందరికీ త్రిప్పు కలుగుతుంది బస్సు నడకలో. రామగోపాలం కృత్రిమంగా ఆమె వైపు చూడదల్చుకోలేదు. నల్లకళ్ళజోడు తీసి జేబులో ముడిచేశాడు. ఆమె నవ్వింది నీ సంగతి నాకు తెలిసిందన్నట్లు. ఆ నవ్వు ఎవరో చిరపరిచిత వ్యక్తి నవ్వినట్లు. ఆత్మీయతలో ఏదో మనస్సు కెలికినట్లు గుండెలు జలదరించాయి.

రామగోపాలానికి తనూ నవ్వేడు, ఎవరూ చూడటం లేదుకదా అని పరిశీలిస్తూ. ఆమె వెక్కిరించింది పెదాలతో. మరుక్షణంలో మౌనంగా అమాయకమైన వదనంతో కొండలమీదికి దృష్టి ప్రసరించింది ఆమె.

కొండమీద లేళ్ళు పరుగెత్తుతున్నట్లు ఆమె చూపులు రామగోపాలం శరీరం మీద పరిగెత్తాయి. కొండ వాగుల్లో నీరు గలగలమన్నట్లు ఆమె కంకణ ధ్వనులు రామగోపాలం మనస్సంతా ప్రతిధ్వనించాయి.

కొండలమీద చెట్ల గుబురులు అల్లుకున్నట్లు ఆమె భావాలన్నీ రామగోపాలం శరీరం చుట్టుముట్టాయి. బస్సు ఒడుపుగా, జాయిగా క్రిందకు నడుస్తోంది -

ఆమె ఒడుపుగా జాయిగా, వీలుబట్టి రామగోపాలాన్ని పలకరిస్తోంది, చూపుల్లో వెక్కిరింపుల్లో. తిరుపతి ఊరు ఇంక అరమైలు ఉంది. కొండల మీంచి ఆమె బస్సు దిగితే ఏమైపోతుందో.

ఇంతకీ మాట్లాడనేలేదే? గొంతుక సవరించుకున్నాడు రామగోపాలం.

మాట్లాడబోయి ఒకసారి నోరు నొక్కుకున్నాడు. పక్కనే ఉన్న పెద్ద ముత్తైదువను చూసి మరోసారి మరీ ధైర్యం తెచ్చుకుని.

'అమృతాంజనం ఒకసారి ఇస్తారూ?' ఆమె వినీ విననట్లు ఊరుకుని నవ్వింది.

'ఏమండీ' మళ్ళీ పిలిచాడు వినయంగా అందరికీ తన కంఠం వినిపించాలని. అమృతాంజనం అందిస్తూ కొంటెగా వెక్కిరించింది. ఆ కొంటె తనంలో తల దిమ్మెక్కి ఆ ఉద్రేకంలో సీసా జారిపోయే ప్రమాదం తప్పించి, మెల్లిగా అందుకుని తలకు రాసుకున్నాడు అమృతాంజనం. 'వెధవ తలనొప్పి?' ఏమనాలో తెలియక తనలో తాను స్వగతంగా పలుక్కున్నాడు రామగోపాలం.

బస్సు ప్రయాణీకుల వదనాలు చిరునవ్వుతో వెలిగాయి రామగోపాలం స్వగతం విని.

ఆమె ముత్యాల పలువరుసలు తళుక్కున మెరిసాయి నవ్వు ఆమెలో వెల్లివిరిసింది.

అమృతాంజనం సీసా అందిచ్చేశాడు తిరిగి. ఆమెకు బస్సు కొండ దిగుతోంది.

దుష్యంతుడు - శకుంతల ఊహల్లో మెదిలేరు మరుక్షణంలో. నలదమయంతులు కనిపించారు.

సమావేశం, వినియోగం రెండూ ఒక క్షణంలో వచ్చినట్లు గజగజ బాధపడ్డాడు రామగోపాలం. కొండ మహిమకు దూరమైయాను కనుక సాహసం చేస్తే!? రామగోపాలం సతమతమయ్యాడు. ఆమె చూపుల్లో బాధ.. ఆనందం, తన్మయత, ఆవేశం, ఆతురత అభిమానం ఏమిటో ఎన్నెన్నో భావాలు! అన్ని భావాలు మాటల్లేకుండా వ్యక్తపరిచే ఆ వ్యక్తి, తనకు వరూధుని. నిజంగా ఆమె వీణ వాయించినట్లు అతను విన్నట్లు ఏదో కలలోకి జారి , మళ్ళీ బస్సు కుదుపుతో బస్సులోకి మారాడు.

బస్సు దేవస్థాన సత్రవు చెరింది. చేరగానే 'హల్లో హల్లో' అంటూ జేబురుమాలు ఆడించింది ఆమె బయట ఎవరో కారులో కూర్చున్న మనుషులను చూసి. 'థాంక్సు' అన్నాడు రామగోపాలం బస్సు దిగుతున్న ఆమెను చూసి.

ఆమె కొంటెగా మూతి త్రిప్పుకుని నవ్వింది. ఒక్క మాట మాటాడకూడదా అనుకున్నాడు రామగోపాలం.

సత్రవులో సామాను దిగింది. ఒక వార పెట్టించాడు రామగోపాలం.

ఆమె దిగింది ఆమె పరివారం, పెద్ద ముత్తైదువ - ఇద్దరు పిల్లలూ, దిగారు. మౌనంగా వీధిలో కాపలా కాచుకునే కారుమనుషులు సామాన్లు కారులో పెట్టారు.

ఏవో పనులు పురమాయించుకుని కారు మనుషులు నడిచి ఊరిలోకి వెళ్ళారు.

ఆమె రెండుగజాల దూరంలో కారు వద్ద నుంచుంది. రామగోపాలం సామాను పక్కనుంచున్నాడు.

ఏం చేయాలి?

ఆమె నవ్వు అతన్ని మరీ ఉక్కిరిబిక్కిరి చేసింది ఉత్సాహంగా గెంతింది కారువైపు. లోపలి ఆడపిల్లల్ని బయటికి లాగింది అల్లరిగా. ముంజెలు కొని ఇద్దరికీ ఇచ్చింది. అవి వల్చుకుతింది ఆమె. మధ్యలో 'కావాలా' అన్నట్లు అందించింది కొంటెగా గాలిలోంచి. రామగోపాలం ద్రాక్షపళ్ళు కొన్నాడు.

'బాధ' అన్నట్లు ముఖం చిట్లించాడు.

'అయ్యో' అన్నట్లు ఆమె జాలిచూపించింది

'ఏం చెయ్యను' అన్నట్లు జాలి ముఖం వేశాడు రామగోపాలం.

'ఏడువు' అన్నట్లు వెక్కిరించింది ఆమె.

'ఊ!' అన్నాడు లోలోపల కోపంగా రామగోపాలం మౌనంగా.

'ఆ!' అంది ఆమె కళ్ళు పెద్దవి చేసి.

జేబులోంచి విజిటింగ్ కార్డు తీశాడు రామగోపాలం, ఇది నా ఎడ్రసు అన్నట్లు.

ఆమె దగ్గర ఎడ్రసు కార్డు లేదుగా. తెల్లబోయింది ఏం చేయాలో తెలియక.

ఆమె ఎడ్రసు? రామగోపాలం తలగోక్కున్నాడు. గబుక్కున కారువైపు చూశాడు.

నెంబరు... మద్రాసు కారు. మనుషులు వచ్చారు. లోన కూర్చుని హారను కొట్టారు.

మెల్లిగా, బరువుగా, బాధగా కారులో కూర్చుంది వెనకగా... ఆమె.

తింటున్న ద్రాక్షపండు రామగోపాలం పంటి మధ్య నిశ్చేష్టగా నిలుచుండి పోయింది -

ఆమె కళ్ళజోడులోంచి నయనాలు జాలి కన్నీరు కార్చాయి "టాటా!" అన్నట్లు చెయ్యి ఆడించింది.

తన విజిటింగు కార్డు కారులోకి విసిరేద్దామనుకున్నాడు రామగోపాలం.

ఒక చెయ్యి ఎత్తాడు చేతిలో ద్రాక్షపళ్ళ గుత్తి బూడిదలో రాలిపోయింది -

కారు పారిపోయింది -

ఆమె విలాసం? తిరుపతి?

తర్వాత గుండెల్లో మంటలు, మెదడు పనిచేయనని సహాయ నిరాకరణోద్యమం ప్రారంభించింది.

ఆఫీసు పని - తిరుపతి యాత్ర మరచి పోయాడు. పరుగెత్తాడు, మధ్యాహ్నం కారులో మద్రాసు.

రామగోపాలం తిరిగాడు మద్రాసులో పిచ్చిగా. ఆ కారు నెంబరు తిరుపతి దేవుని నామంలా అతని హృదయంలో హత్తుకు పోయింది. సముద్ర తీరంలో తిరిగాడు, ఆ సన్నని నాజూకు వనిత వంకీల జుట్టు, పసుపు పచ్చటి చీర, ఎర్రని రవిక ప్రతి స్త్రీని పరిశీలించాడు. ఆమె కాదు.

కెరటాలు పలకరించాయి రామగోపాలాన్ని. అడిగాడు - ఆమె ఎక్కడ అని?

కెరటాను నురుగులతో నవ్వాయి అతని పిచ్చి చూసి.

కెరటాల మీద విష్ణువు సముద్ర మధ్యంలో శేష శయ్యమీద ఉంటాడుగా. తిరుపతి స్వామి దృష్టిలో మెదిలాడు. కారు నెంబరు ఆయన నామంలో కలిసినట్లు కనిపించింది.

'ఆమె విలాసం?' ప్రశ్నించుకున్నాడు లోలోపల రామగోపాలం

'నా విలాసం' అన్నట్లు నవ్వాడు తిరుపతి స్వామి అతని ఊహల్లో.

'తిరుపతి విలాసం' గొణుక్కున్నాడు రామగోపాలం.

సముద్ర కెరటాలు హోరుమని గెంతాయి.

ఇసుక రేణువులు కొల్లలుగా తడిశాయి.

సముద్ర తీరమంతా జనం సందడిలో మునిగింది - రాత్రి పడింది - అంతా చీకటి ఆవరించింది ఆ సముద్ర తీరం గుంపుల్లో.

రామగోపాలం మద్రాసు విడిచి మెల్లిగా ఇల్లు చేరాడు. ఏడు మెట్లు ఎక్కి ఆఫీసు గదిలో కుర్చీలో వాలాడు. విద్యుక్త ధర్మం ఎదురుగా ఫైల్స్ కట్టలు చూపించింది -

ఆ కట్టల్లో ఆమె మెదిలింది -
ఆమెలో కారు నెంబరు, నెంబరులో తిరుపతి స్వామి నామం కదిలాయి.

ఆ ఏడు మెట్ల ఆఫీసు గది, ఏడుకొండల తిరుపతిలా మారింది -

"ఇది తిరుపతి విలాసం!" బాధగా నవ్వుకున్నాడు రామగోపాలం.

# అందచందాల కథ — అవసరాల రామకృష్ణారావు

**(సెప్టెంబర్ 1982, యువ మాసపత్రిక నుంచి పునర్ముద్రితం)**

**వాళ్ళిద్దరూ ప్రాణస్నేహితులు.** శక్తిగల వ్యక్తులను పూజించడంతో, చేతగానివాళ్ళను చీదరించుకోవడంతో మానవత్వమే నశిస్తున్న ఈ లోకంలో ఏ భేదమూ లేకుండా సమానంగా అన్ని విధాలా ఒకే త్రాటిమీద నడుస్తున్న నవయువకులు వాళ్ళు, ఒక తల్లి కడుపున పుట్టకపోయినా అన్నదమ్ములు వాళ్ళు, వాళ్ళకి 'నా' అన్నవాళ్ళు లేరని బాధ లేదు, ఒకరికొకరున్నారు, చాలు కలసి జీవిస్తున్న కళాకారులు వాళ్ళు.

ఓసారి వాళ్ళిద్దరూ ఓ మ్యూజియంలో ఓ చక్కని శిల్పం చూశారు. ముసుగులోంచి సొగసు వెదజల్లుతున్న ఒక ముగ్ధ చలువరాతి విగ్రహం అది. పండు వెన్నెలలో తాజమహలు అందం తనలో ప్రతిఫలిస్తే యమున మురిసి పరవళ్ళు తొక్కిందో లేదోగాని ఆ శిల్పంలోని చెక్కిన చక్కదనం చూచి వాళ్ళిద్దరు మైమరచిపోయారు. పంచేంద్రియాలకూ అతీతమైన భావమేదో వాళ్ళలో ఒక్కసారి ప్రజ్వలించింది. గచ్చుమీద ఉన్న గోతుల్లో నిలిచే నీళ్ళలో కిచకిచమంటూ పిచుకలు స్నానం చేసేటప్పుడు ఆయే చప్పుడూ, కళ్ళు తెరవని పిల్లిపిల్ల మీసాలకు అంటుకున్న పాలచుక్కల్ని వాళ్ళమ్మ నాకి శుభ్రం చేస్తునప్పుడు అయే చప్పుడూ – యిలాంటివేవో వింటునప్పుడు కలిగే ఆనందంలాంటిదేదో వాళ్లలో నిలువెల్లా మెరిసి ఉండాలి.

'ఈ చేతలే చేతలు ఈ శిల్పం చెక్కిన చేతులే చేతులు' అనుకున్నారు వాళ్ళు. ఇద్దరికీ ఒకేసారి శిల్పకళ అభ్యసించాలని బుద్ధి పుట్టింది. ఆ పట్నంలో ఆ విద్య నేర్పే ఓ ప్రైవేటు కాలేజీకి వెళ్ళి అడిగారు ఆ కాలేజీలో ఆరునెలల పాటు శిక్షణలిచ్చి పరీక్షకు తయారుచేస్తారు. నెలకి యాభై రూపాయలు ఫీజు తీసుకుంటారు.

వాళ్ళిద్దరూ బాగా బీదవాళ్ళు, వాళ్ళకున్న కొద్ది ఆస్తీ తినడానికి బొటా బొటీ అవుతూండేది ఫీజు కూడా ఎక్కణ్ణుంచి తెచ్చి కడతారు?

అల్లంత దూరాన ఆశ బాధించగా నాలుగురోజులు కిందమీద పడ్డారు. రోజు రెండున్నర రూపాయలు కూలి యిచ్చే ఫాక్టరీ ఒకటుందని తెలుసుకున్నారు ఆ వూళ్ళోనే.

''నే నివాళే ఫ్యాక్టరీలో చేరుతాను. ఆ డబ్బుతో నువ్వు నేర్చుకో. ఆర్నెలు నువ్వు అక్కడ నేర్చుకోవడం అయాక యిక్కడ పనిచేదువుగాని, అప్పుడు నేను నేర్చుకుంటాను'' అన్నాడు పెద్దవాడు. 'అలాగే' అన్నాడు చిన్నవాడు.పెద్దవాడు ఫ్యాక్టరీలో కూలిపనిలోనూ, చిన్నవాడు శిల్పకళా శిక్షణ కేంద్రంలోనూ చేరారు. పెద్దవాడు డబ్బు తెచ్చి చిన్నవాడికి జీతం కట్టేవాడు, చిన్నవాడు శిల్పకళ అభ్యసించేవాడు. అరమరిక అన్నది లేకుండా అలా ఆరునెలలు గడిచాయి.

''ఒరే రాముడూ.. నా సరదా కొంతవరకు తీరింది. ఇవాళ్నుంచి నేను ఫ్యాక్టరీకి వెడతాను'' అన్నాడు చిన్నవాడు.

ఎంతో ఉత్సాహంతో, ఆశతో పెద్దవాడు కాలేజీకి వెళ్ళేడు, వెళ్ళినట్టే తిరిగివచ్చాడు. ఆ కళ్లలో జీవం లేదు! రాగానే తమ్ముణ్ణి కౌగలించుకుని హృదయవిదారకంగా ఏడ్చాడు. వాడి ఆశ నిరాశ అయింది. గొడ్డళ్ళూ గునపాలు ఎత్తి, కాయలు గాచి బండబారిపోయి, సున్నితత్వం శూన్యమయిన వాడి చేతుల కిక శాశ్వతంగా కళాభ్యాసంచేసే అదృష్టం లేదు, చేతులేం వాడి హృదయమే బండబారిపోయింది. కొంతసేపటికి అందులోంచే ఓ పచ్చని మొక్క తొంగిచూసింది.

' ఏవిఁటో ఎంతసేపూ నా గురించే ఆలోచించాను గాని....నిజానికి... నేనే అదృష్టవంతుణ్ణిరా కిష్టుడూ..... నే నేమైపోతే ఏంగానీ నీలాంటి మహాశిల్పిని తయారుచేశాను... మొదట నేనే కాలేజీలో చేరి నువ్వే ఫ్యాక్టరీలో చేరేవు కాదు, యింకా నయం!'' పెద్దవాడు చిన్నవాడి సుందరమైన వ్రేళ్ళని ప్రేమతో స్పృశించాడు. చిన్నవాడు భరించిన బాధ భాష్యాని కందనిది. అనుభవించిన ఆవేదన అక్షరాలకు అంతుపట్టనిది.

పెద్దవాడి రెండు చేతులూ తన చేతుల్లోకి తీసుకున్నాడు. ముద్దెట్టుకున్నాడు కళ్ళకద్దుకున్నాడు. కన్నీటితో అభిషేకం చేశాడు.

'ఎంత మంచివి ఈ చేతులు! ఎంత అందమైనవి ఈ చేతులు!! తాము త్యాగం చేసి అరిగిపోయి నా చేతుల్లోని సౌకుమార్యాన్ని నిలిపి సుందరమైన కళను వికసింపజేసిన వీటికి నేను చెయ్యగల బహుకృతి ఏమిటి? ఏమిటి?'

ఆ చిన్నవాడు అదేపనిగా ఆలోచించాడు. వాడి మనస్సులో శ్రమ సౌందర్యంతో జ్వలిస్తున్న ఆ చేతులూ వ్రేళ్ళూ అలా నిలిచిపోయాయి. కరుణారసం కరుడుగట్టి కట్టెదుట నిలచింది. సర్వశక్తులూ కేంద్రీకరింపజేసి వాడి జీవితంలో ఒకే ఒకసారిగా అద్భుతమైన శిల్పకళాసృష్టి చేశాడు. ఆ రెండు చేతుల్నీ ఒకదాని ప్రక్క మరొకటి ప్రార్థిస్తున్నట్టు చక్కని ఫలకంపై అపూర్వంగా చెక్కేడు. 'చేతులారంగ....' అని క్రింద వ్రాశాడు. ఆ శిల్పానికి ప్రపంచంలోనే ప్రథమ బహుమతి లభించింది.

★ ★ ★

అందచందాల నిర్వచనంగా ఒకరు ఓ చోట చెప్పిన చక్కని కథ పైది, అదే సంగతి నాకు మరో విధంగా బోధపడిన మరో చిత్రమైన కథ క్రిందిది.

కృష్ణమూర్తి నాకు యింటర్మీడియట్లో క్లాసుమేటు. తుని నుంచి నేనూ, ద్రోణాచలం నుంచి వాడూ వచ్చి కాకినాడలో కలుసుకున్నాం, కలుసుకున్న కొద్దిరోజుల్లోనే పైకి తెలియని పరస్పరాకర్షణకు లోనయ్యాం. గాఢ స్నేహితులం అయిపోయాం.

ఇప్పుడు తలుచుకుంటే ఆ రోజుల్లో అతని చమత్కార సంభాషణకే జోహారు లర్పించానా అనిపిస్తుంది.

''క్రిష్ణమూర్తీ యీ చొక్కాగుడ్డ చాలా బాగుందయ్యా. ఎక్కడ తీశావు?' '

''కొట్లో''

'' ఆ సంగతి అందరికి తెలుసు..... ఎక్కడ కొన్నావని?''

''బజార్లో.......బట్టల కొట్లో.''

''అబ్బా......... ఏం భాష బాబూ యిది?''

''తెలుగు''

''అలాగా, మాకు తెలీదు సుమీ......... గుడ్డ అత్యాకర్షణీయంగా ఉండబట్టి నిన్నిన్ని రకాల ప్రశ్నలు అడగవలసి వచ్చింది. ఏ కొట్లో కొన్నావో చెప్పవుగదూ.... పోనీ కొట్టుకొట్టూ వెతుకుతాంలే, ఎలా కొన్నావో అదయినా చెప్పు మరి.''

''డబ్బిచ్చి.''

''ఏం తిక్కమనిషి బాబూ? సరిగా చెబుతావా చెప్పవా? గజం ఎంత?''

''మూడడుగులు.''

''అబ్బా చంపకయ్యా బాబు, అసలే మేము గుడ్డ దొరకదేమో అని సస్పెన్సుతో చస్తుంటే.... బట్ట ఎలా తీశావని?''

'ఇలా......కుడిచేత్తో.''

అంతేగాని అడిగినదానికి ఆ మనిషి నుంచి జవాబు రాదు!

ఓసారి మా క్లాసులో – మేం ఎప్పుడూ చివరి బెంచీలో కూచునేవాళ్ళం – విష్ణుచక్రనాదం కోసం గజేంద్రుడిలాగ– బెల్ ఎప్పుడవుతుందా అని చూస్తూ కూచున్నాం. కఠిన సమాస భూయిష్టమైన వ్యాకరణారణ్యంలో అగోచర విహారం చేస్తున్నాడు మా తెలుగు లెక్చరరు రామేశ్వరావుగారు. ఒక్కడికి ఒక్క ముక్క బోధపడితే ఒట్టు. కృష్ణమూర్తి నా ముందుకి చిన్న కాగితం విసిరాడు. అందులో యిలా రాశాడా తుంటరి.

'నవనవలాడెడు ప్రాణులు
చివరికి తమ బోధచే అచేతనమయ్యెన్
భవదీయ శిష్యకోటికి
శివరామా! క్లాసు వదిలి జీవనమిమ్మా!'

నా వెనకవాళ్ళూ పక్కవాళ్ళూ– గేలరీమీద ఉన్నామేమో – ఓ పదిమందిలా ఆ కాగితం చదువుకుని ఒక్కసారి గొల్లుమన్నాం.

''ఆ కాగితం యిలా యివ్వండి'' అన్నారు ఆయన. మాకు ప్రాణాలు లేవు.

ఆవేళతో మా కృష్ణమూర్తి కాలేజీ జీవితం సరి అనుకున్నాను ఆ రోజు.

ఆయన ఎంత సరసుడో చూడండి. పద్యం చాలా బాగుందనీ యింకా రాస్తూండమనీ ప్రోత్సహించి పంపేడు!

చపలత్వమూ చురుకుతనమూ చిత్రంగా మేళవించిన వాడి బహు విధమైన 'యాక్టివిటీ' చూసి వాడికి నేను 'ఉడతశ్రీ' అని మారుపేరు పెట్టేను, అయితే వాడు నాకు తిరిగి బహూకరించిన మారుపేరు యిక్కడ నేను చెప్పడం ప్రస్తుతమూ కాదు – నా కేమంత క్షేమకరమూ కాదు!

అయితే తూగుటుయ్యాల లూగుతున్న ఈ గంగాతరంగాలకు గంగోత్రి వేరే ఉందని నాకు ముందు తెలియనేలేదు.

హెచ్. యి.ఏ.డి. కలిపితే 'హీడ్' అని పలికే నాకు 'రన్ గ్రామరు' అవసరమని ఇరవైయో ఏట తోచి కృష్ణమూర్తినడుగుతే " అలాగే" అని తెచ్చి పడేశాడు.

ఇస్తూ ఓ పజిలు నామీద విసిరాడు.

''ఇది మా అమ్మది. అంతేకాదు ఈ పుస్తకమే నాకు అమ్మలాంటిది.... ఒక్క పేజీ నలిగిందా డొక్క చీల్చేస్తాను.''

'ఈ పైత్యానికేంలే....' అని మనసులో అనుకొని ఆ పుస్తకం యిలా తీశాను.

ఆ పేజీపైనున్న ఖాళీలో యిలా ఉంది.

'నా పేరు తెలుసుకోవాలనుందా?... రెండొందల ఏభైనాలుగో పేజీ చూడు.'

ఆ పేజీ తీశాను.

'అంత సులువుగా దొరుకుతానా? నూటపదో పేజీ తిరగెయ్యి'. అదీ తీశాను.

'ఇక్కడ కాదు. అరవైనాలుగో పేజీ చూడు.' అది కూడా తీశాను.

'ట్రై అండ్ ట్రై. నూటఏభై రెండులో వెతుకు. సహనం ప్రయోజనకారి కాకపోదు.' నాకు ప్రాణం విసుగెత్తినా తహ తహ చంపుకోలేక ఆ పుట కూడా తీశాను.

'దారిలోనే ఉన్నావులే..... మంచివాడవు కదూ! ముప్పైమూడో పేజీ తియ్యమ్మా.' ఆ పేజీ కూడా తీశాను.

'ఓయి వెర్రివాడా? ఎండమావుల్లో ఏవీ బావులు! పేరు ఎక్కడ రాసుకుంటారో ఆ మాత్రం తెలియదా నీకు?'

ఇంత వెదికితే చివరికి మిగిలింది ప్రశ్న మాత్రమే. కొంచం ఆలోచించి మొదటిపేజీ చూశాను. కాస్త కనీకనబడకుండా అక్కడే ఉన్నాయి అక్షరాలు కె. స్వరాజ్యలక్ష్మి అని. గ్రామరు నాకు రాలేదుగాని అందులో గ్లామరు నన్ను ముగ్ధుణ్ణి చేసింది. పెళ్ళి చూపులనాడు కూడా 'మా అమ్మయి ముస్తాబు అవుతోంది. అందాకా దాని రైటింగు ఎలా ఉంటుందో చిత్తగించండీ' అని కృష్ణమూర్తి తండ్రికి యీ పుస్తకమే అందించారుట. అందులోని కొంటితనాన్ని గాఢంగా వరించి ఆనాడే బాలగంగాధరతిలక్తోపాటు గంగాధరంగారు కూడా 'స్వరాజ్యం నా జన్మహక్కు' అనుకున్నారుట!

★ ★ ★

రాజ్యలక్ష్మమ్మగారికి కాపురానికి వచ్చిన మరుచటి ఏడే కృష్ణమూర్తి పుట్టాడుట. ఆ పురిట్లోనే అవిడకు చాలా జబ్బుచేసిందట. దాన్తరవాత మళ్ళీ ఆవిడకు కానుపు లేదు, ఇది ఎందుకు చెపుతున్నానంటే వాళ్ళిద్దర్నీ తల్లీ కొడుకులని ఎవరూ అనుకోరు. వీడు ఉడతలా ఉంటే ఆవిడ పిచికలా ఉంటుంది. ఇద్దరూ అక్కాతమ్ముళ్ళలా ఉండేవారు. ప్రతీ చిన్న విషయానికీ యిద్దరూ చిన్ని పిల్లల్లా దెబ్బలాడుకుంటూ ఉండేవారు. ఎడ్వకేటు గంగధరంగారికి యివి రెండూ రెండుకళ్ళు. ఎవరి పక్షం తీర్పుచెప్పకుండా రవ్వంత విసుగులేకుండా చిరునవ్వుతో అయిన వాళ్ళ చిల్లర తగవుల్ని వీక్షించడం నాకు ఎప్పటికీ కమనీయ దృశ్యం.

'ఈ వెర్రివెధవకి చదువొకటా? పెళ్ళి కూడానా ఖర్మ!' అనే ఆ తల్లికీ, కొడుకు చీకటిపడే సరికి యింటికి రాకపోతే కలిగే ఆతృతా, 'ఇంత వయసొచ్చి దీనికి పౌడర్లు ఎందుకో? ఈ షికార్లు ఏమిటో' అనే ఆ కొడుక్కి, తల్లికి కాస్త ఒళ్ళు వెచ్చగా ఉంటే పొందే ఆదుర్దా చూసితీరాలి మరి, చెబితే నమ్మరు గద!

★ ★ ★

మా స్నేహానికే అప్పటికి ఎనిమిదేళ్ళ వయసొచ్చింది.

వాడి పెళ్ళికి నే వెళ్ళినవాడు అంతమందిలోనూ పెళ్లాన్ని బరబరా నా ముందుకి లాక్కొచ్చి......

''ఎలా ఉందంటావ్? నిజం చెప్పు కనురెప్పలు దిద్దీ, సవరం జెడకట్టీ మోసపుచ్చారు పెళ్ళి చూపులనాడు... ఇంత చిన్న కళ్ళు అనీ, ఇంత చిన్న జడ అనీ ఎవరికి తెలుసూ!'' అనడం, వెంటనే ఆ పిల్ల అందుకొని''నిజమే నిజమే.... అరంగుళం దళసరిని కోటాకోట్టి, పక్కనున్న కుర్చీపీటమీద నిలబెట్టి బోల్తా కొట్టించారు ఆనాడు. ఇంత నల్లరంగు అనీ మరీ యింత పొట్టిమనిషి అనీ ఎవరికి తెలుసూ!'' అనడం నేను

మరిచిపోలేని విషయాలు. అంతేగాదు. కృష్ణమూర్తి కొడుకు అన్నప్రాశననాడే వాళ్ళూ క్రొత్తగా కట్టించుకున్న యింట్లో గృహప్రవేశం కూడా చేశారు. ఆంధ్రదేశంలో ఉన్న అయిదురకాల సంపెంగలూ, మాదీ అని ఓ యిల్లు కట్టుకుని అందులో వేసుకోవాలి అనే గంగాధరంగారి కోరిక కూడా తీరింది. నేను వాళ్ళ కొత్తయింటికి రాగానే మొక్కలకి నీళ్లు పోస్తూ నన్ను చిరునవ్వుతో పలకరించింది కూడా అయనే.

''అదేవిఁటి మీరు నీళ్ళుపోస్తున్నారేం? బంట్రోతు ఏమయాడు?''

''మానిపించేశాను. ఇంకా వాడెందుకు? అయినా ప్రాక్టీసు కూడా మానేశాక నేను యింట్లో ఉండి పడే పాటేమిటి గనుక! వాడేమో ఆఫీసుకు పోతాడు.కోడలు ఎప్పుడూ అలా పెరట్లో పనిచేసుకుంటూనే ఉంటుంది. ఇంకా మా ఆవిడ సంగతి నీకు తెలిసిందే కదా. ఎంత వయసొచ్చినా యింట్లో క్షణం కాలు నిలవని వెయ్యిళ్ళ పుజారి అది. ఇంక యీ తోటలో మిగిలేది యింకా పళ్ళూడని యీ తాతగారూ, యింకా పూర్తిగా పళ్ళురాని ఆ బాబుగారూ ఎవరికి తప్పినా మాకు మాత్రం తప్పదు గదా''

ఆ చివరి మాటలు ఆయన నవ్వుతూ అన్నప్పుడు ఆయనగాని నేనుగాని అలాగే జరుగుతే ఏలా ఉండునని కలలో అయినా అనుకోడానికి అంగీకరించి ఉండము. కాని జరిగింది అదే ఆ మధ్య ఆ వూళ్లో ఇన్ఫ్లుయెంజా అంటువ్యాధి మహాతుఫాను ఇంటింటా వచ్చి వెలిసిన తరువాత ఆ యింట్లో ఆ తల్లీ లేదు, ఆ కొడుకూ లేడు!

''ఇదిగోనోయ్ ఇదే. డ్రాయింగు రూం. ఇది మా అబ్బాయి బెడ్రూం. తరువాత వసారా, అది దాటితే హాలూ..... దూరంగా మా పడకగదీ..... ఎంచేతంటావా నిన్నగాక మొన్న పెళ్ళయినవాళ్ళు వాళ్లు....... ఏం ముద్దులూ ముచ్చట్లూ ఉంటాయో... ఆ గుసగుసలూ అవీ రాత్రిపూట యింకోళ్ళు వినడం వాళ్ళకి ఏమంత హితువుగా ఉంటుంది గనుక.. అందుకని మా గది దూరంగా'.'

''అలా అనకపోతే మీ కస్సుబుస్సులూ, చిర్రుబుర్రులూ వినిపించకుండా మీ గదికి మా గదే దూరంగా ఏర్పాటు చేశారని ఎందుకనుకోకూడదు?'' అని పరాసకాలాడుకొనే ఆ తల్లీ కొడుకూ యిప్పుడు లేరు!

విద్యాపీఠం పొట్ట చేత్తో పట్టుకొని ఎవరి సంసార తాపత్రయాల్లో వాళ్ళు పడిపోయి విడిపోయినా, నాకే ' 'కృష్ణమూర్తి, మమ్మల్నందర్నీ విడిచి వెళ్ళిపోయావా కృష్ణమూర్తి,'' అని గుండె బద్దలవుతూంటే – ఆ కఠిన సత్యం ఒప్పుకోడానికి మనసు శతథా మొండికెత్తుతూఉంటే –– ఆ గంగాధరంగారికి ఒక్కగానొక్క కొడుకు... పాతికేళ్ళవాడు. ఉద్యోగం చేస్తున్నవాడు.... కట్టుకున్న యింట్లో కళ్ళముందు కలకాలం కళకళల్లాడుతూ కదలాడవలసిన వాడు..... హఠాత్తుగా మాయమయితే ఎలా భరించారో, బాధ పంచుకోడానికి సహధర్మచారిణి కూడా లేకుండా కొడుకుతో గిల్లికయ్యం పెట్టుకోడానికి కూడా వెళ్ళిపోతే, ఎలా బతికి నిలబడ్డారో నా ఊహకందని విషయం. ఏదో పనిమీద ఆ ఊరు వెళ్ళినా అటువయిపు వెళ్ళడానికి నా కాళ్ళు రాలేదు. అయినా ఆ వీధి చివర్నే మా బంధువులు ఉండి వెళ్ళవలసి వచ్చింది. ఆయనే నన్ను చూసి పిలిచారు. ఆయన్ని చూడగానే నా కళ్ళనీళ్ళు ఆగలేదు.

''నన్ను పరామర్శించడానికి వచ్చి నువ్వే ఏడుస్తున్నావా బాబు?'' అన్నారు ఆయన. నేను కళ్ళెత్తి చూశాను.

''ఏవిఁటో ప్రతి శరీరమూ ఒక అద్దెకొంప. కాని ఈ అద్దెకొంపే ప్రతినిత్యం సొంతకొంప కోసం చూస్తూంటుంది. చిత్రంగా లేదు?''

నిజమే, ఆయన మాట చిత్రంగానే ఉంది చెట్టంత భార్యనీ, కొండంత కొడుకునీ మింగి ఇంకా ఆ మొహంలో ఆ చిరునవ్వు కాంతి చెదరకపోవడం చిత్రంగానే ఉంది.

''మానవుడు స్వార్థపరుడు బాబు..... స్వార్థంతోనే మనోస్వాస్థ్యంకూడా చెడుతుంది. కొడుకును పోగొట్టుకున్నాననే స్వార్థమే నా కన్ను కప్పేసింది. నే నింక బతుకుతే ఎన్నాళ్ళు బతుకుతాను గనుక? ఆ పిల్ల ఎవరు, మా కోడలి మాటే చూడు ఆ పిల్లకి పద్దెనిమిదేళ్ళు కూడా వెళ్ళలేదు, దాని బతుకు ఏం కావాలి చెప్పు? దాని దుఃఖం ముందు నా దుఃఖం ఏ పాటిది చెప్పు? మృదువైన మనస్సూ, చురుకైన బుద్ధీ,

పదునైన నాలికా కలిగి నిత్యం చైతన్య స్రవంతితో యిల్లు ప్రహింపజేసే భార్యా, కొడుకూ ఒకేసారి పోయిన మహాదారుణమైన దుఃఖంలో కూడా యీ 'నయనపథగామి' ఎదుటవారి కష్టసుఖాల గురించే ఆలోచిస్తున్నాడు! ఈ సుఖదుఃఖాలకు వీళ్లెందుకు వంచితులుకారో యిప్పుడిప్పుడు కొంతవరకు నాకర్థమౌతోంది.' '

అవునవును పాపం కృష్ణమూర్తి పెళ్ళాం....'ఇప్పుడెక్కడుందీ?'

''ఎక్కడుంటుందిక? వీడెక్కడున్నాడో అక్కడ...''

నే నంతసేపూ చూడనేలేదు. తాతగారి వెనకనుంచి వాడివతలకి వచ్చాడు. రెండేళ్ళయింది వాణ్ణి చూసి బాగా ఎదిగాడు. ఎంతో ముద్దొస్తున్నాడు.

''ఏం చదువుతున్నావు?'' అన్నాను యింకేం మాటాడాలో తెలీక.

''పిపరీతిరీ'' అన్నాడు. నాకేం బోధనపడలేదు గంగాధరంగారు చెప్పేరు ఏదో మిషన్ స్కూల్లో 'ప్రిపరేటరీ' సెక్షన్లో ఉన్నాట్ట.

శలవు తీసుకుని వెళ్ళిపోతూ వెనక్కితిరిగి చూశాను. అన్ని గదులూ బావురుమంటూ భయం భయంగా కన్పించాయి. అంత ఇంట్లో వెనక పెరట్లో ఆ పిల్ల ఒక్కర్తీ ఏం పనులూ చేసుకుంటూందో భగవంతుడికి తెలియాలి. ఆయన ఏదో మొక్కకి గొయ్యి తవ్వుతూంటే మనవుడూ వీపుమీద ఎక్కి ఊగుతున్నాడు వాళ్ళమీద చెప్పలేని అభిమానం కలిగింది 'ఎవరికి తప్పినా మాకు మాత్రం తప్పదు గదా!' అన్నట్టున్నారు వాళ్ళు.

★ ★ ★

ఇంకో రెండేళ్లు గడిచాక భగవంతుడు గంగాధరంగారిని మరోసారి పరీక్షించాడు. అది ఇలా జరిగింది అనుకుంటారు.

రానురాను గంగాధరంగారికి గార్డెనింగ్ పిచ్చి మరీ ఎక్కువైపోయింది. ఆయన ఇంట్లో పూయించని పువ్వు లేదు. సాయంకాలం అయేసరికి పువ్వులన్నీ మనవడి చేత ఆ చుట్టుప్రక్కల యిళ్ళన్నిటికీ పంపేవారు. అదే పూజ అని ఆయన ఉదేశం. కళ్ళెత్తి చూస్తే ఒక్కొక్కప్పుడు అరుగుమీద నిలబడి రెండు కళ్ళల్లోనూ నీటిచుక్కలు కారుతున్న ఆ కోడలిలో ఆయనకి తెగిపోయిన పూలమాలిక కనిపిస్తూ ఉండేది.

''వెర్రితల్లీ నీ తలలో దండ పెట్టే అదృష్టం నాకు లేకపోయింది'' అనేవాడు.

''అక్కర్లేదు. మీలాంటివారే నాకు ప్రత్యక్షదైవం. నా కన్నీటి పుష్పాలే మీకు ఈ దీనురాలి పూజ'' అనుకునేది ఆమె..

పువ్వులే కాదు, ఆ యింటి ముందున్న విశాలమైన స్థలంలో చక్కని ఆకుపచ్చని లాన్స్ పెంచడం ఆయనకు మహా యిష్టంగా ఉండేది. 'ఇవి గరికపచ్చలు కావు....... భూమహాలక్ష్మి ధరించే గరుడపచ్చల పతకా లివి' అనుకునేవారు ఆయన....

''తాతా తప్కో తప్కో'' అంటూ మూడుచక్రాల సైకిలు మీద వచ్చేవాడు మనవడు, తాత పరచిన పచ్చతివాసీ తిక్కుకుంటూ.

ఆ దృశ్యం చూసి కళ్ళకద్దుకునేది ఆ యింటికోడలు. ఓ సారి వాళ్ళకు తెలిసినవాళ్ళ పిల్లలెవరో చిన్న రెయిన్కోటు వేసుకుని వెడుతూండడం ఆ బాబు చూశాడు. అలాంటిది ఆ యింట్లో? మరుక్షణం వాడికి సరిగ్గా సరిపోయే సిమెంటు రంగు చిన్న ప్లాస్టిక్ రెయిన్కోటూ, చక్కని పువ్వుపువ్వుల రెయిన్హేటూ యింట్లో ప్రత్యక్షమయ్యాయి.

తేగానే అవి వెంటనే వేసుకున్నాడు ఆ బాబు

''వెంటనే వెళ్ళి మా యిస్కూల్లో పిల్లలందరికీ చూపిస్తా'' అన్నాడు వాడు.

''వర్షం రాందే అవి వేసుకోకుడదు బాబు, అందరు నవ్వుతారు.''

బాబు చిన్న బుచ్చుకుని అని విప్పేశాడు.

''అమ్మా! అమ్మా వర్షం ఎప్పుడొస్తుందే?'' అని తల్లి గడ్డంపట్టుకు అడిగాడు.

' వచ్చినప్పుడు చెబుతాలే, అప్పుడు ఎంచక్కా వేసుకుందువుగాన్లే' అంది ఆవిడ. కాని నిజంగా చెప్పనేలేదు. ఆ రాత్రి వర్షం కురిసి కిటికీలోంచి జల్లొచ్చి లోపల పడుతూంటే తలుపు వేసేసి పడుకుంది.

''అమ్మా రాత్రి వర్షం వచ్చిందా!?' అని లేస్తూనే అడిగాడు బాబు గుంటల్లో నిలబడ్డ నీటిని చూసి.

''అవును బాబూ!''

'' మరి నాతో చెప్తానన్నావ్గా, లేపలేదేం?''

''ఆ అర్ధరాత్రివేళ ఏంచేస్తావురా'?'

''మరి వానొస్తే రెయిన్కోటు వేసుకోవద్దా?' '

ఆవిడ నవ్వింది.

''బాగానే ఉందిరా నీ వరస... తడిస్తే వేసుకోవాలిగాని ఊరికే ఎందుకూ?''

''వేసుకుని తడవకూడదా ఏమి?''

బాబు అమ్మని క్షమించలేదు. పోనీ అది వేసుకుని పదిమందికీ చూపించక పోతే పోయె ఓసారి అది వేసుకుని వానలో నుంచుంటే ఎంత తమాషాగా ఉంటుందీ?

వర్షకాలమయినా ఆ నాలుగు రోజులు వర్షమే కురువలేదు, అయిదోరోజు వర్షం కురిసే వేళకు బాబు బళ్ళో ఉన్నాడు. వాడు ఆవాళ స్కూలుకి రెయిన్కోటు తెచ్చుకోలేదు. స్కూలు విడిచేసరికి వాన వెలిసిపోయిందికూడా....

బాబు ఆశగా ఆకాశంకేసి చూసేవాడు ఎక్కదయినా చిన్న మబ్బు అన్నది ఉన్నదేమోనని.

''తాతా అనలు యిక వానలన్నది పడవా?'' అని అడిగాడు.

ఆరోజున గంగాధరం గారు వాడి కళ్ళలోకి చూశారు. అక్కడ లేదా వాన? పెద్ద పెద్ద చినుకులు పడాలి. పన్నీరులాంటివి, పారిజాతాల లాంటివి, గబగబగటగట పడాలి దడదడ పడాలి చిట్పటచిట్పటమని పడాలి, నిలువుగా అడ్డంగా వంకరగా అన్ని రకాలుగా చినుకులు పడాలి. అమ్మోయ్, నాన్నోయ్, బాబోయ్, తాతోయ్ అని అందరూ అటూ యిటూ పరిగెత్తాలి. ఆ మధ్యనుంచి ఏ మాత్రం భయంలేకుండా ఏ కొంచం లెక్కలేకుండా కవచం తోడుక్కుని యుద్ధం లోకి వెళ్ళిన అభిమన్యుడిలా తను రెయిన్కోటు వేసుకుని, టోపీ పెట్టుకుని చకచకా నడిచివెళ్ళాలి అందరూ ఆశ్చర్యపోవాలి.

అన్ని కోరికలున్నాయి ఆ కళ్ళల్లో.... అన్ని రంగులున్నాయి ఆ కన్నీళ్ళలో.

ఆ మర్నాడు పదిగంటలవేళ బాబు పరిగెత్తుకు తాతదగ్గిరకి వచ్చాడు. ఒక మోస్తరుగా వర్షంపడుతోంది.

''తాతా, తాతా యిదిగో రెయిన్కోటు తొడగవూ? నాకు పెట్టుకోడం రాదు తాతా, గుండీలూ అవీ సరిగా పెట్టవూ?''

వాడి సరదాకి ముచ్చటపడి గంగాధరంగారు కోటు తొడుగుతూ ఒళ్ళు ముట్టుకు చూశారు యధాలాపంగ. ఒళ్ళు కాలుతోంది. రెండు గుండీలు పెట్టిన కోటును మళ్ళీ విప్పేశారు. ఎత్తుకుని కోడలి దగ్గరికి తీసుకొచ్చేరు.

''వీరికి జ్వరమొచ్చినట్టుంది చూడు తల్లి' అన్నాడు' భయంగా. టెంపరేచరు చూశారు నూటరెండు ఉంది.

వాడు ఆ కోటు వేసుకుని వర్షంలోకి వెడతానని ఎంత పేచీ పెట్టినా వాళ్ళు ఒప్పుకోలేదు. ఆవాళ ప్రారంభించిన ఆ వాన ముసురుగాపట్టి యించు మించు వారం రోజులు కురిసింది కిటికీలోంచి వర్షం చూస్తున్నాడు వాడు. హేంగర్కి తగిలించి గాలి కెగురుతున్న రెయిన్కోటు చూస్తున్నాడు వాడు. అలా ఆ వారం రోజులు చూస్తూనే ఉన్నాడు. చివరిరోజున పన్నీరులాంటి, పారిజాతాల్లాంటి, బాణాల్లాంటి ఆ

చినుకులు ఎక్కణ్ణుంచి వస్తాయో అక్కడికే వెళ్ళిపోయాడు వాడు!

★ ★ ★

కృష్ణమూర్తి కొడుకు పోయాడన్న సంగతి వినగానే ప్రాన్పడిపోయాను నేను. పిచ్చెత్తకముందో, ఆత్మహత్య చేసుకోకముందో తక్షణం వెళ్ళి గంగాధరంగారిని కలుసుకోవడం నా కర్తవ్యంగా భావించాను. ప్రకృతిలో లీనమై పరమపవిత్రంగా జీవితాన్ని గడుపుతున్న ఆ ప్రశాంతమూర్తిని యింకా భగవంతు డెందుకు పరీక్షస్తున్నాడో నాకు తెలీదు. దేన్ని చూసుకుని బతుకుతున్నాడో అదే పోతే మనుషులు ఏమైపోతారో నాకు తెలీదు. తెలుసుకోవాలని ఉంది. అందుకే తక్షణం రెక్కలు గట్టుకుని అక్కడ వాలేను.

గేట్లోంచే అల్లంత దూరాన గంగాధరంగారిని చూస్తూ నిర్ఘాంతపోయాను. ఈ సారి కూడా నన్నే ఆయన పరామర్శ చేయవలసి వస్తుందని నేను కలలో అనుకొలేదు. ఆయన చేతికత్రతో కొమ్మలు విరిగిపోకుండా గులాబి పువ్వులు కోస్తున్నాడు. ''రా బాబూ రా గుమ్మంలోనే నిలబడిపోయావేం?'' అని ఎప్పట్లా ఆదరించాడు. స్పష్టంగా. శ్రద్ధగా విన్నాను, చూశాను. అదే గొంతుక అదే చిరునవ్వు. అది మానవ హృదయమో కఠిన శిలా ఫలకమో నాకు అర్థం కాలేదు నిశ్శబ్దమైన వాతావరణాన్నీ, నిర్మానుష్యమైన ఆ భవనాన్నీ నేను భరించలేకపోయా ననుకుంటాను, కాదు. కాదు.... అత్యున్నతమైన ఆ మహావ్యక్తి సాన్నిధ్యాన్ని నేను సహించలేకపోయాను. ఇతడు దేన్ని చూసుకుని జీవిస్తున్నాడో నేను ఊహించలేకపోయాను. 'ఎవరికి తప్పినా నాకు మాత్రం తప్పదు గదా!' అని ఎలా అనుకోగలుగుతున్నాడో అర్థంచేసుకోలేకపోయాను ''మళ్ళీ వస్తాను'' అని గుమ్మంలోంచే వచ్చేశాను.

దుర్భరమై ఏకపుత్ర శోకంతో ములిగిపోయిన కృష్ణమూర్తి భార్యని తీసుకువెళ్ళడానికి వచ్చిన ఆమె తండ్రి రెండు చేతులూ పట్టుకుని ''బావగారూ, దురదృష్టవంతుణ్ణి నేను. మనవడు మీ దగ్గిరున్నా బ్రతుకునేమో..... అమ్మాయిని చూస్తే కడుపు తరుక్కుపోతోంది. బొత్తిగా చిన్నపిల్ల... పెళ్ళే కాలేదనుకోండి పిల్లే పుట్టలేదనుకోండి. తగిన ధైర్యంచెప్పి నాలుగు ఊళ్ళూ తిప్పి మళ్ళీ మనిషిని చెయ్యండీ. ఈ అయిదువందలూ ఉంచండి..... పిల్లని అలాగే ఉంచేస్తే భగవంతుడు మన్ని క్షమించడు. వీలయినంత తొందర్లో పెళ్ళి చేసేద్దాం. ఎంత కట్నం యిచ్చైనాసరే, ప్రపంచమంతా ఎదురైనా సరే'' అని గంగాధరంగారు అన్నారంటే కొంతవరకు నమ్మగలను.

ఎనిమిదేళ్ళ శంకరాచార్యుడు ''అదేమిటే అమ్మా, తెలిసినవాళ్ళెవరో పోయారని ఏడుస్తున్నావా! తోమ్మిదికన్నాలున్న తోలుతిత్తి అయిన ఈ శరీరంలో ప్రాణవాయువులాంటి పదార్థం ఉందంటే చిత్రంగాని అది బయటకు పోయిందంటే అందులో ఆశ్చర్యం ఏముందే?'' అన్నాడంటే కథగా నేను నమ్మగలను. అదే ఆధ్యాత్మిక దేశంలో అన్నీపోయిన గంగాధరం లాంటివారు చిరునవ్వుతో జీవించగలుగుతున్నారన్న విషయం సత్యమే అయినా అది నాలాంటి సామాన్యుడికి అర్థంచేసుకోలేనిది. గంగాధరంగారి ఆత్మ అందచందాలు నాలాంటి వాడికి అగోచరమైనవి.

# ఇంద్రధనుస్సు లో సంగీతం కనక్ ప్రవాసి

**(కృష్ణాపత్రిక వజ్రోత్సవ సంచిక నుంచి పునర్ముద్రణ)**

'కాలం ఎవరికోసమూ ఆగదు కాని కనిపించని కాలానికి కట్టుపడి అందరూ బ్రతకాలి' –అని విసుక్కున్నాడు , రైలు దాటిపోయిందని తెలుసుకున్న ప్రకాశం. తను బయలుదేరిన వేళావిశేషమేమో ! రాబోయే కష్టాలు కొంచెం ముందే తెలిసిపోతే ఎంత బాగుండిపోను! చెప్పి రావు ఏవీ!

ప్లాటుఫారంమీద ఇటునుంచి అటు నాలుగైదు సార్లు పచార్లు చేశాడు. తను వెళ్ళదలచినవైపు రైలు మళ్ళీ నలుగైదు గంటల వరకూ లేదు. ఎప్పుడో రావలసిన రైలుకి ఇప్పటినుంచీ వేచియుండే ప్యాసింజరు తానొక్కడేలా కనిపిస్తున్నాడా స్టేషనులో. చాలా చిన్న స్టేషను అది.

ఆ స్టేషనుకు ఊరనేది ఉందో లేదో తెలియదు. దూరంగా కొండలు కనిపిస్తున్నాయి. దగ్గరలో రెండో మూడో రైల్వేవాళ్ళ ఇళ్ళు.....అంతకుమించి ఏమీ లేదక్కడ.

ఇలాంటి స్టేషన్లో ఉద్యోగం చేసేవాళ్ళ జీవితం చాలా భయంకరంగా ఉంటుందని బాధ పడ్డాడు ప్రకాశం. స్టేషను మినహాయిస్తే అక్కడ జీవితమే లేదు. ఇటువంటిచోట రైళ్ళకు వెళ్ళే జనాన్ని చూస్తూ కాలక్షేపం చేద్దామన్నా జనసంచారమే తక్కువ. ఉండే అయిదారుగురు ప్రయాణీకులూ ఆ స్టేషనునీ జీవితాన్నీ నిందించుకుంటూ తమ దురదృష్టానికి వగచేవాళ్ళలా కనిపించారు ప్రకాశానికి.

స్టేషను మాష్టరు కనిపించాడు. "ఏవూరు? ఏక్కడికి వెళ్ళాలి?" ప్రశ్నలువేసి యోగక్షేమాలు కనుక్కున్నాడు, అంత తీరికగా ఉన్నాడాయన అక్కడ.

చాలాదూరం రోడ్డుప్రయాణం చేసిరావడంచేత గుడ్డలన్నీ బాగా మాసిపోయాయి ప్రకాశానివి. వెంటనే రైలు అందుతుందేమో అని ఓ జీప్ వాడిని బ్రతిమాలి అందులో ఇంతదూరం వస్తే రైలు కాస్తా దాటిపోయింది. మళ్ళీ సాయంత్రం ఆరుకి కాని తను వెళ్ళేవైపు రైలు లేదు.

"జీవితంలో ఇలాంటి కష్టాలు ఎన్నని అనుభవించడం! తొమ్మిదింటికి ఇంట్లో వంట కాకపోతే ఓర్చుకోలేము. ఒకటవ తేదీకి జీతం ఇవ్వకపోతే సహించలేము. రైలు ఆలస్యంగా వచ్చినా, మనం ఆలస్యమై అది సమయానికే వచ్చిపోయినా వేచియుండలేము!" అనుకున్నాడతడు. మనిషి దిక్కులేని తనం ఈ సమయంలో అతనికి స్పష్టంగా తెలుస్తోంది. అక్కడ వేటికవే ఒంటరిగా కనిపిస్తున్నాయి. స్టేషను వెనక నిద్రగన్నేరు చెట్లు విడివిడిగా అర్థం లేకుండా నిలబడి చూస్తున్నాయి. కదిలేందుకు కూడ భయపడుతున్నట్టున్నాయి. స్టేషనులో చైతన్యంలేక విసిరేసినట్టు అక్కడా అక్కడా ఒకళ్ళూ ఇద్దరూ జనం.

ఇదేమి స్టేషను.....వేరుశనగపప్పు కేకలులేని స్టేషను.....'పాలకోవా' అరుపులు వినిపించని స్టేషను. బిచ్చగాళ్ళు మాత్రం ఎందుకుంటారు ఇవేమిలేనప్పుడు! స్టేషను వెనకాల ఓ చిన్న టీ దుకాణం ఉంది. వాడు టీ అందరికీ అమ్ముకొనేరకమో లేక వాడిమట్టుకు వాడు పెట్టుకొని కాచుకుతాగేరకమో! అదే అనుమానం కలిగింది ప్రకాశానికి.

స్టేషనులో పట్టపగలే దొంగలు కొట్టవచ్చు!... అయితే ప్రయాణీకులే లేని స్టేషనుకు దొంగలుకూడ ఎక్కడనుంచి వస్తారు?__ అనుకున్నాడు.

టీ కొట్టువాడు ఏం చేస్తున్నాడో అని వెళ్ళాడు. అంత మధ్యాహ్నం అయినా నిద్రలేని కళ్ళతో కునికిపాట్లు పడుతున్నట్టుంది 'టీ దుకాణం'...తనని చూసి పొయ్యిలో నిప్పు వేస్తాడేమో వాడు!......అంతక్రితమే వెలిగించినట్టున్నాడు.....కుక్క ఒకటి దగ్గరలో కునికిపాట్లు పడుతూ మునగదీసికొని పడుక్కొంది. "టీ ఉందా? కాఫీ ఉందా?"

అడిగాడు, ఏదీలేదనే సమాధానం వినవలసి వస్తుందనే దానిని ఊహించుకుని, అందుకు భయపడి, ఏం వినడానికైనా సిద్ధపడి. "కలిపి ఇస్తా, ఓ నిమిషం ఆగండి!"

ఇచ్చేది "టీ" యో "కాఫీ" యో తెలియదు. బలవంతంగా నోట్లో పోసుకున్నాడు. మాట్లాడేందుకు మనిషి దొరికాడు.

"ఈ దగ్గరలో ఊళ్ళేమయినా ఉన్నాయా?"

"ఈ వైపు నుంచి పోతే రెండు మైళ్ళలో 'పేట'అంటారు, ఓ యాభై కొంపలున్నాయి. అదే ఇక్కడ దగ్గరలో ఉన్న ఊరు. ఆ పైన అంతా అడవులే. ఆ 'పేట' కాని పోవాలా?" అడిగాడు ఆ ఊరి వైపు చెయ్యి చూపుతూ "ఇంజినీరు కృష్ణారావుగారింటికి వెడతారా!"

"ఆ యాభై కొంపల్లో మళ్ళీ ఇంజనీరు ఒకడా?"అన్నాడు ఆశ్చర్యపోతూ ప్రకాశం.

"అక్కడెక్కడో కలకత్తా వైపు ఇంజనీరుగా పనిచేసేవారట. ఉద్యోగం వదిలేసి ఆ 'పేట'లో ఉంటున్నారీమధ్య. వారికిక్కడే భూమి కూడ వుంది. సొంతంగా వ్యవసాయం చేస్తున్నారు. ఈ దారి పట్టుకొని తిన్నగా నడిస్తే ఓ పెద్ద నిద్ర గన్నేరు చెట్టు తగులుతుంది. ఇంకా పైకి వెడితే ఒక పెద్ద చెరువు. చెరువుకి కుడివైపుగా తిరిగివెడితే చిన్న గుట్ట. ఆ గుట్ట వెనకాతలే 'పేట' కనబడుతుంది. వెళ్ళండి."

వివరాలన్నీ వింటుంటే ప్రకాశానికి హఠాత్తుగా 'సుందరి'జ్ఞాపకం వచ్చింది. సుందరి పెళ్ళికి తను వెళ్ళలేదు. సుందరి శుభలేఖ పంపింది. ఆమె భర్త పేరు కూడ కృష్ణారావే! అవును. అతను బొగ్గు గనుల్లో ఇంజనీరుగా ఎక్కడో పనిచేస్తున్నాడని విన్నాడు. ఇక్కడ ఏదో భూమీపుత్రా ఉండవచ్చు. అయినా ఆ కృష్ణారావు ఉద్యోగం వదలి ఎందుకు వస్తాడీ మారుమూలకి? ఎక్కడో పెద్ద ఉద్యోగం చెసేవాడికి ఈ అడవిలో ఇంటరెస్టు ఏమిటి? బహుశః ఇంకెవరయినా అయి ఉండవచ్చు అని సరిపెట్టుకొన్నాడు. 'సుందరి'జ్ఞాపకాని కొచ్చాక ఆ కుతూహలం 'పోనీ వెళ్ళి చూసివస్తే ఎం పోయింది ఓ సారి' కాలక్షేపంలేని ఇటువంటప్పుడు కాస్తనడిస్తే సాయంత్రానికి రైలు టైముకి చేరుకోవచ్చు అనే తొందర కలిగించింది. స్టేషను మాష్టరికి బెడ్డింగు అప్పచెప్పి నడక సాగించాడు ప్రకాశం. ఏడేళ్ళ క్రితం 'సుందరి'జ్ఞాపకం ఇప్పుడు ఓ అర్థంలేని సమయంలో తనని తెలియనిచోటికి నడిపిస్తోందనుకున్నాడు. తను వివాహం చేసికోవాలనుకున్న సుందరి పెళ్ళి శుభలేఖ పంపింది తనకి ఓ రోజున. ఆ సుందరి గొప్ప ఇంజనీరు కృష్ణారావును పెళ్ళాడింది. అంతగొప్ప సుందరీ అంత ఇంజనీరూ ఈ మారుమూల ఊళ్ళో అడవిలో ఉంటారంటే అతనికెందుకో మళ్ళీ నమ్మకం కలగడంలేదు . మరెవరయినా అయిఉండవచ్చు. తనకు నడక వృధా అవుతుంది! అలా అయినా కొంత కాలక్షేపం_ అని సరిపెట్టుకొని నడక సాగించాడు. జ్ఞాపకాలు అతని నడకను త్వరపెడ్తున్నాయి.

అవును!సుందరి పెళ్ళికి తనువెళ్ళలేదు.

తనకి వీలుకాలేదు, 'ఇష్టంలేక' అంటే తానేం చెప్పగలడు. పెళ్ళయిన తరవాత ఈ పదేళ్ళలోనూ సుందరిని తానెన్నడూ చూడనయినాలేదు. ఫలానా అప్పుడు వచ్చిందనీ వెళ్ళిందనీ ఆ వూళ్ళో ఉన్నంతకాలం సుందరి కుటుంబంవల్ల తెలియడం తప్పు! తను వివాహమాడాలనుకున్న సుందరి, తనని ఆరాధించిన సుందరి, తన చదువుతో తను పెద్ద ఉద్యోగి కాడనే భయంతో తనతో వివాహ యత్నం

మానుకున్న సుందరి ఇప్పుడెలా ఉందో! తన జీవితాన్ని పంచుకోని సుందరి, తన రంగురంగుల కలలు నిజంకావనే భయంతో తనతో స్నేహన్ని తగ్గించుకున్న సుందరి – ఇప్పుడేం చేస్తుందో!

ఇప్పుడు నిజంగా తను అక్కడికే వెడుతున్నాడా!

ఈ కృష్ణారావు ఎవరో అయితే! అయినా సుందరి భర్తను తానెరగడు, ఎన్నడూ చూడలేదు.

ఈ అద్వాన్నపు టడవిలో ఈ అర్థంలేని పిచ్చి సమయంలో 'సుందరి' ఉంటుందని నమ్మి చూడాలనే కుతూహలంతో ఏవేవో ఊహల్ని పేర్చుకోవడం అతనికే ఎందుకో చిత్రంగా తోచింది. ఏమైనా, తను ఏడేళ్ళతర్వాత సుందరిని చూడ బోతున్నాడు. చూచే ఆశతో వెడుతున్నాడు. ఎంత చనువుగా ఉండేదో తనతో సుందరి !

ఆమెకు జీవితంలో తీరవలసిన ఖరీదైన కలలను పండించ లేననే భయం ఉండేది తనకి.

ఆమె మాటల్లో ఎంత అహంకారమూ,దర్పమూ, ఠీవీ ఉండేవని! ఎంత కలివిడిగా మాట్లాడినా ఎప్పుడూ అవి స్పష్టంగా కొట్ట వచ్చినట్లు కనిపిస్తూనే ఉండేవి.

ఇప్పుడు మళ్ళీ ఆమె మరింత వైభవంతో కనిపిస్తుంది. 'నిన్ను చేసుకోకపోవడం ఎంత మంచిదయిందో చూడు. ఎంత వైభవంతో తులతూగుతున్నానో' అనేలా కనిపిస్తుంది. దాంతో తన స్థితి మరింత వెక్కిరింపవుతుంది. దానికి తను కుమిలిపోవాలి.

తన కొంచెంతనం వేలెత్తి చూపినట్టు ఇంకా క్రుంగిపోతాడు. ఆమెకు మరింత గర్వం వస్తుంది.తను సిగ్గుపడిపోవాలి. ఎందుకు వెడుతున్నావని అతని మనస్సు ఓవైపు రోదిస్తోంది. ఆమెను చూడాలనే కుతూహలం తీవ్రంగావుండి, అతన్ని నడిపిస్తోంది ముందుకి.

రైలుపట్టాల పక్కనే సాగిన కాలిబాట చాలాదూరం తీసుకొని వెళ్ళింది, ఎండకు రైలుపట్టాలు తళ తళ మెరుస్తున్నాయి. నిద్రగన్నేరుచెట్టు కనిపించింది. చెట్టునీడన నిలబడ్డాడు.ఎండలో నడిచాడేమో చాలా హాయిగా తోచింది నీడ.

ప్రయాణంలో ఓ అర్థంలేని ప్రయాణం ఇది. ఇంతకి తను వెడుతున్నదెందుకు? ఆలోచించేకొద్దీ ప్రయాణంలోని అర్థంలేనితనం స్పష్టమవుతోంది. కోరి బాధను కొని తెచ్చుకోవడం అంటే ఇదేనేమో! తను అనుకునే వాళ్ళు అక్కడఉండి ఉండవచ్చనే ఊహతో వెడుతున్నాడు. ఏడేళ్ళక్రితం దిగబడిపోయిన జ్ఞాపకాల్ని తవ్వుకునేందుకు, బాధ పడేందుకు, బాధపెట్టేందుకు అవమానం పొందేందుకు బయలు దేరాడు తను.

సుదూరాన కొండలపై ఎండ పొగకమ్మినట్టుగాఉంది. సరైన రోడ్డు కాకపోవడంచేత చాలాదూరం నడుస్తున్నట్టుంది. ఎత్తు పల్లాలు, చిన్న చిన్న అర్థంలేని తుప్పలు, రాళ్ళు. విసిరేసినట్లు అక్కడక్కడా ఒక్కొక్క పెద్దచెట్టు, ఇన్నింటికీ తోడు తన పిచ్చిప్రయాణం.

చెరువుగట్టు దగ్గరపడుతున్నది.

తను బాగా దగ్గరవుతున్నాడు 'పేట'కు, 'సుందరి'కి. సుందరి తనను వేయబోయే గొప్ప ప్రశ్నలు ఊహించుకొని తగిన సమాధానాలు వాక్యాలుగా అల్లుకుంటున్నాడు. ఇంతా సిద్ధపడి తను అనుకున్న విధంగా, తగినట్టు చెప్పలేనేమో అని జడుపు. చెరువుగట్టుకు కుడివైపుగా మళ్ళితే చిన్నగుట్ట కనిపించింది,ఎవత్తో కూలి మనిషి కనిపించింది.

"ఊరింకెంత దూరం?" అడిగాడు.

"ఇలా తిరిగి వెడితే ఊరే! ఇంజనీరుబాబు ఇంటికా" అని అడిగింది ఆ కూలిది.

లాగూ చొక్కా తొడుక్కుని కనిపించిన ఎవరైనా ఇంజనీరు కోసమని అక్కడ వాళ్ళ ఉద్దేశమేమోననిపించినదతనికి. ఆమె ఏం చెప్పేదీ పూర్తిగా వినకుండానే ముందుకి సాగిపోయాడు. అడుగులు త్వరత్వరగా పడుతున్నవి. దూరంగా ఓ వైపు తల విరబోసుకున్నట్టున్న తాళ్ళగుంపు,

ఆ వెనకనే తాటాకు కొంపలు కనిపిస్తున్నవి. దగ్గరకొచ్చేడు. అది ఊరు కాదు; ఏవేవో చిన్నపాకలు, రెండు పెంకుటిళ్ళు కనిపించాయి. దారి తప్పేనేమో అనుకున్నాడు.

పందులుకూడా కనిపించాయి. ఇటువంటిచోట సుందరి ఉంటుందనుకోవడం తన పిచ్చి భ్రమ. తను ఏదో పిచ్చిగా అనుకొని,అనుకొన్నది నమ్మి ఏదో చేస్తున్నాడు.

"ఎవరికోసం?ఎం పని మీద?" అని ఒకవేళ కృష్ణారావుగారు ప్రశ్నిస్తే తనేం చెప్పాలి?

రెండు మూడు బూరుగుచెట్లు కనిపించాయి, చాలా ఎత్తయిన చెట్లు.

మోదుగుచెట్లు పూసినట్లున్నాయి,ఒకటే ఎఱ్ఱన, జనసంచారంలేదు. కొంచం దూరంలో మరో మనిషి కనిపించింది మన్ను తొక్కుతూ__అడిగాడు.

"అదుగో! ఆ చెట్లు వెనక్కాల తాటాకు ఇల్లు" అని చెప్పి ఎగాదిగా చూసింది ప్రకాశాన్ని. తన రాక ఇష్టం లేదు లా వుందామెకు అనుకున్నాడు. అలా అలా నడిచాడు.సుందరిని చక్కని బంగళాలో ఊహిస్తున్నాడు. మరి ఈ మనిషి తాటాకు పాక అంటుందేమిటి?

ఏమో!చూడాలి. దట్టంగా చెట్లు కనబడుతున్నాయి.

అక్కడే విరగబూసిన రకరకాలరంగుల పువ్వులు కనిపిస్తున్నవి. ఓ తాటాకు ఇల్లు దగ్గర కొచ్చాడు. వీధి ఏదో దొడ్డి ఏదో ఏమీ తెలియడంలేదు. జనం ఎవరూ కనబడలేదు.అతనికంతా అయోమయంగా ఉంది. దారంటూ కనబడలేదు; కింద ఇంతలోతు రాలిన ఆకులూ పువ్వులూ తుక్కు తప్ప.

ఆ ఇల్లు ఇల్లాలు కనిపించలేదతనికి మట్టి అరుగులు,మట్టిగోడలు పైన పేడపూత పెట్టినట్లున్నారు. ఆ గోడలమీద తాటాకులు బోర్లించినట్టుగాఉంది పైకప్పు. గోడ పక్కకు తిరిగాడు. తెరచిన గుమ్మం కనిపించింది.పిల్లల ఏడుపు వినిపించింది.

సందేహిస్తూ అతని అడుగులు గుమ్మం మెట్లు ఎక్కాయి. ఇంట్లో అట్టే వెలుగున్నట్టులేదు. ఎండలో వచ్చినందువల్ల నేమో లోపల చీకటి. తన కళ్ళు చీకట్లు కమ్మడంతో లోపల ఎవరున్నదీ కనిపించలేదతనికి. చాలాసేపు ఎండలో నడవడంచేత అతని గొంతు ఎండి పిడచ కట్టుకు పోయింది. ఇంతలో పక్కగదిలోనుంచి ఎవరో ఇవతలకి వస్తున్న అలికిడి అయి అతని కళ్ళకు మరింత స్పష్టంగా కనిపించింది అవతలి మూర్తి. అనుకోకుండా హఠాత్తుగా ప్రకాశం కనిపించడంతో ఆమె నిర్ఘాంత పోయింది.

నమ్మలేని కళ్ళతో చూస్తోంది 'ఎవరీమనిషి' అని ప్రకాశాన్ని. ఆమె ముఖంలో కాంతి పోయింది. కళ్ళు జడుసుకున్నట్టుగా అయి మనగలిగినాయి ఒక్క క్షణం. ఆ క్షణకాలం విచిత్రమైన నిశ్శబ్దం, వ్యవధిలేని అర్థంలేని నిశ్శబ్దం.ఆ నిశ్శబ్దమూ ఆమె చూపులూ ఒకేలా ఉన్నాయి. క్రమశః ప్రకృత స్థితిలోకి వచ్చి పమిట నిండుగా కప్పుకుంది. పక్కనుండి చెట్లగాలి రివ్వున వీచింది.ఆ గాలి ఆమె నల్లని జుత్తును ముఖం అంతా చిందరవందర చేసేసింది. సంచలించే తల వెంట్రుకలను ఎడంచేతి మునివేళ్ళతో సరిదిద్దుకుంది నిర్వికారంగా.

'ఈమె సుందరేనా?'–విస్తుబోయి తేరుకోలేని స్థితిలో అలానే చూస్తూ నిలుచుండిపోయాడు. ఆమె ఎప్పుడు తేరుకున్నదో ఎప్పుడు తనను తాను సంబాళించుకొన్నదో ఎప్పుడు తన భావాలను యధా స్థితికి తెచ్చుకున్నదో కనిపెట్టే వ్యవధి కూడా ఇవ్వలేదామె. అతను పలకరించే ప్రయత్నంలో నవ్వబోయాడు. నవ్వు కనిపించినదో లేదో ముఖంమీద.ఆమె నవ్వు యత్నించింది,నవ్విందోలేదో కాని అతనికి నిట్టూర్పు నవ్వడిమాత్రం లీలగా వినిపించింది.

"ఇక్కడున్నావా?" అన్నాడు ప్రకాశం కొంత వ్యవధి చేసుకొని.

"వచ్చావా ప్రకాశం.ఎలా వచ్చావిక్కడికి?"

"అనుకోని అర్థంలేని ప్రయాణంలో రైలుతప్పిపోయి తిరిగుతూ దారితప్పి వచ్చాను.నిన్ను చూస్తాననుకోలేదు.నువ్విక్కడే ఉంటావనే ఆశ నన్నిక్కడకు లాక్కొచ్చింది.చూసిపోదామని."

కొంతసేపు ఆమె ఏమీ మాట్లాడలేదు. "నీ పెళ్ళికి గ్రీటింగ్సు'పంపాను అందాయా?" అంది ప్రకాశాన్ని పరిశీలనగా చూస్తూ. ఎప్పటి మాట!

తనపెళ్ళయి నాలుగేళ్ళయి ఉంటుంది. తాను శుభలేఖ వ్రాయలేదామెకు. తాను వ్రాయలేదని దెప్పడం అన్నమాట.సుందరి పెళ్ళికి శుభలేఖ పంపింది తనకి. తను వెళ్ళనందుకు దెప్పడం కూడా ఉందందులో.

"ఏమో నాకు గుర్తులేదు"అన్నాడు.

"పంపానులే" అంది.

"నిన్ను చూడడం చాలా చిత్రంగా ఉందీక్షణం.మాట్లాడవేమో అనుకున్నా. కులాసాగా ఉన్నావా?" అన్నాడు.

"కులాసాకేం లోటు. మాకిక్కడ ఎంతో బావుంది!"అంది, తనని పరీక్షించేందుకే అలా అన్నాడనే భావంకూడా గ్రహించకుండా.

"అలా నిల్చుండిపోయావేమిటి? రా లోపలికి" అని వెనకడుగు వేసి తప్పుకుంది.

లోపలకు వస్తూంటే అతని తలకి ద్వారబంధంపైన తగిలి తలలో నరాలు జివ్వుమన్నవి ఒక్కసారి."అయ్యో!" అంటూ,ముఖంలో సానుభుతిని వ్యక్తంచేసింది. ఆ గదిలో వెలుగుని జయించే చీకటి ఉన్నది. పక్క మిద్దిగదికి పెద్ద కిటికీ ఉంది.ఆ గదికి ఆ వెలుగుతప్ప ఈ గదికి అదీలేదు.ముందు గదిలో మాసిన గుడ్డలు రెండు మూడు తలుపుమీద వ్రేలాడుతున్నాయి. గదిలో ఓ పట్టిమంచం వాల్చి ఉంది.ఓ మూల రెండు ధాన్యం బస్తాలున్నాయి. పైకప్పుఅంతా తాటాకు నేతే. తాటిపట్టెలపై నిలబెత్తిన ఇల్లది. ముందు కనిపించే నల్లగా పొగచూరిన గోడలభాగం వంటిల్లు అయిఉంటుందనుకున్నాడు. పాలచెంబు ఒకటి కనబడుతున్నది గుమ్మం పక్కన. క్రింద తాటాకు చాప పరచి ఉంది. ఈ గదిలోంచి,అవతల దొడ్లో వెదురు దండెంపై ఆరేసిన తడిగుడ్డలు కనబడుతున్నాయి. చుట్టుపక్కల చెట్లు ఎక్కువగా ఊగడంచేతనేమో గాలి ఎక్కువగా వస్తోంది ఇంట్లోకి.

గదిలో అడుగుపెడుతూనే లోపల ఉన్నవాటన్నిటినీ ఒక్కసారి కలయజూచాడు. అంతా అర్థం చేసికొన్నట్టు చూశాడు. మోదుగ పిచ్చిగా పూసింది. నిర్వికారంగా సుందరివైపు చూశాడు. తనతో స్నేహం పెంచుకుని తనతో జీవితం పంచుకోకపోవడంలో తన ఆధిక్యాన్ని ప్రకటించుకుని తనకు దూరమైన సుందరిని ఏడేళ్ల తర్వాత చూస్తున్నాడు ప్రకాశం.

ఇద్దరూ ఒకరితో ఒకరు ఏవేవో చెప్పుకోవాలనుకుంటున్నారు.

"అమ్మా!" అంటూ సుందరి కాళ్ళను చుట్టేసిన మూడేళ్ళ పిల్లాడిని చూశాడు ప్రకాశం.

ఆ కుర్రాడు 'ఎవరీమనిషి' అన్నట్టు ప్రకాశాన్ని భయంగా చూస్తూ ఏడుపు ప్రారంభించాడు.

ఆ కుర్రాడికంటె కొంచెం పెద్దది ఆడపిల్ల. చాలా అమాయికంగా చూస్తోంది. వంటింట్లోంచి ఇంకోబిడ్డ ఏడుపు వినిపిస్తోంది.

"మీ పిల్లలు..." అన్నాడు ఏదోవిధంగా మాట్లాడేందుకు ఉపక్రమించాలికనక,అసంపూర్తిగా.

"ఆఁ అన్నట్టు మంచినీళ్ళు ఇవ్వడమే మరచిపోయాను."అనుకుంటూ వంటింట్లోకి వెళ్ళింది. ఓవైపు చెవిటికాకి అరుపు వినిపిస్తోందతనికి. వంటింట్లోబిడ్డ ఏడుపుస్థాయి హెచ్చుతోంది. తల్లి బిడ్డను కొడుతుందేమో అన్నంతగా వంటింట్లోచి ఏడుపు అధికమౌతూన్నది. ఆ ఇల్లు_ఆఏడుపు_చెవిటికాకి అరుపు వినబడుతూంటే అతనికి ప్రాణాలు పోతున్నంత బాధ కలిగింది. బుఱ్ఱలో నరాలు తెగిపోతాయేమో అన్నంత బాధ కలిగింది. తట్టుకోలేక, వంటింటి గుమ్మంలోకి వెళ్ళినుంచుని ఏమిటన్నట్టు చూశాడు ఆదుర్దాతో.

"అబ్బే!ఏంలేదు,కుర్రాళ్ళుకదూ! పేచీ. నీకింకా పిల్లలు లేరుకదూ. సంసారంలో అప్పుడప్పుడు చికాకులు కలిగినా, ఏమిటో ఈఆనందమే వేరు" అంది. ఆమె అలా అంటుందని ప్రకాశం ఊహించనేలేదు. తనే సంసారంలో పడుతున్న బాధలు బయట పెడుతుందనీ,ఈ పిల్లలతో వచే ఇబ్బందులన్నీ వెళ్ళబోస్తుందనీ అతను చాలా చాలా ఆశించాడు. సుందరి లోపల్లోపలపడుతున్న కలవరాన్ని ఎంత ప్రయత్నించీ కళ్ళు దాచలేక పోతున్నవి.

"నేను భోంచేశాను. నాకోసం ఏమీ ఏర్పాటు చెయ్యకు"అన్నాడు నిజంగా భోంచేసినవాడిలా.

"నీకోసం వేరే ప్రయత్నం చెయ్యనక్కరలేదు. అన్నీ ఉన్నాయి చేసి, శుభ్రమైన నెయ్యి,గడ్డపెరుగూ మేం పెంచిన పాదుల కాయగూరలు ఎలా ఉంటాయో రుచి చూద్దువుగాని,దేనికీ లోటులేదు మా కిక్కడ. లే భోజనానికి" అంది.

ఎన్నో నాజూకుకబుర్లు చెబుతూ,పల్లెటూళ్ళ తిళ్ళను పద్ధతులనూ అసహించుకుంటూండే మనిషేనా ఇలా మాట్లాడుతున్నది అని అతనికి ఆశ్చర్యం కలిగింది. ఎన్ని సౌకర్యాలు సౌఖ్యాలు ఉంటే మట్టుకేం ఇలాంటి అధ్వాన్నపు టడవిలో ఉన్నాక అనేభావం కలిగి ఆతనికి ఆమెపై జాలికలుగుతోంది.అయినా ఎంత మార్పు కనిపిస్తోంది సుందరిలో అనుకున్నాడు. ఆమె ఎన్నడూ ఇటువంటి జీవితాన్ని పీడకలగాకూడ భావించి ఉండదు.తనేమో ఆమె వైభవంచూసి సిగ్గుపడాలేమో కృంగిపోవాలేమో అనే భయంతో వచ్చాడు కాని ఇప్పుడు తను ఆమెకంటే అన్నివిధాలా అధికుడననుకో గలుగుతున్నాడు, కానీ ఈమె ఈ స్థితిలో ఉన్నదేమిటి?

ఎంత మార్పు ఈమెలో!

ఒళ్ళూపై తెలియకుండా గణగణగంట మ్రోగించినట్టుగా మాట్లాడేది. అర్థంలేని వాదన చేసేది. అన్నింటిలోనూ తనదే పై చెయ్యి అన్నట్టు మట్లాడేది. అంతకంటె అధికంగా నిర్లక్ష్యంగా నవ్వేది, అవన్నీ తను వ్యతిరేకించినా ఎంతో ఆకర్షకంగా ఉండే వా రోజుల్లో. తన ధోరణిచూసి మెచ్చుకొనేది. పరోక్షంలో తనని గురించి అందరిదగ్గరా పొగిడేది. తాము వివాహం చేసికొంటామనే భావం అందరికీ కలిగేలా ప్రవర్తించేది.సుందరి ఇంట్లో అందరి ధోరణీ కొంచెం ఇంచుమించు ఓలాగే ఉండేది. ఇతరులు అసూయ పడేలా గొప్ప హోదాగా హుందాగా జీవించడమే జీవితం__ అనే ధోరణే ఆ కుటుంబంలో అందరిలోనూ తను కనిపెట్ట గలిగింది. ఆమె వాంఛించిన హడావిడయిన ఉద్యోగ జీవితం తనవంటి దరిద్రునితో లభ్యం కాదనే ఊహతోనే మిగిలిన మంచితనమంతా మరచి వివాహ నిశ్చయం మార్చుకుంది. ఉన్నతోద్యోగం చేసేభర్తను సంపాదించిన ఈమె ఈ పల్లెటూరి హైన్య వాతావరణంలోకి ఎలా వచ్చింది? ఏంజరిగింది? ఈ తాటాకు కొంప ఏమిటి? దూరంగా విసిరేసిన ఈ బ్రతుకేమిటి? ఈ వాలకం వచ్చిందేమిటి? ఏ పరిస్థితులు తెచ్చాయి ఈమెనీ స్థితికి?_అని ఆలోచిస్తున్నాడు.

అతను భోజనం చేయనన్నాడు. ఆమె చాలా బలవంతపెట్టింది.

"ఎలా వచ్చారిక్కడికి మీరు?" అన్నాడు ప్రకాశం.

"బొగ్గు గనుల ఇంజనీరుగా పనిచేసేవారు. ఉద్యోగం అసహ్యం పుట్టింది. చేసే ఉద్యోగం మానేసి, పల్లెటూరుపోయి స్వేచ్ఛగా హాయిగా పొలందున్ని పండించుకుంటూ తినాలనే దృష్టి కలిగింది. 'స్వేచ్ఛ' ఉండాలంటారు. 'స్వేచ్ఛ' కోసం ఉద్యోగం మానేస్తానంటే ఓ రకంగా ఒప్పించి సెలవు పెట్టించాము. ప్రపంచానికి, హడావిడి జీవితానికి దూరంగా ఉండడం ఆయనకిష్టం. ఇక్కడకి వచ్చేశాం. మాకేమీ బయట ప్రపంచం కనిపించదు. మాకేమీ వినిపించవు. ఆయనకేమో చాలా హాయిగా ఉందీ జీవితం. పొలం వెడతారు, పాలు పితుకుతారు, అన్నీ ఆయనే చేస్తారు వ్యవసాయపుపనులు. ఎప్పుడీ ధోరణిమారుతుందో తెలియదు. అతిమంచితనం, అతికోపం. మళ్ళీ కొన్నాళ్ళ తరువాత మేం ఆయన ఉద్యోగం చోటుకు వెళ్ళిపోతాం." అని ఆగిపోయింది.

అంతరాంతరాల్లోని ఆమె బాధ అతని కిప్పుడు పూర్తిగా అవగతమయింది. తను దొరికిపోయా నేమో అని భయంలో ఆమె కంగారు పడింది. వంటింట్లోకి ఏదో పనిమీద వెళ్ళినట్టు వెళ్ళిపోయింది, వెడుతున్న ఆమెలోని ప్రత్యణువూ బాధతో వేదనతో ఘోషపెడుతున్నట్టు అనిపించింది ప్రకాశానికి.

ఏమేమో ఆమెతో చెప్పాలనీ, కాఫీ వద్దనీ గట్టిగా చెప్పాలనీ అనుకున్నాడతను. తెచ్చి ఎదురుగా వుంచింది కాఫీ గ్లాసు. ఇంతలో దొడ్లో ఏదో పడిన చప్పుడై అతని గుండెలు కొట్టుకున్నాయి. బనీను పంచెవేసికొని చేతిలో మట్టితట్టతో ఒకపొడుగాటి దృఢమైన వ్యక్తి గదిలో అడుగుపెడుతూ ప్రకాశాన్ని చూశాడు. ఎవరీతడన్నట్టు చూస్తున్నాడు ప్రకాశం. సుందరి లోపలనుంచి గదిలోకి వచ్చి "ఈయనే మావారు" అని ప్రకాశానికి పరిచయం చేసి "మా కుటుంబానికి చిన్నప్పటినుంచీ వీరి కుటుంబము తెలుసు. మనల్ని చూద్దామనివచ్చాడు. మా ఊరే!" అని చెప్పింది భర్తకు.

సుందరి భర్త క్రిష్ణారావు ఈయనేనా!_ అనుకుని నమస్కరించాడు ప్రకాశం. ఆయన హాయిగా స్వేచ్ఛగా నవ్వాడు. నవ్వి "సరే! సరే! బాగుంది. వస్తా కూర్చోండి" అని మట్టితట్ట దొడ్లోకి తీసికెళ్ళాడు. కొద్దిసేపట్లో కాళ్ళూ చేతులూ ముఖమూ కడుక్కుని తువ్వాలుతో తుడుచుకుంటూ వచ్చి ఓ కుర్చీ దగ్గరగా లాక్కుని కూర్చున్నాడు.

"ఇక్కడంతా మీకు కొత్తగా ఉందనుకుంటాను. ఈ విధంగా ఇక్కడిలా జీవించడంలో నాకు చాలా ఆనందం ఉంది. అందుకే ఇక్కడకు వచ్చేశాం. నాగరికత మనిషిని 'మర' గానూ బానిస గానూ మారుస్తోంది. చివరకు బ్రతుకులో సహజత్వంపోయి అసహ్యం కలిగిస్తోంది. ఎవరికి ఎట్టి హానీ చేయకుండా, ఆత్మని అమ్ముకోకుండా స్వేచ్ఛగా బ్రతికే మార్గం ఈ ప్రపంచంలో ఇదొక్కటే కనిపించింది నాకు. ఇక్కడ మాకు 'పన్నులు' లేవు , రేడియోలు పత్రికలు లేవు. మాకు ఉత్తరాలు రావు, తాఖీదులు వెళ్ళవు, మాకు యుద్ధభయం లేదు. మీకిదంతా ఏదో ఇది 'పిచ్చి'గా అనిపించవచ్చు. మాకిందులోనే 'శాంతి' వుంది. ఈరోజుల్లో ఆత్మని అమ్ముకోకుండా బ్రతకడం గొప్ప విషయం అంటారా, కాదా!" అన్నాడాయన.

ఇంతలో వంటింట్లో కుర్రాడు ఏడవ నారంభించాడు. " ఆ ఏడ్చేవాడిని ఓసారి తియ్యకూడదూ?" అని "పోనీలే నేను తీస్తాలే" అని లేచి కొంత చిరాకుతో వెళ్ళి నవ్వుతూ కుర్రాడిని తీసికొచ్చాడు. ఆయన ధోరణి చూసి భయంవేసింది ప్రకాశానికి. గబగబా దొడ్లోకి వెళ్ళి ఇన్ని రంగురంగుల పువ్వులు పట్టుకొచ్చి ప్రకాశం ఓళ్ళో పోసి " ఎంత స్వేచ్ఛగా ఎదిగాయో, ఎంత సహజంగా స్వచ్ఛంగా ఉన్నాయో చూడండి ఈ పువ్వులు. ఇంతకంటే జీవితానికి హాయి ఏమిటి?" అన్నాడు గర్వంగా ఆయన.

నిజమేననిపించింది ప్రకాశానికి.

సుందరి అలానే నిలబడి చూస్తోంది మూగవోయి. తన భర్త ధోరణి ఇలా ఉందేమిటని ప్రకాశం ఏమైనా అనుకుంటాడేమోనని భయపడుతూ 'ప్రకాశం ఏమీ అనుకోకు, ఆయన ఆరోగ్యం అట్టే బాగులేదు. ఆయన కెంత తోస్తే అంతే. ఎవరైనా ఇలా ఇంటికి వస్తే మరీ ఇదయిపోతారు' అని చెప్పాలని కూడా అనుకుంది.

కృష్ణారావుగారు అలా మాట్లాడుతూనే ఉన్నాడు. ప్రకాశం వాచీకేసి చూసికొని "మళ్ళీ నాకు రైలుకు వేళవుతోంది. ఇక్కడనుంచి చాలాదూరం నడవాలి. వెడతాను. మీతో పరిచయానికి చాలా ఆనందంగా ఉంది నాకు" అని లేచాడు ప్రకాశం."సెలవు. వస్తా, దయవుంచండి" అన్నాడు ప్రకాశం.

దానికి కృష్ణారావు ప్రకాశం భుజంతట్టి "మీ పేరేమిటో నాకు తెలియదు. వెడుతున్నారుగనక ఓ విషయం జ్ఞాపకంఉంచుకోండి. ఆత్మని చంపుకోకుండా పరాధీనులు కాకుండా హాయిగా బ్రతకడంకంటె కావలసింది లేదు.మీకు తెలిసిన వారందరిలో ఇదే ప్రచారం చెయ్యండి" అన్నాడు.

ఈసారి తలకి ద్వారబంధం తగలకుండా జాగ్రత్తగా వంగుతూ బయటకు వచ్చాడు ప్రకాశం. సుందరి, సాగనంపే ఉద్దేశంతో అతని వెనకాల నడవ నారంభించింది.

వీధిలోకి వచ్చేసరికి గాలి మరీ తీవ్రంగా కొడుతోంది. ఎక్కడో వర్షం కురుస్తున్నట్లుంది. అయినా కొంచం ఎండకూడ కనబడుతోంది. నేలపై రాలిన ఎండుటాకులపై అడుగులువేస్తూ అతని వెనుకనే ఆమె సాగనంపుతూ నడిచింది.

తనని వెనక్కి పిలిచి తనతో ఏదో చెబుతుందేమో అనుకున్నాడు ప్రకాశం, ఈ దైన్యావస్థనుచూచి వెక్కిరించేదుకు తను వచ్చానని అనుకోవట్లేదుగదా సుందరి? ఏమి ఆలోచిస్తూ నడుస్తోంది తనవెనక?

ఆమె ఏమైనా తనతో చెప్పాలనుకున్నదేమో! కాని ఏమీ చెప్పలేదు, నాలుగడుగులు వేసి ఆగి "మరి ఉంటా" అంది. ప్రకాశం వెనక్కు తిరిగాడు. రివ్వున వీచేగాలి ఆమె జుత్తును ముఖం మీదకు ప్రోగుచేసింది.'ఆమె ముఖం పేలవంగా ఉంది' అనుకున్నాడు. ఆమె ముఖంలో గర్వరేఖ అణుమాత్రమైనా కనిపిస్తుందేమోనని పరికించబోయిన అతనికి, చూచేశక్తిని కోల్పోయినట్లున్న ఆమె కళ్ళు మూతలుపడి చీకటిగా కనిపించాయి.

మరికొంత ముందుకునడిచి మళ్ళీ వెనక్కి తిరిగిచూశాడు. అప్పటికే ఆమె నేలచూపులతో రివ్వునవీచే గాలికెదురై ఇంటిగుమ్మం వైపు వెడుతోంది. ఇంకోక్షణం నిలబడ్డాడు ఒక్కసారయినా వెనుదిరిగి చూడకపోతుందా అనే ఆశతో_ కాని అదేమిలేదు.

అతను ముందుకి నడకసాగించాడు. కొన్ని అడుగులు వేసి మళ్ళీ వెనక్కి తిరిగి చూశాడు.

ఆమె మరి కనిపించలేదు. నిశ్చలంగా నిలిచిన ఆ తాటాకు ఇంటిముందు ఏ చలనమూలేదు. గాలి తీవ్రతకు తలలూపి రోదించేటట్లు తప్ప ముందుకి నడుస్తున్న అతనికి ఆకాశంలో హరివిల్లు ప్రకృతి సంగీతం వినిపిస్తున్నట్టుగా కనిపించింది.

# కవిరాజ విరాజితము — బుచ్చిబాబు

**అత్తవారింటికెళ్ళటం** మోజు వివాహం జరిగిన నాలుగేండ్లు వుంటుందేమో! ఆ తర్వాత ఏదైనా పనుంటే తప్ప, వారు పిలువనూ పిలువరు, వీరు వెళ్ళానూ వెళ్ళరు – భార్యను పుట్టింటిలో దిగబెట్టవలసిన సందర్భాలు వస్తే తప్ప. పుట్టింటివారు స్థితిపరులయితే, దగ్గరుండి తీసుకురావలసినవారే, ఎవర్నో పంపుతారు. భర్త స్థితిపరుడయితే, భర్తను తప్పకుండా తీసుకెడుతుంది భార్య. ఉభయులూ అంతంతమాత్రంవారైతే, అవతలవారికి ఉన్నంతలో ఏదో ముట్టచెప్పాలనీ, కూస్తో, కాస్త రాబట్టుకోవాలనీ, కూడబలుక్కుని వెళ్ళటం, లాంఛనం, అంతరాయం లేకుండా కొనసాగుతుంది.

నే నల్లా వెళ్ళాను అత్తవారివూరు. అది బాగా పల్లెటూరు. వెళ్ళగానే నలుగురు పెద్దలూ స్వాగతమిస్తారు. పరామర్శిస్తారు. వారు పరామర్శ రెండుప్రశ్నలతో పూర్తి అవుతుంది. "ఎప్పుడొచ్చారు?" "ఉంటారా నాలుగురోజులు?". అయినా, ఆ కాసేపూ, నేనొక ప్రధాన వ్యక్తిగా కనబడతాను. బస్తీ జనసమూహం ఆకలిపాదాల కదలికలో నలిగిన వ్యక్తిత్వాన్ని లేవనెత్తే అవకాశం పల్లెటూరులో వుంటుంది.

ఆనాడు పగలు భోజనాలయ్యాక నిశ్చింతగా నిద్ర. మూడింటికే లేపారు నన్ను. ముహాన యిన్ని నీళ్ళు జల్లుకుని తుడుచుకుని

దొడ్డివైపు వరండాగది మెట్లమీద చతికిలపడ్డాను. మామగారు చెబుతున్నారు: " ఇవాళ మిమ్మల్ని చూడడానికి ఒక కవిగారు వచ్చారు. మీరొచ్చారని తెలిసిందట. ఇదువరలో చాలాసార్లు చెప్పాడు నాకు. 'ఆయనొస్తే కబురుపెట్టండి, కొన్ని చదివి వినిపించాలి' అని. ఈసారి ఆయనే చక్క వచ్చాడు. అవన్నీ తీసుకుని..... వెళ్ళి తీసుకొస్తా...." అని వెళ్ళాడతను. నా గుండెలో రాయిపడింది. ఇప్పుడాయన యినన్నీ చదివి వినిపిస్తాడు కాబోలు. ఏం చెయ్యడం...?

ఎద్దుబండి మువ్వచప్పుడు నిలిచింది. ఇద్దరు సాయం పట్టి ఒక్క వృద్ధుడ్ని దించారు బండిలోనుండి. మెల్లగా నడిపించుకొచ్చి, అరుగుమీద మంచంవాల్చి దానిమీద కూలవేశారు ఆయన్ని. వాళ్ళు లోపలికి వెళ్ళగానే ఆయన మంచమీద నుండి దిగి, చాపలాక్కుని నా దగ్గరలో అరుగు మీద కూలబడి నవ్వుతూ ఒక స్వాగతపద్యం చదివాడు. ఆపద్యంలో నాపేరూ, వూరు, కులం, గోత్రం, ఋషులు, భార్తారత్నం పేరు, ఆవిడను గురించిన వివరములు, అన్నీ వున్నాయి.

నా కిదంతా కొత్త. సిగ్గేసింది. ఏడవాలో, ఏం చెయ్యాలో తెలిసింది కాదు. నాకు ఓ ఏభై ఎకరం ఉంటే, ఆయనకు ఒక ఎకరంయిద్దును. లేదు మరి. పోనీ ఐదురూపాయలు చేతులోపెడితే! ఐదురూపాయలే! అది యిచ్చిన దగ్గరనుంచీ నా మాటెలావున్నా, మాఆవిడ ఓ వారం బెంగతో కుంగిపోదూ? ఒక్క రూపాయి ఫరవాలేదు.

నా ఆలోచనలు విన్న ఆయన నవ్వుకున్నాడు. ఒక్క కన్ను కనబడుతుంది. దస్త్రం విప్పుతున్నాడు. నా ఆలోచనలు విన్నవాడివలే ఆయన అన్నాడు.

"నాకు మీరేమీ యివ్వనక్కరలేదు. మీ దయ వుంటే అంతేచాలు. డబ్బుకోసమే పద్యాలు వ్రాసివుంటే కుబేరుడిని అవుదును. అరవై తొమ్మిదవ ఏట."

తాళ్ళ ముళ్ళువిప్పి, కాగితాల కట్టలు దులుపుతున్నాడు. లోయలో మంచుపొరలా దుమ్ములేచింది. రుమాలు ముక్కుకు అడ్డంగా వుంచుకొని పక్కకి తిరిగాను.

"దుమ్ముపీలిస్తే, క్షయ వస్తుందంటారు ఈనాటి వైద్యులు, అవునా? మట్టిలో పుట్టి, మట్టిలోకలిసే... అయినా మట్టివేరు. దుమ్ము వేరులెండి... "

నవ్వుతున్నాడు.

ఏనాడో కాగితాల మధ్య నలిగి శిధిలమైన సాలీళ్ళ కళేబరాలు పొడుమై రాల్తున్నాయి.

నెమలి ఈకల ముక్కలు, కాగితహారి వెండి పురుగు, బొద్దంకి మీసాలు, ముక్కుపొడుం రేణువులు, దుమ్ము, పుగాకు రేకులు, విరిగి పొడుమైన కాగితాల అంచులు,---- అలా ఒక్కటొక్కటే వర్షపు చినుకుల్లా రాల్తున్నాయి. కాంచన గంగా శిఖరం అంతటి కాగితాలకట్టలోంచి, అడుగుది పెల్లగించాడాయన.

పఠన ప్రారంభించాడు.

"ఇది మెదటిది 'మిరియాలు, కారం' పేరు. అనగా మార్లీమింటో దొరలు సూచించిన సంస్కారాల పట్టి బైటపెట్టిన సందర్భములో 1909 కాంగ్రెసు నాలుగు తీర్మానాలు చేసింది. అప్పుడు వ్రాసిన పద్యాలు, మార్లీకీ, మింటోకీ, చెరొక కాపీ పంపాను. అంటే వారి కార్యదర్శులకు.. చూడండి."

అని ఆ వ్రాతపత్రిని నాకు చూపించాడు. అది నామ మాత్రంగానే కాగితం. కావ్యకాంతకు ఆయన కట్టిన మొదటివస్త్రం. అక్షరాలు కనబడ్డంలేదు. హరప్పానాటి శిలశాసనంలాగుంది. ఆ వ్రాతప్రతికి మరోకాగితం తగిల్చివుంది. దానిండా అధికారుల సంతకాలు. ప్రభుత్వ

కార్యాలయాల ముద్రలు. ఆ పద్యాలు వారు చూచామనీ, పంపినందుకు కృతజ్ఞులమనీ వ్రాసిన జాబు అది. ఆ ముద్రలు, దొరల సంతకాలు చూడగానే దగ్గర జరిగి కొంచెం శ్రద్ధ కనబరుస్తూ, కూర్చున్నాను. ముందున్న నిర్లక్ష్యభావం జారుకుంటోంది.

"ఇది 1916 లో బిసెంట్‌సతి హోంరూల్ లీగు ప్రచారంచేస్తున్న సందర్భాన వ్రాసింది. వారధిమాల. నాలుగు చాటువులు. బిసెంట్‌గారికి పంపుకొన్నాను."

ఆ నాలుగు చాటువులు చదివి వినిపించాడు, ఆయన. అనీబిసెంటు ఆ పద్యాలు అందుకున్నట్లు సంతోషించినట్లూ, వారు ముందువ్రాయబోయే పద్యాలకు ఎదురుచూస్తూ వుంటాననీ, ఆమెస్థానే ఎవరో సంతకంపెట్టి పంపిన కృతజ్ఞత ఆ పద్యాలప్రతికి కలిగింది.

మరోకాగితం తీశాడాయన.

"1917లో చందురాన్ రైతులవెన్ను చరుస్తూ వ్రాసిన పద్యాలు వుండవలసింది యిక్కడ" అన్నాడు కాగితాల కట్టకేసి చూపుతూ. "పంపించాను. జవాబుకూడ వచ్చింది. ఎక్కడో పోయింది."

ఏ ఎలికో తినేసివుంటుంది.

"పొలం పాడుచెయ్యడమే కాకుండా, పొలాన్ని గురించిన పదునాలుగు పద్యాల మనుమాలనుకూడ తిన్నాయంటే, బ్రిటిష్‌పాలనలో దేశం ఎంతటి బీదస్థితిలో వుండేదో ఆలోచించండి." అని నవ్వుతున్నాడు. మూల మరో పన్నుకూడావుంది, సింహాలుండే చీకటిగుహలో మిగిలిన ఎముక ముక్కలా. కంటెమెడ ఖద్దరు చొక్కానిండా కంతలే. రెండు అద్దంపెంకులు దారంతో బిగించి, ముక్కుమీద నిలబెట్టి చెవులకు ముడెట్టి కండ్ల జోడు అనబడే ఒక పేటెంటు పరికరాన్ని శుభ్రంచేసి, నుదుటిమీదికి నెట్టేశాడు. మరో కాగితం పెల్లగించాడు.

"మొదటి ప్రపంచ సంగ్రామం ముగిసింది. 1918 నవంబరు పదకొండన సంధి జరిగింది. అప్పుడు వ్రాసిన చిత్ర, ఆశు, బంధ, గర్భ" అనబడే చతుర్విధ కవితాక్రోధమూ – శీర్షిక పేరు "775" అంటే తెలుసా? జర్మన్ సైనికుణ్ణి పోషించడానికి జర్మను ప్రభువులు 145 రూపాయలు ఖర్చు పెడతారు. ఫ్రెంచి సైనికుడి పోషణకి 185 రూపాయలుండాలి. ఇంగ్లాండులో బ్రిటీషు సైనికుడికి 285 ఖర్చు అవుతుంది. కానీ చిత్రం! ఇండియాలో బ్రిటీష్ సైనికిడికి 775 రూపాయలవుతేగానీ గడవదు. బెంగల్‌ను విడగొట్టారు. కాశీలో 21 వ కాంగ్రెసు సమావేశం అసమ్మతిని ప్రకటించింది.__ చూడండి."

మళ్ళా పద్యాలు ఆనాటి ప్రముఖులకు పంపడం, వారు సంతోషంతో స్వీకరించి, కృతజ్ఞత తెలుపుతూ వ్రాయటం, ఆ ఉత్తరాలను వ్రాతప్రతితో జతపరిచి భద్రపరచటం, రెండూ పొడుమై, మిగిలినవాటిని వారుముందు ప్రదర్శించటం ఇదీ తంతు.

"ఇది వినండి. నల్ల జండా. 1920లో వేల్సు మువరాజు ఇండియా పర్యటించాడు, వెనుక్కు పొమ్మన్నాం. ధ్రువకోకిలా వృత్తాలివి. యువరాజుకే పంపాను. పాపం, చదివాడు. సంతోషం వెలిబుచ్చుతూ వారిస్థానే కార్యదర్శి పంపినజాబు ఇదుగో....."

ఆ కాగితం ప్రదర్శించాడాయన. గురి, గౌరవం పెరుగుతున్నాయి. పూర్వకాలపు కవులను వుదాశీనతతో చూడటం, ఈనాటి వారికి పరిపాటి. ఇవన్నీ చూడగానే నాలో ఆ భావం పోయింది. పద్యాలు సులువుగా అర్ధమయ్యేవే. అందులో విషయాన్ని ఉత్తరంగా గద్యంలో వ్రాసినా సరిపోను. ఐతే పద్యంలోకానీ ఆ విషయానికి నిండుతనం, పరిపూర్ణత, రావనుకుంటాను. పద్యం లో ఏదో వుంది మజా.

1921 ఖిలాఫట్ ఉద్యమం కొనసాగుతున్న సందర్భంలో డాక్టర్ అన్సారికి కొన్ని పద్యాలు వ్రాసి పంపారాయన. వారు చదిని అనందించినట్లు జాబుంది.

"విని విని అలసినట్లున్నారు, కాసేపు విశ్రాంతిగా కూర్చుందాం." ఈలోగా యింట్లోంచి తినేందుకు ఏవో తెచ్చారు. తినేవి విడిచేసి,

కాఫీ తీసుకున్నాడాయన.

"ఏడు నిముషాలు మనకు విశ్రాంతి" అన్నాడాయన.

"అదేమిటండోయ్! ఏడులో ఏమిటి విశేషం!"

"తరువాతి పద్యాలు 1928 లో ప్రారంభమయినాయి. ఖిలాఫట్ కవిత 1921 నాటిది. అంటే వ్యవధి ఏడు సంవత్సరాలన్నమాట. ఏడాదికొక నిముషం పెట్టుకుందాం."

నాకు నవ్వొచ్చింది. దిగమింగుకున్నాను. ఆ ఏడు సంవత్సరాలలో ఆయన ఎందుకో ఏదీ వ్రాయలేదు. బోలెడు జరిగాయి.

జాతీయ, అంతర్జాతీయ రంగములలో ఎనెన్నో ఘట్టాలు వున్నాయి. మరెందుకీ మౌనం?

"నాకు తెలుసు మీ ప్రశ్న. ఆ ఏడు సంవత్సరాలలో నాకు రెండో వివాహం అవడం, భార్య చనిపోవడం జరిగాయి. 1928 లో సైమన్ కమీషను విచ్చేసింది. దాన్ని బహిష్కరించారు ప్రజ. అప్పుడు వ్రాసిన మత్తేభ విక్రీడితము.__ ఇదిగో వినండి."

లాలా లజపతీరాయి చదివించుకుని, అనందించి మెచ్చుకుంటూ జాబు వ్రాశాడు.

అని ఆ పద్యాలు చదివాడు ఆయన.

కాని నా దృష్టి ఆ పద్యాల మీద లేదు. అసలు నేను వాటిని వినసే లేదు. విన్నట్లు నటించినా, ఆ పదేండ్ల మౌనం_ వివాహం, భార్యమరణం వాటిని గురించే వూహిస్తున్నా. భార్యనుగూర్చి, పెళ్ళి సందర్భంలోగాని, మరొకప్పుడు గాని, ఏమీ వ్రాయలేదా? ఎందుకు వ్రాయలేదు? ఇష్టం లేదా? లేక మరీ ఇష్టమా? అంతులేని ఆవేదన ఏదన్నా వుందా? లేక ఆమెని హత్యచేసి పోలీసులకు పట్టుబడకుండా ఎక్కడో దాక్కుని, అంతా మాటుమడిగింతర్వాత కవితాకన్యని ఆరాధించడం సాగించాడా? కవిత్వాన్ని కూడా హత్య చెయ్యలేదు పాపం.

మళ్ళా మరికొన్ని కాగితాలు తీశాడు. ఈ వ్రాత ప్రతులేమిటి నా ప్రాణానికి! ఏ పత్రికలోనైనా అచ్చువేసి వుండగూడదూ? అడిగేశాను.

"ఏవండీ___మీ పేరు....?"

"పేరయ్య"

"అవుతే పేరయ్యగారూ! చాలా బాగున్నాయండీ. కవిత్వంలో మంచి చెడ్డలు విమర్శించే శక్తి నాకు లేదనుకోండి. ఇవన్నీ ఒక పుస్తకంగా వేయించలేక పోయ్యారూ? పోనీ ఏదైనా పత్రికకి పంపివుంటే...." నా వాక్యం పూర్తవకుండానే అందుకున్నాడాయన "... వేసివుండవు. అయ్యో పంపించకేమండి. నాలుగైదుసార్లు, పత్రికలకి పంపించాను. వారు తిప్పు పంపించివేశారు. వారు మాత్రం ఏంచేస్తారు చెప్పండి. దేశచరిత్ర రోజురోజుకీ మారిపోతూవుండే ఒక ఘట్టం గురించి నే వ్రాసిన పద్యాలు వారికి చేరేటప్పటికి మరో కొత్తసంఘటన వచ్చిపడుతూ వుండె. నిన్నటి పత్రిక నేడు చూస్తామా? చూడండి. ఈ పద్యాలూ అంతే....."

"ఆ రోజుల్లో ఎందరో జమీందార్లు, డబ్బున్న ఆసామీలు వుండేవారు. పుస్తకంగా వేయించమని మీరెవ్వరినీ కోరలేదా?" పొడుం పంచి మడతల్లోంచి తీశాడు. కళ్ళజోడు శుభ్రంచేశాడు. తల తడిమి చూసుకున్నాడు. అంతా నున్నగా వుంది. నిలబడే ఓపిక వున్న వెంట్రుకే లేదు. ఏ ఆవేదనా లేకుండా ఆయన మనస్సు ఎంత నిశ్చలంగా వుందో, ఆయన బుర్రక్కూడా ఏ ఆటంకమూ లేకుండా అంత నిర్మలంగా వుందనిపించింది.

"అప్పుడప్పుడనిపించింది. కాని ఏమిటో పడలేదు. అశ్రద్ధయిపోయింది. నా మొదటి భార్య క్షయవ్యాధికి గురై చనిపోయింది.

చాలా దిగులుపడ్డాను. మంచి విషాదకావ్యం వ్రాయాలనుకున్నాను. ప్రపంచములో భార్యవియోగం పొందిన వారి అందరి బాధా అందులో గుప్పెయ్యాలనే సంకల్పం, పూనూకోనూ లేదు, పడనూ లేదు. ఇంతలో రెండోపెళ్ళి జరిగింది. ఆ బాధంతా తగ్గిపోయింది. హాయిగా

రోజులు వెళ్ళిపోయినాయి. మశూచిపోసి చనిపోయింది రెండో కళత్రం. దుఃఖంలో మునిగిపొయ్యాను. ఇంక బ్రతకననుకున్నాను. గొప్ప విషాదకావ్యం వ్రాసి మరణానికి సిద్ధపడదామనుకున్నాను. చిత్రం అదీ పడలేదు. ఇంతవరకూ కొన్ని కొన్ని అల్లా జరిగిపోతూంటాయి. ఇప్పుడు ఏదో చెయ్యాలి అన్న సంకల్పంతో ఎదిరించటం మానుకున్నాను.

1929 లో లంక్ షైర్ బట్టని తగలబెడుతోంది దేశం. జతీంద్రనాధదాస్ నిరాహారదీక్ష పూనాడు. అప్పుడు వ్రాసినవి. వనమయూరము తెలుసుగా." అని చదవడం మొదలెట్టాడు.

నాకు వనమయూర మంటే తెలియదు. నాకు తెలుసునని ఆయన అనుకున్నందుకు కాస్త లోలో చక్కిలిగింతలో కూడిన మందహాసం కవ్వించింది.

"చాలా బాగుంది పేరయ్యగారు! ఇప్పుడేనా వీటిని పుస్తకంగా వేయిస్తే...?"

"ఎవ్వరూ చదువుతారనుకోను నేను వ్రాసినవన్నీ, ఏవ్యక్తులైతే దీక్షతో కార్యానికిపూనుకుని చరిత్ర రచిస్తున్నారో వారి నుద్దేశించి, వారిని ఉద్బోధిస్తూ వారి కోసం వ్రాసినవి. వాటి విలువ వారికే తెలుస్తుంది. నేననుకున్నట్లుగానే వారు వాటిని చదివి సంతోషించి కృతజ్ఞత చెబుతూనే వచ్చారు. నాకింకేం కావాలి, వాడవాడా పల్లె పల్లే, ఈ పద్యాలు ప్రజానీకం ఆదరిస్తారని నేననుకోలేదు. అల్లా జరగాలనీ ఆశించలేదు నేను.

1930లో పూర్ణస్వరాజ్యపార్టీ నెలకొల్పారు." పంగనామం" అనే శీర్షికను మందాక్రాంతి వృత్తంలో వ్రాశాను."

"అబ్బ ఎంతబాగుందండి!"

"వినకుండానే?"

"అదికాదు ఆపేరు మందాక్రాంత వృత్తం అంటే ఏమిటండీ?"

"మీకు తెలీకనా. ఇందులో ప్రతి పాదంలోనూ 'మ, భ, న, త, త, గ, గ' అనే గణాలుంటాయి, పదకొండవ అక్షరానికి యతి వుంటుంది. ప్రాస ఉండి తీరాలి."

"అల్లాగా ఏదీ చదివండి. అవుతే 'పంగనామం' అన్నా రెందుకూ?" నవ్వుతున్నాడు పేరయ్యగారు.

"ఆ మాత్రం వూహించలేకనా ఏమిటి మీరడగడం! చూడండి ఆరోజుల్లో గాంధిగారు పదకొండు విషయాలు ప్రతిపాదించాడు. ఆ అంకే పంగనామంలా వుంటుందనీ అల్లా పెట్టాను. ఉప్పుసత్యాగ్రహం గురించి వ్రాసిన పద్యాలను థియేడర్ పార్కర్‌కి పంపించాను. ఇద్దరు అందుకున్నట్లు దాఖలాగా జాబులివిగో........" అని మరికొన్ని ఉత్తరాలు చూపించాడాయన.

నాకా జాబులు చూడడంలో కన్పించిన సంతోషం పద్యాలు వినడంలో కనబడలేదు నిజానికి. నాలో దేశభక్తి లోపించిందా! జాతీయతత్వం ఏనాడో అంతరించింది. నేటి జనాన్ని ఆకర్షిస్తున్నది అంతర్జాతీయతత్వం 'నావూరు, నాదేశం' అన్న మాటలు విన్నప్పుడు నాలో ఉచితమైన ఉద్రేకం ఊరడంలేదు.

"ఇవి గుండుసున్నా శీర్షికను వ్రాసినవి. రవుండు టేబిలు సమావేశం జరిగినప్పుడు వ్రాశాను. అన్నం పెట్టమంటే రాయి చేతులో పెట్టారన్నాడు గాంధిగారు. నాకు ఆ రాళ్ళూ లేవు. అవన్నావుంటే ఇల్లేనా కట్టుకుందును. తాడి చెట్లు కొట్టిపారెయ్యమన్నాడు గాంధిగారు. మా దొడ్లో తాడిచెట్టుని పీకించేశాను. ఈ స్రగ్ధర వినండి. అ ఆ ఇ ఈ లు అనే పద్యాలు ఎ.బి.సి క్లాస్ రాజకీయఖయిదీల నుద్దేశించి వ్రాసినవి."

అని చదవడం మొదలెట్టాడు.

ఆ కట్టలన్నీ చదవాలంటే, రెండు మూడురోజులు పట్టొచ్చు. అందుచేత నేనే ఆ కాగితాలను అక్కడక్కడ బైటకిలాగి అవి ఎవరికి పంపాడో, వారేమి వ్రాశారో చదువుతూ కొంత కాలక్షేపంచేశాను. 1931లో భగత్‌సింగుని గూర్చినవి కొన్ని పద్యాలున్నాయి. 1932లో

గాంధీగారు నిరాహారదీక్షపూనినపుడు వ్రాసిన పద్యాలని ఏకంగా సామ్యుల్ హోర్‌కి పంపడం, ఆ పంపిన కాగితాలు ఏ కారణంవల్లనో తిరిగి రావడం జరిగినట్లు తెలుసుకున్నాను. పూనా ఒడంబడిక పద్యాలు ఏండ్రూస్‌కు ఒక కాపీ పోలక్ దొరగారికి మరొక కాపీ వెళ్ళాయి. 1934లో బీహర్ భూకంపం గురించి వ్రాసినవి ఎవరికీ పంపినట్లు లేదు. 1938 రెండో ప్రపంచయుద్ధం ప్రారంభమైనప్పుడు యుద్ధంపట్ల అసమ్మతి తెలుపుతూ, రూజువెల్ట్‌కి, బోస్‌కి పంపిన పద్యాలున్నాయి.

క్రిప్స్‌మిషన్ వచ్చినప్పుడు, క్రిప్స్ ధరించిన ఖద్దరు సూటును మెచ్చుకుంటూ కొన్ని పద్యాలున్నాయి. క్విట్ ఇండియా ఉద్యమం పద్యాలు గాంధీగారినీ, యూరప్‌లో నాయకులను సంభోదిస్తూ, వ్రాసిన పద్యాలు, రాకపోకల సౌకర్యాలు లేక కాబోలు, వారివద్దనుండీ జవాబులొచ్చి నట్టు లేదు. భారతదేశం స్వతంత్రదేశం కావడమూ, నవకాలీ, ఆంధ్రరాష్ట్రం ఏర్పడ్డమూ ఒకటేమిటి ప్రతి చారిత్రక సంఘటన గురించి వందలాదిగా పద్యాలున్నాయి. చీకటిపడుతోంది. అక్షరా లానడంలేదాయనికి. చదవలేకపోతున్నాడు.

"చాలా గొప్పగా వున్నాయండీ. దేశచరిత్రలో ఆనాటివన్నీ వూహించుకుంటే ఎంతో ఆనందంగా వుంటుంది. అంతటి అద్భుతమైన కలంలో అంతటి మహా వ్యక్తులనుగూర్చి వ్రాసిన ఆయనకు సమకాలికుడుగా వుండటం నా అదృష్టం. ఎంతో గర్వంగావుంది. ఆ ఆనందం, ఆ గర్వం, రేకెత్తించాయి మీ పద్యాలు మీ పరిచయం. నాకృతజ్ఞత ఎల్లా చెప్పుకోవాలంటారు?" అని ప్రశ్నించాను. లోపల ప్రస్ఫుటంగా, ఆవేశం లేకపోయినా, ఆ మాటలనేప్పటికీ ఉద్రేకం ఏదో ఆకారం తెచ్చుకుని, పల్లంలోకి నీరు జారినట్లుగా కళ్ళల్లోకి, గొంతుకలోకి తీసుకుంటూ వస్తూందెందుకో!

ఆయన నవ్వుతున్నాడు. మిగిలిపోయిన సూర్యకిరణంవలే, రెండు రైలుపట్టాలు ఒకటైనట్లు ఆయన కళ్ళు చిట్లించి, కాగితాలను సవరించి మూటకడుతున్నాడు.

"మీ కృతజ్ఞతా!? కృతజ్ఞత నేను చెప్పుకోవాలి ఓపికగా విన్నందుకు. మీరు చిన్నగనుక అల్లా అంటున్నారు. నా మిగతా పద్యాలుకూడా వింటే అదే పదివేలు నాకు. ఐనా యిదొక్కటి వినండి. ఆ మధ్య మావూరికి పది మైళ్ళు దూరంలో హరిజనులు ఆలయప్రవేశం జరగటం, ఆలయంలోనే వర్ణాంతర వివాహం జరగటం, రెండు విశేషాలను పురస్కరించుకుని వ్రాసిన పద్యాలు ఉండండి తీస్తాను...."

అని మళ్ళా ఆ కాగితాల కట్టను కదిపి వెదకడం ప్రారంభించాడు. నేనుకూడా వెదకడం ప్రారంభించాను.

" ఇక్కడే వుండాలి. వినోభాజీకి పంపించాను. కనబడదేం.... వృత్తం ఏమిటో చెప్పుకోగలరా? 'కవిరాజ విరాజితం' అనేది. ఒక నగణము, ఆరు జగణములు, ఒక వగణము, వుంటాయి. సందర్భానికే తగింది."

పసివానినలె ఆతృతతో వెదుకుతూ, చీకటిలో మానసిక ఆనందంతో మిణుగు పురుగులల్లే మెరుస్తూన్న ఆయన నేత్రాలు. ఆ వైఖరి చూస్తే, కన్నీటితో నా నేత్రాలు కలవరపడ్డాయి. ఆయన మనిషికాదు. మానవజాతి. మట్టిలోపుట్టి, మట్టిలోపెరిగి, మట్టిలో అడుకుంటూ, ఆనందంతో అందులోనే కలిసిపోతాడు.

"ఇదిగో!" అని సంతోషంతో వూగిసలాడాడు. మళ్ళా పెదవి చప్పరించాడు.

"అబ్బే! అవికావు. అవిపోతే యింకేమున్నా వుందీ!?" అంటూ అదుర్దాపడుతున్నాడు.

"ఫరవాలేదు లెండి, రేపు వింటాను."

"రేపా! రేపు మావూరు మాయింటికొస్తారా?" పంచి మడతల్లో యిరుక్కున్నట్లు దులిపి చూసుకుంటున్నాడు.

"వొస్తాను. పొద్దోయింది. యింక వుండండి."

అని, ఆయనా, నేనూ, యింట్లోంచి మరో యిద్దరూ ఆ కాగితాలను కట్టగా తాళ్ళతో కట్టి బండిలోకి చేరవేశాము.

"మరోకట్ట వుందిలెండి, చిన్న భోషాణంలో వుంచాను. ఆ కట్టలో కలిసిందేమో, ఆ పద్యాల కాగితం. అల్లా జరుగకూడదు. వేగిరం వెళ్ళి చూడాలి. రేపటికి దొరక్కపోదులేండి..." అని తొందరగా బండిలోకి ఎక్కాడు.

"దొరక్కపోతే ఏంలెండి! మళ్ళా వ్రాయలేరా ఏమిటి?" అన్నా ఓదార్పుభావంతో.

"మళ్ళా వ్రాసింది మళ్ళా వ్రాసిందే. వన్సుమోరు పద్యంలా, రెండో వివాహం భర్తలాగా, రేపు తప్పకుండా రావాలి స్మాండి...."

బండి వెడుతూంది. నేను వెనకాలే కొంతదూరం వెళ్ళాను. ఆయన బండిలోంచి అంటున్నాడు. "చిన్న అబద్ధం ఆడాను. వయస్సు అరవై తొమ్మిదన్నట్లు గుర్తు. ఒక రెండేండ్లు తగ్గించాను అంతే."

నాకు నవ్వొచ్చింది. ఆ మాటతో నాకు సన్నిహితుడయ్యాడు. అతడు మానవజాతి కాడు, మనిషే.

ఎద్దుకు హుషారిస్తున్నాడు తోలేవాడు సినిమా పాటలుపాడుతూ. మెళ్ళోగంట సన్నగిల్లుతూంది. చాలా దూరం వెళ్ళిపోయింది. నడుచుకుంటూ వంతెనదాటి కాలువ గట్టుకు చేరుకున్నాను. కొబ్బరిచెట్లు నిర్ఘాంతపోయినట్లు, కదలకుండా వున్నాయి. చందమామ కాలువ పల్చటి అలలలో సాగేసినట్లు జారి వొడ్డుకు చేరుకుని మళ్ళా లోపలికి మయ్యారంగా ఈదుతూ కదుల్తున్నాడు.

పచ్చగడ్డిని చెంతరానీకుండా రాతిబండ వొడ్డున వంగి జపంచేసుకుంటోంది. అక్కడ ప్రశాంతగా ఉన్నట్లు అనిపించింది. ఈ మనిషి మొహం ఎట్లావుంటుందో చూద్దామని వొడ్డుకువచ్చిన రెండుమూడు కప్పపిల్లలు వొడ్డున నీటిబీటలో నిద్రపోతున్నాయి. ఆ ప్రశాంతత నాలోవున్నదేమో! మనలో భావాలు ప్రకృతికి ఆపాదిస్తాము. అమాయకులం. పేరయ్య మహాకవికాడు, అసలు కవికూడా కాడు. దేశభక్తుడు. ఏం చెయ్యాలో తెలీక పద్యాలద్వారా ఆ ఉద్రేకాన్ని ప్రకటించుకుంటాడు. వాటిల్లో పెద్ద ఉద్రేకమూలేదు. గొప్పవారిని ఈ విధంగా మంచి చేసుకుంటే తనకు ముందు మేలు జరుగుతుందని ఆశించి వ్రాయడం మొదలుపెట్టి, కొంతకాలానికి అదొక అలవాటై అల్లా పద్యాలు కొనసాగిస్తూన్నాడు అంతే. అతను సాధించిందేమిటి? లోకాన్ని జయించి తిరిగి మనుషులకి అప్పగించి వెయ్యడంలోవున్న ఔదార్యంలోని అనందం, సంఘటన, పరిస్థితి, కృషి, చరిత్ర, అందలి మనుషులు అందర్నీ తన గుప్పెట్లోకి లాక్కున్నాడు.

చూశాడు. "ఇదా? ఇల్లావుంటుందా? ఇంతేనా జరిగేది? సరేపోనీ __" అని మళ్ళా విడిచిపెట్టేశాడు. అతని గుండెలు కొట్టుకుంటూనే వున్నాయి. ప్రేమతో, ఆనందంతో తను లోకంలో ఐక్యమై, లోకాన్ని తనలో కలుపుకున్నాడు. తనులేడు. తనుపుట్టి, పెరిగి, జీవించినట్లు నిదర్శనాలులేవు. ఆ పద్యానికి తగిలించిన ప్రముఖుల సంతకాలతో వున్న ఉత్తరాలు తప్ప. అందులో వకటి కనిపించడం లేదు. పద్యాలని మెచ్చుకుంటూ వ్రాసిన జాబుతో అతని జీవితంలో ఒక ప్రధానఘట్టం ముడిపడివుంది. ఆ జాబు లేకపోతే అతను ఆ సందర్భంలో మరణించినట్టే బాధపడ్డాడు. ఇంటికి వెళ్ళి వెదికి, ఎవరికైనా వినిపించాలి, అప్పుడుకాని అతను జీవించడు.

★ ★ ★ ★

ఆ మర్నాడు వెళ్లాను పేరయ్య పల్లెకి. సందుమొదలో బండిదిగి నడుస్తున్నాం, నేనూ మరో స్నేహితుడు. అడ్డంగా పడుకుని విశ్వాన్ని తిలకిస్తున్న కుక్కలద్వయం. అసమ్మతిని తెలుపుతూ మొరిగి, మళ్ళా అంగీకరించినట్లు, ఒక మూలగా జరిగి పరున్నాయి. కట్టెలు నెత్తిన పెట్టుకుని ఒక ముసలిది అటుపోతోంది. పిల్లాడు ఇనప చక్రం కర్రతో దొర్లించుకుంటూ పరుగెత్తుతున్నాడు. పేరయ్యగారింటి ముందు రెండు కొబ్బరిచెట్లున్నాయి. ఆ గోడమధ్య రెండు తలుపులూ, సరిగ్గా మూసుకోవు. మధ్యబీటలు, కంతలు లోపలంతా కనబడుతూనే వుంటుంది. ఆయన హృదయద్వారంలా ముందు వసారా. చూరున పెంకులు కొనవూపిరితో సాలిగూళ్ళ బంగారుతీగెలతో నిలబడివున్నాయి. పిచ్చుకలు,

బల్లులు, తేళ్ళు వాటి పుట్టిల్లు ఆ చూరు. ముందుగదిలో పెద్దభోషాణం. లోపలగదిలో చిన్నభోషాణం. నుకలమంచం, తాళ్ళు నేలమీదికి జారి 'బాలే' నర్తకుల వంటికాలు, వంకరలు తిరిగివున్నాయి. కింద కాగితాలు, పైనకాగితాలు, ప్రక్కన కాగితాలు చూరికి తగుల్తున్నాయి. అవన్నీ పద్యాల కాగితాలకట్టలు, ఆయన వుండేందుకు చోటేలేదు. మరో నాలుగైదేళ్ళలో ఆయనకాపురం వసారాలో చూరుకిందే. పేరయ్యగారేడి? కనబడ్డేం? ఆమెవరో వుంది ఎర్రచీర. బోర్డరులేదు. నెరసిన వెండ్రుకలు, బలసిన శరీరం, మడతలతో జారిన దవడలు, నల్ల బడుతూవున్న పెదవుల వెనక చీకటిమందహాసం, నరసమ్మట. పనిమనిషి, ఆయన్ని కొన్ని సంవత్సరాలుగా కనిపెట్టుకుని. ఆదుకొన్న స్నేహితురాలు. దూరపు చుట్టం, బీదది. ఆయనకీ ఎవరూలేరు. ఈమెకి ఎవరూ లేరు. ఏటి వొడ్డున ఇల్లుకట్టుకుని, పద్యాలు చెప్పుకుంటున్నారా!?

"ఇట్లా రండి" అని సంజ్ఞ చేసింది నరసమ్మ. ఆవిడ ధోరణిచూస్తే భయంవేసింది. గబగబావెళ్లాము దొడ్డివైపు. దోడ్లో అన్నీ చెట్లు. మూలగా పాక. దాన్నిండా కట్టెలు, సిరామరకలు, పాతకగితాలు. ఆగదిలో మరో మంచం. దాని మీద మిగిలిన పేరయ్య. చేతులు, కాళ్లు పూగిసలాడుతున్నాయి. నాలుక లోపలకీ, బైటికి కదులుతూంది. సిగిరెట్ నుసి రంగు కంటి పాపలు, పక్కలకీ, పైకీ జరుగుతున్నాయి. ఆయన చేతుల్ని అదిమిపెట్టి నుదిటిమీద చెయ్యివేసి, బుజ్జగిస్తూ సపర్యలు చేస్తున్నా. నరసమ్మ చెప్పింది రాత్రంతా ఆ పోయిన పద్యంకోసం వెదికాడట. భోషాణాల కిందదూరి, చూరంతా కెలికి, దొడ్డంతా గాలించాడట. దూడ కాగితాన్ని తినడానికి తీసుకుపోయిందేమోనని రోజల్లా వెదుకుతూ ఏవో కాగితాలకట్టలు చూసినట్లు భ్రమించి పరుగెట్టడంలో ఆ బీటలో కాలు ఇరుక్కుని పడిపోయాడుట. పక్షవాతం ప్రకోపించి మంచాన పడవేసిందట. మరొక్కసారి నవ్వుకోసం ప్రయత్నంచేశాడు పేరయ్యగారు.

"నా పనైపోయింది. పోయిన పద్యం వృత్తం కవిరాజు విరాజితం. మంగళం పోయింది. విరాజిల్లుతూ నేను పోతున్నాను."

నా జేబులోంచి అచ్చుకాగితం ఒకటి తీశాను.

"చూడండి పేరయ్యగారు ఆ కాగితం పోలేదు. మీకు తెలీకుండా నేనే తీశాను ప్రతికలో వేయిద్దామని. ఈ ఉదయం పత్రికలో వేశారు. ఇదిగో చూడండి" అన్నాను. ఆ కాగితాన్ని ఆయన కళ్లముందు చూపుతూ. ఆయన  చూడలేదు. మరి కదలలేదు. నన్ను,దేశాన్ని, లోకాన్ని, సృష్టిని క్షమించాడనుకుంటే తప్ప, నా కళ్ళంట కారుతున్న నీటిధార నిలవదు.

★ ★ ★ ★

నిజానికి ఆ మర్నాడు పేరయ్య పల్లెకి వెళ్ళలేదు. కాలవగట్టున ఆ కొబ్బరి చెట్లకింద రాతిబండమీద కూర్చుని కొనసాగించిన వూహలవి. కథల్లో చిత్రింపబడిన జీవితానికి పరిపూర్ణత, సమాప్తం, వుంటాయి. దిగ్భ్రమ కలగచేసే ఒక పేచీ ముగింపు ముడెడతాడు కథకుడు. జీవితంలో ఆ రకం చెలగాటం ఆడదామన్న అభిలాషా, ఆడగలిగే శక్తీ నాకు లేవు మరి! నాకు చేతనైంది వూహించడం. ఓ విధంగా పేరయ్యగారు సాధించిందికూడా అదే. ఆయనతో ఆ గంట పరిచయం ఆ రకం వూహాలని రేకెత్తించింది. సారస్వతం జీవితాన్ని అనుసరిస్తుందంటారు. జీవితంకూడా అప్పుడప్పుడు సారస్వతాన్ని అనుకరించడం లేకపోలేదు. ఎక్కడో చదివాను. ఒక శ్రీమంతుడు జీవితం అంతా , ధనికుల పార్టీలకి హాజరుకావడం ఆశయంగా పెట్టుకుని, వారిచేత  ఆహ్వానింప బడేటందుకు ప్రాణం మినహా సర్వస్వమూ ఇచ్చేవాడట. ఆ వ్యక్తి వార్ధక్యంలో వ్యాధికి గురై మంచాన పడతాడు. చూడ్డానికి వెడతారు స్నేహితులు. అవి తుదిఘడియలని గుర్తించారు. ఒక ధనికురాలు పార్టీ ఇస్తోందిట. దానికి ఆయన్ని పిలువలేదుట. అందుకు బాధపడి, ఆమెని తిడుతూ, ప్రేలాపన సాగించాడుట ఆ వృద్ధుడు. అప్పుడు ఆ స్నేహితులు ఆయనకి మనశాంతి సమకూర్చాలని, ఒక ఆహ్వానపత్రం సృష్టించి ఆయనకి చూపించారట. కొన్నినిమిషాల ముందు

ఆయన దాన్ని చూసివుంటే నిశ్చంతగా ప్రాణం విడుచును. ఇది జ్ఞాపకంవచ్చి పేరయ్యగారి పోయిన పద్యాల కాగితం నేనే తీసి, మొర్నాడు అచ్చువేయించి, ఆయనకి చూపి మనశ్శాంతి కలగజేసివుంటే ఎంతబాగుండునో వూహించుకుని నేను తృప్తి చెందాను. పేరయ్యగారి మాటెల్లా వున్నా ఆయన ఉన్నట్లు తెలీని ఈ లోకానికి ఆయన లేనట్లు తెలిపే అవసరం ఎందుకురావాలి? అందుకే ఆయన్ని మర్నాడు చూడలేదు చూడనుకూడా... ఎవరితోను పంచుకోను ఆ అనుభూతిని. ప్రతివ్యక్తి కొన్ని అనుభూతులను రహస్యంగా దాచుకుంటాడు. అప్పుడప్పుడు దాన్ని స్మరించుకుని అనందపడతాడు. నాకిది అట్లాంటిది.

# రాధ — 'వసంతమూర్తి'

***1933 ఆంధ్రపత్రిక 'శ్రీముఖ సంవత్సరాది ప్రత్యేక సంచిక' నుంచి పునర్ముద్రితం***

*ఎనభై సంవత్సరాల క్రిందటి తెలుగు కథ!!!*

**ఆ అమ్మాయిని "రాధ" అని పిలుస్తారందరూ.** శరీరచ్ఛాయ నలుపే. అయితే నేం? ఆ కళ్ళు! వింతరకమైన వెల్తురు పరిమళిస్తుంది వాటిలోంచి. ఇంక నవ్వో? గవ్వల గిలకరింతే. మా అక్కయ్యతో ఆడుకోడానికి ప్రతిరోజూ ఆమె మా ఇంటికి వస్తుంది. ఆమెని గురించి నాకు తెలిసిందింతవరకే.

"నేననుకున్న కన్నా ఆమెకు నన్ను గురించి ఎక్కువ తెలిసి ఉండాలి. కాకపోతే అలాగ ఎందుకంటుంది? నా భావన గాలిలాగ పరుగెత్తుతోందే? చిన్నతనము చేత ఆమె అన్న మాటల కింత వ్యాఖ్యానమా?" అనుకుంటూ నా గదిలోకి వెళ్ళాను.

"దాసీదాని కింత చొరవా? సరే. 'మీ తమ్ముణ్ణి పెళ్ళాడతా'నని ఆమె అన్నదే అనుకుందాం. మా అక్కయ్యకి లేని తొందర దానికెందుకూ? అబ్బ! ఎంతకేక వేసింది? 'అబ్బాయిగారూ, ఈ అమ్మాయి మీ పెళ్ళామటండీ' అంటుందా?" నా కోపం చల్లారలేదు. మరి రెండు చీవాట్లు పెట్టుదామని వెనక్కి తిరిగాను.

"సుధా! ఏమిటిరా, అంత ఎగిరావు? పాపము, సూరమ్మ ఏడుస్తోంది. అది అన్నమాటలు నిజమో, అబద్ధమో తెలుసుకోకుండా ఊఁ.. చీవాట్లు పెట్టేయడమే?"

"ఏమిటే అంది? నన్ను పెళ్ళాడతానందా? లేనిపోని మాటలు కల్పించి -"

"లేనిపోని మాటలా? పోనీ, అడుగు"

"ఏం రాధా? నిజమేనా? అబద్ధమా?"

"................"

"అదిగో చూశావా?"

"నామీద అనుమానం పడుతున్నాడు. ఊరుకుంటావా రాధా?"

"నిజమే!!"

నీళ్ళు చిలకరించగానే అణిగిపోయే పాలపొంగులాగ నా కోపం అణిగిపోయింది. ఏమనాలో తోచిందికాదు. అక్కయ్య ఘొల్లున నవ్వి "ఏం? ఇప్పుడేమంటావు?.. సూరమ్మా!" అని కేక వేసింది.

సూరమ్మలో తప్పులేదు. పెరట్లోకి వెళ్ళి దానికోసము వెతికాను. గడ్డిమేటి చాటున నిలబడి కళ్ళు ఒత్తుకుంటోంది.

"సూరమ్మా, నీ తప్పు లేదు. ఓస్, ఇంతమాత్రానికే ఏడవాలా?" అన్నాను. ఏడుపాగలేదు. చెయ్యిపట్టుకు క్రిందకి లాగి - పాపము చిన్నప్పుడు నన్నెత్తుకుని ఆడించేది. పడవలమీద కూర్చోపెట్టేది, మా అమ్మ వద్దన్నాను. నేను తినమని బలవంతం చేసినా ఏమీ తినడానికి పుచ్చుకునేది కాదు. "అయితే నా మోటారు కారులో ఎక్కవన్నమాటే" అన్నాను.

నా చిన్నతనములో ఒక కాపు నన్ను బైసికిలు ఎక్కించి తీసుకువెళ్ళాడుట. మధ్య దారిలో క్రిందపడ్డాను. దెబ్బ తగిలి రక్తము వచ్చింది. అమ్మ కోప్పడుతుందేమో అని సూరమ్మ ఏడవడమారంభించింది. తరువాత ఆ కాపుతో "నేను పెద్దవాణ్ణయాక కారుకొని దానిలో నిన్నెక్కించి పడతోస్తాను లే" అనీ, తనతోటి "నా కారులో నిన్నెక్కిస్తానులే" అనీ అన్నానని సూరమ్మ చెపుతూంటుంది. ఈ సందర్భంలో చిన్ననాటి మాట జ్ఞాపకము చెయ్యడమే క్షమాపణ కోరడమని ఇలా అన్నాను.

ఓస్! ఏడుపంతా ఎక్కడికో ఎగిరిపోయింది. పకాలున నవ్వి "ఏమండీ, అబ్బాయిగారూ అంత కోప్పడ్డారు?" అంది. ఆ అమ్మాయి అలా అంటుందనుకోలేదు.

జరిగినదానికి వింతపడుతూ వెనక్కి వచ్చాను. హాస్యాలు ఆఖరయినట్లు లేదు. మా అక్కయ్య చావిడిలోంచి రావడానికి బయలుదేరింది. రాధ ఆవిడ పైట పట్టుకుని వెనక్కి లాగుతోంది.

"అబ్బ వదలవే పైట లాగేస్తావేమిటి?"

"అడగనంటే వదుల్తాను"

"వదులే, అడగనులే"

"సుధా - అ...బ్బ చెయ్యి తియ్యి. ఊపిరిసలపడము లేదు. ఏమంటావురా అయితే."

"ఏమిటే అనడము? హాస్యము ఎక్కువైపోతోంది. వాళ్ళు నియోగులు, మనం వైదికులం? వాళ్ళమ్మ వింటే ఏముంటుంది. "

"ఏమంటుంది? ఇంతకన్నా మంచివాడెక్కడ దొరుకుతాడంటుంది?"

మాట్లాడకుండా నా గదిలోకి వెళ్ళి పోయాను. రాధ గభీమని బయటికి దాటేసింది.

"నా పద్యాల పుస్తమెవరు తెరిచారూ?"

"అక్కయ్యా నా పుస్తకమెవరూ తీశారు పైకి?"

"నేను!!" అన్నది రాధ.

"రాధ తీసిందట."

●●●

భోజనము చేస్తున్నాము. అమ్మ పప్పులోకి నెయ్యి వడ్డిస్తూ "సూరమ్మ నెవరేనా ఏమిటేనా అన్నారేమిట్రా?"

"ఏం? ఇంకా ఏడుస్తోందా ఏమిటి? "

"ఏమన్నావేమిటి?"

"అలాగడగండి, అమ్మగారూ" అని నూతి దగ్గర్నుంచి సూరమ్మ.

"ఏమీ లేదూ. అక్కయ్య రాధని 'రాధా, రాధా ఎవర్ని పెళ్ళాడతావే?" అని అడిగిందట తక్షణం ఆవిడగారు సావిత్రిలాగ 'మీ తమ్ముణ్ణి పెళ్ళాడతా' నందిట" పెద్దక్కయ్య నవ్వి చప్పట్లు చరిచింది.

అమ్మ "అదేమిటే, శాంతా, అంట్ల చేతితోటే" అంది.

శాంతక్కయ్య నువ్వు మానలేదు. వదినగారి వంతు వచ్చింది. అక్కయ్య చెయ్యి కడుక్కోడానికి ఆవిడ చేతిమీద నీళ్ళు పోస్తూ "సుధా! మీరాగనక్కరలేదు చెప్పండి"

సూరమ్మ ఊరంత కేకవేసి కడుపు చెక్కలయేటట్టు నవ్వుతూ "అబ్బాయిగారూ! ఈ అమ్మాయి మీ పెళ్ళామంటండీ" అంది. చిన్నక్కయ్య అందుకుని "నీ అంతరము చూచి మాటాడమన్నారు పెళ్ళికొడుకుగారు" అంది. అంతా నవ్వనారంభించారు. నేను లేచి చెయ్యి కడుక్కుని చుట్టుతిరిగి వీధిచావడిలోకి వచ్చాను.

"ఆడనీ సుక్కాని ఈడనే గెడయేసి" అని పాడేసరికి రాధ గుమ్మం దగ్గరకొచ్చి నిలబడింది.

వేద తొట్లో లేచి కూర్చుంది

"వేదా! లేచావూ..!?" అన్న నా మాటలకి వేదవతి చిరునవ్వు నవ్వింది. మాటలు రావు గాని లేకపోతే ఏదో ఒకటి అనేదే!

గభీమని తొట్లోంచి ఎత్తుకుని "పడవెక్కి భద్రాద్రి పోదామా" అని గెంతాను. రాధ నవ్వుతోంది.

"రాధా వేదని అక్కయ్య కిచ్చేయి" అన్నాను.

ఆమె వస్తూంటే వేద "దాదా" అని చెయ్యి ఊపి, తీరా దగ్గిరికి రానిచ్చి నావీపు వైపు తల తిప్పింది. రాధ పకపక నవ్వడమారంభించింది. అచ్చంగా "సరిగమపదనిస" గవ్వలు గిలకరించినట్లు, మువ్వలు మోగినట్లు, బంగారు గుండ్లు దొర్లించినట్లు. "ఏది ఏది మరొక్కసారి" "సరిగమపదనిస". ఏదో వింత అందముంది ఆ గొంతులో. కోయిల స్వరము కాదు, నెమలి కంఠముకాదు, తుమ్మెదరొద కాదు. వీటినన్నిటిని మింగి నెమరువేస్తున్నట్లుంది. గోడకి చేరబడి రాధ ఒకటే నవ్వు. విస్మయము తోటి ఆమె వైపు చూచాను. కలువపువ్వుల అమాయకత్వము ఆ ముఖములో నురుగు కట్టింది. ఉషఃకాంతులా నల్లని నుదురుమీద నృత్యము చేశాయి. నక్షత్రాలాకళ్ళల్లో గంతులు వేస్తున్నాయి. నాగస్వరానికి సర్పములాగు క్షణకాలము ముగ్ధుణయాను. వీధిలోంచి ఉరుములాగ నాన్న మాటలు వినబడ్డాయి. గభీమని ఆమె చేతులు పట్టుకు లేవదీసి "ఊ, వేదని తీసుకుపో త్వరగా" అన్నాను.

## 2

మధ్యాహ్నము అమ్మ పడుకుని నిద్రపోయింది. గదిలో కూర్చుని 'కృష్ణపక్షము' చదువుతున్నాను. ఎండ తెరలు తెరలుగా భూమి నావరిస్తోంది. చంద్రకాంతం మొక్క ఆకులు వేలవేసింది. చిన్న పిట్ట ఒకటి రెమ్మలమధ్య వాలి ఏదో పొడుచుకు తింటోంది. అక్కయ్య చావిడిలోంచి "సుధా" అని పిల్చింది.

వెళ్ళి, "ఏం?" అన్నాను.

"చెప్పు రాధా" అంది రాధవైపు తిరిగి.

"మరేమోనే, మీ అక్కయ్య పిక్క ఒకటి నాదగ్గరుంది. ఇప్పుడావిడ చెమ్మా వేశారు. ఆవిడ తన పిక్కని బతికించుకోకుండా నా పిక్కని చంపవచ్చునా?"

"గవ్వలాడుతున్నారా? మరేం పని లేదా ఏమిటి?"

"ఏం చెయ్యమన్నావు?"

"చదువరాదూ, ఏదేనా పుస్తకం?"

"ఆ! పుస్తకమనగానే జ్ఞాపకం వచ్చింది. ఏది, సుధా, ఎంకి పాటల పుస్తకమియ్యి."

"నేను పట్టుకురానా?" మధ్యలో రాధ అందుకుంది.

"ఊఁ వెళ్ళు" రాధ ఒక్క పరుగున వెళ్ళింది. అక్కయ్య "అబ్బ చంపేస్తోందిరా" అంది.

"ఏమిటీ?"

"ఆ పాటలు పాడమని నిన్నడగమని చంపేస్తోంది. ఆఁ నువ్వే అడగమన్నాను. అడగదుట.. అన్నం తింటున్నా, నీళ్ళు తాగుతున్నా, పూలు కుట్టుతున్నా, 'ఏమండీ అడగరూ' అని పీకేస్తోంది."

"ఎప్పుడు వింది?"

"రోజూ వింటోంది."

పుస్తకం పట్టుకుని రాధ వస్తోంది. ఈ పిల్ల చర్య కొంత వింత గొల్పింది.

"ఏ పాటపాడమన్నావూ?"

"రాధ నడుగు. ఏది రాధా?"

"బాగుంది. నేను పాడమన్నానా ఏమిటి?"

"అయితే పుస్తకము సొరుగులో పెట్టేయ్."

"ఊఁ"

అంటూ పుస్తకమందించింది. వేళ్ళు తగిలి రక్తముద్రిక్తమైంది. ఆమె బుగ్గలకి రక్తము చిందింది. ఆ కళ్ళు ఎందుచేతనో చూడలేకపోయాను. గుండె గాలికి రావియాకులాగ కొట్టుకుంది. చెయ్యి వణికింది. పుస్తకం జారింది.

"అదేమ్రిటా పాడవూ?"

"పోనిస్తూ"

"అయితే పుస్తకం ఎందుకు తెమ్మన్నావు?"

"నువ్వా? నేనా?"

"ఎవరో పాడుదూ"

"ఆడనీ సుక్కాని ఈడనే గడయేసి. ....."

"ఊఁ ఇంకోటి. ఏదీ పుస్తకమిలా ఇయ్యి. ఇదిగో."

"అబ్బే ఇది కాదండీ. నేను చూపిస్తా. ఇదిగో ఇది"

"ఇయ్యి"

"అబ్బ. మీరిద్దురూ"

"ఎంకి వంటీ పిల్ల లేదోయి లేదోయి, ఎంకి నా వొంకిక రాదోయి రాదోయి"

"అమ్మ రాధా, గడుసుదానవే!"

"ఏం?"

"ఏం లేదు. పాట కానీ."

"చెక్కిట చిన్నీ మచ్చ, చెపితే చాలదు లచ్చ"

అక్కయ్య పకాలున నవ్వి, "అమ్మ రాధోయ్, ఇంత గడుసుదాని వనుకోలేదే. అమ్మోయ్! రాధే." అంటూ అమ్మకేదో చెబుదామని లోపలికి వెళ్ళబోయింది.

రాధ ఆవిడపైట పట్టుకుని "అబ్బ, ఇప్పుడే పడుకున్నారండీ. లేపకండి" అని అడ్డుపడింది.

అక్కయ్య వెనక్కి వచ్చి, "ఏదీ సుధా తక్కినది కూడా కడతీరా పాడు. ఇంకా ఏముందో చూదాము."

"పాడను. ఏమన్నావు. రాధగడుసుతన మేముందిక్కడ?"

"...(నవ్వు).. ఏది రాధా నీమచ్చ ఏదీ?" అంటూ రాధ బుగ్గ నా వైపు తిప్పబోయింది.

"అ...బ్బ"

"ఇదిగో సుధా, రాధ చెక్కిట చిన్ని మచ్చ."

రాధ అక్కయ్యనోరు మూసేసింది.

ఈ అమ్మాయి అమ్మాయిలాగ లేదు. !!

## 3

ఒంటిగంటకి బళ్ళు పూయించాడు పయిడయ్య. అంతా బళ్ళలో కెక్కుతున్నారు పల్లకీ రాలేదు సొమ్ము పుచ్చుకుని కూడా. సమయానికి రాలేదని అమ్మకి చాలా కోపముగా నుంది.

"బ్రహ్మం, వెళ్ళు."

"ఊఁ అరుగో."

పల్లకీ వచ్చింది. అన్నయ్య కూర్చున్నాడు. అత్తా, దొడ్డమ్మా, పిన్నీ అక్షితలు జల్లారు. బాజాలు మోగుతున్నాయి. అమ్మ పెద్దక్కయ్య కేదో చెప్పింది. ఆవిడ రాధ ఇంటికి వెళ్ళి చిన్నక్కయ్యనీ, రాధనీ తీసుకు వచ్చింది. చిన్నక్కయ్య ఒక బండిలో కూర్చుంది. కానీ రాధకి చోటు లేకపోయింది.

"మా బండిలో కొంచెం చోటుంది ఇక్కడికి పంపండి" అని మా అప్పలన్నయ్య కేకవేశాడు. రాధ వచ్చింది. నేను చెయ్యి అందించాను. పట్టుకుని పై కెక్కింది.

"ఫిడేలెవరిది?"

"నాదే"

"ఎన్నాళ్ళాయి నేర్చుకుంటున్నావు?"

"రెండేళ్ళనుంచి."

"ఇంకేం, గానపాటకు లెవ్వరూ అక్కర లేదన్నమాటే."

రాధ నవ్వింది. "ఏదేదీ? మళ్ళీ" అన్నాడు, అప్పలన్నయ్య.

"ఊరుకో ఊరుకో. ఊపిరి సలపదు."

ఏదో విపరీతభావము గాలి తెరలుగా వచ్చి నా హృదయాన్ని కమ్ముకున్నది. విరామము లేకుండా వాసనలు గుప్పే సుగంధ రాజకుసుమంలాగు, ఆయాసపడకుండా మెరిసిపోయే నక్షత్రంలాగు రాధ నవ్వడమారంభించింది. నూటికి ముగ్గురున్న బ్రాహ్మలలో ఇన్ని శాఖలెవరేర్పరిచారా అనే ఆలోచనలో పడవల రేవుకి బళ్ళు వచ్చాయన్నమాట మరచిపోయాను.

## 4



కౌముది

మా విడిదికి మేడ ఉంది. నేనూ, అప్పల నరసింహం అన్నయ్యా, నా తమ్ముడూ కూర్చుని తమలపాకులు వేసుకుంటున్నాము.

"తమ్ముడూ, ఒక పద్యం చదువుదూ.?"

"పద్యం కాదు. పాట పాడతాను విను"

"ఏదో ఒకటి."

"ఎంకి వంటి పిల్ల లేదోయి లేదోయి"

"..............."

"ఒక్కనవ్వే చాలు ఒజ్జిర వైఢూర్యాలు"

అన్నట్టు నవ్వగానే జ్ఞాపకము వచ్చింది. "ఆ పిల్ల ఏదీ? ఏం పేరు?"

"రాధ."

"రాధా?"

"ఆఁ"

"మాట మాట."

"తమ్ముడూ, పాటకానీ"

పాడక పోడానికి కారణము లేదు. పాడితే అనుమానము పడతాడేమో. అన్నట్టు ఇతనికాసంగతి తెలీదు.

ఆమె మెట్లెక్కుతున్న చప్పుడయింది.

"చెక్కిట చిన్ని మచ్చ
చెపితే చాలదు లచ్చ
ఒక్క నవ్వే యేలు వొజ్జిర వైఢూర్యాలు"

రాధ వచ్చింది. అప్పలన్నయ్య ఆమెకేసి తిరిగి "ఒక్క నవ్వే యేలు వొజ్జిరవైఢూర్యాలు" అన్నాడు. రాధ ఈమారు నవ్వలేదు. దృష్టి పాటమీద ఉన్నది.

"మెళ్ళో పూసలపేరు తల్లో పూవుల పేరు"

"అబ్బే. అలాక్కాదురా; మెళ్ళో ముత్యాల పేరు - తరువాత ఏమిటీ?"

రాధ మెళ్ళో ముత్యాలపేరుంది. నాకళ్ళామె వైపు తిరిగాయి. ఆనాటి 'మచ్చ' మాట జ్ఞాపకమొచ్చి "చెక్కిట చిన్ని మచ్చ" కూడా ఉంది.

"అది కూడా పాడవోయి" అన్నాడు.

రాధ సిగ్గుచేత తలవంచేసింది. పాట ఆరంభిద్దామని గొంతుసవరించి,

"రాసోరింటికైన రంగూ తెచ్చే పిల్ల
నా సామ్ము నా గుండె నమిలి మింగిన పిల్ల" పాడుతున్నాను.

"వణుకుతావేం?"

"గొంతుకలో ఏదో అడ్డుపడింది. వస్తా" నంటూ వరండాలోనికి వెళ్ళాను.

క్రిందనుంచి "సుధా!" అక్కయ్య పిలుపు.

"ఆఁ"

"రాధేదీ?"

"ఇక్కడుంది"

"ఇలా రమ్మను."

"రాధా! అక్కయ్య పిలుస్తోంది."

నేను తిరిగి వచ్చి, "నియోగులకీ, వైదికులకీ తేడా ఏమిటన్నయ్యా? " అడిగాను.

"వాళ్ళు - కర్మలకి పనికిరారు"

"మనం? - ఉద్యోగాలికా"

"ఎక్కడికిలే, అసలు తేడాలేమీ లేవు. అనుకుంటే తేడాలెన్నైనా వస్తాయి"

"పురోహితుణ్ణడుగుదామా?"

"ఊఁ. పిలవరా చంద్రశేఖరం."

"వద్దు. వద్దండు. నేను రప్పిస్తాను.

"నిండార బాఋ నఖండ గోదావరి

దాగిన చాళుక్య నాగరికత"

"ఎక్కడ నేర్చావురోయి ఈ ఫక్కీ. వెంకటశాస్త్రిగారిదిలాగుండే కానీ."

"పల్లెపదాల జీవము నిల్పికొన్న పల్నాటి వీరుల రక్తనాళ పటిమ"

"భేష్. బాగుంది. రాధా. ఇలా రా. మూలనక్కావేం?"

పురోహితుడూ, శాస్త్రులుగారూ, పినతండ్రిగారూ వచ్చారు.

"ఏమండోయి శాస్త్రులుగారు, బ్రహ్మగారు ఇలా వచ్చారు?"

"ఇదిగో మనవాడి పద్యాలు విందామనే."

"పద్యాలు వినడంకంటే పెద్దపనికే రప్పించాడు మిమ్మల్ని, పద్యాలు చదివి."

"ఏమిటి కథ?"

"నియోగులికీ మనకీ సంబంధాలెందుకు లేవు?"

"ఆచారం లేదు."

"అధికారగర్వం ఉంది వాళ్ళకి, ఆచారాల గర్వం మనకి"

"సరి. ఏ కోతీ కొండదిగదు."

"పెళ్ళి సంబంధాలవల్ల ఈ రెండు భాగాలూ కలిసిపోతే నూటికి ముగ్గురున్న బ్రాహ్మల గతి ఇప్పటికంటే బాగుపడదూ?"

"పిల్లికి గంటకట్టేవారెవరు?"

"ఇది పిల్లిటండీ?"

"వీళ్ళివ్వరు, వాళ్ళివ్వరు. మరి పెళ్ళేలాగ అవడం?"

"మాటవరసకంటున్నాను. నాకివ్వడానికి ఎవరేనా సిద్ధపడతారనుకోండి. మీరు పెళ్ళి చేయిస్తారా?"

"ఏమంత అవసరము, వాళ్ళ పిల్లని చేసుకోవడానికి?"

"చూశారా? ఆ ప్రశ్న రావలసిన అవసరమేమిటనే నేనడిగేది."

"పోనిస్తూ. దానికేం గానీ ఒక పద్యం చదవరా?"

"చదవ్వోయి. చూద్దాం, వాటిమాటకేం?"

"సడిలేని నడిరాత్రి నుడురాజు గిల్గింత
కడలి యుప్పొంగెడి కలువనవ్వు.
వగరొ చిగురు మెక్కి పొగులు కోవెల గొంతు
బిగుతౌట కలరు జాబిల్లి నవ్వు
వేశ్య జూడగ బోవ వెలికిదీయుచు నూదు
జడు బొడగాంచు వజ్రంపు నవ్వు -"

"భేష్, ఎవర్రా వ్రాశారూ?"

"అర్జునా ఫల్గుణా యనుచు కేకలవైచు
బాలుర గాంచు మేఘాల నవ్వు
కలసి యానందర సవర్షములను గురిసి
మోడుబోయిన నా గుండె మొలకలేసి
కిసలయావృతగా ఏసె కీరవాణి
ఏది వినిపింపు నీ నవ్వు నింకొక సారి"

"ఏది? ఆ ఉయ్యాల పద్యం చదువు"

"ఏలాలతాజాల డోలసమాలోల
బాలామణీగాన భాసురములు"

ఏలాల.... మొదటి, రెండు, మూడు కాలములలో చేతిని ఉయ్యాల తీరుని ఊపుతూ చదివాను. చెయ్యూపుతూంటే రాధ నవ్వింది. "గ్రామఫోన్ ప్లేట్" అన్నాడు అప్పలన్నయ్య. మా పినతండ్రి "ఊఁ బాగానే ఉంది కథ" అన్నాడు. నా గుండెలో రాయిపడింది.

"బ్రహ్మగారూ, కబురు వచ్చింది. రావాలి" అని అన్నయ్య వచ్చి పిల్చాడు. పినతండ్రిగారు, రాధ మాత్రమే ఉన్నారు.

"ఏదీ, సుధా! ఏమిటాపాదం? వగరొ?"

"వగరొ చిగురు మెక్కి పొగులు కోవెలగొంతు బిగుతౌటకలరు జాబిలినవ్వు"

"అబ్బే - మార్చాలి ఈ పాదం. వ్రాసుకో."

"నేను వ్రాస్తేగా?"

"నా దగ్గర బొంకకు మరి. ఈ పిల్ల నియోగుల పిల్లా ఏమిటి?"

దొరికిపోయాను. "ఊఁ"

"అనుకున్నదే ఊఁ."

"నికటస్థమౌ పెంటి నెరుగక మొరలిడు

చక్రవాకము గాంచు చంద్రు నవ్వు"

అని వ్రాయి.. అదేమిటి ఆ బాజాలు?"

"భోజనానికి వెళ్ళుతున్నారు."

"నువ్వు రావూ?"

"మేము చద్దన్నము తిన్నాము."

"సరే. నే వెళ్ళాలి మరి" అని ఆయన లేచి వెళ్ళిపోయారు. ఏదో పెద్ద బరువు గుండెలమీదనుంచి లేచిపోయింది.

"రాధా! నీ ఫిడేలేది?"

"అదుగో."

నేను వెళ్ళి తెచ్చి, "ఊఁవాయించు." అడిగాను.

"అబ్బ, ఇప్పుడేమిటి?"

"ఇప్పుడే మరి. ఎవరూ లేరు. చాలా బాగా వాయించాలి మరి."

"సా...."

"ఊఁ ఎవరేనా వస్తారు మరి"

"సారినీదా - విరిబోణి.."

"భేష్. ఎవరిదగ్గర నేర్చుకుంటున్నావు? ఏమిటది ఉండుండు. సాలీడు. నేను దులిపేస్తాను" అని ఆమె ముంగురుల మీది సాలీడు దులిపాను. ఆమె కదలలేదు.

"ఇంకొకటి."

"స్వరరాగసుధారస...."

"ఊఁ ఇదొకటా నీనవ్వుకి తోడూ? అవునుగాని అన్నట్లు నీ పెళ్ళెప్పుడు?"

"ఊఁ"

"చెప్పదూ, సిగ్గులకేమీ?" అంటూ అప్రయత్నముగా ఆమె చెయ్యిపట్టుకున్నాను. ఆమె తీసికోయత్నించలేదు.

"మీ పెళ్ళో?"

"...అవునుగాని, ఎవర్ని పెళ్ళాడతావని మా అక్కయ్య అడిగితే ఏమీ ఆలోచించకుండా 'మీ తమ్ముణ్ణి పెళ్ళాడతా'నంటావా?"

"ఏమిటి ఆలోచించడము?"

"మీరు నియోగులు, మేము వైదికులం."

"అయితే?"

"మీకూ మాకూ సంబంధాల్లేవే..... అయినా ఏమి చూచి పెళ్ళాడతానన్నావు? అందమా? ఏకోశాన్నా లేదే?"

"ఎవరన్నారూ?"

"అద్దం.! ఎవరనాలి. చిన్నప్పుడు కాల్చిన చుట్టమచ్చ నుదురు మీదుంటే అదీ... మరో సంగతి. నువ్వూ నేనూ ఒప్పుకుంటే సరిపోతుందా? మీ అమ్మో?"

"అమ్మ ఏమనదు."

"చిన్నతనము నీకు. ఇదేం బజారు నుంచి మిఠాయితేవడమనుకున్నావా? మీ అమ్మ కిష్టమే అనుకో. మీ మామయ్య, పిన్నీ, మీ అత్త, అమ్మమ్మ, వీరంతా నిన్ను నాకివ్వనిస్తారా? 'వైదీకపాడికి మనపిల్లనివ్వడమేమి'టనరూ? చిన్నపిల్లవి. నీకీ సంగతులు తెలియవు. ఏమంటావు?"

రాధ మెల్లిగా నా చేతిలోని చెయ్యి తీసేసుకుంది. నా మనస్సులో తుఫాను బయలుదేరింది.

"ఏమంటావు? నిజమా? అబద్ధమా?" అని తలమీద చెయ్యివేసి ముఖము పైకి ఎత్తాను.

"నిజమే" అని ఆమె తలవంచేసి ఫిడేలు తీగని బిగుతుచేసి వదులు చేస్తోంది. కుడిచేతిలోని ఫిడేలు కర్ర తీగలమీద గంతులు వేస్తోంది.

తూ.తుత్తు తుత్తుత్తూ..

"తూతూపాకా. వాళ్ళు వస్తారు. వెళ్ళు. ఫిడేలు నేను సర్దుతాలే"

ఆమె లేచింది. రెండు నీటిచుక్కలు నా చేతి మీద పడ్డాయి.

ఎవర్నేమిటనడము? ప్రాచీనాచారమునే మత్తగజము ఆచారవంతుల వీధులలో విచ్చలవిడిగా విహరిస్తుంది. దానికెవరేనా అడ్డువెళ్ళితే దాని కాళ్ళక్రింద పడి నలిగిపోవలసినదే. ఆచార దౌర్జన్యము వారికి రోహిణికార్తి ఎండవలె కనబడితేనే కానీ ఏవిధమైన మార్పూ అవసరమని ఎంచేవాళ్ళే ఉండరు. రాధా సుధాకరులు ఆ నలిగినవాళ్ళలో ఇద్దరు.

●●●

రాత్రి పడవలు మెల్లగా సాగుతూన్నట్లు పిల్లినకర్రకి కట్టిన మువ్వలు చెప్పుతున్నాయి. గట్టుమీది చెట్లు నాదాకా వచ్చి కొంచెమాగి, నన్ను చూచేకాబోలు గుసగుసలాడుకుంటూ కదిలిపోతున్నాయి. పాపము వీటిగతేమిటి? పుట్టిన దగ్గర్నుంచి చచ్చేదాకా ఒకేచోటున పడిఉండాలి. నక్షత్రాలు కునికిపాట్లు పడుతున్నాయి. వాటికీ ఎదుగేలేదు. ప్రపంచము, ఎందరో అనేటట్లు విశ్రాంతి గృహముకాదు. గాలిరాకకి వెదురుపొదలు సంగీతమారంభిస్తే నన్ను పొందలేరని చెప్పేసి వెళ్ళిపోతున్నాడు మందపవనుడు.

"పడవ ఒడ్డుకి పెట్టవోయి."

"ఎవరు?" అని బయటికి చూచాను. బాబు.. ఇంకా ఎవరో.

అక్కయ్య "సుధా" అని పిలిచింది.

"ఆఁ"

"ఇలా రా."

వెళ్ళాను.

"రాధకి ఏమిటో కావాలిట. కొనిపెట్టు."

"ఏం కావాలీ?"

"దాహం వేస్తోంది."

కొంత దూరం వెళ్ళాము.

"సోడా తాగుతావా?"

"అబ్బే ఛీ"

"మజ్జిగో?"

"ఊం"

దూరంగా దీపం మినుకు మినుకు మంటోంది. దగ్గరకి వెళ్ళాము. దీపం లాగే కునికిపాట్లు పాడుతోంది గొల్లమనిషి.

"మజ్జిగుందా?"

"ఆఁ ఎంతటిది?"

"ఒక అర్ధణాదియ్యి. రాధా, నీకెంతదికావాలి. చూడిది."

"మీరు తాగండి చెప్తాను."

నేను తాగి "అబ్బో" అన్నాను. రాధ "ఏదీ. ఎంత మిగిల్చారేమిటి?" అని నా చేతిలోని పిడత తాను తీసుకుని తాగడమారంభించింది. పిడత తీసుకోబోతే వదలలేదు.

"అదేమిటి రాధా!"

"ఏం?"

"నేను ఎంగిలి చేసినది తాగుతావా?"

"ఏం తాగితే!? అదుగో పడవమళ్ళా ఒడ్డు కొచ్చేసింది. రండి. వెళదాము" పరుగులో ఆమె జారింది. నేను పట్టుకుని ఆమె తల రొమ్ముకదుముకున్నాను. పడమటి మేఘాలు పక్కున నవ్వాయి.

●●●

మునుపటివలె రాధ మా ఇంటికి రావడంలేదు. ఎందుచేతనో తెలియలేదు.

"అక్కయ్యా, రాధ రావడం మానేసిందేం?"

అక్కయ్య అమ్మకేసి చూసింది.

"ఏం రాకపోతే? ఎప్పుడూ నీ పాటలు వింటూ కూర్చోమన్నావేమిటి? వాళ్ళమ్మకి జ్వరమట."

"ఉహూఁ"

●●●

"కాఫీ పొడుము పట్టుకురాగ్లా ఎక్కడేనా, మీ బావగారికి టీ పడదట?"

"రాధగారింట్లో ఉంటుందేమో?"

"రాధ ఇంట్లోనా? మీ అమ్మ ఏమంటారో?"

"ఏమి? అడగకూడదూ?"

"పోనీ పట్టుకురండి. మీ అమ్మతో చెప్పకండి. వీళ్ళనీ, వాళ్ళనీ ఎందుకు అడగడమంటారు."

బయలుదేరాను. కానీ "మీ అమ్మ ఏమంటారో" అన్న మాట చెవులలోను, గుండెమీదా రింగుమంది. రాధ నడగడము అమ్మ కిష్టములేదూ?

వారింటికి వెళ్ళి "రాధా" అని పిలిచాను.

"ఆఁ." అంటూ బయటికి వచ్చింది.

"కాఫీపొడుముందా?"

"ఊఁ" అని వెళ్ళి పట్టుకొచ్చింది.

"రావడము మానేశావేమి?"

"అమ్మ కోప్పడుతోంది?"

"మీ అమ్మ కెలాగుంది?"

"ఏం?

"జ్వరమంట."

"అబ్బే, లేదే ఎవరన్నారూ?"

●●●

"అమ్మా, రాధకి శారదా బిల్లు రాకుండా పెళ్ళి చేసే యత్నంలో లేరేమిటి?"

"లేకేమి? యడిగారా ఎవరూ దొరకకపోతే మన సుధని కట్టమంటుందంట వాళ్ళమ్మ, మంగళసూత్రం."

నా ఒళ్ళు ఝల్లుమంది. మూలిగేవాడికి కట్టెపుల్లలాగు నిరాశలో ఈ ఆశ ఏమిటి?

●●●

"అమ్మా, రాధకి పెళ్ళివారొచ్చారు. కుర్రవాడు తెల్లగా బాగున్నాడు."

"వాళ్ళ ఇంటిపేరేమిటి?"

"ఎందుకురా నీకు వాళ్ళ గొడవలు, నీ చదువేదో చూసుకోక?"

"ఏం, అడిగితేను?"

"అబ్బే! తెలియదురా"

"ఏమమ్మా అడిగితే?" నా కళ్ళుమండాయి. గోరుచుట్టుమీద రోకటిపోటు.

●●●

పఠన మందిరములో పేపరు చదువుతున్నాను. రాధ అన్నయ్య శుభలేఖ ఇచ్చాడు. లోకమంతా ఊపిరి బిగపట్టింది. "నీరాధని ఇంకొకని కిచ్చేస్తున్నారోయ్" అంటూ కవరు మీద బొమ్మ ఎర్రనవ్వు నవ్వింది. ఏదో మాట్లాడబోయాను. మాట రాలేదు. దగ్గబోతూ బయటికి వచ్చేశాను. ఇంటికెళ్ళి "అక్కయ్యా! రాధకి పెళ్ళికాబోలు. ఇదిగో శుభలేఖ. వాళ్ళన్నయ్య ఇచ్చాడు."

"కాబోలంటున్నావు. చూడలేదేమిటి?"

"ఎందుకు చూడడం? లేదు"

●●●

"ఇవాళ రాధ పెళ్ళిట."

"అయితే?"

"మీరు వెళ్ళరూ?"

"ఉహూఁ పిలిస్తేనా?"

"భేష్. ఈ నాటకం బాగుంది. ఏమనుకున్నారో?"

●●●

సాయంకాలము. పెళ్ళివారింట్లో బాజాలు మోగుతున్నాయి. అప్రయత్నంగా ఆ వైపు వెళ్ళాను.

రాధ పసుపు బట్టలు కట్టుకుని అరుగుమీద నిలబడి ఉంది. ఆగిపోయా.

"అదిగో రాధ. మరొకడి సొత్తయిపోయింది. అయితే నాకేమీ కాదన్నమాటే! ఆ అభిమానం, ఆ పాటలు, నవ్వులు సృష్టికర్తకి గచ్చకాయలే? అంత ఆకర్షణకి కారణం ఏమీ లేదూ? ఈమె నా కేమీ కాదూ, నేనీమెకేమీ కానూ?"

"అన్నయ్యా! ఎవరూ భోజనానికి రాలేదేం?" రాధ ప్రశ్నతో ఒళ్ళంతా గగుర్పొడిచింది.

ఈమె నాకు చెల్లెలా? నేను పొరపాటుగా ఎంచి బాధపడ్డాను.

"చెప్తానులే"

లేకపోతే ఆ స్నేహాన్నికర్థమేమిటి? ఈమె నాకు చెల్లెలే.

## 5

పెళ్ళయిపోయిన దగ్గర్నుంచి రాధ మా ఇంటికి రావడము మొదలుపెట్టింది. ఇంక భయము లేదుకదా అని కాబోలు. వాళమ్మ కాని, మా అమ్మ కాని రావడానికి అభ్యంతరం పెట్టలేదు. తెర కాస్తా బలిసింది. కాబట్టి "ఏది రాధా, ఏదీ నీనవ్వు?" అని నేనన్నా. "అన్నయ్యా! ఈ పాటపాడ"మని ఆమె అన్నా తప్పించేవారెవరూ లేరు. ఆమెకూ నాకూ ఉన్న - తప్ప మిగిలిన వన్నీ ఉన్నాయి, ఈ పరిచయ స్నేహాలలో.

రాధ వివాహమయింది, నీ వివాహము మాటేమిటంటారు పాఠకులు. అవనిగడ్డ నుంచి ఒక సంబంధము వచ్చింది. నా కెందుచేతనో వివాహమంటే వైముఖ్యం పోలేదు. మునుపు, ఆమె ఉన్నది కనక, ఇప్పుడో ఆమె దాటిపోయింది కనకేమో? ఈ సంగతి మా వాళ్ళకి తెలియదు. ఈ సంబంధం చూచి రమ్మన్నారు. పిల్లకళ్ళలో తేజస్సు లేదు. నవ్వితే ఏడ్చినట్లు లేదుకానీ అదెలాగో ఉన్నది. సంగీతములో 'మ' 'ప'లకి తేడా లేదు ఉచ్చారణలో. పిల్ల మాత్రం సఫేదు రంగు, అర్ధణాబిళ్ళకి పాదరసం పూసినట్టు. నల్లగా ఉంది. తెలివి తేటలు లేవు. మొద్దుమొహం అని చెప్పి తోశేశాను. శారదాబిల్లు ప్రాచీనాచారవంతుల కోలాహలముతో, పెళ్ళిబాజాలతో, గుర్రపుబండీ, పల్లకీలతో ప్రవేశించింది.

పరశాఖలోని పిల్లనే వివాహమాడతానని చాలామార్లు ఇంట్లో అంటూ వచ్చాను.

"బిల్లు ఒకటి అవతరించిందిగా? ఇంక ఏ పిల్లయితేనేం" అనేది మా అమ్మ. ఈలోపుగా మా అక్కయ్య నేస్తురాలికొకర్తెకి (వారు ములికినాడువారు) కూతురున్నదట. చేసుకోవలసినదని ఆమె మా అక్కయ్యకి వ్రాసింది. మా అమ్మకి పైశాఖ సంబంధములిష్టములేక పోయినా ఆ పిల్లనైతే ఒప్పుకుంటానంది. నేను 'పిల్లని చూడనక్కరలేదు. మనమెరిగిన పిల్లేకదూ?' అన్నాను. రాధకాకపోయిన తర్వాత ఇంకే పిల్లయితేనేం?

●●●

నాకిస్తానన్న పిల్లలందరి భోగట్టాలూ రాధా కనుక్కునేది. ఈ పిల్ల సంగతి ఆమెకు తెలియదేమో. ఒకనాడు మా అక్కయ్య ప్రసంగవశాత్తు, "బందరెళ్ళేటప్పుడు" అంది.

"బందరా! మీకెందుకు బందరూ?" అంది రాధ.

"మా తమ్ముడి పెళ్ళికి."

"ఏమిటీ కుదిరిందా ఏమిటి?"

"ఆ."

"వాళ్ళింటి పేరు?"

"హిందూపురంవారు"

"అదేం పేరు? వెలినాట్లే?"

"కాదు. 'మా శాఖవాళ్ళ పిల్లని చేసుకోను, పై శాఖలోనేగానీ అని వాడు పట్టుబట్టాడు. అందుకని పైశాఖపిల్లని చూశాము." నీళ్ళు జల్లితే పాలపొంగులాగ అణిగిపోయింది, ఆమె ఉత్సాహము.

"అయితే ఎప్పుడు బయలుదేరుతారు?"

"మాఘమాసంలో."

●●●

శాఖాభేదాలు మాసిపోవాలని సంఘంలో కల్లోలం పుట్టిద్దామని నా ఆశయం. చేసి చూపిన తర్వాత ఆరంభిద్దామని ఊరుకున్నాను. మళ్ళీ ఏమొచ్చిందో రాధ మా ఇంటికి రావడం మానేసింది. ఏమిటిరా విశేషమని కనుక్కుంటే ఆమె వ్యక్తురాలయినట్లు తెలిసింది. కానీ పాపం ఒంట్లో బాగుండక బాధపడుతూ చిరాకుగానుంటుందట. ఒకనాడు ముందుకి డాక్టరుగారింటికి వెళ్ళాలని వాళ్ళమ్మ మా అమ్మతో చెప్పింది.

"సుధా! వాళ్ళమ్మాయికి వంట్లో నయములేదుట. వాళ్ళబ్బాయి ఊళ్ళో లేడుట. వెళ్ళి మందు తెచ్చి పెట్టరా పాపం." అంది మా అమ్మ.

మందు తీసుకుని వాళ్ళింటికెళ్ళి "పిన్నిగారూ" అని కేకవేశాను.

"రండి" అని ధ్వని.

లోపలికి వెళ్ళాను. మంచము మీద ఆమె పడుకుంది. కూర్చోమని మంచం పట్టెమీద కొట్టింది.

"బందరు ఎప్పుడు వెళతారు?"

"నీకెవరు చెప్పారు?"

"మీ అక్కయ్య."

"నువ్వు వస్తావా?"

ఎందుచేతనో నావైపే చూస్తున్న ఆ కళ్ళలో జలజల నీరు క్రమ్మింది. ఆనీళ్ళు నాకు కనబడకూడదని గాబోలు తల పక్కకి త్రిప్పింది.

"ఏం రాధా?"

"..............."

"ఎందుకేడుపు?"

వంట వసారా తలుపు గాబోలు కిర్రుమంది. గభీమని కళ్ళు తుడుచుకుని,

"ఏంలేదు. దూరంగా నిలబడండి. అమ్మ వస్తోంది."

"పిన్నిగారూ!"

"వస్తున్నా నాయనా! కూర్చో. ఎంతో ఆలశ్యం లేదు."

"మందివ్వనా రాధా?"

"మందా, ఎందుకు? రోగానికా, యోగానికా?"

నాకామె మాటలు వింతగొల్పాయి. చికాకెత్తింది. మందక్కడ పెట్టి "రెండింటికీ మందెవరివ్వగలరమ్మా? ఇప్పుడే వస్తానుండు" అని వచ్చేశాను.

ముహూర్తము సమీపస్థమౌతున్న కొద్దీ నాకుత్సాహమెక్కువౌతోంది. ఎవరో కోతిని కట్టుకుంటాను. ఇకముందు రాధాసుధాకరులకి శాఖలడ్డురాకూడదు.

శుభలేఖలకి పైవిలాసాలు వ్రాస్తున్నాను. రాధ అన్నయ్య వచ్చి పిలిచాడు. వెళ్ళాను. "మా ఇంటికి ఒకసారి రండి. మా చెల్లి తీసుకురమ్మంది" అన్నాడు. ఎందుకో? వెళ్ళాము.

మంచం మీద ఆమె అలాగే ఉంది. గది చీకటిగా ఉంది. నడికప్పులోంచి సూర్యకిరణ మొకటి గదిలో దూరి కొంచెం వెలుతురిచ్చింది. రాధ కూర్చోమని సైగచేసింది. ఎక్కడా కుర్చీలేదు. దగ్గరికి వెళ్ళినిలబడ్డాను. కూర్చోమని మళ్ళీ సైగచేసి, "మరెప్పుడూ కూర్చోమనను లెండి" అంది. నా కడుపు చెరువైపోయింది. ఎందుచేతనో పాత విషయాలన్నీ గుండెని కమ్మాయి.

అనలేక అనలేక "ఏం చెల్లమ్మా!" అన్నాను. రాధ మూతిమీద చెయ్యిపెట్టుకుని కూర్చోమంది మూడోసారి.

"కూర్చో నాయనా! నామూలాన్నుంచే వచ్చిందింతాను. అప్పుడిచ్చేస్తే ఏ బెంగా లేకపోవును." అన్నాదావిడ, కళ్ళు వత్తుకుంటూ. ఝుంఝూమారుతానికి అరటి చెట్టులాగ కొట్టుకుంది మనస్సు. రాధపక్కన కూర్చున్నాను. ఆమె నాచుట్టూ అరసున్నాలాగు పడుకుని నన్ను ఒత్తింది. తల మంచంపట్టెమీద పెట్టి, చేతులు నాకాళ్ళమీద వేసింది. ఒళ్ళు గప్పుమంది. ముత్యాల్లాగ కన్నీరు రాలుతోంది. తుడవడానికి ధైర్యము చాలలేదు. పక్కమీది పగడాల పేరు తీసి నాతలమీద పడేసింది. వెల్లకిల పడుకుని ఏదో మాట్లాడబోయింది. మొగము దగ్గరికి వెళ్ళాను. నాముఖము రెండు చేతులా తడివి గొణుగుతోంది. ఇంకా దగ్గిరికి వెళ్ళాను. నా ముఖం తన చెక్కులకదుముకుని "మళ్ళీ జన్మకి" అంది. సరి మరిలేదు. అంతా అంధకారం.

"ఈమె నా చెల్లెలా? భార్యా?"

# పచ్చగడ్డి - అప్పాజీ

*ఆంధ్రజ్యోతి ఫిబవరి 3 ' 1979 నుంచి పునర్ముద్రితం*

**సర్కస్‌లో గుర్రాలు, ఏనుగులు..** వాటి మీద మావిటివాళ్ళు ఆకులు కోయటానికి, గడ్డి త్రవ్వి తీసుకురావటానికి పోతున్నారు.

"మన ఊరికొచ్చిన సర్కస్‌లోని గుర్రాలు, ఏనుగులు ఇవేరా చంటీ. ఆ ఏనుగు చూడు గోడ కుర్చీ వేసినట్టు కూర్చుంటుందట. ఆ తెల్ల గుర్రంపిల్ల చూడు నడచి నడిచి ఆగి రెండు కాళ్ళు పైకెత్తి ప్రేక్షకులకు దణ్ణం పెడుతూంది." ఇన్ కమ్‌టాక్స్ ఆఫీసరు రామానుజరావు భార్య సుగుణమ్మ చంటితో చెపుతోంది. చంటివాడు ఎంతో ఉత్సాహంగా వింటున్నాడు.

"మనమూ వెళదామమ్మా" అని మారం చేస్తున్నాడు.

"నాన్నగారు ఆఫీసు ద్వారా టిక్కెట్లు తీసుకువస్తారు. సర్కస్ కొత్తగా వచ్చిందిగా! చాలా రద్దీగా ఉంటుంది. రెండు రోజులాగి వెళదాం బాబూ!"

●●●

బొరిగె గోనె సంచులు పట్టుకుని, ఎవరో ధర్మాత్ములు తొడిగి విడిచిన పాత చెప్పుల్ని కాలికి తగిలించుకుని నూకాలమ్మ, నరసమ్మ ఆ గుర్రాల వెనుకనే నడిచిపోతున్నారు.

కటకం వారి కోనేరు ప్రక్క పెద్ద మర్రి చెట్టు ప్రక్కనే దొరల సమాధులు. పచ్చిక ఒత్తుగా పెరిగిన చిన్న మైదానం. అక్కడ సర్కస్‌లోని గుర్రాలు, ఏనుగులు ఆగాయి. వాటిని నీళ్ళతో కడిగారు. మర్రి కొమ్మల్ని కోసివేశారు. దగ్గరలోనే గడ్డి త్రవ్వుతూన్న నూకాలమ్మనూ, నరసమ్మనూ గుర్రాలు కాచే గౌరీశు చూశాడు. నూనెకు నోచుకోని తలలు. కంపు కొడుతున్న గుడ్డలు. గ్రామంలో ఉన్న తనవారు గుర్తుకొచ్చి గౌరీశు భోరున ఏడ్చాడు. తాను పంపుతూన్న యాభై రూపాయలతో అమ్మ, చెల్లాయి మిగిలినవారు ఎన్నాళ్ళు గంజి తాగుతారు? వాళ్ళ తలలు, బట్టలు కూడా ఇలాగే కంపుకొడుతుంటాయి. ఆకలి భరించలేక కలిగిన వాళ్ళ కొంపల్లో అంట్లు తోమటం, వాళ్ళు తినగా ఇచ్చిందాంతో కడుపులు నింపుకోవటం. ఎప్పుడు తిరిగొస్తాడా అని తనకోసం ఎదురుచూడడం గౌరీశు దుఃఖంతో కుమిలిపోయాడు.

గడ్డి త్రవ్వుతున్న నూకాలమ్మ, నరసమ్మలు తలెత్తి చూశారు. "దగ్గరగా రా పాపా.." అన్నట్టు తలతో నరసమ్మను పిలిచాడు. నరసమ్మ దగ్గిరగా వెళ్ళింది. గౌరీశు నరసమ్మను దగ్గరగా తీసుకుని, "మా ఊర్లో నాకూ నీలాంటి చెల్లాయి ఉంది. అమ్మ, తమ్ముడూ ఉన్నారు. వాళ్ళు చెప్పిన మాటలు వినకుండా నేను సర్కస్ కంపెనీలో చేరిపోయాను. పదో తరగతి పాసైపో బాబూ మా కష్టాలు గట్టెక్కుతాయని అమ్మ ఎంత నెత్తీ నోరూ కొట్టుకున్నా వినకుండా పెంకెతనంగా ఈ సర్కస్ కంపెనీలో చేరిపోయాను. గుర్రాల్ని మేపడం నా పని. ఊరూర తిరుగుతూ ఎక్కడో ఒక దగ్గిర ఈ జీవితాన్ని అంతం చేయాలి"

గౌరీశు చెపుతున్న మాటలు నరసమ్మకి అంతు చిక్కటం లేదు. నరసమ్మ తల్లిని పిలిచింది. నూకాలమ్మ దగ్గరగా వెళ్ళి నిల్చుంది. సంచిలోని దుంపలూ, బఠాణీలూ తీసి వాళ్ళకిచ్చాడు గౌరీశు.

తృప్తిగా తింటున్న వాళ్ళిద్దర్నీ చూసి గౌరీశు, "ఈ ఏనుగులూ, గుఱ్రాలూ సర్కస్‌లోనివి. సర్కస్‌లో రకరకాల ఆటలు చేసి చూపిస్తాయి" అన్నాడు. నరసమ్మ ఆనందానికంతులేదు.

"సర్కస్ నేనెప్పుడూ చూడలేదు. నా దగ్గర డబ్బులెలానూ లేవు. గుఱ్రాలకు పచ్చగడ్డి తీసుకుని లోపలికి రానిస్తావా అన్నయ్యా?"

"నువ్వెంత మంచిదానవు పాపా! చనువుగా దగ్గరకు పిలిచి పలుకరించానని ఆ చనువుతో నన్ను ఊరికే సర్కస్‌కు తీసుకు వెళ్ళమని అడగకుండా గుఱ్రానికి గడ్డిచ్చి సర్కస్ చూస్తానన్నావు. ఎంత మంచిదానవు పాపా!"

"అది సరదా పడుతోంది. సాయంత్రం ఆటకు రమ్మంటావా బాబూ?"

"ఇద్దరూ రండమ్మా! నేనక్కడే ఉంటాను. మా మానేజరుతో చెప్పి లోనికి తీసుకుపోతాను."

త్రవ్విన గడ్డిని గౌరీశుకప్పచెప్పారు.

"ఈ మారు సర్కస్ టెంట్ దండు బజారు దగ్గర వేశారు. ఐదుగంటలకే వచ్చేయండి" అని పోతున్నవాడు చేతులూపుతూ చెప్పాడు.

"అమ్మా! నిన్నూ, చెల్లెల్నీ వీళ్ళిద్దరిలో చూసుకుని పట్టరాని దుఃఖంతో, బాధ తీరేటట్టు ఏడ్చుకున్నాను. నా జీవితం దేశదిమ్మరిలా తిరగటం. తలపులో పడ్డప్పుడు చేతకానివాడిలా ఏడ్చుకోవటం ఈ నరకం నుంచి పరారయిపోవాలనుకుంటున్నాను. వెళ్ళినవారు తిరిగి రారని వీళ్ళు మరీ కట్టుదిట్టంగా ఉన్నారు" తనలో తాను మధనపడ్డాడు గౌరీశు.

"ఇంటికెలితే ఏముంది? గడ్డమ్మిన డబ్బులుంటేకదా గింజలు కొన్నుక్కుని మంటెట్లకోడానికి. అమ్మగారింటికెల్లి కూర్చుందాం అంట్లు తోమేసినట్టు తోమేస్తే మిగిలిందేటైనా పెడతారు. తల సిక్కదీ తీసుకుని అక్కడ్నుంచే సర్కస్ కెల్లిపోదాం." నూకాలు చెప్పింది.

ఇద్దరూ రామనుజరావు గారింటికి వెళ్ళారు. పెరటి వైపు నిల్చుని చూస్తున్నారు.

"ఏం నూకాలమ్మా! సాయంత్రం పనికప్పుడే వచ్చేశారు?"

"సాయంత్రం సర్కస్ కెళ్ళాలమ్మా నర్సమ్మను తీసుకుని."

"నీ ముఖం - నీకేం సర్కసే?"

"అదే నేనూ అనుకున్నానమ్మా! నరసమ్మ సరదా పడతంది. గడ్డి తవ్విన దగ్గిరికి సర్కస్‌లోని ఏనుగులు, గుఱ్రాలు వచ్చినాయి. గుఱ్రాలికి గడ్డిచ్చినాము. గుఱ్రాల్ని తోలే గౌరీశు మమ్మల్ని సర్కస్ కొచ్చియ్యమన్నాడు."

సుగుణమ్మ ఒకటే నవ్వు. "సర్కస్‌కి డబ్బిచ్చి వెళ్ళటం చూశాను. కానీ, గుఱ్రాలకు గడ్డిచ్చి సర్కసుకు వెళ్ళటం ఇప్పుడిక్కడే వింటున్నాను. అవును. ఏం చేస్తారు. పాపం. తింటానికి తిండి, కట్టుకోవడానికి గుడ్డల్లేనివాళ్ళు అంతకన్నా చేసేదేముంది?"

"ఏదైనా మిగిల్తే నరసమ్మకు పెట్టమ్మా! తినేసి అంట్లు తోమి ఇలాగెల్లి పోతాం సర్కస్‌కి"

"అక్కడే కూర్చోండి భోజనాలౌతున్నాయి."

"ఈ చేతిలో మంచి నూనెయ్యండమ్మా. తలలు దువ్వుకుంటాం" సుగుణమ్మ నవ్వుతూ నూనె నూకాలమ్మ చేతిలో పోసింది. ఇద్దరూ తలలు దువ్వుకుని నూతి దగ్గర నీళ్ళతో ముఖాలు కడుక్కున్నారు.

ఇదిగో నూకాలమ్మా ఈ అంట్లు పైకి తీస్కుపో. అన్నం పులుసు పైకి తీసుకుపోయి పంచుకు తినండి" అంది సుగుణ.

నరసమ్మ ఆనందానికంతులేదు. పులుసన్నంతో కడుపు నింపుకుని కాసేపు నూతి పక్కనున్న అరటి చెట్లు క్రింద నిద్రపోయారు. కాసేపటికి కాకులు చేసే గోలకి ఇద్దరూ లేచి కూర్చున్నారు.

"కళ్ళు తుడుచుకుని అమ్మగారితో చెప్పి ఎల్లిపోదాం రాయేలమ్మ. గౌరీశన్నయ్య మనకోసం చూస్తుంటాడు."

ఇంతలో ఆఫీసు బంట్రోతు పరుగు పరుగున మీద వచ్చాడు.

"అమ్మగారూ! అయ్యగారు అరడజను ఫస్ట్‌క్లాసు పాసులు తెప్పించారు. తయారై ఉంటే బాబుగారు స్వయంగా వచ్చి తీసుకు వెళతామన్నారు"

"అలాగే రాజయ్యా! నువ్వు వెళ్ళు. మేం తయారుగా ఉంటామని చెప్పు. ఇదిగో నూకాలమ్మా! ఆ వెనుక తలుపులు మూసి మీరు వెళ్ళండి. మేం కూడా సర్కస్‌కి వెళుతున్నాం. అయ్యగారికి సర్కస్ వాళ్ళు పాస్‌లు పంపించారు."

"అంటేటమ్మా?"

"పాస్‌లంటే పెద్ద పెద్ద ఆఫీసర్లకు సర్కస్‌కి డబ్బివ్వకుండా ఊరికే చూడమని పంపిన టిక్కెట్లు."

ఆ మాటల్ని అమాయకంగా విన్న నూకాలమ్మ "చిన్నమ్మగారూ! నా చేతిలో రవ్వంత పౌడరు దులపండి" అంది. చేతిలో పోసిన పౌడరును కూతురు ముఖానికి అద్దింది నూకాలమ్మ.

"మిగిలింది నువ్వు రాసుకోయే అమ్మా"

"మీ అయ్య చచ్చిపోయాడు. నేను రాసుకోకూడదే" బాధతో అంది నూకాలు..

●●●

సర్కస్ టెంటు మీద రంగు రంగుల బల్బులు తోరణాలుగా వెలిగిపోతున్నాయి. పై బల్బులు చూస్తూ పాటలు వింటూ గుమికూడిన జనాన్ని చూస్తుండగా నరసమ్మను గౌరీశు పిలిచాడు.

"రా నరసమ్మా రా. నీకోసమే చూస్తున్నాను. ఆట మొదలుపెడితే లోపల మాకెంతో పని. కేంటిన్‌లో పకోడీ, టీ తీసుకోండి. మా మేనేజరుతో చెప్పిలోనికి పంపిస్తాను" అని కేంటిన్‌లో ఫలహారం చేయించి వాళ్ళను మేనేజర్ కుమారన్ వద్దకు తీసుకువెళ్ళాడు.

"సార్!" అని వినయంగా గౌరీశు వందనం చేశాడు.

"ఆఁ! ఇంకేముంది? మీ వాళ్ళు లోనికి ఫ్రీగా పంపించమంటున్నావ్?"

"అది కాదు సార్. వీళ్ళిద్దరూ రెండు బస్తాల పచ్చగడ్డి మన గుర్రాలకిచ్చారు సార్. సర్కస్ చూస్తామంటున్నారు."

కుమారన్ పకపక నవ్వుతున్నాడు. లోనికిపంపరేమో అని నరసమ్మ భయపడుతోంది.

"ఇండియా అంతా ప్రోగ్రాంలిస్తూ తిరుగుతున్నాం. మన గుర్రాలకు పచ్చగడ్డిచ్చి కడుపు నింపి సర్కస్ చూడటానికి వచ్చిన వాళ్ళను వీళ్ళనే చూశాను. వీళ్ళను బాల్కనీలో కూర్చోపెట్టు త్వరగా కానీ. రాజపోషకులూ, మహారాజ పోషకులూ వచ్చే టైం అయింది. ఫ్రీ పాసులు ఇచ్చింది కాక వంగి వంగి సలాంలు చేస్తూ లోనికి తీసుకు వెళ్ళి కూర్చోపెట్టాలి. "

"రండి సార్. రండి. వీరు ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసరు రామానుజరావుగారు కుటుంబంతో సహా వచ్చారు. లోనికి వెళ్ళి కూర్చోండి సార్. బాయ్.. అయ్యగారిని లోనికి తీసుకువెళ్ళు. వీరు పోలీసు అధికార్లు, వీరు మునిసిపాలిటీవారు. ఈయన మనకు ఉత్తరాలు తెచ్చే పోస్ట్‌మేన్, వారు వారి స్నేహితులు, వీరు కమర్షియల్ టాక్సు డిపార్టుమెంటువారు. వీరు కలెక్టరాఫీసువారు. " అలా అలా రాజపోషకులూ మహారాజ పోషకులు లోనికి పోతున్నారు.

అందరి హర్షధ్వానాలమధ్య సర్కస్ మొదటి ఆట ముగిసింది. రామనుజరావు భార్య, పిల్లలతో తిరిగి వచ్చాడు. భోజనం ముగించాక కూతురితో కబుర్లు మొదలుపెట్టాడు రామానుజరావు.

"సర్కస్ చాలా బాగుంది కదూ బేబీ?"

"హా డాడీ! ఎంత జనం! రోజూ వాళ్ళకి చాలా ఖర్చవుతుంది కదూ?"

"గుర్రాలు, ఏనుగులు, ఎలుగుబంట్లు, వాటిని సంరక్షించేవారు, కళాకారులు, అన్ని సదుపాయాలతో పాటు నెల జీతాలు. ఇవన్నీ టిక్కెట్లమీదే కదమ్మా" ప్రక్కనున్న తల్లి అంది.

"మన నరసమ్మ, నూకాలమ్మ పాపం డబ్బులేక రెండు బస్తాల పచ్చగడి గుర్రాలకిచ్చి, గుర్రాలు తోలే అబ్బాయి సహాయంతో సర్కస్ చూస్తామన్నారు. వాళ్ళు కూడా మొదటి ఆటకే వచ్చి చూసి ఉంటారు."

"గుర్రానికి గడ్డి" మనసు కెలికినట్లయింది రామానుజరావుకి. నూకాలమ్మ నరసమ్మ అతి పవిత్రులుగా తన కండ్ల ముందు కనిపిస్తున్నారు.

"నిద్రపో బేబీ! సర్కస్ విషయాలు రేపు మాట్లాడుకుందాం" అని ప్రక్కకు తిరిగి బలవంతంగా కళ్ళుమూసుకున్నాడు. కన్ను మూశాడేకానీ కలత నిదుర..

"బాబూ! రామానుజం నేనురా మీ నాన్నను. చిన్నప్పటినుంచీ కష్టపడి పెంచి చదివించాను. ఎన్నో నీతులు చెప్పాను. డబ్బు దొరికే డిపార్టుమెంటులో కాలుపెట్టి లక్షలార్జిస్తున్నావు. నోరులేని జంతువులు చేసే రకరకాల పనులు ఆనందంగా అయిస్ క్రీం తింటూ చూశావు కదూ! ఆ చిన్నపిల్ల రబ్బరు బొమ్మలా రకరకాలుగా చుట్టుకుపోతుంటే చాలా ఉత్సాహంగా చూశావుకదూ. మేకుల పాన్పుమీద వస్తాదు పడుకుని పైన బస్తాలు వేసి సుత్తితో రాతిని కొట్టిన దృశ్యం చూసి 'అబ్బ! వండర్ ఫుల్ సుగుణ!' అన్నావ్ కదూ. వాడు లేచి కండల్ని వివిధ భంగిమల్లో చూపిస్తుంటే వాడి శరీరం నుండి ఎంత చెమట కారిందో చూశావా? ఊరకుక్కల్ని చవకగా కొని పులులకూ, సింహాలకు బ్రతికున్న వాటినే ఆహారంగా విసిరేస్తున్నారు. నలుగురూ ఇచ్చే డబ్బులమీద ఆ పని పోషించబడాలి కానీ ఫ్రీ పాసుల మీద కాదురా. నీ ఇంట్లో అంట్లు తోముకుని బ్రతుకుతున్న నూకాలమ్మ, నరసమ్మలు గుర్రాలకు పచ్చగడ్డిచ్చి సర్కస్ చూశారురా బాబూ."

రామానుజం నిద్రలోనే కలవరిస్తున్నాడు. అలానే తెల్లవారింది. ఐదు గంటలకు అలారం కొట్టగా త్రుళ్ళిపడి లేచిన బేబీ "డాడీ ఎంత భయంకరమైన కలనుకున్నారు. మీరు గుర్రంగా మారిపోయారు. అమ్మ ఎలుగుబంటిగా మారిపోయింది. నేను కోతిలా కుప్పిగెంతులు వేస్తున్నాను. సర్కస్‌లో మన గంతులు చూసి ప్రేక్షకులెంతో ఉత్సాహంగా చప్పట్లు కొడుతున్నారు" అంది.

"అవును బేబీ. కన్ను మూశానో లేదో తాతయ్య కలలోకనిపించి 'నోరులేని జంతువులు చేసిన పనులు ఉచితంగా చూశావా బాబూ' అని ఎంతగానో నొచ్చుకున్నారమ్మా!"

"టిక్కెట్ డబ్బులుకాక మరికొంత మేనేజరుకిచ్చి వస్తానమ్మా! అప్పుడు కానీ నా మనసుకి శాంతి లభించదు"అని రామానుజం బయలుదేరాడు.

"డాడీ! ఆ చిన్న తెల్ల గుర్రప్పిల్ల ఎంత ముద్దుగా ఉంది? విచిత్రమైన పనులు చేసి చూపిస్తుందిట. కానీ ఒంట్లో బాలేదేమో రాత్రి ఎక్కడికక్కడే కూర్చుండిపోవడం, దానిని కొరడాలతో కొట్టిలేపడం, పాపం దానికి ఈ నల్లంచుల తెల్ల సిల్కుగుడ్డ నా బహుమతిగా తీసుకువెళ్ళండి."

"అలాగే తల్లీ దానిమీద ఈ గుడ్డ ధగధగమని మెరిసిపోతుంది. తప్పక నీ బహుమతిగా దానికిస్తానమ్మా" అని బయలుదేరి వెళ్ళాడు.

"ఇంత తెల్లవారే వచ్చారేం సార్?" మేనేజర్ కుమారన్ పలుకరించాడు కుర్చీలు చూపిస్తూ.

"గుర్రానికి గడ్డి ఖర్చివ్వడానికి వచ్చాను కుమార్. గుర్రానికి కనీసం గడ్డి ఖర్చయినా ఇవ్వకుండా సర్కస్ ఉచితంగా చూడటం అవివేకమని అనాగరికుల లక్షణమనీ మా నాన్న కలలో కనిపించి చెప్పారు. మా ఇంట పని చేసుకు బ్రతుకుతున్న నూకాలమ్మ, నరసమ్మలు గుర్రాలకు గడ్డిచ్చి సర్కస్ చూశారంట."

"ఫరవాలేదు సార్. తమ దగ్గర డబ్బుంచండి.."

"ఎంత మాత్రం వీల్లేదు కుమారన్. నా మనసులో కల్లోలం చెలరేగింది. ఆ బాధకు తట్టుకోలేక వెంటనే వచ్చాను" అని బలవంతంగా కుమారన్ చేతిలో డబ్బు పెట్టి "మాబేబీ మీ తెల్లగుర్రపు పిల్లకు ఈ నల్లంచుల తెల్ల సిల్కు గుడ్డ బహుమతిగా పంపింది. అదెక్కడుందో చూపించండి. నా చేతులతో అలంకరిస్తాను." అన్నాడు.

కుమారన్ దీనంగా ముఖం వాల్చి రామానుజరావును గుర్రాల చావిడికి తీసుకువెళ్ళాడు. నేలపై నిర్జీవంగా పడుకున్న దానిపై ముసురుతున్న ఈగల్ని తోలుతున్న గౌరీశు సహాయంతో రామానుజరావు నల్లంచుల తెల్లగుడ్డ దానిపై కప్పి బాధతో, బరువైన అడుగులతో ఇంటిముఖం పట్టాడు.

# పరివర్తన — తిలక్

**1980 లో 'జ్యోతి ' మాసపత్రికలో ప్రచురితమైన కథ**

**థియేటర్ అంతా జనంతో నిండి ఉంది,** పావుగంట ఆలస్యంగా మిలిటిరీ దుస్తులతో వచ్చిన శంకరానికి బ్యాటరీలైటు వేసి చూపిస్తున్నా సరే, సీటు వెతుక్కోడం కష్టమయింది. తడబడుతూ, కాళ్ళు తొక్కుకుంటూ చివరికి సీటులో చతికలపడ్డాడు. ప్రేక్షకులందరూ ఏకాగ్రతతో తెరమీద కథలో నిమగ్నులై ఉన్నారు. బరువుగా విడుస్తున్న వాళ్ళ ఊపిరి చప్పుడు శంకరానికి వింతగా తోచింది. తెరమీద మంచు దట్టంగా కప్పిన పట్టణంలో ఒక భాగం. ఓవరాల్స్ వేసుకున్న వ్యక్తులు రోడ్డు మీద మంచులో స్పష్టా స్పష్టంగా గోచరిస్తూ నడుస్తున్నారు. ఓ చర్చి కిటికిలోంచి ముసలి వాడు నిర్లిప్తంగా మంచునీ మనుష్యుల్నీ పరికిస్తున్నాడు. హఠాత్తుగా పిస్తోలు పేలినచప్పుడు రోడ్డుమీద ఓ వ్యక్తి 'అబ్బా' అంటూ ఒరిగాడు. బూట్ కాళ్ళు కలదొక్కుకుంటూన్న చప్పుడు... శంకరం చేతి మీద ఎవరిదో మెత్తని చేయిపడింది. శంకరం పక్కకి చూశాడు, ఒక యువతి చప్పున చేయి తీసేసుకుని 'సారీ' అని తెరవైపు చూస్తూవుంది. హిచ్‌కాక్ పిక్చర్ యొక్క ప్రభావం అనుకున్నాడు శంకరం ఆమె కలవరపాటు చూసి. అతనికి కథ అర్థం కావడం లేదు, ఆలస్యంగా రావడం మూలాన. అయినా శ్రద్ధగా తెరమీదకి చూస్తున్న అతనికి తన ప్రక్కనున్న యువతి తన వైపు చూస్తున్నట్టు అనిపించింది. నిశితంగా వెచ్చగా తనకి ఆ చూపులు తగులుతూన్నట్టు ఉంది శంకరానికి. ఆమెవైపు చూడాలనుకుని కూడా అతను కుతూహలన్ని అణచుకున్నాడు. ఇంతలో ఆ యువతి ఏడుపును నొక్కిపట్టిన సన్నని ధ్వని ఆగి ఆగి అతనికి

వినపడింది. వింతగా ఆమె వైపు చూశాడు పరీక్షగా నిదానంగా చూశాడు. రాజేశ్వరి..!! శంకరం వొళ్ళూ మనస్సూ ఒక్క సారిగా వేడిగా కంగారుగా అస్తిమితంగా అయిపోయింది. కొంతసేపటికి తమాయించుకొన్నాడు. ఆమె చేతి మీద చెయి వేసి 'రాజీ' అన్నాడు మెల్లగా.

'బాగున్నావా?' అంది రాజేశ్వరీ నిట్టూర్పుని, మాటల్ని తొక్కిపెట్టి. శంకరం చేతినుండి ఆమె తన చేతిని మెల్లగా తీసేసుకుంది. ఇద్దరు ఓ ఐదు నిమిషాలపాటు నిశబ్దంగా ఉన్నారు. వాళ్ళు తెరవైపు చూస్తున్నారు గాని వారి దృష్టి అటులేదు. థియేటరులో వెచ్చబడిన చీకటికన్న దళసరైన ఉద్రేకం వారిరువురినీ చుట్టుకుంది.

'నీతో మాట్లాడాలి' అన్నాడు శంకరం గొంతును బాగా తగ్గించి. ఆమె వెడల్పయిన తెల్లని కళ్లతో అతనికేసి చూసింది.

'బీచికి పోదాం వచ్చెయ్యి' అన్నాడు శంకరం. ఆమె తల ఊపింది. ఇరువురూలేచి అడుగులో అడుగు వేసుకుంటూ థియేటరు బయటకి వచ్చేశారు. విద్యుద్దీప కాంతిలో ప్రౌఢంగా అందంగా అకర్షణీయంగా ఉన్న ఆమె ముఖాన్నీ, అవయవాల్నీ హతుడైచూస్తూ నిలబడిపోయాడు శంకరం. రాజేశ్వరి కొంచెం కలవర పడి, నవ్వి 'ఏమిటా వాలకం, రాపోదాం' అంది. శంకరం అనుసరించాడు.

అమె కారు వద్దకు వచ్చింది. లోపల స్టీరింగు దగ్గర కూర్చుంటూ 'ఎక్కడికి పోదాం?' అంది అతను ఎక్కి కూర్చోగానే.

'డ్రైవర్ లేడా?'

' పొమ్మన్నాను, సినిమా వదిలే సమయానికి వస్తాడు'

'మరి–?'

'ఇక్కడ లేకపోవడం చూసి యింటికి వస్తాడు'

'మీ ఆయన?'

నవ్వింది రాజేశ్వరి. ' ఊళ్ళోలేరు, క్యాంపుకి వెళ్ళారు' ఓ సెకను ఆగి మళ్ళా యిలా అంది ' ఉంటేమాత్రం? వారికి నామీద నమ్మకమే....'

శంకరం నిట్టూర్చాడు. అదే పట్టుదల, అదే వ్యక్తిత్వం, అదే స్వతంత్రం ఈ రాజేశ్వరిలో అనుకున్నాడు. అతనికి జరిగిపోయిన రోజులన్ని జ్ఞాపకం వచ్చాయి. రాజేశ్వరీ, తనూ గాఢంగా ప్రేమించుకున్నారు బాల్యంనుండీ. కొనదేరిన ముక్కుతో పెదవి ఎఱ్ఱనివంపులో ఒక పట్టుదలా, వెడల్పాటి కళ్ళల్లో తెలివైన వెలుతురూ, వెన్నెల పాలరాతి శిల్పం మీదపడి జారిపోతున్నట్టుగా అనిపించే అవయవ లావణ్యమూ రాజేశ్వరి అతన్ని స్వప్నంలో స్వగతంలో ఆక్రమించుకుంది. అతని బతుక్కి ఒక అర్థాన్ని ఆవేశాన్ని గమ్యాన్నీ యిచ్చింది. ఇరువురి స్నేహాన్ని చనువునీ ఎవరూ అడ్డుపెట్టలేదు, తప్పుగా తీసుకోలేదు. వారి కుటుంబాల మధ్య ఉన్న సాన్నిహిత్యమే అటువంటిది. అదేకాదు, వారిరువురూ భార్యా భర్తలౌతారనే అనుకున్నారందరూ. ఆమె అనర్సు చదవడానికి దూరం వెళ్ళింది. తాను ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. ఆమె సెలవులకి వచ్చినప్పుడల్లా కలసికొనేవాడు. గంటలకి గంటలు కబుర్లు చెప్పుకునేవారు. సినిమాలకి వెళ్ళేవారు. రాజకీయాల్ని గురించీ సాంఘిక వ్యవస్థల్ని గురించీ విశ్వాసాలగురించీ చర్చించుకునేవారు. ఆమె తెలివైనది. ఎటువంటి సమస్యనైనా ప్రాక్టికల్‌గా ఆలోచించి తూచి నిర్ణయం చేయగల శక్తి ఉంది ఆమెకు. తమ ఉద్రేకానికి లోనుకాదు. దాన్ని శాసించగలదు బుద్ధి యొక్క అదుపులో అవరణలో ఆమె ఉద్రేకాలు నిలిచి ఉంటాయి. అందుకే ఆమె తననీ, తన జీవితాన్నీ, తన భవిష్యత్ కుటుంబాన్నీ అందంగా ప్రయోజనకరంగా సుఖవంతంగా తీర్చి దిద్దగలదని అతను నమ్మాడు.

ఫైనలియరు పరీక్షలు వ్రాసి చదువుతో, వయస్సుతో మరింతపొడుగ్గా అందంగా పెరిగిన రాజేశ్వరి తనని ఏకాంతంగా పిలిచి, "శంకరం నిన్ను నేను పెళ్ళి చేసికోను" అని చెప్పినపుడు అతను నమ్మలేక పోయాడు. ఆమె ఒక్కొక్కటే కారణాలు విశదీకరిస్తూంటే ఒకొక్క

నిలువులోతు లోపలికంటా అధఃపాతాళానికి అంధకార సముద్రంలోకి అతను మునిగి పోయాడు. అతనికి తన జీవితాన్ని ఎవరో సగానికి నిర్దయగా చీల్చి రెండు ముక్కల్నీ చెరోవైపుకీ విసిరేసినట్టు అనుభవం పొందాడు. చివరికి ఆమె తండ్రి కూడా అన్నాడు 'మనం ఎరిగున్న శంకరాన్ని కాదని ఆనారాయణరావుని పెళ్ళి చేసుకోవడం అన్యాయం అమ్మా' అని.

ఆమె వినలేదు. నారాయణరావు బాగా డబ్బున్నవాడు. పెద్ద చదువు చదివాడు. పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు. వీటితో పాటు మంచి ఆరోగ్యము, రూపమూ ఉన్నవాడు. అతనంటే యిష్టపడింది. అతనికి మాట యిచ్చింది. ఇంత గొప్ప అవకాశాన్ని జారవిడుచుకోవడం– ఒక బాల్యచాపల్యాన్ని నమ్మి, ప్రేమ అనే పదంపన్నిన యింద్రజాలంలో చిక్కుకుని వొట్టి తెలివి తక్కువ. మానవుడికి బుద్ధి, హేతువు వున్నందుకు ఉపయోగం ఏమిటి? ఇదీ ___ వాదం.

తండ్రికి ఆమె పట్టుదల తెలుసును ' నీ యిష్టం తల్లి నీ సుఖమే నాకు కావల్సినది' అన్నాడు. తాను ఆ సాయంత్రం తోటలో మునిమాపు వేళ కలుసుకున్నాడు. చీకటి తన మనసులోని దిగులులా వ్యాపిస్తుంటే, గాలి చెట్ల ఆకులలో ఏడుస్తుంటే ఆమెతో అన్నాడు 'నువ్వులేని బ్రతుకు ఉహించుకోలేను రాజీ! బ్రతకలేను, నాగుండె పగిలి పోతుంది రాజీ.'

'ఇది బలం లేని వాళ్ళు మాటలు ధైర్యం స్థయిర్యంలేని వాడవు నన్ను పెళ్ళి చేసుకొని ఏం నిర్వాకం చెయ్యగలవు శంకరం? జీవితాన్ని, జీవితంలో కలిగే సంఘటనలనీ ఎదుర్కోలేని పిరికితనం నాకసహ్యమని తెలుదుగా! నువ్వంటే నాకు ఉన్న అభిమానము యిష్టమూ కూడా. వాటిని యిటవంటి మాటలతో తుడిచి వెయ్యకు' అంది రాజేశ్వరి.

ఆమె పెళ్ళికాకముందే తాను మిలిటరీలో జేరాడు. మళ్ళీ యిన్నేళ్ళకి కలుసుకున్నాడు. శంకరానికి కారుదిగి రాజేశ్వరితో బీచ్‌వొడ్డున కూర్చోడం కూడా ఎరుగడు యీ ఆలోచనలతో. అతను ఎంతో బలవంతాన తన హృదయంలోని ఉద్రేకాల్ని అణచుకుంటున్నాడు. అక్కడక్కడ జనం జంటలుగా గుంపులుగా బీచ్ వొడ్డంతా ఉన్నారు. దశమినాటి వెన్నెల పడి సముద్రం అలలతో సురుగులతో గంభీరంగా మనోహరంగా ఉంది.

'నువ్వు సుఖంగా ఉన్నావా రాజీ?' అన్నాడు శంకరం.

'ఆఁ ! నన్ను చూస్తే తెలియటం లేదూ!?' అని నవ్వింది రాజేశ్వరి

'మరి థియేటరులో నన్ను చూసి ఏడ్చావెందుకూ ! నువ్వు ఏడ్చినట్టు నాకు తెలుసును'

'అవును , నిన్ను చూడగానే ఏదో బాధ కలిగింది. నావల్ల నువ్విలాగ అయిపోయావు కదా అని బాధ' ఆమె గొంతు మృదువుగా జాలిగా వుంది.

'అంతేనా రాజీ! ఒట్టి బాధేనా?' అతను ఖంగారుగా అడిగాడు.

'కాదు శంకరం. నువ్వంటేనాకు అభిమానమూ ఉంది నిన్నెప్పుడు మర్చిపోలేదు.....'

శంకరం హృదయం ఆనందంతో నిండిపోయింది. అమె చేయి పట్టుకుని 'రాజీ నన్ను ప్రేమిస్తున్నావా? మరి నీ భర్త...' అంటూంటే ఆమె నవ్వియిలా అంది 'ఇలా తొందరగా నిర్ణయాలకి వచ్చేస్తావు నువ్వు శంకరం! నా భర్తని కోరి పెళ్ళి చేసుకున్నాను, సుఖపడ్డాను, అన్ని విధాలా.'

శంకరం తెల్లబోయాడు. తన నిర్ణయం తప్పనీ, తాను సుఖ పడడం లేదనీ తన వోళ్ళో అమె తలదూర్చి ఏడవాలని అతని రొమాంటిక్ ఉద్దేశం. కాని నిశ్చలంగా అందంగా నిండుగా ఉన్న ఈ రాజేశ్వరి తన మీద స్నేహభావాన్నీ జాలినీ మాత్రమే ప్రదర్శిస్తోంది.

ఇరువురూ కొంతసేపు మౌనంగా కూర్చున్నారు. రాజేశ్వరి దీనంగా వున్న శంకరాన్ని చూసి మళ్ళీ జాలిగా అంది. 'నువ్వు పెళ్ళిచేసుకో

లేదు కాదూ?'

'లేదు'

'చేసుకోవా శంకరం?'

'ఉహు'

వెన్నెల వెలుగులో శంకరం కళ్ళు తడితడిగా ఉండడం ఆమె చూసింది. 'ఎవరిమీద నీకోపం శంకరం? వెర్రివాడివిగాని, నువ్వు పెళ్ళి చేసుకోంటే నీ జీవితం మారిపోతుంది. నీకు ఒక గమ్యం ఏర్పడుతుంది. నా మాటవినవా?' అంది బతిమాలుతూన్న గొంతుతో.

'నీ బొమ్మ ఈ మనసులోంచి చెరిగిపోదు రాజీ. అంతవరకు పెళ్ళాడలేను' అన్నాడతను బరువుగా గాద్గదికంగా.

రాజేశ్వరి తలతిప్పుకుంది. ఇసుకలో చూపుడువేలుతో వలయాలు గీస్తోంది. ఆమె కన్నులలో కమ్మిన నీరు శంకరం చూడకూడదని ఆమె ప్రయత్నం. కొంతసేపటికి తేరుకొని వెన్నెలలాగ నవ్వి 'సరే నీ మిలిటరీ కబుర్లు చెప్పు. ఇప్పుడు నువ్వు బ్రిగేడుయర్‌వా? జనరల్‌వా?' అంది.

'మేజర్ని'

శంకరం తన అనుభవాలు చెప్పసాగాడు. ఆమె శ్రద్ధగా వింది. బీచ్‌లో జనం బాగా పల్చబడ్డారు. సముద్రపు అలలు యిందాకటికన్న కోపంగా బలంగా వొడ్డుకు తగిలి విరిగుతున్నాయి. ఆమెలేచి 'ఇక పోదామా' అంది.

శంకరం అమెను అనుసరించాడు.

కారు నడుపుతున్న రాజేశ్వరి రేగిన ముంగురుల్నీ అవయవాల వయ్యారాన్ని, ఎర్రని పెదవుల్లోని తియ్యని పట్టుదలనీ చూస్తూ కూర్చున్నాడు శంకరం. అతనిలో ఏదో కోరిక బలవత్తరమై నరనరాలలోనూ వెచ్చగా పదునుగా వ్యాపించింది.

'ఇదే నా హోటలు. ఇక్కడాపు రాజీ' అన్నడు శంకరం. రాజేశ్వరి కారు ఆపింది.

'ఒకసారి నారూమ్‌కి రారాదు. ఓ నిముషం కూర్చుని వెళుదువుగాని' అన్నాడు శంకరం.

'ఆలస్యమై పోయింది.'

'భయమా రాజీ?' అన్నాడు శంకరం.

'నువ్వంటేనే? నీ దగ్గరా నాకు భయం?' అంది రాజేశ్వరి నవ్వి.

'అయితే ఓ సారి వచ్చివెళ్ళు.'

రాజేశ్వరి కారు దిగి అతని వెనకాలే వెళ్ళింది. రూంలో ఆమెని సోఫాలో కూర్చోపెట్టి 'ఇప్పుడు నువ్వు నా అతిథివి. ఏదైనా తీసుకోవూ?' అన్నాడు.

'ఇప్పుడేమీ వద్దు. అరె ! టేబిలు మీదది నా ఫోటోయే!'

'అవును నిన్ను నిత్యం చూస్తూ ఉండాలి రాజీ' శంకరం నవ్వాడు.

'నేపాల్ యుద్ధమ్లో బ్రతికి తిరిగి వస్తానని అనుకోలేదు. అప్పుడుకూడా నీ ఫోటో నా జేబులోనే ఉంది' అన్నాడు.

రాజేశ్వరి ఆ ఫోటోని పరీక్షగా చూసి 'ఎంత చిన్నదాన్నో అప్పుడు. ఎనిమిదేళ్ళు జరిగిపోయాయి' అని నిట్టూర్చింది.

అల్మారాలోంచి బ్రాందీ తీసి టేబులుమీద పెట్టి' ఎనిమిదేళ్ళు నాకు ఎనిమిది యుగాలు. నీకు క్షణంలో జరిగిపోయినట్టు ఉంది. అయినా రాజీ నువ్వు మరింత అందంగా మరింత పరువంగా ఉన్నావు. ఇప్పుడు నీ వయస్సెంత రాజీ?'

రాజేశ్వరి నవ్వి 'యిరవై ఎనిమిది' అంది.

'కొంచం మందువేసుకోనియ్యి రాజీ. అలవాటయి పోయింది. అయినా ఎప్పుడూ మోతాదుగానే ఉంటాను.' అంటూ కళ్ళు చిట్లించి ఆమెకెసి నవ్వుతూ చుసి బ్రాందిని గ్లాసులో పోసుకుని తాగాడు.

'మిలిటరీ దుస్తులలో ఉన్న నా ఫోటో ఒకటి నాకివ్వు శంకరం' అందామె.

' ఒకటేమిటి నీకు కావల్సినవి తీసుకో.' అని అల్బం అమె ముందు పడేశాడు.

ఆమె ఒక ఫోటో ఏరి తీసుకునిలేచి నుంచిని 'ఇంక వెళ్ళివస్తాని శంకరం' అంది అతను మాట్లాడలేదు తదేకంగా ఆమెను చూస్తున్నాడు. ఆమె కొంచెం యిబ్బందిగా కదలింది 'ఏమిటా చూడడం?' అంది విసుగ్గా.

శంకరం ఆమె దగ్గరకు వచ్చి రెండు చేతులూ చప్పున పట్టుకున్నాడు. 'రాజీ ఈ రాత్రికి యిక్కడ ఉండిపో. ఒకసారి పూర్తిగా నువ్వు నాదానివి కావాలి. ఇంక నీకు కనిపించను. ఈ ఒక్క కోరిక తీర్చు  రాజీ ఈ తృప్తితో, యీ స్మృతితో యింక చనిపోయినా ఫరవాలేదు. అదేం రాజీ అలా చూస్తావు? ఇది తప్పుగా భవిస్తున్నావా! నా కోసం, గుండెలో యింత పెద్ద ఎడారిని దాచుకొన్న నాకోసం– ఒక్కసారి, ఒక్కసారి...' ఉద్వేకంతో ఎరుపెక్కిన మొహంతో అతనింక మాట్లాడలేక పోయాడు.

ఆమె మెల్లగా చేతులు విడిపించు కొని 'శంకరం నా కిష్టం లేదు' అంది నిశ్చయంగా.

అతనింకా ప్రాధేయ పడుతూ 'రాజీ రాజీ ఒక్కసారి.... ...' అన్నాడు.

రాజేశ్వరి అతన్ని సోఫాలో కూర్చోపెట్టింది. మృదువుగా లాలనగా అంది. ''పిచ్చివాడవయి పోతున్నావు శంకరం. నువ్వడిగేది ఎంత అసహజమో ఎంత అసంభవమో నీకు తెలియడం లేదు. నువ్వు వెళ్ళి చేసుకోవాలి. తప్పదు శంకరం! నామాట విను.'

శంకరం తల వాల్చుకుని కూర్చున్నాడు. అతని కన్నులలో నీరు చిమ్మింది.

రాజేశ్వరి 'నేను వెళ్ళి వస్తాను శంకరం! నువ్వు స్థిమితంగా ఆలోచించుకో' అంటూ అతని జుట్టు నిమిరి గదిలోంచి వెళ్ళిపోయింది. శంకరం మరికాస్త బ్రాందీ పోసుకొని ఒక గుక్కలో తాగి గిర్రున తిరిగే పంకా వైపు చూస్తూ కూర్చున్నాడు.

★★★

సివిలియన్ డ్రస్సులో ఉత్సాహంగా వచ్చిన శంకరాన్ని నవ్వుతూ ఆహ్వానించింది రాజేశ్వరి. ఆమె చాలా అందంగా అలంకరించుకుంది. ఇటూ అటూ అందంగా పెరిగిన గార్డన్ చూస్తూ యీలవేస్తూ వచ్చాడు శంకరం. ఆమె వొంటి మీద నుండి సుతారపు అత్తర సువాసన అతన్ని సోకి గిలిగింత పెట్టింది. వరండాలో విద్యుద్దీపకాంతిలో నిలిచి ఉన్న ఆమె లావణ్యాన్నీ అందాన్నీ వింతగా వెర్రిగా చూస్తూ 'రాజీ' అని చేతులు చాచాడు.

'హుష్ – నౌకర్లింకా వెళ్లలేదు' అందామె సిగ్గుగా.

ఇద్దరూ డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్నారు. రాజేశ్వరి మౌనంగా తలవాల్చి కూర్చుంది. శంకరం  మెల్లగా 'రాజీ. నువ్విలాగ అనుగ్రహిస్తావని అనుకోలేదు. నీ చీటీ చూసినప్పట్నుంచీ ఎప్పుడు చీకటి పడుతుందా అని చూస్తూ ఉన్నాను' అన్నాడు.

రాజేశ్వరి జవాబుగా నవ్వింది.

శంకరం నలువైపులా దృష్టి సారించి 'చాలా పెదయిల్లే..! ఈ ఫర్నిచర్ చాలా బాగుంది' అన్నాడు

ఆమెతో గృహిణీత్వపు గర్వం కళ్ళల్లో మెదిలింది, 'బొంబాయిలో కొన్నాం. అయనా నేను కలిసి ఎన్నిక చేశాం' అంది.

'మీ గార్డెన్ కూడా మనోహరంగా వుంది రాజీ! అంతా నీ కృషి ఫలితమే అనుకుంటాను' అన్నాడు శంకరం.

'ఒక్క నాకే కాదు. ఆయనకీ గార్డెనింగంటే ప్రాణం. ఇద్దరం కలసి ఏమొక్క ఎక్కడ నాటాలో, ఎక్కడ ఎలా వుండాలో వివరంగా ఆలోచించి ప్రణాళిక వేశాం. ఆయన గోతులు తవ్వడం నేను మొక్కలు నాటడం. నేను బోదెలు చెయ్యడమూ ఆయన నీరు తోడటమూ! తోటమాలికి ఊరికే జీతం యిస్తున్నాం.'

శంకరం సిగరెట్టు అంటించి గోడల మీద ఫోటోలు చూస్తున్నాడు రాజేశ్వరీ పక్కనే నిలబడి చెబుతోంది.

'ఇది మా పెళ్ళి నాటి ఫోటో ఇది హనీమూన్‌కి కాశ్మీరు వెళ్ళినప్పుడు. ఈ బొమ్మలన్నీ అవే! కాశ్మీరు ఎంతలవ్లీగా ఉంటుందని.... ఇంకా అల్బమ్‌లో చాలా బొమ్మలున్నాయి. ఇది ఆయనకి జనరల్ మానేజరుగా ప్రమోషన్ వచ్చినప్పుడు తీసిన ఫోటో నాకూ ఓ పూలదండ వేశారులే--'

శంకరం మరొక ఫోటోని చూసి 'ఇది_ ఈ ఎన్‌లార్జిమెంటు ఎవరిది?' అన్నాడు.

' మా బాబుది. ఏడాది పిల్లవాడిది. ఎన్‌లార్జి చేయించాం'

శంకరం ఆశ్చర్యంగా 'రాజీ, నీకు పిల్లలున్నారు?' అన్నాడు.

' భలేవాడివి పెళ్ళయాక పిల్లలు పుట్టరేం?' అంది రాజేశ్వరి.

'ఎంతమంది?'

'ఒక్కడే'

' అందుకే యీ కాని వొళ్ళు. ఆమె కేసి చూస్తూ ఆగిపోయాడు శంకరం. ఆమె ఫక్కున నవ్వి ' సరే, యింక భోజనం చేద్దామా?' అంది.

'భోజనానికి తొందరేవిటి.. ఏది నీ యిల్లంతా చూపించు రాజీ' అన్నాడు శంకరం కుతూహలంగా.

ఆమె ఒక్కొక్క గదీ చూపించింది, భర్త లైబ్రరీ గది, ఆమె గదీ, వంట గదీ అన్నీ చూపి అతన్ని మేడ మీదకు తీసుకు వెళ్ళింది. 'ఈ బాల్కనీ అంటే వారికెంతో యిష్టం అలసిపోయి వచ్చినప్పుడు యిక్కడే కూర్చుని అకాశాన్నీ నక్షత్రాల్ని చూస్తూ విశ్రాంతి తిసుకుంటారు. అప్పుడు నేను వీణమీద రెండు మూడు పాటలైనా వినిపించి తీరాలి' అంది రాజేశ్వరి.

సగం అల్లిన ఊలు స్వెట్టర్ని చూపించి శంకరం అన్నాడు 'నీకు అల్లిక పని బాగా వచ్చునా రాజీ?' అన్నాడు.

'ఏదో కొంచెం. కాలక్షేపం ఎలాగ చెప్పు, ఆయనకి స్వెట్టరూ, మఫ్లర్లూ ఆబ్బాయికి మేజోళ్ళూ అల్లుతుంటాను.'

' ఆయన ఎప్పుడొస్తారు?'

'నాలుగైదు రోజుల్లో....' ఆమె ఆలోచనగా నిలబడిపోయింది.

'ఏమిటాలోచిస్తున్నావు?' అన్నాడు శంకరం.

'ఈ వేళ ఆయన దగ్గర్నుండి ఉత్తరం రావాలి. రాలేదేమా అని!'

' అందుకు పెద్ద కారణం ఏముంటుంది రాజీ! పని తొందరలో రాయకపోవచ్చును' అన్నాడు శంకరం.

'అదికాదు శంకరం. రోజు విడిచి రోజు వారు ఉత్తరం రాయకపోతే నాకు తోచదని వారికి తెలుసును.' అంటూ సన్నగా నవ్వింది రాజేశ్వరి.

శంకరం మరో సిగరెట్టు వెలిగించాడు.

'ఈ రాధాకృష్ణుల దంతపుబొమ్మ ఎంత బాగుంది రాజీ. ఎక్కడ ఖరీదు చేశావు?' అన్నాడు.

'నా పుట్టిన రోజుకి ఆయన బహుమతిగా యిచ్చారు.'

'ప్రతి పుట్టిన రోజుకీ మీ ఆయన ప్రజెంట్ యిస్తాడా?'

' ఆఁ.... ఏం మరిచిపోయినా నా పుట్టినరోజూ, పెళ్ళిరోజూ ఆయన మరచిపోరు. ఇప్పుడు నేను కట్టిన చీర ఒక పుట్టిన రోజు బహుమతులే.'

శంకరం కిటికీలోంచి వెన్నెల పరుచుకున్న పట్టణాన్ని చూస్తున్నాడు.

'ఏఁవిటి చూస్తున్నావు శంకరం?' అంది రాజేశ్వరి.

'ఇక్కణుంచి వ్యూ బాగుంది' అన్నాడు శంకరం. అతని గొంతులో జీర వుంది.

రాజేశ్వరి శంకరాన్ని మరో గదిలోకి తీసుకు వెళ్ళింది గదిలో చిన్న టేబిలూ చిన్న చిన్నకుర్చీలూ చిన్న రైలుబండి మోటారు కారూ రకరకాల ఆటవస్తువులూ– ముచ్చటగా వుంది. ఆరేళ్ళ కుర్రవాడు కాలు మీద కాలు వేసుకు పడుకున్నాడు. ఆయా మంచం వారనే కూర్చోని కథలు చెబుతోంది.

'వీడే మా అబ్బాయి సుందర్రావు.. తాతగారి పేరు' అంది రాజేశ్వరి. సుందరరావు లేచి కుర్చుని 'ఈయననెవరమ్మా? డాడీ వచ్చారెమో అనుకున్నాను. డాడీ ఎప్పుడోస్తాడమ్మా' అన్నాడు ముద్దుగా.

రాజేశ్వరి వాణ్ణి ముద్దుపెట్టుకొని 'వచ్చేస్తారు బాబూ. ఇంకా పడుకోలేదేం నిద్రరావడం లేదా?' అంది.

'నువ్వు రావాలమ్మా నువ్వొచ్చి కథ చెబితేకాని నిద్రపోనమ్మా' అన్నాడు సుందర రావు బుంగమూతి పెట్టి.

'అలాగే సుందర్. బువ్వతిని వచ్చి నీకు కథ చెవుతాను. ఏం?'

తల వూపాడు సుందరరావు.

'ఎవరి పోలిక రాజీ. మీ అబ్బాయిలో నీ పోలికలు కనిపించవేం?' అన్నాడు శంకరం.

'ఆయన పోలికే ఆ నుదురూ ఆ పెదాలు...' అంది రాజేశ్వరి గదిలోంచి వస్తూ.

రాజేశ్వరి శంకరాన్ని పడక గదిలోకి తీసుకు వెళ్ళింది. లేత నీలపు రంగు గోడలూ, రెండు పెద్ద స్టీల్ అల్మైరాలు, తెరిచి వున్న వాటిలోంచి కనపడే ఖరీదైన చీరలూ, పాంట్లు ముఖమల్ దుప్పటి పరచిన మంచాలూ, మొజెయిక్ ఫ్లోరింగూ, గోడలలో అమర్చబడిన విద్యుద్దీపాల మెత్తని వెలుతురూ, నిలువకుద్దాలూ – లవెండరువాసనా, విశాలంగా ఉన్న ఆగది ఎంతో మనోహరంగా వుంది. దగ్గరగా వున్న ఆ మంచాలమీద నారాయణరావూ రాజేశ్వరీ దగ్గరగా కౌగలించుకుని పడుకున్నట్టు కనపడ్డారు శంకరానికి, అతనికి గొంతులో డెక్కు పట్టినట్టయింది.

'ఎలావుంది శంకరం?' అంది రాజేశ్వరి.

'వండ్రపుల్' అన్నాడు శంకరం తేరుకొని రాజేశ్వరి నవ్వింది ఆ నవ్వులో ఏదో తృప్తి, గర్వమూ ధ్వనించాయి.

ఇరువురూ టేబిలు మీద ఎదురెదురుగా కూర్చుని భోజనం చేస్తున్నాడు.

'ఏం శంకరం. అదోలావున్నావు?' అంది రాజేశ్వరి.

'ఎలా వున్నాను?' అన్నాడు నవ్వుతూ శంకరం.

'గ్లూమీగా.'

' నిన్నూ నీ యింటినీ చూడడం ఒక అనుభవం సుమా. అవును కాని రాజీ...?' సందేహం ధ్వనించింది అతని గొంతులో.

'ఏం?' కుతూహలంగా చూసింది రాజేశ్వరి.

'నన్ను పిలవడంలో నువ్వు తొందరపడి....'

'నేను తొందరపడి నిర్ణయానికి రాననీ, వచ్చాక ఆ నిర్ణయం మారదనీ తెలుసుగా శంకరం.'

శంకరం నవ్వేశాడు ఆమె తన క్లబ్బుని గురించీ, అతను తన మిలటరీ అనుభవాలూ చెప్పుకుంటూ భోజనం పూర్తి చేశారు భోజనానంతరం రాజేశ్వరి శంకరాన్ని డ్రాయింగ్ రూమ్‌లో కూర్చోపెట్టి యిన్నిపత్రికలు అతను ముందు వుంచి 'బాబుని పడుకోబెట్టివస్తాను. నౌకర్లనీ పంపివేస్తాను. ఈ పత్రికలు చూస్తూవుండు. ఇంతవరకూ గృహిణి అయిన రాజేశ్వరిని చూసి విసుగెత్తింది కదూ.' అని ఆగి సిగ్గుతో ఓరగా చూసి 'ఈ సారి నీ రాజేశ్వరిగా వస్తాను' అని వెళిపోయింది శంకరం మందహాసం చేశాడు.

ఒక గంట అనంతరం తెల్లని చీరతో సిగ్గు కోరికా కలవరపడే కళ్ళతో అప్సరసలా మెట్లు దిగి వచ్చింది రాజేశ్వరి. కాని డ్రాయింగ్ రూంలో శంకరం లేడు. వరండాలోకి వెళ్ళి చూసింది. అక్కడా లేడు. వరండాలోకి వెళ్ళి చూసింది. అక్కడా లేడు. గేటు కాపలావాడు తనవైపే రావడం చూసింది. 'దొరగారు వెళ్లి పోయానని చెప్పమన్నారు. ఈ కవరు మీ కిమ్మన్నారు' అని లేత నీలపు రంగు కవరు ఆశ్చర్యంతో తెల్లబోయిన రాజేశ్వరికి యిచ్చి వెళ్లిపోయాడు. ఆ కవరు తనదే డ్రాయింగ్ రూమ్ బల్లమీద తన కవర్లు రైటింగ్ ప్యాడూ ఉన్నాయి.

సంభ్రమంతో ఆశ్చర్యంతో కోపంతో ఆత్రుతగా కవరువిప్పి యిలా చదివింది రాజేశ్వరి.

'రాజీ, నన్ను క్షమించు. నేను వెళ్లిపోతున్నాను. నేను నిన్ను కోరిన కోరిక ఎంత అసమంజసమో, అవివేకమో తెలుసుకున్నాను. నా మీద జాలివల్ల నువ్వు అంగీకరించావు. అయినా నేను చూసి చూసి ఒక పవిత్ర దేవాలయాన్నీ, లోని దేవతనీ అపవిత్రం చేయలేను. పదేళ్ళక్రితం రాజేశ్వరివి కాదు నువ్వు. నువ్వూ నీ భర్తా నీకొడుకూ నీయిల్లూ ఇవన్నీ పెనవేసుకు పోయిన స్త్రీ మూర్తివి. నీ అణువణువూ నీ భర్తకి అంకితమయింది. మీ యిద్దర్నీ విడదీసి చూడడం తెలివి తక్కువ. నిన్నువిడిగా ప్రత్యేకంగా నేను పొందడానికి నీ దగ్గర ఏమీ నీదనేది లేదు రాజీ. నిర్మలమైన ఒక సరస్సుని కెలికివేసేటంతటి కుసంస్కారినికాదు నేను. దాంపత్య జీవితం ఇంతగా ఒక వ్యక్తిని మారుస్తుందనీ, ఉదాత్తం చేస్తుందనీ నేనెన్నడూ ఊహించలేదు. ఈ చర్య జరిగివుంటే ఎంతో మానసిన సంక్షోభానికి కారణమై వుండేది. నిన్ను మరచి పోయేందుకు ప్రయత్నిస్తాను. నీ కోరిక ప్రకారం పెళ్లి చేసుకుని సతీమణితోనే నీకు మళ్ళీ కనిపిస్తాను – శంకరం'

## స్వప్నసీమ ఆలూరి బైరాగి

**సాయంత్రం చీకటిపడుతున్నది.** ఆఫీసులో వాళ్లంతా ఇదివరకే ఇళ్ళకెళ్ళపోయారు. నేను అప్పటిదాకా ఏవో ప్రూఫులు దిద్దుకొంటూ కూర్చున్నాను. వీటికి అంతులేదు గామాలునురా! అనిపిస్తున్న ఆ ప్రూఫులు ఎలాగైతేనేం అయిపోయాయి. 'అబ్బ!' అనుకొంటూ ఒక్కసారి గట్టిగా ఊపిరిపీల్చి లేచి నిలబడ్డాను. బయటికి వెళ్ళిపోతూపోతూ ఒక్కసారి ఆ సిరామరకల బల్లవైపు నా అసహ్యాన్నంతా వెలిబుచ్చేటట్టు ఒక విషపుచూపు విసిరేశాను. నాకేగనక కౌశికుని, దుర్వాసునిశక్తి ఉంటే ఆ బల్లదెబ్బకు భస్మమైపోయి ఉండేది. కాని అదృష్టవశాత్తూ అలాంటిదేమీ జరుగలేదు.

అఫీసు నుంచి బయటకు వెళ్తూవెళ్తూ మెట్లమీద అలా క్షణంసేపు ఆగాను. కళ్ళు మండుతున్నయ్. ఒళ్ళంతా నెప్పులుగా ఉంది. ప్రొద్దున్నుంచీ విరామంలేకుండా వంచి ఉన్నందు వల్ల వెన్నుపూస గోడకుకొట్టిన మేకులా వంగిపోయి తిన్న బడనంటున్నది. కాళ్ళు గుదులుబడ్డాయి. క్షణం సేపు మెట్ల మీద ఆగి ఎటువెళ్ళటమా అని ఆలోచిస్తూ అలాగ నిలుచున్నాను. ఉన్న పళాన కలకత్తా చీకటికొట్టులాంటి నాగదిలోకి వెళ్లటం ఇష్టం లేదు. వెళ్లితే గదితాళం తీసి, లైటువెలిగించి, బట్టలుమార్చి, చేతులూ మొగమూ కడుక్కొని పడక కుర్చీలో నడుం వాల్చాలి. ఇవన్నీ చేయటానికి ఓపికలేదు. అందువల్ల ఏమి చేయటమా అని ఆలోచిస్తూ అలాగ నిలుచున్నాను.

చీకటిపడింది. జనప్రవాహం ఇళ్లవైపు మరలింది. ప్రొద్దున్నుంచి ఆఫీసుల్లో కర్మగారాల్లో దుకాణాల్లో ఎక్కడెక్కడో పనిచేస్తున్నజనం పనిచాలించి ఇళ్ళకు వెళ్తున్నారు. వారి తీరికలతో కోరికలతో నిండివుంది గాలి. విద్యుద్దీపాల శాంతి. ఈ మహజన కలవరం అన్నీ ఆ ఒక్క ఆనందాన్నే సూచిస్తున్నాయి. అందువల్లనే ఈ సంజగాలుల్లో మానవ స్పర్శ ఎక్కువ వున్నది. పిల్లల పాపలతో ఉన్న ఆడవాళ్ళను వెంట బెట్టుకొని షికారు కెళ్ళుతున్న మగవాళ్లనుచూసి అది ఆనందం పట్టలేక నవ్వుతున్నదా అనిపిస్తున్నది. ఆ వేళపుడు హోటళ్ళన్నీ నిండిపోతాయి. పేవ్‌మెంట్ మీద జనం ఒత్తిడికి అంతుండదు. ఎక్కడ చూచినా కాంతి, కలవరం, సంగీతం.

నాకు ఇంటికి వెళ్లబుద్ధెయ్యలేదు. మెయిన్ రోడ్డు వైపుకు నడిచాను. జనం ఎక్కువ ఔతున్నకొద్దీ నేను ఒంటరితనం అనుభవిస్తున్నాను. నాకు అకస్మాత్తుగా ఇలియట్ వేస్టు ల్యాండులో పంక్తులు జ్ఞపకమొచ్చాయి.

" ఈ వినీల సాంధ్యవేళ
మానవుని అలసిన కన్నుల వంగిన వీపు
బల్లనుంచి పైకిలేచి చూచేవేళ
మానవ యంత్రం నిరీక్షణలో ఇంజినాపని
టాక్సిలా స్పందిస్తూ లేచి ఉన్న ఈవేళ
ఈ వినీల సౌందర్యవేళ."

ఈ సంజవేళ పగటిపూట వెలుతురులో ఏమూరుమూల చీకటిలోనో దాక్కున్న స్వర్ణ స్వప్నాలు మనుష్యుల రెప్పల్లో రాజ్యమేలటానికి తిరిగివస్తాయి. ప్రతిజీవీ పగలల్లా ధరించిన గంభీరమైన ముసుగు తీసిపారేసి మళ్ళా తన నిజస్వరూపం దాలుస్తాడు. మానవజాతి యుద్ధాలూ రాజకీయాలూ మరచిపోయి పిల్లలకు మిఠాయిపొట్లాలసంగతి ఆడవాళ్లకు పూల సంగతి ఆలోచిస్తుంది. కల తిరిగివస్తుంది. కల కరిగివస్తుంది. కల కరిగిపోదు.

చివరికి నేను, నేనుకూడ మరచిపోతాను ప్రూఫుల సంగతి, సిరామరకబల్ల సంగతి, ఆఫీసు సంగతి, సాయంత్రపు చీకటి గడిచిన పగలును జీవితంలో నుంచి తుడిచిపెడుతుంది. సాయంత్రమయ్యేటప్పటికి నేను మామూలుమనిషినై నలుగురితోబాటు దీపకాంతిలో ధగధగలాడుతున్న బజారుల్లో నడుస్తుంటాను. నేనొక్కక్షణం వెలుగులో, నవ్వుల్లో జీవిస్తాను. నేను పునర్జీవితజీవాత్మాన్ని. నేనే లాజరస్‌ను. చనిపోయినవాళ్ళలోంచి తిరిగివచ్చాను.

కాని ఇవ్వాళ సాయంత్రం వేళ ఎందుకనో రోజూ ఉండే ఉత్సాహం లేదు. ఆఫీసులోంచి బయటకొచ్చేశాననే సంతోషంగూడా, ఆడుగులు తొందరగా ముందుకు వేయించలేక పోతున్నది. ఈ ముసురుకుంటున్న చీకటిలో, ఈ దీపాల మసక వెలుతురులో ఈ జనంమధ్య నన్నేదో దిగులు, చెప్పరాని ఆరాటం ఆవహిస్తున్నది. కన్నులముందు ఏదో నీడలా కదులుతున్నది. అది ఏమైనదీ తెలియటం లేదు. నేనేదో

వినగోరినది వినలేనట్టూ చూడకోరినది చూడలేనట్టు అనిపిస్తున్నది. బహుశా అది బడలికయి ఉంటుంది. చాలా సందడిగా ఉన్నచోటికో ప్రశాంతమైన నిశ్శబ్దంలోకో వెళ్ళాలనిపిస్తున్నది. కాని ఎక్కడికి వెళ్లేట్టు?

అకస్మాత్తుగా నాదృష్టి ఎదరుగా గోడమీదనున్న పోస్టరుమీద పడింది. ఆ పోస్టరు పెద్ద అక్షరాలతో బిగ్గరగా అరుస్తున్నది. "గ్రేండ్ కార్నివాల్ అండ్ మిలిటరీ టేటూ' నేను ఆలోచించాను ఎందుకు వెళ్ళగూడదా అని. తొమ్మిదింటిదాకా కాలక్షేపం చెయ్యొచ్చు. రంగురంగుల లైట్లుంటాయి. బహుశా పాటకచ్చేరీలు నృత్య ప్రదర్శనాలు ఉంటాయ్. జనం మంచిమంచి దుస్తుల్లో కారుల్లో బళ్ళలో వచ్చి ఉంటారు. బహుశా లాటరీలు తమాషాలు ఎన్నో ఉండొచ్చు. ఆలోచించి వెంటనే వెళ్దామని తీర్మానించుకొన్నారు. ఎక్కువ దూరంకూడా లేదు. అణా ఇచ్చి బస్సు ఎక్కాను.

గ్రౌండ్సు దగ్గిర చాలా ఒత్తిడిగా ఉంది. బయట వందల కొలది కారులు ఒకదాని వెనకాల ఒకటి నిలబడి ఉన్నాయి. రంగు రంగులు. ఎన్నో రకాలు. వాటిని చూస్తే లోపల ఎంత జనం ఉన్నారో అనిపిస్తున్నది. బుక్కింగు ఆఫీసు దగ్గరకు వెళ్ళి పావలా టికెట్ తీసుకొని లోపలకు వెళ్ళాను. లోపల అంతా అదొక కలగా దేవేంద్రలోకంగా ఉన్నది. ఎక్కడ చూచిన రంగురంగుల ఎలక్ట్రిక్ దీపాలే! కళ్ళు చెదిరిపోతున్నాయి.

నగరంలో ప్రసిద్ధికెక్కిన వ్యాపారసంస్థల సైనుబోర్డులన్నీ ఉన్నాయి. రెండు వైపులా రెండు వరసల్లో తాటాకు పాకల్లో రకరకాల వినోదాలూ ఆటలూ జరుగుతున్నాయి. ఎడతెరిపి లేకుండా జనం వాటిలోకి పోయి బయటకు వస్తున్నారు. మధ్య చిన్న ఎలక్ట్రిక్ రైలు, రంకులరాట్నం ఇంకా ఇలాంటివి ఉన్నాయి. మధ్య ఏదో ఒక పెద్ద లాటరీ జరుగుతున్నది. చక్కటి దుస్తులు వేసుకొన్న యువతులూ, సైనికులూ లాటరీ టిక్కట్లు అమ్ముతున్నారు. వారి చిరునవ్వుల్ని తప్పించుకోటం చాలాకష్టం. ఇష్టంలేకపోయినా ఏదో ఒకటి కొనక తప్పదు.

జనం అన్ని రకాలూ ఉన్నారు. సంఘంలో పూల పరిమళమంతా ఇక్కడ పోగయింది. ఇది ఒక తేనెతుట్టె. నగరంలో ధనాఢ్యులూ, సినిమాతారలూ, ప్రసిద్ధ నర్తకీమణులూ అంతా ఇక్కడ కనిపిస్తారు. ఎక్కడ చూచిన రంగులు, ఎటువైపు చూచినా అటునుంచి మళ్ళీ చూపుమరల్ప బుద్ధెయ్యటం లేదు. మధ్యమధ్య ఈ సిల్కు చీరల, అందమైన సూట్లమధ్య పేదవాళ్ళు నాలాంటి మధ్యవర్గీకులు కూడా ఉన్నారు. నిజమైన ఆనందం వీళ్ళది. రోజూ పడే బాధలూ దిగుళ్ళూ తప్పించుకొని ఒకపూట నిశ్చింతగా సౌఖ్యంగా గడపటానికి వచ్చారు వారు. వాళ్ళ కళ్ళల్లోంచి ఆశ్చర్యం ఒలికిపడుతున్నది. వాళ్లకు గాలిలో మేఘాల్లో తేలిపోతున్నట్టుంది. వాళ్ళకిలాంటి అవకాశాలు ఎప్పుడోగాని రావు. రంగురంగుల విద్యుత్కాంతి మృదుత్వంలేని వాళ్ళ మొఖాలకు రంగువేసి వాళ్ల ప్రత్యంగాన్ని ఒక తేజంతోకప్పి వాళ్లను దేవతా స్వరూపుల్నిగా చేస్తున్నది. వాళ్ళు సరిగా కుట్టని చవకరకం దుస్తులు ఈ వెలుగులో సిలుకు చీరలకేమాత్రం తీసిపోవు. ఈ రాత్రి వాతావరణం, ఈ వెలుగుల వరద ఇక్కడ తిరిగేవాళ్లందరినీ సమానంచేస్తున్నది. ఇంటికి వెళ్లగానే వాళ్ళ కలలు మాయమౌతాయి. వాళ్ళు ఎప్పటిమనుషులౌతారు. ఐతేనేం?

నేను చాలాసేపు తిరిగాను అట్లా తమాషాలు, తమాషాలు చూస్తున్న మనుషులను చుస్తూ, చివరకు కాళ్ల నొప్పులు పుట్టినయ్. ఎక్కడికైనాపోయి కాస్తంతసేపు కూర్చుందామనిపించింది. అలా అనుకుంటూ చాలాదూరం తిరిగాను ప్రశాంతమైన చోటు వెతుకుతూ. కాని ఎక్కడా కూర్చునేచోటు దొరకలేదు. ఇంతలో ఒకచోట క్యూలుగా నిలబడ్డ జనం కనిపించారు. ఏమిటా అని దగ్గరకు వెళ్ళి చూశాను. మిలిటరీ టాటూకి టిక్కట్లు అమ్ముతున్నారు. లోపలికి వెళ్దామా, కూర్చోవచ్చు అనిపించింది. వద్దనుకుంటూనే కుర్చీ టికట్టుకొని లోపలికి వెళ్ళాను.

లోపల అదొక పెద్దమైదానం. దానిచుట్టూ దళ్లు కట్టి ద్వారాలు ఏర్పరిచారు. చుట్టూ గ్యాలరీలు, బెంచీలు, కుర్చీలు వేయబడి ఉన్నాయి. ఒకవైపు నిలబడ్డవాళ్లుకూడా ఉన్నారు. వీటి తరువాత మధ్యలో త్రాళ్ళతో కట్టిన ఆవరణలో సైనికదళాలు ప్రదర్శనం జరుపుతున్నాయి. నాలుగు వైపుల నుంచి ఎత్తుమీద ఉంచిన శక్తివంతమైన ఫ్లడ్‌లైట్లు రంగు రంగుల కాంతివాళ్ళ మీద ప్రసరిస్తున్నది. ఆ కాంతిలో వాళ్ళ యూనిఫారాలు

వాటి బొత్తాములు చెప్పులు ఆయుధాలు ఒకటేమిటి చివరకు వాళ్లమొఖాలు కూడా మెరుస్తున్నయ్. దళాలు తరువాత దళాలు వచ్చి కులాసాగా కవాతుచేస్తున్నయ్. ప్రేక్షకులంతా చాలా ఆనందంగా చూస్తున్నారు.

నేను వెళ్ళి ఒక కుర్చీలో కూర్చున్నాను. నాకు కవాతు చూడాలని ఏమంత సరదాలేదు. తమాషా చేసేవాళ్లకంటే తమాషా చూసేవాళ్ళే ఎక్కువ తమాషాగా ఉన్నారు. నేను కూర్చున్నచోట కొంచం చిరుచీకటిగా ఉంది. మొఖాలు సరిగ్గా అగుపించటం లేదు. అప్పుడప్పుడు ఫ్లడ్‌లైట్ల లోంచి ఒక కిరణం వచ్చి మావైపు తిరిగిపోతున్నది. అది పోగానే మళ్ళీ చీకటి. ప్రేక్షకుల వ్యాఖ్యలుమాత్రం వినిపిస్తున్నయ్. నేను అలాగే మెదలకుండా కూర్చున్నాను. తల మీద నల్లనిచీకటి. రాత్రి ప్రశాంతంగా ఉంది. క్రిందిమోగుతున్న మిలిటరీ బ్యాండు కూడా ఆ ప్రశాంతాన్ని భంగపరచలేకపోతున్నది. కొద్దిగా మంచుపడటం కూడా ప్రారంభమయింది. కాని ఒత్తుగా జనం కూర్చున్న వెచ్చదనంలో అది ఎవరికీ తోచటం లేదు. నేను కాళ్లముడుచుకుకొని పైన పెట్టుకొని తాపీగా సిగరెట్ ముట్టించాను.

నా సిగరెట్టుకొన ఎర్రగా మెరుస్తున్నది. నేను మగతగా కూర్చొని ఉన్నాను. కాని ఆ మగత నిదురమగత కాదు. అది మెలుకువకు పదునుపెట్టే మగత. అకస్మాత్తుగా మహాజన సమూహంలోనో లేక నిర్జనమైన ఎడారిలోనో నీకేదో మహత్తరమైన విషయం జ్ఞాపకం వచ్చినట్లుగా, చీకటిలో పట్టపగలై పోయినట్టుగా, ఇంతవరకూ దాక్కోని ఉన్న ఒక కొత్త ఆనందాన్ని కనుక్కొన్నట్టుగా, ఏదో ఓక మంత్రానికి అర్థం తెలిసినట్టుగా అదోరకమైన మగత అది. నీకు బాగా దప్పికవేసి, ఇక ముందు అడుగు పడని వేళలో నీకు రాయిక్రిందనుంచి పారుతున్న స్వచ్ఛమైన సెలయేరు కనిపించినట్లుగా ఉంటుంది. నేను బాగా మేలుకొనే ఉన్నాను. ప్రక్కనున్న వాళ్ళమాటలు కూడా వినిపిస్తున్నాయ్. కాని ఆ మెలకువ కేవలం నాకు సంబంధించినది. ప్రపంచానికందులో ఏమీ భాగం లేదు. నేను ప్రపంచాన్ని చూస్తున్నాను. కాని నేను ప్రపంచాన్ని చూడటంలేదు. నేను నా మధురమైన మగతలో చుట్టబడి ఉన్నాను. బయట మంచు తుపాను వీస్తున్నప్పుడు గదిలో వెచ్చగా గొంగళ్ళు కప్పుకొని సుఖంగా పండుకొన్నట్టుంది. ఆ మగతలోంచే ఒక రకమైన చైతన్యం బొగ్గులకుంపటిలా కణకణలాడుతా నన్నొక రకమైన వెచ్చదనంలో నింపుతున్నది.

"అదిగో, అటుచూడు. ఆ అబ్బాయి ఎలా ముడుచుకొని కూచున్నాడో పాపం!" అని హిందీలో ఎవరిదో స్త్రీ కంఠం వినిపించింది మెత్తగా, నా మగత దెబ్బతో వదిలిపోయింది.

"పాపం వానలో తడిసిన పక్షిలాగ కూచున్నాడు." అన్నది మళ్ళీ అదే కంఠం హిందీలోనే.

నామీద ఈ విధంగా అయాచితంగా జాలి కురిపిస్తున్న వారెవరా అని కళ్ళు తెరిచి చూశాను. నాకు రెండూ కుర్చీలవతల కుర్చీలమీద నిలబడి ముగ్గురౌత్తరాహులు నాజూకుగా బాలన్సు చేస్తున్నారు. ఇద్దరు యువతులు. ఒకడు నడివయసుకు మరలుతున్న యువకుడు. దుస్తులను బట్టి చూడగా వాళ్లు ధనవంతులైన వ్యాపారవర్గానికి చెందిన వాళ్ళాలా కనిపిస్తున్నారు. వీళ్లు ఎందుకా కుర్చీలమీద సర్కసు ఫీట్లు చేస్తున్నారా అనిపించింది. కాని చుట్టూ చూసేటప్పటికి దానికి కారణమేమిటో తెలిసిపోయింది. ప్రేక్షకుల్లో ముందున భాగం ఉత్సాహం ఇనుమడించడం వల్ల అకస్మాత్తుగా లేచి నుంచున్నారు. అందువల్ల వెనకవాళ్ళకు జరుగుతున్న తమాషా చూసే ప్రాప్తం లేకపోయింది. ఇక ముసలివాళ్లు ఆడవాళ్ళు కూడా పటపటలాడుతున్న అద్దెకుర్చీలను నమ్మి మునిగాళ్ళమీద నిలుచుని తమ కుతూహలం తీర్చుకోవలసి వచ్చింది.

"ఏం చెయ్యమంటారు? నిలబడిచూద్దామన్నా ఓపిక లేదండి" అన్నాను నేను ఆ అమ్మాయికి జవాబిస్తూ హిందీలోనే.

పాపం వాళ్ళు ముగ్గురూ తెల్లబోయారు. అసలు సంగతేమిటంటే వాళ్ళు నావాలకంచూసి నేను మద్రాసు వాణ్ణేననీ అందువల్ల హిందీ వచ్చి ఉండదనీ ఊహించుకొన్నారు. పైగా చుట్టూవున్న వాళ్లందరూ కుర్చీలమీద నిలబడి ఎంతో ఉత్సాహంగా చూస్తుంటే నేను అలా కుర్చీమీద ముడుచుకొని కళ్ళుమూసుకొని కూర్చొని ఉండటం వాళ్లకు చిత్రంగానే తోచి వుంటుంది. కాని ఇప్పుడు కథ ఇంకో విధంగా మరలింది.

'చూశావా. ఇప్పుడేం జరిగిందో,' అన్నట్టుగా చూశాడు యువకుడు ఇద్దరు అమ్మాయిల్లో ఒకరివంక. ఆ అమ్మాయి నావంక తిరిగి 'క్షమించండి. ఆ మాటలన్నది నేనే! మీరు ఏమనుకున్నారో ఏమో? ఐనా నేను మీకు హిందీ వచ్చుననుకో లేదు' అన్నది.

'అయితే హిందీ రాకపోతే సరి, ఏమన్నా ఫరవాలేదన్నమాట' అన్నాను నేను నవ్వుతూ.,

'కాదనుకోండి' అన్నదామె.

వాళ్లుముగ్గురు కూడా నవ్వారు. నిలబడ్డం మానేసి, దిగి నాప్రక్కనున్న కుర్చీలమీద కూచున్నారు. నలుగురం పిచ్చాపాటీ మాట్లాడటం మెదలెట్టాము. నేను శుద్ధ వ్యావహారికపు హిందీ మాట్లాడుతుంటే వాళ్ళకు ఆశ్చర్యం వేసింది. అప్పుడు చెప్పాను నేను ఉత్తరదేశం వెళ్ళి చదివానని. వాళ్ళు ముగ్గురుకూడా బాగా చదువుకున్నవాళ్ళ లాగ కనిపించారు. ఆ యువకుడికి 33 ఏళ్ళు ఉంటయ్. బట్టల వ్యాపారమట. ఆ అమ్మాయిలిద్దరూ పినతండ్రి కూతుళ్ళట. బొంబాయినుంచి సెలవుల్లో చూసిపోవటానికి వచ్చారట.

ఆ అమ్మయిలు చాలా అందంగా ఉన్నారు. ఇద్దరు ఒకటేరకం చీరలు. గులాబిరంగు సిల్కువి ధరించారు. నీలి జాకెట్టు స్వచ్ఛమైన ఎరుపు అదోరకమైన అందం. ఆ మసక చీకట్లో, అప్పుడప్పుడు వచ్చిపడుతున్న ఫ్లడ్ లైట్స్ కాంతిలో వాళ్ళు నాకు అప్సరసల్లా కనిపించారంటే అశ్చర్యంలేదు. మేం అలాగే మాట్లాడుకొంటూ కొంతసేపు కూర్చున్నాం.

అకస్మాత్తుగా వాళ్ళిద్దరిలో పెద్ద అమ్మాయి (ఆమె పేరు సుధ) లేచి తన చెల్లెల్ని 'ప్రభ! నేను అలా వెళ్ళి కొంచెం సేపు బయట తిరిగి వస్తాను. మీరిద్దరూ ఇక్కడ కూచుని ఉంటారా?' అని అడిగింది. వాళ్ళిద్దరూ, సరే వెళ్లి రమ్మని తల ఊపారు.

అప్పుడు ఆమె నావేపుతిరిగి 'ఏమండి! అలా తిరిగివద్దాం. మీరు నాకు తోడువస్తారా?' అని అడిగింది.

'ఓ. అలాగే!' నని ఆమె వెంట బయలు దేరాను.

మేము బయటకు వెళ్ళేటప్పటికి జనం ఇందాకటంత ఎక్కువగా లేరు. పలుచబడ్డారు. ఇద్దరం అలాగే స్టాల్స్ వెంటే మౌనంగా నడిచాం. ఇదే స్వప్నసీమ. దగ్గరగా కుర్చీల మీద కుర్చున్న ఆ జనాన్ని తప్పించుకొని ఇక్కడ బయట నిశ్శబ్దం కాకపోయినా, చల్లగాలిలో ప్రతిక్షణం మారుతున్న విద్యుద్దీపాలరంగుల్లో ఒకరకమైన మత్తుతో కూడుకొన్న ప్రశాంతి మనస్సును ఆవరిస్తుంది. బహుశా మేమిద్దరం అప్పుడు ఒకే ప్రశ్నను గురించి ఆలోచిస్తూ ఉండి ఉంటాం.

'మేమెవరం? ఇక్కడికెలావచ్చాం ?' అని. ప్రపంచంలో ఇన్ని చోటులు ఆరణ్యాలూ పర్వతాలూ నగరాలూ ఉండగా మేమిద్దరం ఇక్కడ కలుసుకోవటం ఎలా తటస్థించింది? ఈ ప్రశ్న కెవడు జవాబిస్తాడు?

'ఏమిటి ఆలోచిస్తున్నారు?' అన్నాను. 'ఏమిలేద'న్నది ఆమె. మళ్ళా మౌనంగా కొంతదూరం నడిచాం. ఆమె తలవంచుకొని ఎటూ చూడకుండా నడుస్తున్నది. నేను తల కొంచెం పైకెత్తి ' చూడండి' అన్నాను. మాకు ఎదురుగా ఏదో వ్యాపార సంస్థవారి ఎడ్వర్టయిజుమెంటు బోర్డు ఉన్నది. దానిమీద రంగురంగుల బల్బులు అమర్చివున్నవి. ఒక్కొక తూరి ఒక్కొకరంగు బల్బులు వెలిగి ఆ ప్రదేశాన్నంతటినీ అదే రంగు కాంతితో నింపుతున్నవి. మేమా వెలుగుల మార్పును చూస్తూ కొంచెం సేపు అలాగే నిలుచున్నాం. అకస్మాత్తుగా నీలిరంగు బల్బులు వెలిగినయ్. ఆ ప్రదేశమంతా నీలిరంగు కాంతితో నిండిపోయింది. ఆ కాంతులు ఆమె ఎర్రని చెంపల లోయల్లోపడి విచిత్రమైన కలగలుపు రంగులను సృష్టించాయి.

నేను అనాలోచితంగా 'ఒక్క విషయం చెపితే మీరేమీ అనుకోరుగదా? ఈ వెలుతురులో మీరు నీలం దేశపు రాజకుమారిలా ఉన్నారు' అన్నాను.

ఇంకొంచెం ముందుకెళ్ళాం. అక్కడ ఇంకా లాటరీ టిక్కట్లు అమ్ముతూనేవున్నారు.

'లాటరీవేసి చూదామా? మన అదృష్టం ఎలావుందో?' అన్నాను. అంటూనే ఆమె పేర ఒకటి నాపేరొకటి రెండు టిక్కట్లు కొన్నాను. లాటరీ ఫలితాలు తెలుసుకోటానికి కొంచెం సేపు అక్కడే చదికలపడ్డాము. నేనిలా అన్నాను 'చూశావా? మన అదృష్టాలు తెలుసుకోటానికి ఎంతమంది వేచి ఉన్నారో? అదృష్టం న్యాయ విచారణచేసి ఎవడి పక్షాన తీర్పు ఇస్తుందో వాడు నవ్వుతూ వెళ్తాడు. మిగతావాళ్లు విచారంగా తచ్చుకలాడుతారు. చక్రం ఎప్పటికైనా తమవైపుకు తిరగకపోతుందా అని. ఈ చక్రం తిరగటంలోనే వెలుగునీడలు ఏర్పడతాయి' ఆమె ఏమీ మాట్లాడలేదు. వింటూ కూర్చున్నది. ఇంతలో లాటరీ ఫలితాలు చెప్పారు. మా యిద్దరిలో ఎవరికీ ఏమీ రాలేదు.

'ఇవ్వాళ మన అదృష్టం ఏమీ బాగాలేదు.' అన్నదామె.

'ఏమో, నాఅదృష్టం చాలా బాగానే ఉన్నది' అన్నాను.

అక్కడినుంచి లేచి బయలుదేరాం. కొంతదూరం వెళ్ళేప్పటికి బుల్లిపట్టాలు కనుపించాయి. అలా వెళ్ళేటప్పటికి చిన్న ఆట రైలు బయలు దేరబోతూ ఉన్నది. అప్పుడే చాలామంది ఎక్కికూర్చున్నారు.

'రైలెక్కుదామా, రాకుమారీ! బహుశ ఇది మీదేశానికి తీసుకెళ్ళుతుందేమో?' అన్నాను. సరేనన్నది. ఇద్దరం ఎక్కికూర్చున్నాము. రైలు కూత వేసి సాగింది.

"ఈ ఆవరణ కవతల ఏమున్నదో తెలుసా? చీకటి. ఆ చీకటి అవతల బహుశా మళ్ళా లైట్లుంటయ్. అలా ఇలా వెలుగు చీకటుల పొరలు దాటిన తరువాత బహుశా మీ దేశం వస్తుంది. కాని మీ దేశానికి నీవొక్కతవే పోవాలి. మే మెవరమూ రాకూడదు." అన్నాను.

'ఏం? నువ్వు ఎందుకు రాకూడదూ? నువ్వుకూడా రా!' అన్నది.

'అమ్మో! మీ దేశంలో నేను అడుగుపెట్టడమే? మీ తండ్రి రాజాధిరాజు. ఈ పరదేశస్థుణ్ని నీవెంటచూస్తే ఇంకేమన్నా వుందా? పీక వుత్తరించి వేయడూ?' అన్నాను. నవ్వింది.

'కాని రాకుమారీ! ఒకవేళ ఈ రైలు ఎన్నటికీ అగదనుకో. అనేక దేశాలు అనేక కాలాలు దాటించి ఇది ఇలాగే మనిద్దరినీ అనంతంలోకి తీసుకెళ్తుందనుకో. అప్పుడు బాగుంటుందా?' అని నేను అంటుండగానే రైలు ఆగింది. ఇద్దరమూ దిగాం.

'చూశావా? కల ఎంత తొందరగా అయిపోయిందో?' అన్నది రాకుమారి. నాకు వెంటనే–

'తెలివి రానీయకే కల కరిగిపోతాది.

ఒక్క నేనే నీకు పెక్కు నీవులు నాకు'

అనే చరణాలు జ్ఞాపకం వచ్చాయి. హిందీలో అనువాదం చేసి ఆమెకు చెప్పాను విని ఆశ్చర్యపోయింది.

చేతులు పట్టుకొని మౌనంగా ఆలోచిస్తూ కొంతదూరం నడిచాం. ఆమె ఏమి ఆలోచిస్తూ వుందో నాకు తెలియదు. కాని నేనాలోచిస్తున్నాను, జీవితంలో ఎటువంటి విచిత్ర సంఘటనలు జరుగుతయ్యా అని. అకస్మికంగా జరిగిన ఏదో విషయం నీ మనసులో ఎన్నటికీ చెరిగిపోని ముద్రలు వేసిపోతుంది. ట్రాములో, బస్సుకిటికీలోంచి చూసిన ఏదో మొఖం, ఎక్కడో ఎప్పుడో ఎవరినోటనో విన్నపాటలోని ఒక చరణం, హఠాత్తుగా అర్ధరాత్రిపూట నిదుర మెలకువ వచ్చినప్పుడు జ్ఞాపకం వస్తాయి. మనం అన్ని ముఖ్య విషయాలు మరచిపోతాం. చూడవలసిన అధికారిపేరు మరిచిపోతాం. కుటుంబంలో చావుపుట్టుకలు మరిచిపోతాం. గురుతుల్యులూ పితామహులూ పుట్టిన గిట్టిన తేదీలూ తిథులూ మరిచిపోతాం. కాని ఈ జ్ఞాపకాలు మాత్రం హృదయ యంత్రంలో మసిలా మనసు పట్టుకొని ఒకపట్టాన వదలవు. ఏదో ముఖం చూచినట్టు స్మరణకొస్తుంది. కాని జ్ఞాపకంరాదు. అలాగే.

ఈమె ఎవరు? హఠాత్తుగా పూలవాసనలు నిండినగాలి విసురులా ఈ రాత్రివేళ ఈ నా జీవితంలో ఎందుకు ప్రవేశించాలి? ఏ అదృశ్యభాగ్యసూత్రం మమ్మల్నిద్దరినీ ఈ విధంగా ఒక గడియసేపు బంధిస్తున్నది? ఈ గడియ గడవగానే ఏమౌతుంది?

నేను ఆమెవంక తిరిగి చూచాను. మెత్తటి వెలుగులో ఆమె పొరపాటున భూమి మీద జారిపడిన అప్సరసలా కనిపించింది. నా హృదయం అదోవిధమైన ఆనందంతో నిండిపోయింది. నవవికచనుమ దళాలను మృదువుగా తాకుతున్నట్టనిపించింది.

'రాకుమారీ! నాకు అకస్మాత్తుగా ఏమి బుద్ధిపుట్టిందో తెలుసా?' అని అడిగాను.

'ఏమి బుద్ధిపుట్టింది?' అన్నదామె.

'ఏమి బుద్ధిపుట్టిందో నీకు తెలిస్తే తిట్టుకొంటూ పారిపోయి ఉండేదానివి. నాకు ఒక క్షణం నిన్ను ముద్దుపెట్టుకోవాలని బుద్ధిపుట్టింది.'

'మరి పెట్టుకోలేక పోయావా?'

'పూవులాగా చెదిరి రాలిపోతావేమోనని భయమేసింది.'

ఇంకొంచెంసేపు అలాగే నడిచాం. నేను టైము చూసి 'రాకుమారీ! మీ వాళ్ళు నీకోసం ఎదురుచూస్తూ ఉంటారు. వెళ్తావా?' అని అడిగాను. అనుమానిస్తూ నిలుచున్నది.

'అయితే మరి ఇక నే వెళ్లనా?' అన్నాను.

'మళ్ళా ఎప్పుడు కనిపిస్తావు?' అని అడిగింది.

'ఎక్కడ కనిపించగలరు?' అన్నాను.

' ఈ సెలవుల్లో నే నిక్కడ ఉన్నన్నాళ్ళూ మా వాళ్ళింటికిరా!' అని అడ్రసు ఇవ్వబోయింది.

'అది అంతా కుదరదు. రాకుమారీ! మన పరిచయాన్ని వృద్ధిచేసుకోటానికి ప్రయత్నించటం అనవసరం. ఎందుకు మనని మనం మోసం చేసుకోటం! రేపు ప్రొద్దున నేనెవరనో నీకు గుర్తుండదు. నీవెవరవో నాకు గుర్తుండదు. అంటే గుర్తు ఉండదనికాదు, ఉంటుంది. కాని పగలు వెలుతురులో దీన్ని గురించి ఆలోచించినపుడు మనమే సిగ్గుపడతాం. ఇదో రహస్యమైన కలలామాత్రమే గుర్తు ఉంటుంది. ఒకవేళ నేను మీ సంఘంలోకి వచ్చానే అనుకో. అక్కడ నన్ను ఏమని పరిచయం చేస్తావ్? ప్రూఫులు చదివే నా స్నేహితుడంటావా? అది జరుగనిపని రాకుమారీ! కలను వాస్తవంలోకి మార్చటానికి ప్రయత్నించకు. అలా చేసిన రోజున అదీ వాస్తవం లాగానే కఠోరంగా కటువుగా తయరౌతుంది. అందువలన మనం దీనిని తాకి దీని మృదుత్వాన్ని నాశనం చేయకుండా ఉండడమే మంచిది. ఈ జ్ఞాపకాన్ని మన హృదయంలో ఏమూలనో భద్రపరచుకొందాం. ఏం? మరిశెలవా?' నేనామె చేతిని నా చేయిలోకి తీసుకొన్నాను.

వెలుతురు ఆమె వెనుక ఉండటం వల్ల ఆమె ముఖం నాకు సరిగ్గా కనుపించటం లేదు.

నేను వెళ్తున్నానన్నట్టుగా ఆమె చేతిని ఒకసారి నొక్కి చీకటి వైపుకి నడిచాను. బయట రాత్రి చల్లగా నిశ్శబ్దంగా ఉన్నది.

# సహ్రపయాణం ఆకెళ్ళ

ఫిబ్రవరి '83 విజయ మాసపత్రిక

**ఆకాశంలో నల్లటి మబ్బులు గుంపులు గుంపులుగా** ఉన్నాయి. వర్షం పూర్తిగా తగ్గలేదు. ఆకాశాన్ని కత్తితో చీలుస్తున్నట్టు ఉండుండి ఓ మెరుపు మెరుస్తోంది. అరుగు చివర కొచ్చి నిలబడ్డాడు యాజి. కను చూపు మేరలో కావల్సిన వ్యక్తి కనపడకపోవడంతో నిరాశగా వెనక్కి తిరిగేడు.

ఊరి చివరనున్న ఆ రంగుల మేడ వయసుడిగిన ముత్తయిదువుల్లా ఉంది. రంగులు వెలిసిపోయాయి. ప్రహరీ కూలి పోయింది. ఆ మేడలో పాతికేళ్ళుగా ఉంటున్న యాజికి, అదే ఇంద్ర భవనం. తక్కువ అద్దెకు అంతకన్న పేలస్‌లు దొరకవుగా?

ఆందోళనగా అరుగు మీద తిరుగుతున్న యాజికి సావిట్లోంచి సన్నటి మూలుగు వినిపించింది. ఒక్క అంగలో సావిట్లో కొచ్చి "ఏం కావాలీ?" లాలనగా అడిగేడు.

యాభై ఏళ్ళ ముత్తయిదువు మంచాన్ని అంటిపెట్టుకుని ఉంది. నీరసంగా కళ్ళు విప్పి చూసింది. తిరిగి కళ్ళు మూసుకుంది. ఆరాటాన్ని అణుచుకుంటూ ఆమెకేసి చూశాడు. కట్టుకున్న ముతక చీర ఏరంగో తెలియటంలేదు. పసుపు కొమ్ములా సన్నగా ఉన్న ఆ ముత్తయిదువు మెడలో నల్లపూసలు, దాన్ని అంటిపెట్టుకుని పసుపుతాడు ఉన్నాయి. నయాపైసంత కుంకుమ బొట్టు మాత్రం నీరసమైన ఆ ముఖంలో గంభీరంగా కనపడుతోంది.

యాజి ఆమె కెసి చూడలేక తలతిప్పుకున్నాడు. ముప్పై ఏళ్ళుగా తనతో ఆమె భాగస్వామిగా సహ్రపయాణం చేసింది. ఆమెనేవిధంగానూ తను సంతోషపెట్టలేకపోయాడు. తను ఎన్నుకున్న వృత్తి - మరే గృహవిషయాలు పట్టించుకోలేని పరిస్థితిలో ఉంచింది. ఆమెకు కష్టాల్ని కట్టబెట్టింది. తనలో తనే గొణుక్కున్నాడు యాజి. అతని దృష్టి గోడలకు తగిలించబడిన కిరీటాలు, దుస్తుల మీదకు మళ్ళింది. తను జీవితంతో అన్ని వేషాలు వేశాడు. అందరి మన్ననలు పొందేడు. కానీ భర్తగా తన వేషాన్ని తను సంతృప్తిగా నిర్వహించలేకపోయాడు. ఆమెకు అసంతృప్తినే కలిగించాడు. ఆమె మాత్రం ఇన్నేళ్ళుగా గృహిణిగా మెలిగింది తన్ని సహించింది.

పన్నెండో ఏట తొలిసారి తను వేషం వేశాడు. ఆనాటికే తండ్రి వెంకయ్య పగటి వేషాల్లో సుప్రసిద్ధుడు. తండ్రి వేదాలు, మంత్రాలు సర్వం నేర్చుకున్నవాడే అయితేనేం? మరే వృత్తిలేనట్లు పగటి వేషాలు వేయడమే వృత్తిగా స్వీకరించాడు.

తరచుగా తండ్రి అంటూండేవాడు. "నేను మంత్రాలు చదువుతూ కులవృత్తిలో పొట్టపోసుకోగలను. లేదా మూడు వీధులు చెంబెత్తితే సంసారం సాగిపోవచ్చు. ఐతే ఏ వృత్తి ఇవ్వలేని సంతృప్తి వేషాలు వేయడం కలిగిస్తుంది. సమాజంలో అన్యాయాలున్నాయి. మూఢనమ్మకాలున్నాయి. నా వేషంతో వాటిని విమర్శిస్తాను. వాటి పట్ల ప్రజలకు విముఖత కలిగిస్తాను. సంఘ సంస్కర్తలు చేసే పని నా

ధోరణిలో నేను చేస్తాను. నా హాస్యంతో విమర్శిస్తాను. ఎవరి ముక్కు మీద మసి వాళ్ళకి తెలియదు. మనం చెప్పాలి. అదే మన వృత్తి. " ఎన్నోసార్లు సగర్వంగా చెప్పేవాడు తండ్రి.

పన్నెండో ఏట తండ్రి వెనుక తను బయల్దేరాడు. అంతా గుంపుగా ఒక ఊరు చేరేవారు. తండ్రి వెళ్ళి ఆ ఊళ్ళో ఉన్న ప్రముఖుల్ని కల్సుకుని మర్నాడు నుంచి వేషాలు వేస్తామని తెలియజెప్పి వచ్చేవాడు.

మర్నాటి నుండి వేషాలు ఆరంభించేవారు. తండ్రి సోమయాజి వేషం వేస్తే, ఒక శిష్యుడు సోమదేవమ్మ వేషం వేసేవాడు. మిగిలిన వాళ్ళు శిష్యులు.

అంతా బయలుదేరి ఏ గృహస్తు దగ్గరకెళ్ళినా పరదేశి బ్రాహ్మణ కుటుంబం అనుకోవల్సిందే కానీ, పగటి వేషాలని గ్రహించలేకపోయేవారు. అంత రమ్యంగా వేష రచన ఉండేది. రాత్రి గ్యాస్ లైట్స్ ముందు వేషాలు వేయడం వేరు. పట్టపగలు వేషం వేసి, వేషం కానట్టు ప్రజలను భ్రమలో ముంచడం వేరు.

తండ్రి సోమయాజి వేషం వేసి సోమిదేవమ్మతో హాస్యరస ప్రధానంగా నడిపిన విసుర్లు విని, కొండు శ్రేష్టి నాలుగో వివాహ ప్రయత్నం విరమించుకున్నాడు. అలాగే గొల్లవాడి వేషంలో గొల్లవారికి నీతులు చెప్పేవారు ఏ వేషంలోనైనా ఏదో పరమార్ధాన్ని సాధించేవారు.

పగటి వేషాల వెంకయ్యగా తండ్రి ఆంధ్రదేశంలో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నాడు. తండ్రి రాజు వేషం వేస్తే పిఠాపురం రాజావారు ఆ ఠీవికి దర్జాకి విస్తుపోయారు.

"రాజకుంటుంబాలకే తెలియని రాజసాన్ని, మీ హావభావాల్లో చూపారు" అంటూ ఉంగరాన్ని బహూకరించేరు పిఠాపురం రాజావారు.

తండ్రి తర్వాత అంత కీర్తిని తనూ ఆర్జించగలిగేడు. సోమయాజి, గొల్లవాడు, పోలీసు, పఠాన్, రాజు, ఇలా వరుసగా ముప్పయి రెండు వేషాలు వేసేవాడు. ఏ వేషానికి ఆ వేషమే. ఆఖరికి శారదా వేషంతో వేషాలు పూర్తి అయ్యేవి. ఆనాడు తను ఊళ్ళో ప్రముఖుల్ని కలిసేవాడు. తోచిన డబ్బు ఇచ్చి సంతృప్తిగా వాళ్ళు ఊరి చివరి వరకూ సాగనంపేవారు. మరో ఊరు, మరో వేషం. ఇవ్వగలిగి కూడా ఇవ్వనని మొండి వేషం వేసే వాళ్ళ దగ్గర తనువాళ్ళని నవ్వించి, ఒప్పించి - తాంబూలం తీసుకునేవాడు.

గత ఆలోచనల్లో ఉన్న యాజి పెదవులు సన్నగా విచ్చుకున్నాయి. పరుశురామ నాయుడుగారు గుర్తుకొచ్చారతనికి. తను ఆ ఊళ్ళో వేషాలు వేసినంత కాలం నోరు మెదపకుండా కూర్చున్నాడు. శారద వేషం వేసి, తాంబూలానికి వెళ్ళినరోజు, "నీ వేషం ఏదీ నన్ను భ్రమ పెట్టలేకపోయింది. నేనెందుకు తాంబూలం ఇవ్వాలి" అని ఎదురడిగేడు.

"మీ చేత శభాష్ అనిపించుకున్న రోజునే, ఈ తాంబూలానికి రెట్టింపు మీ దగ్గర తీసుకుంటాను" అని చెప్పి తను వెనక్కి తిరిగేడు.

వారం తర్వాత కోర్టు అమీనాగా, తను రంగప్రవేశం చేశాడు. నాయుడు తన వేషాన్ని గుర్తించలేదు. గజగజలాడేరు. అరగంట నాయుడ్ని ముప్పుతిప్పలు పెట్టి మూడు వందలు లంచం తీసుకుని, వేషం తీశాడు. నాయుడు ఆశ్చర్యంలో మునిగిపోయాడు.

లంచంగా తీసుకున్న మూడు వందలు అతని చేతిలో ఉంచి వెనక్కి తిరిగితే, వెంటపడి ఆ డబ్బు తను తాంబూలంగా తీసుకుంటే కానీ ఊరుకోలేదు. ఆ తర్వాత వరుసగా అన్ని వేషాలు తిరిగి వేయించుకుని ఆనందించేడు.

అర్ధనారీశ్వరుని వేషం తనెన్నో వందలసార్లు ధరించేడు? పెద్దాపురం దివాన్ ఆ వేషానికి మెచ్చి - ఈ రంగుల మేడలో ఆశ్రయాన్ని కల్పించేడు.

కాలం మారిపోయింది. కళాస్వరూపాలు మారిపోయాయి. తమ పగటి వేషాలు చేసే పనని నాటకాలు, చలన చిత్రాలు నిర్వహిస్తున్నాయి. ఒడ్డుకి ఉత్సాహంగా చేరిన కెరటం సముద్రంలో తిరిగి కల్సిపోతుంది. ఆ తర్వాత మరో కెరటం - జీవితం అంతే. జీవనంతో ముడిపడిన కళా అంతే.

కళలు రూపం మారేయి. తన సంసారం పరిస్థితి మారిపోయింది. పెద్దకొడుకుని, గంటకో ఊరు తిరిగే తను చక్కదిద్దలేక పోయాడు. దారి తప్పిన కొడుకు తనదారి వెతుక్కుంటూ ఇల్లు వదిలిపోయాడు. ఉన్న చిన్నాడు - నోట్లో నాలుక లేని వాడయ్యేడు. ఇన్నేళ్ళూ తనతో కష్టాల్ని, సుఖాల్ని, బరువును, బాధ్యతల్ని పంచుకున్న మనిషి భార్య మంచమెక్కింది.

తను అన్నివేషాలూ ధరించాడు. అందరి మెప్పూ పొందాడు. ఐతే నేం గృహస్తుగా తన వేషాన్ని సక్రమంగా నిర్వహించలేకపోయాడు. ఈ పుణ్యమూర్తికి భర్తగా, తను ఘోరంగా విఫలమయ్యాడు.

యాజి ఆలోచనలు భంగపరుస్తూ పార్వతమ్మ మంచం మీద మెల్లగా కదిలింది. ఆరాటంగా వంగి "ఏంకావాలి పార్వతీ?" మెల్లిగా అడిగేడు. యాజి, అతని మాటకి అతని మనసే మూలిగింది. 'జీవితం అంతా ఆమెకేం ఇవ్వగలిగేవు?ఇప్పుడివ్వటానికి' అంది మనసు.

ఆమె పెదవులు కదిలేయి. బలహీనంగా, పెదవుల మధ్య నుంచి మాట విడిరావటం లేదు. ఆమె స్థితి చూసి యాజి ఎండుటాకులా వణికిపోయాడు. కొంచెం కంగారు పడ్డాడు.

యాజి నరనరాల్లోంచి ఎగదన్నుకొచ్చింది దుఃఖం. మగతగా తననే చూస్తున్న పార్వతమ్మని చూడగానే చేతులు వణికేయి. ఏదో తరుముకొస్తున్నట్టు భయంతో వణికిపోయాడు. భార్య చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని.

"భయం లేదు పార్వతీ అబ్బాయి వెళ్ళేడుగా. డాక్టర్ని తెస్తాడు. వర్షం కదా! " వచ్చే మాటలు దారం తెగిన పువ్వుల్లా రాలి పడుతున్నాయి. ఆమె పెదవులు విరక్తిగా విచ్చుకున్నట్లు తోచింది యాజికి.

ఈ వర్షంలో డాక్టర్ రాడు. ఫీజివ్వలేని ఓ పగటి వేషగాడి ఇంటికి, ఈ వాతావరణంలో రాడు. ఇన్ని వేషాలు వేసిన తను అబద్ధం అందంగా చెప్పలేకపోతున్నాడు. భార్యను నమ్మించలేకపోతున్నాడు.

అందుకే ఆమె నిరాసక్తగా నవ్వింది.

యాజి తలొంచుకున్నాడు. గుండెల్లో మండుతున్న అగ్నిపర్వతం బయట పడేయాలి. ఇన్నేళ్ళ సహచర్యంలో అన్నీ పంచుకుందామె. తన ఆఖరి బాధను, ఆమెకి చెప్పాలి.

ఇదే ఆఖరి బాధనా? ఏమో? ఆమెకి చెప్పుకోవాలి. తలొంచుకుని, ఆలోచనలోంచి తేరుకుని తనకు తనే ఒప్పుకుంటున్నట్లు యాజి మెల్లిగా అన్నాడు.

"పార్వతీ నాతో ఇన్నేళ్ళ నీ జీవితాన్ని పంచుకున్నావు. నేను అసమర్ధుణ్ణి. నిన్ను ఏమీ సుఖపెట్టలేదు. నేను కీర్తికోసం సంప్రదాయం కోసం పరుగులెత్తి కళకోసం నిన్ను ముళ్ళబాటలో వదిలేశాను. నీకు కడుపుకి ఆకలి. మనసుకి వేదన మిగిల్చేను... "

యాజి మాటలు పూర్తికాలేదు. వణుకుతున్న ఆమె చేతులు యాజి పెదవుల కడ్డు పడ్డాయి. టక్కున తలెత్తాడు.

లోతుకు పోయిన ఆమె కళ్ళలో నిండుగా నీళ్ళున్నాయి. గుండెలు ఎగిసి పడుతున్నయి. చేతులు వణుకుతున్నాయి. కంటితో దగ్గరగా రమ్మన్నట్టు సైగచేసిందామె. కంటిలోపాప ఏదో అగాధాల్లోకి చేరిపోతున్నట్టు ఊగిసలాడుతోంది. గాలిలో దీపంలా ఊగుతోంది. ఆమె ఏదో చెప్పాలని ప్రయత్నిస్తోంది.

యాజి ఆమె మీదకి వంగాడు. ఆమె ఏదో అంటోంది. అతి బలహీనంగా పెదవులు కదిలాయి. పెదవుల కదిలిక యాజి చెవిని చేరింది. యాజి నిశ్చేష్టుడయ్యాడు. "ఏమిటి? ఏమిటి పార్వతి అనేది" - తను సరిగ్గా విన్నాడా? అనుమానంతో భార్యకేసి చూశాడు. ఆమె కన్నీళ్ళతో తల ఊపింది.

ఎక్కడో మెరపు మెరిసింది. యాజి మహావేదాంతిలా చావు బతుకుల మధ్య ఊగిసలాడుతున్న భార్య మంచం పక్కన కూర్చున్నాడు. చకచకా సగభాగం పరమేశ్వరుడవుతున్నాడు. సగభాగం గౌరీ దేవిగా రూపు దిద్దుకుంటున్నాడు. మనసులో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి.

ఇదా ఆమె కడపటి కోరిక? అర్ధనారీశ్వరుడుగా ఆంధ్రదేశమంతా తను తిరిగాడు. కానీ ఏ నాడు తన భార్య మనసులో తన వేషం మీద ఉన్న మక్కువ గ్రహించలేకపోయాడు. ఇన్నేళ్ళ సహచర్యంతో భార్య మనసులో కళల పట్ల ఇంతటి ఆదరణ ఉందని తమ గ్రహించలేక పోయేడు. తను చేసే వృత్తి మీద భార్యకింతటి మమకారం ఉందని ఊహించలేకపోయాడు.

ఇన్నేళ్ళుగా... ఆమె మనసులో దాచుకున్న కోరిక ఇదా? తనని అర్ధ నారీశ్వరుడుగా చూడాలనేది తన భార్య కడపటి కోరికా?

తన భార్య మనసులో ఏవుందో గ్రహించలేని తను అర్ధనారీశ్వరుని వేషానికి అర్హుడా? లేదు. తనెన్నడు కాలేడు.

వెలవెలబోయే రంగులు పూసుకోవడం మినహాయించి తను ఆదిశంకరుడు కాలేడు. భార్యకు సగం శరీరం, మనసు పంచి ఇచ్చిన పార్వతి పతి కాలేడు. అలంకరణ పూర్తి అయ్యింది. అర్ధనారీశ్వరుడు అవతరించేడు. ఆమూల చీకటి గదిలో పార్వతమ్మ చూపు నిలిపి చూస్తోంది. లోకంలో భార్యా భర్తల స్థానాన్ని రూపుదిద్ది చెప్పిన ఆదిదంపతులు అవతరించేరు.

శంఖం నోటికి ఆనించి ఊదేడు. ఆమె చేతులు జోడించింది. మెల్లిగా లేచింది.కంటి నిండుగా ఆ రూపాన్ని చూస్తోంది.చూస్తూనే తూలింది. ఒక్క ఉదుటున యాజి ఆమె దగ్గిరకు చేరి ఆమెను పొదివి పట్టుకున్నాడు, ఆ అర్ధనారీశ్వరుని గుండెమీద పార్వతమ్మ ఒదిగిపోయింది. అలాగే గౌరి రూపం మీద పార్వతమ్మ తలవాల్చేసింది. అలౌకికమైన స్థితిలో అరనిమిషం పాటు ఊగిసలాడిన యాజి తేరుకున్నాడు.

పార్వతి చేతులు, పాములా యాజి మెడను పట్టుకుని అలాగే ఉండిపోయాయి.

అన్నేళ్ళ సహస్రప్రయాణంలో ఆమె పొందిన ఆనందానికి సంకేతంగా ఆమె చేతులు అలా బిగుసుకునే ఉండిపోయాయి.

# పొరుగింటి మీనాక్షమ్మ - వసుంధర

**మార్చ్'77 జ్యోతి మాసపత్రిక**

**నేను మునిమాణిక్యంగారి** దాంపత్యోనిషత్తు చదవలేదు. ఎందుకంటే ఆ అవసరం నాకు కనిపించలేదు. భార్యవద్ద ఎలా మసలుకోవాలో నేను వివాహానికి ముందే నిర్ణయించేసుకున్నాను. వివాహానంతరం ఆ ప్రకారమే నడుచుకుని ఆమె మన్ననకు పాత్రుడనయ్యాను.

నేను నడుచుకున్న విధానమంటారా - ఆమెను ఒసేవ్ అనికాకుండా, పేరుతో పిలవడం; నేను సంపాదించేదంతా ఆమె చేతుల్లోనే పోసి - నా కష్టాలన్నీ ఏకరువు పెట్టుకోడం, ఆమెను నా నా అర్ధశరీరంగా భావించి - ఆఫీసుకూ, అభ్యంతర ప్రదేశాలకూ తప్ప మరెక్కడికెళ్ళినా కూడా తీసుకెళ్ళడం, ఆమెతో అవసరమున్నప్పుడు కోపంగా ఉండడమూ, అవసరం లేనప్పుడు అభిమానంగా మాట్లాడడమూ, ఆమె దగ్గర లేనప్పుడు విరహంతో పేజీలు నింపి పోస్టు చేయడం... ఇంకా చాలా ఉన్నాయి. ఇవన్నీ ఆమెకు నా మీద గౌరవాన్ని, అభిమానాన్నీ పెంచగా - నా జీవితం ఆమెద్వారా స్వర్గధామమైంది.

మేమిలా చిలకాగోరింకల్లా, చూడముచ్చటగా కాపురం చేస్తూంటే చాలామంది ఎదురుగా మెచ్చుకుని చాటుగా అసూయపడ్డారు. నా వల్ల కొంతమంది భర్తలు ఇరుకున పడ్డారు. నేనొక ఆదర్శపతిగా పేరుపొందాను. మాది ఆదర్శదాంపత్యంగా విలసిల్లుతోంది. అందుకు తగ్గట్లుగానే మాకు అమ్మాయీ, అబ్బాయీను.

ఇదిలావుండగా మా పొరుగింట్లో ఓ మీనాక్షమ్మగారు దిగింది. దిగిన వారం రోజులు బాగానే ఉంది కానీ అనంతరం మా కష్టాలు ప్రారంభమయ్యాయి.

నాకు తెలిసినంతవరకూ మీనాక్షమ్మగారి భర్త 'నల్లనివాడు పద్మనయనంబులవాడు, చల్లని చూపులవాడు' కాని మా ఆవిడకు ఆయన్ను గురించి అంతకంటే ఎక్కువ తెలిశాయి. కారణం - నాకు ఆయనతో పరిచయం. భర్తను గురించిన వివరాలు - భర్తకంటే కూడా ఆ భర్త - భార్యకు తెలుస్తాయి కదా!

మీనాక్షమ్మ గారి భర్త భార్యకు అర్ధశరీరం కాదుట. పూర్తి శరీరాన్ని ఇచ్చేశాడట. ఆవిడను అర్థాంగి అని కాక పూర్ణాంగి అని పిలుస్తాట్ట.

"ఆవిడ కాస్త లావు కదా మరి. అందుకనేమో." అని నేనంటే "మీరంతే అన్నింటికీ అలానే అంటారు. ఆయనకి భార్యే జీవన సర్వస్వమటండీ" అంది మా ఆవిడ. అలా అంటున్నప్పుడు శ్రీమతి కళ్ళల్లో మొదటిసారిగా కొంత అసంతృప్తి చూశాను.

ఆ అసంతృప్తి నన్ను బాధించింది. ఆదర్శపతిగా భాసిల్లుతున్నానన్న నా అహంకారాన్ని దెబ్బకొట్టింది.

"రేపట్నుంచే టానిక్కులిప్పిస్తాను. నువ్వు కూడా పూర్ణాంగివే అవుదువుకాని." అన్నాను. శ్రీమతి మూడు వంకరలు తిప్పింది.

మర్నాడు శ్రీమతి పేరంటానికి వెళ్ళింది. పిడుగులాంటి పిల్లవాణ్ణి నా మీద వదిలేసి పిల్లదాన్ని నడిపించుకుంటూ హాయిగా వెళ్ళిపోయింది. సాయంత్రం ఐదున్నరకు వెళ్ళిన మనిషి మళ్ళీ రాత్రి ఎనిమిది దాటిన తరువాత దర్శనమిచ్చింది. ఈలోగా మా పిడుగు నన్ను ముప్పతిప్పలూ పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించగా నేను ఆయాసంతో మంచం మీద పడిపోయి నిస్సహాయుడనై వాడు చేసే దారుణ నాశన కాండను తిలకిస్తూ ఊరుకున్నాను.

శ్రీమతిని చూస్తూనే నాలో మళ్ళీ ఎక్కడలేని బలమూ పుంజుకోగా ఒక్కసారి విరుచుకుపడిపోయాను. పేరంటానికని వెళ్ళి ఇంతసేపా అన్నాను. పిల్లడు ఇక్కడున్నాడన్న జ్ఞానముండక్కర్లేదా అన్నాను. ఇలా నోటికొచ్చినవి చాలా అని అసలు నీ బుద్దే ఇంత అని కొన్ని పాత ఉదాహరణలు కూడా ఇచ్చాను. ఇంకా అందును కానీ పిల్లాడ్ని ఆడించలేక నీరసమొచ్చింది. ముందు వంట కానీయమని కూడా అన్నాను.

నన్ను పూర్తిగా వాగనిచ్చి శ్రీమతి అంది.

"నీరసమొచ్చి మాట్లాడలేనంటున్నారు. కాబట్టి ముందా మాట మీద నిలబడి నేను చెప్పినవన్నీ మాట్లాడకుండా వినండి. పేరంటానికి వెళ్ళేటప్పుడు ఇద్దరు పిల్లల్ని తీసుకుని ఎలా వెళ్ళను? మీ పుత్రికారత్నం మూడ్‌ని బట్టి నడుస్తుంది. అది ఎత్తుకోమంటే ఎత్తుకు తీరవల్సిందే కదా! పేరంటానికి వెళ్ళకుండా ఉండాలి కానీ వెళ్ళాక తిరిగిరావడమన్నది నా చేతిలో ఉన్న విషయం కాదుకదా!. అప్పటికీ రెండుమూడుసార్లు అననే అన్నాను. - కుర్రాడితో ఆయనేం ఇబ్బంది పడుతున్నారో ఏమో అని. అంటే మీనాక్షమ్మగారు తెలుసుకదా మీకు. ఆవిడ నవ్వేసి మా వాడికంటే అల్లరి వాడు కాదుకదా మీవాడు. మా ఆయన మాత్రం భరించడంలేదా? అయినా నేను కూర్చోవడంలేదా అనేసింది. ఉన్న ఒక్క కొడుకునీ ఎంచక్కా ఇంటి దగ్గర వదిలేసి చేతులూపుకుంటూ పేరంటానికొచ్చిందావిడ - ఒక్కపిల్లే ఉన్నప్పుడు ఎప్పుడైనా పేరంటానికి ఒక్కత్తినీ వెళ్ళనిచ్చారా నన్ను. ఇద్దరు పిల్లలుంటే మీనాక్షమ్మగారి మొగుడయితే ఇద్దర్నీ ఇంటిదగ్గరే ఉంచేసుకునేవాడు." శ్రీమతి ఒక్కసారి గుక్క తిప్పుకుని మళ్ళీ మొదలెట్టింది. "చచ్చి ఎనిమిది గంటలకి తిరిగొస్తే, వంట చేయమని తొందర పెడుతున్నారు మీరు. మీనాక్షమ్మగారూ నేనూ పేరంటం నుంచి బయటకు వచ్చేశామా. నేను తిన్నగా ఇంటికొచ్చేసేను కానీ ఆవిడ ఇంకా పెత్తనాలు చేస్తోంది. ప్రస్తుతం ఆవిడ రమణిగారింట్లో ఉంది. ఎందుకంటే ఆవిడ మొగుడు పిల్లాణ్ణి చూసే బాధ్యతతో బాటు, వంటచేసే బాధ్యతను కూడా స్వీకరించాడట. ఆవిడ మరీ ఆలశ్యంగా వచ్చే మాటయితే తన వాటా తను తినేసి పడుకుంటానని కూడా అన్నాడట. ఎందుకూ మీరూ ఉన్నారు."

అన్నమాట మీద నిలబడి, అన్నం తినేవరకూ నేనేం మాట్లాడలేదు. కానీ నన్నో ఆశ్చర్యం బాధిస్తోంది. బాబిగాణ్ణి ఆడించేసరికి నీరసమొచ్చి సోలిపోయాను నేను. మీనాక్షమ్మగారి మొగుడు, తన కొడుకుని చూసుకుంటూ వంట ఎలా చేయగలిగాడు? బాగా ఆలోచించిన మీదట సమాధానం తట్టకపోలేదు కానీ, అన్నమాటకు కట్టుబడడం కోసం అన్నం తినేవరకూ ఆగవలసి వచ్చింది.

కూరా, అన్నం తిన్నాక నెమ్మదిగా అన్నాను. "మీనాక్షమ్మగారికి పెత్తనాలు అలవాటు గదా. సెలవురోజుల్లో కూడా ఆవిడ కొడుకు నొదిలేసి పెత్తనానికి వెడుతుందని నువ్వే ఒకసారి అన్నట్టు గుర్తు. అందువల్ల ఆవిడ భర్తకు కొడుకును చూసుకుంటూ పనులు చేసుకోవడమన్నది ఒక్కసారిగా నేర్చుకున్న విద్యకాక, క్రమంగా అలవడినదై ఉంటుంది. అందువల్ల రేపట్నించీ నువ్వు కూడా ఒక్కత్తివీ పెత్తనాలకు వెళ్ళు. నేను పిల్లల్ని చూసుకుంటాను. ఓ నెల్లాళ్ళలో వంట చేయలేకపోను."

"చాల్లెండి" అంది శ్రీమతి "పెత్తనాల మీద నాకు ఇంటరెస్టు లేదనీ, మిమ్మల్ని వదిలి రోజా వెళ్ళననేగదా మీ ధీమా. అయినా పెళ్ళాం మీద జాలి అనేది ఉండాలి కానీ, ఈ మాత్రం దానికి అభ్యాసం కావాలా. మీనాక్షమ్మగారు రాత్రి నిద్రపోతే మరి లేవదట. మధ్యలో కొడుక్కి పాలు పట్టించవలసిన బాధ్యత తండ్రిదేనట."

"మరి మనవాడికి పోతపాలు కాదుకదా, ఈ విషయంలో నేనెలా సహాయం చేసేదీ" అన్నాను.

"చెప్పేది వినకుండా ప్రతిదానికీ అలా విపరీతార్థాలు తీస్తారెందుకండీ" అంటూ విసుక్కుంది శ్రీమతి. "ఆవిడ ఉదయం లేచేసరికి ఆయన కాఫీ కలిపేసి తను త్రాగేసి ఆవిడ మటుకు ఫ్లాస్కులో పోసి ఉంచేస్తాడట. ఎందుకంటే భార్యా భర్తలిద్దరికీ లేవగానే కాఫీ కావాలి. ఎటొచ్చీ అయిదున్నరకే లేవడం ఆయనకలవాటు. ఏడుదాటితే కానీ ఆవిడకు మెలుకువరాదు. లేవగానే భర్త కలిపిన కాఫీ తాగాకనే ఆవిడ వరుసగా ఇంటి పనులన్నీ మొదలెడుతుందిట. అదృష్టం చూడండి, పెళ్ళయినా ఆవిడ తన పాత అలవాట్లను మానుకోనవసరం లేకపోయింది. నా సంగతి చూడండి, ముఖ్యంగా నిద్ర విషయంలో.."

"నిన్ను గురించి నాకు బాగా తెలిసింది వివాహమైన మొదటి రాత్రి నాడే గదా. ఆ అనుభవాన్నిబట్టి అట్టే నిద్రపోని మనిషివనుకున్నాను నేను" అన్నాను.

నా మాట అనుకున్న ఫలితాన్ని సాధించింది. "ఎప్పుడూ మీకు అదే దృష్టి -" అంటూ సిగ్గుపడింది శ్రీమతి.

ఈ విషయంలో మీనాక్షమ్మగారి ఉదహరణలేవీ ఇవ్వకపోవడం అప్పటికి నా అదృష్టం సంగతలాగుంచితే అప్పుడే నేను ప్రమాదాన్ని పసిగట్టవలసింది. కానీ అలా జరగలేదు. రెండు మూడురోజుల అనంతరం శ్రీమతి మరో వార్త మోసుకొచ్చింది. "ఇది విన్నారా?" అంటూ.

"ఆ ఇది ఏదో తెలిస్తే విన్నదీ లేనిదీ చెబుతాను" అన్నాను విసుగ్గా.

చెప్పింది శ్రీమతి. మీనాక్షమ్మగారి భర్త తనే స్వయంగా చాకలి పద్దు వేస్తాట్ట. ఎంత పకడ్బందీగా వేస్తాడంటే - తెల్లటి బట్టలకు కూడా పద్దులో ఏవో గుర్తులు పెట్టుకుంటాడట. ఆ కారణంగా ఆవిడ కాపురానికి వచ్చేక ఇంతవరకూ ఎన్నడూ ఒక జేబురుమాలు కూడా పద్దులో తేడా రాలేదట.

ఈ వార్త మా శ్రీమతి మోసుకురావడానికి కారణం లేకపోలేదు. నేను కొంచెం పరధ్యానం మనిషిని. ఏదో ఆలోచిస్తూ ఏదో పనిచేస్తూంటాను. అందువల్ల అనేక తప్పులు చేశాను నేను. చాలా తప్పులు శ్రీమతి క్షమించింది కానీ చాకలి పద్దు విషయంలో మాత్రం క్షమించలేదు. ఒకసారి నేను వేసిన చాకలిపద్దు ప్రకారం మా శ్రీమతివి రెండే రవికలు రావాలి. కానీ వాడు ఆరు తెచ్చాడు. ఆరూ తనవేనని మా శ్రీమతి బట్టలను చూసి గుర్తుపట్టింది. నా తప్పిదం వల్ల వాటిని స్వంతం చేసుకోడానికి శ్రీమతి చాకలితో కాసేపు వాదించవలసి వచ్చింది. మరోసారి పద్దు ప్రకారం నావి ఆరు బనీన్లు రావాలి కానీ వాడు మూడే వచ్చాయి. చాకలివాడు ఇంతే ఉన్నాయి మొర్రో అన్నాడు. వాడి గోలలో అర్థం లేకపోలేదు. నాకున్నవి అప్పటికి సరిగ్గా అయిదు బనీన్లు. ఒకటి తొడుక్కున్నాను. ఒకటి పెట్లో ఉంది. అంత ఖచ్చితంగా బనీన్ల లెక్క ఎలా తెలుసంటే - నెల్లాళ్ళ క్రితం ఎవడో ప్లాస్టిక్ వాడొస్తే - శ్రీమతి కళ్ళకి ఇంట్లో ఉన్న నా బనీన్లన్నీ పాతవిగా అయినాయి. తొడుక్కున్నది మిగలగా మిగతావన్నీ ప్లాస్టిక్ సామాన్లవాడి పరమయ్యాయి. (అప్పుడు దురదృష్టవశాత్తూ మా చాకలి ఊళ్ళో లేకపోవడం వల్ల మాసిన బట్టలన్నీ ఇంట్లోనే ఉన్నాయి) అందువల్ల ఆ రోజు సాయంత్రమే షాపుకి పరుగెత్తి ఓ నాలుగు బనీన్లు కొనుక్కోవలసి వచ్చింది.

ఇంతకీ నాకున్నవి అయిదే బనీన్లయినప్పుడు - పద్దులో ఆరెలాగుంటాయని చాకలివాడితో తర్కించి బట్టలు సరిగానే వచ్చినట్లు తేల్చాను. చాకలివాడు వెళ్ళిపోయాడు. శ్రీమతి నా తెలివితక్కువతనాన్ని ఏకేసింది. పద్దు సరిగా వేయకపోవడం ఒక తప్పయితే - చాకలాడి

ముందా విషయాన్నంగీకరించడం ఇంకా పెద్ద తప్పట. శ్రీమతి చెప్పిన మాటల్లో నిజం లేకపోలేదు. చాకలి నా పద్దుకు అతీతుడై బట్టలు తేవడం ప్రారంభించాడు ఫలితంగా గృహిణిగా తనకున్న బాధ్యతల్లో చాకలి పద్దును కూడా చేర్చుకోవలసి వచ్చింది శ్రీమతి.

ఈ మీనాక్షమ్మగారి మొగుడు అసాధ్యుడిలాగున్నాడు. భార్య మన్ననకు పాత్రుడైనవాడు నా దృష్టిలో అసాధ్యుడే అయితే అలా మన్ననకు పాత్రుడు కావడానికి అతను చేసే కృషి కూడా సామాన్యమైనది కాదు. అతన్ని గురించి ఆ రోజే కొద్దిగా ఆలోచించాను. నా ధర్మపత్ని స్థానాన్ని అతడాక్రమిస్తున్నట్లు నాకు తోచింది. అయితే నేనేం చేయాలి?

ఆ రోజుకి కొద్దిగా ఆలోచించినా ఆ విషయాన్ని నేనంత సీరియస్‌గా తీసుకోలేదు. కానీ క్రమంగా సీరియస్‌గా తీసుకోవలసిన అవసరం కనబడింది.

వారం రోజులు తిరక్కుండా మీనాక్షమ్మ మొగుడిలో ఉన్న అనేక సుగుణాల వివరాలు నా శ్రీమతి సంపాదించింది. అందుకోసం మా ఆమె పడ్డ కష్టమేమీ లేదు. మీనాక్షమ్మగారే స్వయంగా ఆమె చెవిన వేసింది.

మీనాక్షమ్మ మొగుడు వాసన చూసి కూరలు లేతవో, ముదురువో చెప్పగలడట. దేనికీ ఎన్నడూ కోపగించుకోవడమన్నది ఎరుగడట. ఈ ఓరిమి గుణం వల్లనో ఏమో అతడనేక విద్యల్లో ప్రావీణ్యం సంపాదించాడంట - వాటిల్లో వడ్రంగం కూడా ఉంది. దేవదారు పెట్టెల సహాయంతో అతడు చేసిన అలమారాను తలచుకున్నప్పుడల్లా శ్రీమతి పరవశించిపోతూంటుంది. అంతేకాదు - అతనుండే క్వార్టర్లో బాత్‌రూం తలుపులు పాడైపోతే - దేవదారు పెట్టె చెక్కలతో అతనొక తలుపును తాత్కాలిక ప్రయోజనార్థం తయారు చేశాడు. ఇంట్లో అన్ని తలుపుల్లోకీ అతను చేసిందే బాగుందిట.

"అవును మరి - గవర్నమెంటు క్వార్టర్సు కదా - తలుపులన్నీ నాసిరకంగానే ఉంటాయి" అన్నాను అమాయకంగా శ్రీమతి ఉద్దేశ్యాన్ని గ్రహించని వాడనై. నా అమాయకత్వానికామె అసూయ అని పేరు పెట్టేక అసలు విషయం అర్థమైంది.

"అసూయ నాకెందుకూ? నేనూ ఓ తలుపు తయారుచేస్తే - ఆ తలుపు ఆయన చేసిన తలుపుకంటే బాగుండకపోతే - అప్పుడు కలగాలి అసూయ -.." అని ఇంకా ఏదో అనబోతూండగా "చాల్లెండి, తలుపు చేయడం కూడాను -" అనేసింది శ్రీమతి.

నాక్కొంచెం ఉడుకుమోత్తనం రాగా "బాగుంది, ఎవరికొచ్చే విద్యలు వారి కొస్తాయి. పోనీ మీనాక్షమ్మగారి మొగుణ్ణో కథ రాయమను చూస్తాను" అన్నాను.

శ్రీమతి అనవసరంగా నవ్వింది. "ఏం చెప్పారండీ - కథలు రాయడం కూడా ఒక విద్యేనా? పనీపాటూ లేనివాళ్ళే కథలు రాస్తారు. రోజూ ఓ గంట మీరు పిల్లల్ని చూశారంటే వారం రోజుల్లో నవల రాయగలను నేను. అసలు కథలు రాయడం వల్లనే మీరీ స్థితికి వచ్చారు. ఎంతసేపూ ఎవరిని వేళాకోళం చేద్దామా అనే ఉంటుంది మీ దృష్టి. లేకపోతే మీరూ మీనాక్షమ్మగారి మొగుడిలాగే ఉండేవారు."

నాకు కోపం వచ్చింది. కానీ ప్రకటించలేదు.

మరో రెండు రోజుల్లోనే నేను మీనాక్షమ్మ మొగుణ్ణి చూసి అసూయపడవలసిన అవసరం నిజంగానే వచ్చింది.

మేము అన్ని తెలుగు మాస, వారపత్రికలూ కొంటూంటాం. కొన్న అన్నింటిలోంచీ కథలూ, సీరియల్సూ కట్ చేసి పుస్తకాలు కుడుతూంటాం. కటింగ్ శ్రీమతి వంతు. కుట్టడం నా వంతు.

అలా కుట్టబడిన పుస్తకమొకటి మా ఇంట్లోంచి మీనాక్షమ్మగారు తీసుకెళ్ళింది. తీసుకెళ్ళిన ఆ పుస్తకం అట్ట ఆవిడ పుత్రరత్నం చేతిలో పడి నలిగి చిరిగిపోయిందట. అందుకు మీనాక్షమ్మ మొగుడు చాలా నొచ్చుకుని - పుస్తకానికింకో అట్టవేసి మళ్ళీ కుట్టి బైండింగ్ చేశాడుట. కుట్టేటప్పుడు ఆయన నేను కుట్టిన కుట్టు చాలా బలహీనంగా ఉందనీ అదెంతో కాలం ఉండదనీ భార్యతో అన్నాడుట.

ఏది ఏమైనా మీనాక్షమ్మ మొగుడి శక్తి సామర్థ్యాలకు నిదర్శనంగా ఆ పుస్తకం ముందు నేను కుట్టిన పుస్తకాలన్నీ వెలవెలబోతున్నాయి. మరి అసూయపడక చావనా?

ఏమనాలో తెలియక వ్యక్తి దూషణకి దిగాను. అతని రంగు నలుపన్నాను.

"మీరేమైనా తెల్లని తెలుపా?" అంది శ్రీమతి.

అతన్నీ నన్నూ పోల్చడంలో నీ ఉద్దేశ్యమేమిటనన్నాను.

నేనెం పోల్చలేదు, మీరే పోల్చుకున్నారంది.

అయినా అంత చదువుకున్న వాడికివేం లేకి బుద్ధులు - అన్నాను. మగవాడు వంట చేయడాన్ని గర్హించాను. పెళ్ళాన్ని మరీ నెత్తి కెక్కించుకుంటే చాలా ప్రమాదమనీ - ఆ సంసారం హెచ్చిల్లదనీ ఉదాహరణలతో సహా చెప్పాను.

కానీ శ్రీమతి లాయరుగారమ్మాయి. నా పాయింట్లన్నీ ఆమె తర్కం ముందు వీగిపోయాయి. ఇంటిపనుల విషయంలో శ్రద్ధ వహించడం లేకితనమెలాగవుతుందని అడిగిందామె. సహజీవనాన్ని కోరే భార్యాభర్తల్లో అవసరాన్ని బట్టి ఎవరు వంట చేస్తేనే అందామె. ఆఖరున శ్రీమతి అన్నమాట నాకు పిడుగుపాటే. "మీనాక్షమ్మగారి మొగుడు పెళ్ళాన్నేం నెత్తికెక్కించుకోలేదు. ఆయన కాదన్న పని చేయడానికి ఆవిడ హడలి పోతుంది. ఎటొచ్చీ మగవాడుగా ఆయన వ్యవహార దక్షతను మాత్రమే మీకు తెలియచేశాను."

అప్పటికి నాకు బుద్ధి వచ్చింది. అసూయ నన్నెంతకు దిగజార్చిందో అర్థమయింది. వ్యక్తి దూషణ అల్పులు చేయవలసిన పని. అయినా తనకు తానై మీనాక్షమ్మ మొగుడు నాకు చేసిన అపకారమేమీలేదు. పైగా పాపం నేను కనబడ్డప్పుడల్లా ఆప్యాయత ఒలకబోస్తూ నవ్వుతూంటాడు ఆఫీసులో.

కానీ ఎంత నిగ్రహించుకుందామన్నా నా వల్ల కావడంలేదు. మీనాక్షమ్మ మొగుణ్ణి చూసినప్పుడల్లా నా ఒళ్ళు కంపరమెత్తిపోతోంది. ఆఫీసులో సాధ్యమైనంత వరకూ అతన్ని తప్పించుకుని తిరుగుతున్నాను. కనబడ్డప్పుడు తప్పనిసరి అయితే తప్ప నవ్వడం మానేశాను. నాలోని ఈ మార్పు కొట్టొచ్చినట్లు కనపడకుండా ఉండటానికి తగినంత జాగ్రత్త తీసుకున్నాను. ఎంత లేదన్నా ఎంతో కొంత సంస్కారమేడిసింది కదా మరి.

నా సంగతి ఇలా ఉండగా నా శ్రీమతికతన్ని గురించి ఇంకా ఇంకా వివరాలు లభించేస్తున్నాయి. అతగాడు చేసే పనులన్నీ కూడా నాకు అసాధ్యమైనవి. నేర్చుకుందామన్నా కుతూహలం లేనివి.

ఆడవాళ్ళు కొంతమంది కలిసి ఒకరోజు సినిమా ప్రోగ్రాం పెట్టుకున్న రోజున మీనాక్షమ్మ టైము చూసుకోకుండా జంతికలు వేయడానికి సిద్ధపడింది. తీరా మొదలెట్టబోయే సరికి టైమయిపోయిందని తెలిసింది. అప్పుడు మొగుడావిడ కభయహస్తాన్నిచ్చి ఆవిణ్ణి పంపించేసి తను జంతికలు వేసేశాడు. ఈవార్త నన్ను నిశ్చేష్టుణ్ణి చేసింది. మగవాడికి జంతికలు వేయడమన్నది సామాన్యమైన విషయం కాదు. ఒక వంక గొట్టాలని నొక్కుతూ, మరోవంక గొట్టం మొత్తాన్ని తిప్పుతూ చక్కని ఆకారంలో జంతికలు వేయాలి. తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుడి చుట్టూ తిరిగే భూమి ప్రజ్ఞకు ఇదేమీ తీసిపోదు.

మొట్టమొదటిసారిగా ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ ఫీలయ్యాను నేను. అప్పుడే నన్ను మరో విషయం బాధించింది. నా భార్య దృష్టిలో నేను అల్పుణ్ణి. మీనాక్షమ్మ మొగుడు అధికుడు. వచ్చే జన్మలో తనకలాంటి మొగుడు రావాలని అంతరాంతరాల్లో ఆమె కోరుకుంటున్నదేమో - ఒక భారతీయుడిగా ఈ విషయాన్ని నేను ఆమోదించలేను.

అదీగాక నా భార్య దృష్టిలో నా స్థానం పెరగాలి అందుకోసమని నేను నన్ను మీనాక్షమ్మ మొగుడితో పోల్చుకోవడం ప్రారంభించాను.

మరీ పొడగరి కాకపోయినా మీనాక్షమ్మ మొగుడు నాకంటే పొడుగే. అతగాడు మీసాలను అందంగా కట్ చేసుకుంటాడు. భౌతికంగా అతనిలో కనిపించే ప్రత్యేకతలు ఇవేనని గుర్తించాను నేను. అయితే పాతికేళ్ళు దాటిపోయేక పొడుగు అవడం కష్టంగదా - ఆ మార్పు నేను సాధించలేనిది. మీసాలుంచుకోవడం నాకు బోరు. మీసాలు లేకపోవడం వల్లనే నా షేవింగుకు పది నిమిషాలు కూడా పట్టదు. మీసాలు పెంచడం మొదలు పెట్టి ఆ సౌఖ్యాన్ని కాలదన్న దల్చుకోలేదు నేను.

అయితే ఏం చేయాలి?

వెంటనే సమాధానం తోచలేదు. కానీ ఏదో చేసి తీరాలని మాత్రం గ్రహించాను. ఎందుకంటే శ్రీమతిలో ఇటీవల నా పట్ల దారుణంగా అసంతృప్తి పెరిగిపోయింది. ఏ విషయానికీ నన్నూ నా సమస్యలను అర్థం చేసుకోవడం మానేసింది. ప్రతిదానికీ మీనాక్షమ్మ మొగుడయితేనా అంటూంటుంది. అన్నింటికంటే నన్ను బాధించేది ఈ పోలికే!

చిట్టచివరకు నాకు ఒకే ఒక ఉపాయం కనిపించింది. అదేమిటంటే మీనాక్షమ్మ మొగుడి దగ్గరకు స్వయంగా వెళ్ళి గీతోపదేశాన్ని పొందడం. ముఖ్యంగా ఆయన ఎప్పుడు ఏ పరిస్థితుల్లో వంట, వడ్రంగం నేర్చుకున్నాడో తెలుసుకోవాలి. వాటిలో ప్రావీణ్యత సంపాదించే అవకాశం నాకున్నదో లేదో తెలుసుకోవాలి.

ఆడవాళ్ళ మనస్తత్వం గురించి నాకింకా బాగా అర్థం కాలేదనీ, అవే నా కష్టాలకు అసలు కారణమనీ అప్పటికి నాకింకా అర్థంకాలేదు. ఆ విధంగా చూస్తే మీనాక్షమ్మ మొగుడి దగ్గర నేను గీతోపదేశం పొందాననే చెప్పాలి.

ఒకరోజు సాయంత్రం ఆడవాళ్ళందరూ లేడీస్ క్లబ్‌లో సమావేశమైన సందర్భంలో నేను నా పుత్రరత్నాన్ని ఎత్తుకుని మీనాక్షమ్మ ఇంటికి బయలుదేరాను. నేను వెళ్ళేసరికి మీనాక్షమ్మ మొగుడూ చంకలో పిల్లాడినెత్తుకుని ఇంటి తలుపు తాళం వేస్తున్నాడు. అరే ఒక్క నిమిషమాలశ్యమైతే ఎంత ప్రమాదమయ్యేది - అనుకుంటూ పలకరించానతన్ని.

నన్ను చూస్తూనే అతని ముఖం వికసించింది. అతను మళ్ళీ తాళం తీసి "రండి రండి. నేను బయల్దేరుతున్నది మీ ఇంటికే, మీరే వచ్చేశారు" అన్నాడు.

ఆశ్చర్యపోతూ నేను లోపల అడుగుపెట్టి "మా ఇంటికే బయల్దేరారా - ఏమిటి విశేషం?" అనడిగాను.

"కూర్చోండి చెబుతాను. మీతో చాలా మాట్లాడాలి -"

ఇద్దరం కూర్చున్నాము. మా కుర్రాళ్ళిద్దరూ ఆటల్లో పడ్డారు.

"మిమ్మల్ని నేను చాలా విషయాలడిగి తెలుసుకోవాలనుకుంటున్నాను. కానీ ముందుగా ఇది చెప్పండి. మీరు కథలు ఎలా రాస్తారు? నేను కథలు రాయడం మొదలు పెట్టాలంటే ఏం చేయాలి?"

ఇదీ మీనాక్షమ్మ మొగుడి ప్రశ్న!

కాబట్టి - పొరుగింటి మీనాక్షమ్మల వల్ల బాధపడే భర్తలూ - మీనాక్షమ్మ అంటూ పొరుగున ఉండాలేకానీ మీ శ్రీమతి ఆ మీనాక్షమ్మకు ఏమీ తీసిపోదన్న నిజాన్ని గ్రహించండి. మీ శ్రీమతి చేసే పరపురుష స్తోత్రానికి కారణం ఆమెకు మీ పట్ల గల అసంతృప్తి కాదనీ అది మగువల మనస్తత్వమనీ గ్రహించండి. అందుకు విరుగుడు కావలంటే మీరూ ఓ పక్కింటి పంకజాక్షిని ఎన్నుకుని స్తోత్రం ప్రారంభించండి. ఈ విరుగుడు తప్పక పనిచేస్తుందని అనుభవం మీద చెబుతున్నాను.

# నీడ వెనుక నిజం - జలంధర

**వనిత - జనవరి 1990**

**సుధాకర్ కెమెరా కొన్నాడు.** ఆ విషయం దాచడానికి అతడేమీ ప్రయత్నించలేదు. పైగా వీలైనంతగా ఎదుటివారికి తెలియపర్చాలనే ప్రయత్నంలోనే ఉన్నాడు. బొంబాయి మహానగరం నుంచి దాదాపు ఆరడుగుల సమున్నత విగ్రహం, అందమైన వర్చస్సు, ఉంగరాల జుట్టు, చిలిపి కళ్ళు కల సుధాకర్ తన రంగుకు మాచ్ అయ్యేట్లు వేసుకున్న నీలం రంగు స్వెట్టర్, కూలింగ్ గ్లాసెస్, ఎయిర్ బాగ్‌తో పాటు పెట్టెలో ఖాళీ ఉన్నా అందరికీ తెలియజెప్పే ఉద్దేశ్యంతోనే కెమెరా మరో భుజానికి తగిలించుకుని, వీలైనంతమందికి దార్లో దాని గుణగణాలు తెలియచెప్పి, సిరిపురంలాంటి చిన్న ఊర్లో దిగాడు. మొనాటనీతో విసిగిపోయిన అతని పాతికేళ్ళ వయస్సు, ఆకుపచ్చ చీరకట్టుకున్న అందగత్తెలాంటి ఆ ఊరిలో పాదం మోపగానే ఏదో తెలియని అడ్వంచర్ కోసరం ఉరకలు వేసింది.

"ఇన్ని వేలుపోసి ఇప్పుడిది కొనకపోతే ఏమిటిరా?" మెల్లగా మందలించే అక్కగారి మాటలకు సమాధానం వెంటనే చెప్పలేదతను. చింతగింజ మునగని చిక్కటి కాఫీ తాగుతూ, తనకు చిన్నప్పటినుంచీ ఉన్న కెమెరా ఫోటోగ్రఫీ పిచ్చి గురించి మరోసారి చెప్పాడు అతను. సంపాదనపరుడు, స్వతంత్రుడు అయిన తమ్ముణ్ణి మరేమీ అనలేక -

"మా ఫోటోలు తీయరా! నాదీ బావగారిదీ కలిపి ఒక్కటి కూడా లేదు" అంది అక్క.

"తప్పకుండా అక్కయ్యా!" అని అక్కకు, అలా అడిగిన చాలామందికి ప్రామిస్‌లు చేసేశాడు సుధాకర్.

"నీ ఫోటోలు తీద్దామనే తెచ్చాను కెమెరా!" అని అతనన్నప్పుడు ఎంకిలాంటి మావయ్య కూతురు అనురాధ అంతంత కళ్ళేసుకుని 'అలాగా బావా' అనలేదు. హాయిగా నవ్వేసింది. నీరెండలో తళుక్కుమన్న ఆ నవ్వు, మెరిసిన ఎర్రరాయి ముక్కు పుడక అతణ్ణి ముగ్ధుణ్ణి చేశాయి. "ఎలాగైనా ఈ అందం వేరు" అనుకున్నాడు బొంబాయిలో నీతా మెహతా గుర్తుకు వచ్చి. బిగించి వేసిన కుప్పెలు పెట్టిన జడలో, వాడిన కనకాంబరాలు, ఏమాత్రం మాచింగ్ లేకుండా కట్టుకున్న లేత ఆకుపచ్చ పూల పరికిణీ, నీలం రంగు ఓణీ, ఎర్రరంగు జాకెట్టు, ఛామనఛాయ ఇచ్చిన మరింత కళతో, నూతి దగ్గరనుంచి నీళ్ళు తీసుకువస్తున్న అనూను అలాగే ఫోటో తీశాడు. అలా అందంగా కనిపించిన ప్రతి మనిషినీ, దృశ్యాన్నీ ఫోటో తీస్తూ తను ప్రతి ఏడూ చూసే ఈ ఊరిలో ఇన్ని అందాలున్నాయని కెమెరా పట్టుకుంటేనే కానీ అర్థం కాలేదే అనుకున్నాడు.

పాలు తీసే పల్లెపడుచులు, రంగుల రంగవల్లుల మధ్య బంతిపూల గొబ్బెమ్మలు, తాటాకులతో కట్టిన దేముడి రథం, అన్నీ అందంగానే కనిపించాయి అతనికి. జీవితంలో అస్తమయానికి వచ్చి, సహం నెరిసిన జుట్టుతో అలంకరించుకుని తిరిగే మునసబుగారి భార్య "నా ఫోటోలు తీయవు బాబూ!" అని వయ్యారంగా అడిగేటప్పటికి మతిపోయి చూశాడు అతన్ను. "తప్పదు, మునసబుగారి భార్య" అన్నట్లు అక్క చేసిన సౌజ్ఞ చూసి "హతవిధీ" అనుకున్నాడు సుధాకర్. సాయం సంధ్యలో నిర్మానుష్యంగా ఉన్నదారిలో, దేముడి ధ్వజస్థంభం దగ్గర నిలబడి, ఏం చేద్దామా అని నాలుక వేలాడేసి చూస్తున్న ఊరకుక్క పెద్ద వేదాంతిలా అనిపించింది అతని

కళాహృదయానికి. 'ఇలాంటి దృశ్యాలకే ఫోటోగ్రఫీ ప్రైజ్ వచ్చేది' అని నూటొక్కసారి అనుకుని కెమెరా క్లిక్‌మనిపించబోయాడు. కుక్క కళ్ళలో సుధాకర్‌కు కనపడ్డ వేదాంతం తారుమారై అది మీదకొచ్చి పడేటప్పటికి ఒక్క పరుగుతో రోడ్డు ఎక్కాడు. దారిలో పైట చెంగులు అడ్డం పెట్టుకుని నవ్వుతున్న ఆడపిల్లల్ని కూడా లెక్కచెయ్యకుండా ఒక్క ఉరుకులో ఇంటికి వచ్చిపడి, "డామ్ ఇన్సల్ట్" అని ఉడుక్కున్నాడు. కొబ్బరి చెట్ల చాటున సూర్యాస్తమయం దగ్గర నుంచి చిన్నారి పాపల బోసి నవ్వుల వరకూ అన్నీ ఫోటోలు తీశాడతను. ఖరీదైన కలర్ ఫిలిం ఉన్న కెమెరాను పక్కపట్నానికి తీసుకువెళ్ళి మరోసారి లోడ్ చేసుకు వచ్చాడు సుధాకర్. ఫోటోలు తీసే మోజులో అతనికి దానికయ్యే ఖరీదు జ్ఞాపకం రాలేదు.

సుధాకర్ అడిగి తీసిన ఆడపిల్లల ఫోటోలు చాలా ఉన్నాయి కానీ, అతన్ని అడక్కుండా అతని చేత ఫోటోలు తీయించుకోవాలని అలంకరించుకుని, అవతల మేడమీద గుడ్డలారేసే నెపంతోనో, ఒడియాలు తీసే నెపంతోనో వచ్చి చూపుల బాణాలు విసిరే కరణంగారి కొత్తకోడలులాంటి వారిని చూస్తే చాలా నవ్వొచ్చేది సుధాకర్‌కు. అతను కెమెరా తీసుకుని ఎదురుపడితే చాలు, వీలైనంత అందమైన భంగిమలో అతనికి కనబడాలనే ప్రయత్నించేవాళ్ళను చూసి.

"ఈ ఆడవాళ్ళూ.." అనుకునేవాడు సుధాకర్.

"బావా! ఇవ్వాళ ఒంట్లో బాగోలేదు. రేపు చూద్దాం" అని ఇంకా ఏమిటేమిటో రాసి పంపింది అనూ ఈ రోజు పాలేరుచేత. కెమెరా లోడ్ చేసుకుని అనూ వాళ్ళ మామిడితోటలో రకరకాల ఫోటోలు తీయాలనుకున్న సుధాకర్‌కు "బాబూ నన్ను కూడా.. ఏదీ.. ఇవాళ" అంటున్న పాలేరు మాట వినపడగానే "ఛా ఫో వెధవా!" అని తిట్టి పంపించేశాడు. ఆ రోజు ఎక్కడికీ వెళ్ళాలనిపించలేదు సుధాకర్‌కు. ఇంట్లో వాళ్ళంతా బయటకు వెళ్ళడం వల్ల అంతగా అలికిడిలేదు డబ్బాలోనుంచి చేగోడీలు తెచ్చి నములుతూ కెమెరా వంక చూస్తూ పడక్కుర్చీలో జారగిలబడ్డాడు అతను.

"ఏమండీ!" ఏదో బొంగురు గొంతు వినబడి ఉలిక్కిపడి చూశాడు వాకిలికి కట్టిన రంగు రంగుల గాజు గొట్టాలు, పూసలతో అల్లిన తెర అల్లల్లాడింది. వాటి సందునుంచి తొంగిచూస్తున్నారు. ఎవరో?

"ఎవరది? "

"నేనండి శ్యామలను. నా ఫోటో తీస్తారేమోనని అడుగుదామని వచ్చాను." గొంతుకను విని ఉలిక్కిపడ్డాడు సుధాకర్ నల్లటి ఛాయ, బక్కచిక్కిన శరీరం, లోతు బుగ్గలు మెల్లకన్ను, బిగించి కట్టిన ఉంగరాల జుట్టు కరణంగారి అమ్మాయి శ్యామల. "ఖర్మరా బాబు" అనుకున్నాడు సుధాకర్. ఎలాంటి ఎలాంటివాళ్ళో ఫోటోలు తీయించుకుందామనుకుంటారుగానీ, ఇలాంటి పిల్ల కూడా ఫోటో తీయించుకుంటుందని అతని ఊహకు తట్టలేదు.

"మాట్లాడరేమండి. నేను ఫోటోకు బావుండననేగా! అందరూ అందంగా ఉంటారా ఏమిటీ? నాకెన్నాళ్ళ నుంచో ఫోటో తీయించుకోవాలని ఉంది. నీ ముఖానికి అదొక్కటే తక్కువ, అంటుంది మా అమ్మ. ఏమండీ. నేను బావుండనా!" వెలిసిపోయిన వాయిలు ఓణీ వేలుకు మెలిపెడుతూ, మెల్ల కన్నుతోనూ, భయంకరమైన గొంతుతోనూ మాట్లాడే ఆ అమ్మాయిని చూసి దడుసుకున్నంతపనైంది అతనికి.

"అబ్బే.. అదేం లేదు. తప్పకుండా తీస్తాను" అన్నాడు తడబడుతూ.

"ఎప్పుడూ తీస్తారూ?" అంది గొంతు సాగదీస్తూ

"ఎప్పుడేమిటీ? ఎప్పుడైనా తీద్దాం. రేపు లేకపోతే" ఎవరైనా తనను చూస్తారేమో, నవ్వుతారేమోననిపించి అని తత్తరపడ్డాడు.

"అయితే ఎల్లుండి తీయండి. సాయంత్రం వస్తానేం. ఎల్లుండి మంచి రోజు ఏం?" అంటున్న ఆ అమ్మాయిని చూసి నవ్వాలో ఏడవాలో అర్థంకాలేదు అతనికి.

"అలాగే.. అలాగే" అంటుండగా వాళ్ళక్క లోపలికి వచ్చింది హమ్మయ్య అనుకున్నాడు.

"ఏమిటీ శ్యామలా, ఇలా వచ్చావు?" అంది నవ్వుతూ, ఆ పిల్లను చూడగానే ఎవరికైనా నవ్వూ, వేళాకోళం, విసుగూ అన్నీ.

"లేదు పిన్నిగారూ! మీ సుధాకర్ ఫోటో తీస్తాడేమోనని ఆపకుండా మాట్లాడుతోంది శ్యామల. అక్కడినుంచి మెల్లిగా దాటుకున్నాడు సుధాకర్.

"ఏమిటక్కయ్యా! ఆ అమ్మాయి.." భోజనాల దగ్గర కదలించాడు మెల్లిగా ఎందుకో ఎంత మర్చిపోదామన్నా ఆ అమ్మాయే గుర్తుకు వస్తోందతనికి.

"ఆఁ - ముది వయసులోపుట్టిన పిల్లరా ఎదుగూలేదు, బొదుగూ లేదు. పైగా అనాకారి తను. పోనీ కాస్త శుభ్రంగా అన్నా ఉంటుందా అంటే ఆ తల్లికే లేదు శ్రద్ధ. వచ్చిన కొత్త కోడల్ని చూసి మురిసిపోవడంతోనే సరిపోతోంది, సాయంత్రం అయ్యేసరికి తట్టెడు మల్లెపూలు ఇంటిల్లపాదీ పెట్టుకుంటారు. ఆ పిల్లకు తలన్నా దువ్వరు, 'పోనీ, ఏ టానిక్కన్నా ఇవ్వరాదా వదినా' అని చెప్పానురా! శ్రద్దే డుస్తేనా? ఆస్తి ఉంటే చాలనుకుంటున్నారు. కాస్త అందమన్నా ఇవ్వకూడదా భగవంతుడు. అబ్బే.. పగలు చూస్తే రాత్రి కల్లోకి వచ్చేటట్లుంటుంది. ఏం రాత రాసుందో ఆ పిల్లకు.." పులుసు వడ్డిస్తూ అక్క చెప్పిన విషయాలకు జాలేసింది సుధాకర్‌కు.

"ఇంతకూ నీ దగ్గరకెందుకు వచ్చింది మామయ్యా!" పిల్లలు అడిగిన ప్రశ్నకు 'ఫోటో కోసమ్రా' అని సమాధానమిచ్చాడు. ఫకాల్న నవ్వారు పిల్లలు.

"ఆ! దాని ముఖానికి ఫోటో ఒకటి తక్కువ" అంది కంచాలెత్తుతూ అక్కయ్య.

"అయితే బావా శ్యామల నిన్ను ఫోటో అడిగిందా?" మర్నాడు మామిడితోటలో నవ్వాపుకుంటూ అడిగింది అనూ. ఆమె వెనకాల ఉన్న మిత్రబృందం ఆశ్చర్యంగా చూశారు. అంతమంది ఆడపిల్లలు తనను అలా చూసేటప్పటికి రెచ్చిపోయి నిన్నటి దృశ్యాన్ని చిలవలు, పలవలు కలిపించి చెప్పి, వాళ్ళను నవ్వించాడు సుధాకర్. ఇంక ఆ మర్నాడు శ్యామలను ప్రత్యేకంగా పిలిపించి, కూర్చోబెట్టి, అతి అమాయకత్వం నటిస్తూ, "మా బావ నిన్ను ఫోటో తీస్తానన్నాడటగా" అంటూ ప్రారంభించి, చాలాసేపు శ్యామలను వాగించి, వాగించి ఆనందించారు అనురాధ, ఆమె స్నేహితురాళ్ళు.

అదే రోజు సాయంత్రం లేతాకు పచ్చని పట్టుపరికిణీతో సోగకళ్ళతో సంపెంగదండలాంటి అనూ దూసుకు వచ్చింది తోటలోకి.

"బాబోయ్! నీకో విషయం తెలుసా? నీకొక ఆరాధకురాలుంది ఈ ఊళ్ళో." ఫకాల్న నవ్వుతూ అంది.

ఎవరబ్బా! ఆలోచిస్తూ మెల్లగా, "నువ్వా" అన్నట్లు కొంటెగా చూశాడు సుధాకర్.

"ఆశ పాపం.. నిన్నెవరు నమ్మార్లే.. నవ్వులాట కాదు నిజంగా."

"నీ ముఖం"

"నిజం.. ఎవరో తెలుసా? ఊర్వశి శ్యామల"

ఉలిక్కిపడ్డట్టు నటించాడు సుధాకర్, "పాపం శమించుగాక" అని చెవులు మూసుకున్నాడు.

"నిజం. మేము నిన్ను గురించి బాగా ఉన్నవీ, లేనివీ నమ్మేటట్లు చెప్పేశాం. పిచ్చిది కదా నిజం అనుకుంది. ఇంక చూడు, రోజూ నువ్వు తననే చూస్తున్నావట. పొద్దున్న ముఖం కడుక్కునే సాకుతో మేడమీదకు వస్తావట. అసలు నువ్వే 'ఫోటో తీస్తాను శ్యామలా' అని అడిగావట. నిజమా బావా?" చక్రాల్లా కళ్ళు తిప్పుతూ అమాయకత్వం నటిస్తూ అడిగింది శ్యామల.

"ఛా! నోర్ముయ్యి. అసలు ఆ అమ్మాయితో నేను.."

"నాకు తెలుసులే బావా ఏడిపించడానికి అన్నాను. విను మరి. ఇంకా చాలా చెప్పింది. విని విని మన పూజారిగారి రాధకు ఒళ్ళుమండి 'నువ్వేం పెద్ద ఊర్వశిననుకుంటున్నావా? జరిగింది మాకు తెలియదా ఏమిటి? మొన్న ఆయనే చెప్పాడులే' అని నువ్వు మొన్న ఆ అమ్మాయి ఫోటో తియ్యమని అడిగిన ఫార్సంతా చెప్పావే - అదంతా నీ భాషలోనే వర్ణించింది. ఇంక చూడు. దాని నల్లటి ముఖం మరీ మాడిపోయింది. పారిపోయిందనుకో" ఇంకా ఏదో చెపుతోంది అనూ.

ఎందుకో సుధాకర్ మనస్సు కలుక్కుమంది. పాపం, ఏమనుకుందో అమాయకురాలు అనిపించింది. అందవికారమైన ఆడపిల్ల తన 'గొప్ప' ఉందని తృప్తి పరచుకోడానికి ఊహించుకున్న తీయని ఊహలన్నీ నిజాలుగా బైటకు చెప్పిందనే విషయం తెలియకపోయినా ఎందుకో జాలేసిందతనికి.

"అయినా, ఆ పిల్లకెన్నేళ్ళుంటాయి అనూ. నాలుగడుగులు కూడా ఉండదు" అన్నాడతను.

"ఎన్నేళ్ళేమిటి బావా! నా వయసే పద్దెనిమిది. నేను కార్తీకంలో పుట్టాను. అది పుష్యమాసంలో పుట్టింది. అయినా బావా, నువ్వు మేడెందుకు ఎక్కుతున్నావో నాకు తెలియకనా? కరణంగారి కొత్తకోడల్ని చూట్టానికేగా?" అంది నవ్వుతూ.

"ఏయ్ అనూ తంతాను. వాళ్ళ మావ విన్నాడంటే మక్కెలిరగగొడతాడు మనని" అన్నాడు చెయ్యెత్తుతూ.

నాలుకతో ఎక్కిరించి గోరింటాకు చేతులతో టాటా చెప్పేసి, అందకుండా దూసుకుపోయింది అనూ.

మర్నాడు మధ్యాహ్నం నిన్న సాయంత్రం మరచిపోయిన నవల కోసరం భోజనం చేసి మేడెక్కాడు సుధాకర్. ఎర్రని ఎండలో నోరూరించేటట్లున్న వడియాలు తీసుకుని రెండు నోట్లో వేసుకుని వెనక్కి తిరగబోయి ఆగిపోయాడు సుధాకర్. అవతల మేడమీద ఎర్రటి ఎండలో గోడకానుకుని కూర్చుని మోకాళ్ళలో తలదాచుకుని ఏడుస్తోంది శ్యామల. ఆశ్చర్యపోయి ఇవతలి గోడకానుకుని "శ్యామలా" అని పిలిచాడు తనను తాను మర్చిపోయి.

తలెత్తి చూసింది. ఎంతసేపటినుండి ఏడుస్తుందో కళ్ళు - ఎర్రబడి వాచి ఉన్నాయి.

"మీరా? పోండి. నాతో మాట్లాడకండి" అంది బెక్కుతూ చేతుల్లో ముఖం దాచుకుంటూ.

"ఏం? ఎందుకని? ఏమైంది?" మెల్లిగా అడిగాడు. అతనికి తెలియకుండానే అతని గొంతు మృదువుగా మారిపోయింది.

మరి కాసేపు బ్రతిమాలించుకుని అసలు విషయం చెప్పింది శ్యామల.

"మీరు నన్ను గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడారట కదా నిన్న అనూ, దాని స్నేహితురాళ్ళు నన్ను గుళ్ళో ఎలా ఏడిపించారో తెలుసా? నేను ఫోటో తీయించుకుంటానని దానికెందుకు చెప్పారు? ఇష్టం లేకపోతే అప్పుడే చెప్పాల్సింది. అందరికీ తెల్సిపోయి నన్ను ఏడిపిస్తున్నారు. మా అమ్మ 'సిగ్గులేనిదానా? నీ ముఖానికి ఫోటో ఒకటే తక్కువ. సిగ్గూ ఎగ్గూ లేకుండా పరాయి మొగాడ్ని అడుగుతావా?' అని కొట్టింది. ఏమండీ! నేను ఫోటోకు అంత పనికిరానిదాన్నా?" బెక్కుతూ చేత్తో కళ్ళు నులుపుకుంటూ అడుగుతున్న ఆ పిల్లను చూడగానే అతనికి ఆ అమ్మాయి అందవికారం కాని, బొంగురు గొంతుకానీ వినిపించలేదు, కనిపించలేదు. గుండె తరుక్కుపోయినట్లనిపించింది. వెంటనే తనను తాను మర్చిపోయి -

"ఛీ! ఛీ అదేం లేదు శ్యామలా! ఎవరన్నారు అలా? అదంతా అబద్ధం. ఇంకా నువ్వు ఇవ్వాళ ఫోటో తీయించుకుంటానికి రెడీ అవుతావనుకుంటున్నాను. వాళ్ళ ముఖం. వాళ్ళ మాటలేమిటి? రేపు నీ ఫోటో చూడు. ఎంత బావుంటుందో" అన్నాడు.

నమ్మనట్లు తలెత్తి చూసింది శ్యామల, "నిజం.. అబద్ధం కాదు.. సాయంత్రం మరి రెడీగా ఉంటావా? ఫో ముఖం కడుక్కో. అన్నం తినలేదు కదూ. పిచ్చి పిల్లా..వెళ్ళు" అన్నాడు.

మెల్లిగా లేచి పరికిణీతో ముఖం తుడుచుకుని, వెనక్కు తిరిగి చూసుకుంటూ వెళ్ళిపోయింది శ్యామల. ఆమె వెళ్ళిన అయిదు నిమిషాలకు కానీ, తను చేసిన పనేమిటో అర్థం కాలేదు అతనికి. "ఇదెక్కడి కొత్త జంజాటం పెట్టుకున్నానురా దేముడా!" అనుకుంటూ కిందికి వెళ్ళాడతను.

"ఏమండోయ్" సాయంత్రం పడకగది కిటికీ దగ్గర నుంచి శ్యామల గొంతు వినబడి ఉలిక్కిపడి నిద్రలేచాడు.

"నేనేనండీ. మా ఇంట్లో అందరూ పన్లలో ఉన్నారు. మీ అక్కా వాళ్ళు మామయ్యగారింటి కెళ్ళారు. మరి నేను తయారవ్వనా? ఫోటో తీస్తారా?" ఆ గొంతులో ఆశ, ఆ వికృతమైన ఆకారం రెండూ చూసి ఏం మాట్లాడలేక 'ఊఁ' అని, ఖర్మరాబాబూ అనుకుంటూ కెమెరా తీసుకుని మేడెక్కాడు అతను. అంత ఖరీదైన కలర్ ఫిలిం శ్యామల మీద దండగ చెయ్యడం ఏమాత్రం ఇష్టంలేదతనికి. 'ఊరికే క్లిక్ మనిపిస్తే సరి. నమ్మేస్తుంది పిచ్చిది' అనుకున్నాడు. 'భగవంతుడా ఈ ఫోటో తీసే సమయానికి మా అనూ, దాని బృందం రాకుండా చూడు' అని మనస్సులోనే దేముణ్ణి ప్రార్థించాడు. అయిన అతనికి బెరుకు వదల్లేదు.

"ఏమండీ" ఆ గొంతు మళ్ళీ వినబడగానే ఉలిక్కిపడ్డాడు. ఎదురుగా శ్యామల ఆమెను, ఆమె అలంకరణనూ చూస్తే నోటమాట రాలేదతనికి. ముదురు ఎరుపురంగు పరికిణీ, కనకాంబరం రంగు ఓణీ, వాళ్ళ అమ్మది కాబోలు - లూజుగా ఉన్న పట్టు జాకెట్టు, మెళ్ళో ఏవేవో రకరకాల నగలు, చేతినిండా నానా రంగుల గాజులు, ముఖానికి అరంగుళం పౌడరు, కళ్ళు మూసుకుపోయేలా కాటికా, ఎర్రటి అమ్మవారి బొట్టు.. అసలే అందవికారమైన శ్యామల, ఆ అలంకరణలో "బావున్నానా అండీ?" అని నవ్వేసరికి దడుచుకున్నాడు సుధాకర్. ఉన్నపళంగా చేతిలో ఉన్న కెమెరా కిందపెట్టి పారిపోవాలనిపించింది అతనికి.

"ఏమండీ మాట్లాడరేం. నేను బాగాలేనా?" ఆ గొంతు వినగానే మధ్యాహ్నం ఎండలో కుర్చుని ఏడుస్తున్న శ్యామల జ్ఞాపకానికొచ్చింది. ఒక్కసారిగా జాలేసిందతనికి.

"ఏమండీ ఫోటో తీయరూ?" ఏడుపు గొంతుకతో అంది శ్యామల.

అటూ ఇటూ చుశాడు అతను.

"నేను ఎవరికన్నా చెప్తానని భయపడుతున్నారా? నేనెవరికీ చెప్పను లెండి. ఒట్టు" ఆశగా అంటున్న ఆమె గొంతు వినగానే - "ఛా!ఛా అదేంలేదు. అదిగో ఆ పిట్టగోడకానుకుని నుంచో" అని తోచిన అయిడియా చెప్పి, నిజంగానే ఫోటో తీశాడు సుధాకర్. కెమెరాలో రీలు తిప్పుతున్న అతన్ని చూస్తూ "ఏదండీ ఫోటో" ఆశగా చెయ్యిచాచింది.

"ఇప్పుడే రాదు. మా ఊరు వెళ్ళింతరువాత పంపుతాలే. సరే నువ్వెళ్ళు ఇంక" అని వెనక్కు తిరగబోయాడు అతను.

"ఏమండీ"

మళ్ళీ ఏమిటన్నట్లు వెనక్కు చూశాడు.

"అందర్నీ ఫోటో తీస్తారు, మీరు తీయించుకోరా? మీరు ఆ ఫోటోలో ఎంత అందంగా ఉంటారో తెలుసా?"

ఆ అమ్మాయి మాటలకు అదిరిపోయాడు. ఇంతవరకు కెమెరా కొన్న తరువాత ఫోటో తీయించుకునేవాళ్ళే కానీ, అతన్ని గురించి ఆలోచించినవాళ్ళులేరు. ఈ శ్యామల. ఈ అనాకారి పిల్ల. నా ఫోటో గురించి ఆలోచిస్తోందా? అనిపించింది. ఏదో చెప్పాలని మాట్లాడబోయాడు.

"శ్యామలా!" అని వాళ్ళమ్మ గొంతు వినగానే పరుగెత్తింది శ్యామల. దూరమౌతున్న ఆమె పాంజేబు పట్టీల సవ్వడి వింటూ అలాగే చాలాసేపు నిలబడి కిందకు వచ్చేశాడు సుధాకర్.

ఆ తరువాత రెండు రోజులు అతనికి ప్రయాణసన్నాహాలతోనూ, బంధువుల ఇళ్ళల్లో భోజనాలు, అనూ వాళ్ళతో వనభోజనం వీటితోనే సరిపోయింది. ఆ మూడోసాయంత్రం గూడు బండిలో రైల్వే స్టేషనుకు వెడుతున్న అతనికి కరణంగారి వాకిట్లో తారాడిన నీడ శ్యామలలా అనిపించినా, మిగతా అనేక విషయాలలో అదేం పట్టించుకోలేదతను.

బొంబాయి వచ్చిన నెలరోజులకు –

"బావా నీకీ విషయం తెలుసా? కరణంగారి శ్యామల చచ్చిపోయింది. ఏదో డిఫ్తీరియాట. పాపం, ఇరవైనాలుగు గంటల్లో ప్రాణం పోయింది. అది పోయినందుకు వాళ్ళింట్లో ఎవరికీ విచారం లేదనుకో. పోయేముందు నన్ను పిలిచి 'మీ బావను నా ఫోటో అడుగు' అని రాసి చూపించింది. దానికి నువ్వు ఫోటో తీశావా? మాకెవరికీ చెప్పలేదేం బావా! పాపం, అమాయకురాలు" ఈ రకంగా ఉన్న ఆ ఉత్తరం చూడగానే కళ్ళనీళ్ళు తిరిగాయి అతనికి. ఆ రోజే ప్రింటు అయివచ్చిన ఫోటోల కవరు తీసి మెల్లిగా అన్ని ఫోటోలు చూస్తూ, శ్యామల ఫోటో దగ్గర ఆగిపోయాడతను. చాలా క్లియర్‌గా వచ్చింది బొమ్మ. శ్యామలలాగా ఉంది. "ఏమండీ నా ఫోటో బావుందా?" ఎవరో అన్నట్లనిపించింది. అలాగే దాన్నే చూస్తూ కూర్చున్నాడతను చాలాసేపు.

●●●

"ఇంత అందవికారమైన అమ్మాయి ఫోటోకి ప్రైజ్ ఎలా వచ్చిందా అని చూస్తున్నావా? ఆ ఫోటో పరిశీలించి చూడు. అందులో ఏం కనబడుతోంది? లైఫ్. జీవితం, జీవితం మీద ఆశ. ఆ అలంకరణ, ఆ శ్రద్ధ చూడు. అదొక విచిత్రమైన అనుభూతి.. ఆ కళ్ళు.. ముఖ్యంగా ఆ కళ్ళు చూడు. ఎంత స్త్రీత్వం? ఎంతో కోరిక ఎంతో ఇష్టమైన వ్యక్తిని ఎవర్నో ఎంత ఆరాధనగా చూస్తోందో చూడు ఆపిల్ల.. అందుకే అన్నారండీ 'కెమెరా ఐ' అని.

జీవితంలో మామూలుగా ఉండేవాటిని కెమెరే అద్భుతంగా కనిపెడుతోంది. ఏం ఫోటో అండీ? ఊరికే ఇచ్చారటండీ ప్రైజూ?" ఎవరీ ఇద్దరు నడివయస్సు వ్యక్తులు ఇలా ఆ ఫోటో ముందు నిలబడి మాట్లాడుకుంటున్నారు.

అక్కడే కొద్దిదూరంలో ఒక స్థంభానికి ఆనుకుని, చేతులు కట్టుకుని నిలబడి, వారి మాటలు వింటూ ఆ ఫోటో వంకే చూస్తున్నాడు ఒక యువకుడు.

అది ఫోటో ఎగ్జిబిషన్.

ఆ యువకుడు సుధాకర్.

# అతని కోరిక బాలగంగాధర తిలక్

'జ్యోతి' మాసపత్రిక రజతోత్సవ ప్రత్యేక సంచిక (1988) నుంచి పునర్ముద్రితం

**లక్ష్మీ మోహనరావు** నిద్రనుంచి లేచాడు. లేచి భార్యకేసి చూశాడు. ఆమె ఇంకా నిద్రపోతోంది. ఆమెను లేపడం ఇష్టం లేదతనికి. ఆమెతో పాటు ఎన్నో బాధలూ గాథలూ మేల్కొంటాయని అతనికి తెలుసును. అసలు నిద్రకన్న సుఖకరమైన స్థితి మరొహటి ఏమీ అతనికి ప్రపంచంలో కనపడలేదు. అర్ధాంగి అయిన ఆమెను ఆ సుఖాన్నుంచి దూరం ఎందుకు చెయ్యాలనుకున్నాడు. అతనికి నిద్ర అన్నా, నోవకేన్ ఇంజక్షన్ అన్నా చాలా ఇష్టం. ఇదివరకెప్పుడో తేలుకుట్టి అతనికి కాలంతా మంటలూ పోట్లూ ఎత్తినప్పుడు డాక్టరు ఆ ఇంజక్షను ఇచ్చాడు. దాంతో పాదం తిమ్మిరెక్కిపోయింది. బాధ తెలియలేదు.

నిద్రకూడా అతనికి అలాగే ఉంటుంది. బాధల్నీ ఆ రుచికరమైన సంగతుల్ని నొక్కి వేసి ఉంచుతుంది. అందరికిలాగా అతనికి నిద్ర గాఢ నిద్రకాదు, సుఖనిద్రా కాదు. ఒహరకం తిమ్మిరి లాంటిది. నిద్రలేవగానే అతనికి మనస్సు సలుపుతున్నట్టు ఉంటుంది.

దొడ్లోకి వచ్చి వేపపుల్ల విరిచి పళ్ళుతోముకున్నాడు. ఆ సమయంలోనే అతనికి జరిగిపోయిన రోజున జరిగిన ముఖ్య సంఘటన జ్ఞాపకం వచ్చింది. నాలుగేళ్ళ కొడుకు చనిపోవడమూ, తాను మోసుకుని స్మశానానికి తీసుకుపోవడమూ, తన భార్య గుండెలు బాదుకుని ఏడ్వడమూ – ఇదంతా నిన్ననే జరిగిందా, ఇదివరలో ఎప్పుడయినా జరిగిందా అన్న అనుమానమూ వచ్చింది అతనికి. అతనికి జ్ఞాపకం లేక కాదు. అతనికేదేనా కష్టం వచ్చినప్పుడు అతనికి మనస్సంతా చిత్రంగా మొద్దుబారిపోతుంది. కాలం అనే డైమన్షన్ ఎక్కడికో తప్పుకుంటుంది. ఏమైనా అతనికి అంతగా ఏడుపు రాలేదు. అంతగా బాధ అనిపించలేదు. అంతే. ఇదీ తిమ్మిరే అనుకున్నాడు.

పళ్ళు తోముకుంటుంటే ఇలాగ ఆలోచనలు మంచు పొగలాగ ఎందుకు ముసురుతాయో అతనికి తెలీదు. వాళ్ళమ్మ చిన్నతనంలో 'దరిద్రుడా' అని తిట్టేది. మరి తనకి లక్ష్మీ మోహనరావు అని ఎందుకు పేరు పెట్టింది? అతనికి అమ్మమీద కోపం వచ్చింది. తనకి ఆ పేరు పెట్టినందుకు కాదు; తనకి లక్ష్మి అనే పేరుగల భార్యను వెతికి తెచ్చి మెడకు కట్టినందుకు. అతను నవ్వుకున్నాడు. అతనికి ఎవరేమన్నా కోపం రాదుకానీ, 'దరిద్రుడా' అంటే కోపం వచ్చేది. తల్లిని అలా పిలవద్దని కసురుకునేవాడు. దరిద్రం యాచనలో ఉంది. సోమరితనంలో ఉంది. కష్టపడేవాడికీ, అభిమానం ఉన్నవాడికీ దరిద్రం ఉండదు. ఎవరూ కూడా ఉందని వేలెత్తి చూపించలేరు. అందుకే అతను దొరికిన ఉద్యోగమల్లా చేసేవాడు. అతనికెప్పుడూ టెంపరరీ ఉద్యోగాలే దొరికేవి. బియ్యం కొట్లో గుమాస్తాగా పనిచేశాడు. ఎలక్ట్రిసిటీ ఆఫీసులో పనిచేశాడు. లాటరీ టిక్కెట్లు అమ్మేవారితో కూర్చుని మైక్ ముందు గొంతు పెట్టి 'రూపాయికి లక్ష రూపాయలు' అని కేకవేశాడు. సినిమాలో గేటు దగ్గర నిలబడ్డాడు. కిరాణా కొట్లవాళ్ళకి పద్దులు రాసిపెట్టేవాడు. ఎప్పుడూ అతని జీతం ముఖ్యావసరాలకి సగం సరిపోయేది.

పై సగం అవసరాలు ఎండిపోయి అతని భార్యకి జబ్బు రూపంలో, తనకి భయం రూపంలో, కొడుక్కి ఆకలి రూపంలో దాగి ఉండేది.

చచ్చిపోయిన కొడుక్కి ఆకలెక్కువ. వాడస్తమానం తిండి కావాలని మారాం చేసేవాడు. వాడికి కడుపునిండా అన్నం పెట్టినా ఇంకా ఇవీ అవీ కావాలనేవాడు. తోచకపోతే మట్టి తినేసేవాడు. ఒక వైద్యుడికి చూపిస్తే లివర్ పెరిగిందన్నాడు. అందుకే పొట్ట అలా ఎత్తుగా వచ్చిందన్నాడు, పొట్ట మీద నీలం రంగు నరాలు పైకి ఉబ్బి భూగోళం మ్యాపు మీద నదుల గీతల్లా ఉండేవి. వాడికి సరిగా మందివ్వక - మందిప్పించలేక చంపేశాడన్నారు లక్ష్మీ మోహనరావుని కొందరు. కానీ అది అబద్ధం. ఎలాగో అలాగ డబ్బు తెచ్చి మందులిప్పించాడు. కొట్టు వాడిని బతిమాలి కొన్ని మందులు అరువు తెచ్చాడు. ఆ జబ్బుకి ఇవి అరువు మందులని తెలిసిపోయి లోకువ చేసి కాస్తయిన తగ్గలేదని అతని అనుమానం.

వాడు బతికి ఉంటే వాళ్ళ మేనమామ అల్లుడు పినతండ్రిలాగా తాసీల్దారయి ఉండే వాడు అని భార్యకీ కూడా గౌరవం, గర్వంగా చెప్పుకోదగిన బంధువు ఈ తాసిల్దారు ఒకడే ఆ తాసీల్దారుని వీళ్ళెప్పుడూ చూడలేదు. ఆయన వీళ్ళనెప్పుడూ చూడలేదు. ఆయన వీళ్ళనెప్పుడూ ఏకార్యానికీ పిలవనూ లేదు. కానీ ఆ తాసిల్దారు మాత్రం ఈ భూమి మీద ఎక్కడో ఉండడం ఖాయం. లక్ష్మి కుళాయి దగ్గర ఏవో మాటల్లో "మా బంధువొకాయన తాసిల్దారు. ఆయనకి ఊరు బదిలీ అయితే బాగుండును. ఈ కుళాయి నీళ్ళు ప్రత్యేకంగా నేను పట్టుకునేందుకు ఏర్పాటు చేసి ఉండును. వేగలేక చస్తున్నాం ఈ అలగాజనంతో -" అంటుండేది.

అలగాజనంలో తానూ ఒకర్తెనని లక్ష్మికి తెలియలేదు. అయితే లక్ష్మి నమ్మకాలూ ఆశలూ పెట్టుకున్న మనిషి. తన భర్తకి ఏ నాలుగువందల ఉద్యోగమో, ఏ లాటరీ ఫస్టుప్రైజో ఎదో ఒకటి అనతి దూరంలో రెడీగా ఉందని అనుకుంటుంది. ఒకమేడ, ఒక మంచికారు, రాళ్ళ నెక్లెసూ ఆవిడ కనీసపు కోర్కెలు. కానీ లక్ష్మీమోహన రావుకి ఏనాడూ పెద్ద ఆశలు లేవు. అతనికి చిన్న చిన్న సరదాలు ఉండేవి. చిన్నతనంలో అతను పెద్దవాణ్ణయిపోవాలనుకునేవాడు. చిత్రం ఏమంటే నిజంగా కొన్నేళ్ళకి పెద్దవాడయిపోయాడు. నిజానికి అతనికి తీరిన కోరిక ఇది ఒక్కటే. చిన్నప్పుడు కసరత్తు చేసి 'గామా'లా తయారవాలనుకునేవాడు. దానికి బాదం పప్పు, కోడిగుడ్డు మొదలైన పుష్టికరమైన ఆహారం తినాలనేవారు. బాదంపప్పు సమృద్ధిగా సంపాదించుకోగలిగిననాడు కసరత్ ప్రారంభించేయాలనుకోవడం వలన ఈనాటికీ ఆ కోరిక నెరవేరలేదు. సర్కస్ అంటే అతనికి ఇష్టం. నల్లకోటు వేసుకుని పొడుగాటి కమ్చీని చప్పుడు చేస్తూ గుర్రాల్ని గుండ్రంగా పరుగెత్తించే వాడంటే అతనికి భయం, గౌరవం, అభిమానము కూడా. అంత వాడవాలని ఉండేది. తన ఇంటి పెరట్లోకి వచ్చే పోయే రెండు మూడు చచ్చు కుక్కలకి మెడకి నవారు పట్టీ కట్టి వెదురు పుల్లలు ఎత్తుగా అడ్డం పెట్టి వాటిని దుమకమనేవాడు. అవి మొరిగేవి, మూల్గేవి. కరవబోయేవి. వాటిని తన చాంతాడు కమ్చీతో చావకొట్టేవాడు. అవి వెల్లకితలా పడుకుని భోరుమని ఏడ్చేవి. ఇలాగ అతనికి చిన్న చిన్న సరదాలుండేవి. ఆ రోజుల్లో అతను లేనివాడని ఎవరూ అనుకునేవారు కారు. అతనికి కూడా అనిపించేది కాదు. అతని తండ్రి చేసేది గుమాస్తా ఉద్యోగమైనా తెలివిగా, సులువుగా లంచాలు పట్టగలిగిన వాడవ్వడం వల్ల ఇంట్లో ఏ ఇబ్బందీ ఉండేది కాదు. లక్ష్మీ మోహనరావుకి చిరుతిండికీ, సినిమాలకీ లోటు ఉండేది కాదు.

అన్నింటికన్నా అతనికో సరదా ఉన్నట్టుగానే ఉండిపోయింది. అతను పదోక్లాసు చదువుతున్నప్పుడు శ్రీరామనవమి ఉత్సవాలకి పందిట్లోకి వెళ్ళాడు. అక్కడ మంచి మజాగా మేజువాణీ జరుగుతోంది. పళ్ళెత్తుగా ఉన్నదెవత్తో మేళం కడుతోంది. 'ఛా' అనుకున్నాడు లక్ష్మీ మోహనరావు ఆమెను చూసి, కానీ ఇంతలో రసజ్ఞుడైన ఒక కారా కిళ్ళీ ఫ్లస్ కండువా ఆసామి ఫిడేలు వాయించేవాడిని పిలిచి చెవిలో ఏదో చెప్పాడు. పళ్ళెత్తు ఆవిడ గజ్జెలు విప్పి ఇంకో సన్నగా నాజూకుగా ఉన్న ఎర్రని పిల్లకిచ్చింది. ఆ పిల్ల కళ్ళు బాగున్నాయి.

బెంగగా ఉన్నాయి. చిన్నగా, జాలిగా నవ్వి ముందుకు వచ్చి ‘తూరుపు తెల్లవారె’ అని అభినయం ప్రారంభించింది. లక్ష్మీమోహనరావుకి సరదా వేసింది. ఆ కళ్ళనీ, బుగ్గల్నీ ముద్దెట్టుకోవాలనుకున్నాడు.

తర్వాత పెద్దవాడయిన కొలదీ భోగం వాళ్ళంటే ఏమిటో, ఎందుకో తెలిసిపోయింది. రాజమండ్రి మెరక వీధిలో వీళ్ళు ఉంటారని తెలిసింది. వాళ్ళొక మేలిరకం ‘హాయిని’ ఇస్తారని బతికున్నవాడెవడైనా ఒకసారి ఆ హాయిని పొంది తీరాలని విజ్ఞులైన మిత్రులు కొందరతనికి చెప్పారు. కానీ వాళ్ళు ఒక ఇబ్బందైన మాట కూడా చెప్పారు. వాళ్ళకి డబ్బూ, నగలూ మొదలైనవి ఇస్తేనే రానిస్తారనీ, లేందే గడప తొక్కనివ్వరనీ చెప్పారు.

ఈ షరతు మాత్రం అతనికేమీ బాగాలేదు. ఈ సరదా క్రమ క్రమంగా అతనిలో అడుగున పడిపోయింది. సంఘానికి వీళ్ళు చీడ పురుగులనీ, తప్పనీ, అవినీతి అనీ అందరూ అనడంవల్ల కొంత అతనూ నమ్మాడు. స్వంత ఊళ్ళో మేజువాణీ చూడడానికి సిగ్గువేసినా పొరుగూళ్ళకి వెళ్ళినప్పుడు బెదురుగా, మోతాదుగా చూసి సంతృప్తి పడేవాడు. మొహం కడుక్కుని ఇంట్లోకి వచ్చాడు. అతనికేదో జైల్లో ఉన్నట్టనిపించింది. అసలీ మధ్య అతనికి ఇంట్లో పట్టుమని పది నిమిషాలు ఉండడమే కష్టంగా ఉంది. కొడుకు బతికున్నప్పుడు , అతనికి కొడుకు బతికున్నట్టే అనిపించేది కాదు. కానీ ఇప్పుడు కొడుకు లేడని ప్రతీవస్తువూ సాక్ష్యం ఇస్తున్నట్టు ఉంది. తన భార్య నిద్రలేవకుండానే అతనికి వెళ్ళిపోవాలనిపించింది. పుత్రశోకంతో ఉన్న ఆమెని ఓదార్చడం చాలా కష్టమైన పని అనిపించింది. పక్కింటావిడ నిన్నవచ్చి కష్టంలో ఆదుకుంది. మళ్ళీ ఈ రోజు ఉదయమే తన భార్యనావిడకి వదిలెయ్యడం మంచిదనుకున్నాడు. వీధితలుపు చప్పుడు కాకుండా తెరచి గుమ్మం దాటబోతుంటే అతనికి క్రితం రోజున లక్ష్మి మెళ్ళో మంగళ సూత్రాలు తీసి పిల్లాడికి మందులూ, బియ్యమూ తీసుకురమ్మని చెప్పడం జ్ఞాపకం వచ్చింది. వెనక్కి వచ్చి అల్మారులో మూలగా కాగితం పొట్లంలో కట్టిన మంగళ సూత్రాలు తీసి జేబులో వేసుకున్నాడు. నిన్న వీటి అవసరం లేకుండానే కుర్రవాడికి ప్రాణం మీదికి రావడంతో తాకట్టు పెట్టవలసిన అవసరం లేకపోయింది. ఈ రోజున డబ్బు తెచ్చుకోవల్సిన అవసరం ఉంది. లక్ష్మి చాపమీద సగం, నేలమీద సగం పడుకుని నిద్రపోతోంది. ఆమె నిప్పు సెగకి ఎండి ముడతపడిన పాతకాగితంలా ఉంది. ఒక్కసారి ఆమెను చూసి గబగబా వీధిలోకి వెళ్ళిపోయాడు.

లక్ష్మీ మోహనరావు వీధిలోకి వచ్చి నడవడం మొదలుపెట్టాడు. అతనికొక గమ్యం లేదు. ఇంటికి తిరిగి వెళ్ళకుండా చీకటి పడేవరకూ పొద్దుపుచ్చడమే అతని ప్రస్తుతాశయం. ఎప్పుడో ఒకప్పుడు మంగళసూత్రాన్ని తాకట్టు పెట్టవచ్చును. ఒక వీధినుంచి ఇంకొక వీధికీ, ఒక సందులోంచి ఇంకొక సందులోకీ కులాసాగా నడుస్తున్నాడు. నడవడంలో, ఇటూ అటూ కొట్లనీ, ఇళ్ళనీ, మనుష్యులనీ చూడడంలో అతనికొక విశ్రాంతి లభించినట్టుగా ఉంది. ఒళ్ళూ మనస్సూ ఏదో తేలికపోయినట్టుగా బరువు దిగిపోయినట్టుగా ఉంది. తాను విచ్చలవిడిగా తిరగడానికి ఇంత పెద్ద ఊరు ఏర్పడి ఉండడం ఏదో దైవసంకల్పంలాగా అనిపించింది. రాజమండ్రి ప్రజలనందరినీ పిలిచి ఒక్కసారి అభినందించాలనిపించింది. ఇంతమంది జనాలలో ఎవడికీ తన కొడుకు పోయినట్టు తెలియదు. తెలుసుకోలేరు, తెలుసుకోవాల్సిన అవసరం లేదు. జన ప్రవాహంలో తానొక బిందువు మాత్రమే. నడవగా నడవగా ఆకలి వేసింది. జేబులో ఒక రూపాయికూడా ఉంది. హోటల్‌కి వెళ్ళి ఇడ్లీలు తిని కాఫీ తాగి మిఠాయి కిళ్ళీ వేసుకుని నడక ప్రారంభించాడు. ఎదురుగా ఎవడో నున్నగా క్రాఫింగ్ దువ్వుకున్న ఒక లుంగీదారు ఇతన్ని చూసి ఇకిలించినట్టు నవ్వాడు. గబుక్కున లక్ష్మీ మోహనరావుకి జ్ఞాపకం వచ్చింది తాను తల దువ్వుకోలేదనీ బట్టలు మార్చలెదనీ, పోనీలే అనుకున్నాడు. ఒక దేవాలయం దగ్గర ఎందరో తడిబట్టలతో దేవుడికి మొక్కుకుంటున్నారు. అతను కూడా చేతులెత్తి నమస్కరించాడు. ఒకావిడ చాలా ఖరీదైన పట్టుచీరా, మెడకీ చేతులకీ కొన్ని వందల తులాల బంగారమూ, విశాలమైన కళేబరంతో వెనకాల మొగుడూ పరిచారికా వెంటరాగా దేవాలయంలోకి వెళుతుంటే చూసి నవ్వుకున్నాడు. అంతడబ్బున్న ఆవిడని చూసి దేవుడు నాలుగడుగులు ముందుకు వేసి ‘రండి మహాలక్ష్మమ్మగారూ దయచేయండి.

మోబోటి వాళ్ళు అస్తమానూ వస్తారా' అంటాడేమో అని కాసేపు నిలబడి చూశాడు. అక్కణ్ణించి సినిమా పోస్టర్లు వరసగా చూస్తూ చదువుతూ ఇన్నీసుపేట వరకూ వెళ్ళాడు. ఒకచోట రోడ్డుకి పక్కగా ఖాళీజాగాలో ఎవడో గారడివాడు తన విద్యని ప్రదర్శిస్తున్నాడు. జనం గుండ్రంగా మూగివున్నారు. లక్ష్మీ మోహనరావు వాళ్ళల్లోకి చొచ్చుకుపోయాడు. సర్కస్‌లాగా గారడీ అన్నా ఇష్టం. గారడీవాడు తురకాన్నీ తెలుగునీ పసందైన పాళ్ళల్లో కలిపి పంచి పెడుతున్నాడు. కోడిగుడ్డుని ఒక బుట్టతో మూసి కుక్కపిల్లని చేస్తానంటున్నాడువాడు. తనకీ గారడీవస్తే దాన్ని మేకపిల్లని చేసి గారడీవాణ్ణి ఏడిపించవచ్చుననుకున్నాడు. గారడీవాడి కూతురు డబ్బులడుగుతోంది. దాని గడ్డం మీద మచ్చ ముద్దొస్తూందనుకున్నాడు. జేబులోంచి పావలా తీసి దానికిచ్చేశాడు. పక్కవాడు అణాయే ఇచ్చాడు. వాడిని తిరస్కారంగా గర్వంగా చూశాడు.

సూర్యుడు నడినెత్తికి వచ్చాడు. ఎండ చుర్రుమంటోంది. మళ్ళీ ఆకలేసింది లక్ష్మీమోహనరావుకి. సత్రం వేపు బయల్దేరాడు. సత్రం ముందు ఎవడో బొమ్మలున్న గుడ్డ నేలమీద పరచి 'కాయ్ రాజా కాయ్' అంటున్నాడు. సర్కస్ జ్ఞాపకం వచ్చింది లక్ష్మీ మోహనరావుకి గుర్రాలంటే అతనికి ఇష్టం. గుర్రం మీద బేడ కాసేడు. పావలా వచ్చింది. మళ్ళీ రెండోసారి పావలా, బేడ కలిపి కాశాడు. పోయింది. పక్కున నవ్వాడు.

"ఏం నవ్వుతావ్?" అన్నాడు లాటరీవాడు.

"ఈ గుర్రం నిజం గుర్రం కాదు" అన్నాడు లక్ష్మీ మోహనరావు.

"ఊరుకోవయ్యా. ఇది ఫస్టు క్లాసు గుర్రం చూడు. ఈ ఏనుగుని. మైసూరు మారాజా దీన్నే ఎక్కి ఊరేగేవాడు, కాయ్ రాజా కాయ్" అన్నాడు లాటరీవాడు.

"నే కాయను" అన్నాడు లక్ష్మీమోహనరవు.

"ఏం - ఎందుకు కాయవ్? నాది నిజాయితీ అయిన లాటరీ" అన్నాడు లాటరీవాడు.

"ఎందుకో చెప్పనా" అని అడిగాడు లక్ష్మీ మోహన రావు.

"చెప్పవోయ్ చెప్పు. ఏదేనా మోసం ఉందని రుజువుచేస్తే పది రూపాయలు నీకు ఈనాం" అన్నాడు కోపంతో లాటరీవాడు.

"అయితే చెప్తాను విను. నా దగ్గర డబ్బు లేదు. నేనాడను" అని లేచిపోయాడు లక్ష్మీ మోహనరావు. అందరూ ఘొల్లుమని నవ్వారు. లాటరీవాడు పెద్ద అవమానంగా తలచి "ఖలేజా ఉంటే కాయండి. రూపాయకి రెండు రూపాయలు. ఊరికే చూస్తే అదృష్టం రాదు మొగాలకి" అన్నాడు.

లక్ష్మీ మోహనరావు సత్రంలోనికి వెళ్ళాడు. సత్రం గుమాస్తా ఇతన్ని ఎరుగును. బీడీ పొగ పైకి ఊదీ "ఏమంయ్యోయ్ కులాసానా కనపడ్డం మానివేశావ్?" అన్నాడు.

"ఏదీ బీడీ ఉంటే ఒకటియ్" అన్నాడు రావు.

"అరె నీ కలవాటు లేదుగా?"

"చేసుకున్నానులే" అంటూ బీడీ తీసుకుని అంటించాడు లక్ష్మీ మోహనరావు. అతనికి బీడీ అలవాటు లేదు. కానీ ఈవేళ అతనికి ప్రతి పనీ చేసేందుకు స్వంతంత్రం వచ్చినట్టుగా ఉంది.

"కులాసాయేనా? ఏంటి ఇలా వచ్చావ్" అన్నాడు గుమాస్తా.

"ఆం ఇలాగ పనిమీద వెళుతున్నాను. ఏదేనా మంచం ఉంటే పడెయ్యి. కాసేపు నడుం వాల్చిపోతాను" అన్నాడు రావు.

గుమాస్తా ఖాళీ గది ఒకటి చూపించాడు. బీడీ కాలుస్తూ ఉక్కిరి బిక్కిరవుతూ దగ్గుతూ మంచం మీద పడుకుని లక్ష్మీ మోహనరావు రకరకాల ఆలోచనల్ని తరుముతున్నాడు. అలసిపోయిన అతనికి తెలీకుండా నిద్రపట్టింది.

సాయంత్రం ఆరుదాటాక గుమాస్తా లేపేవరకూ అతనికి మెలుకువ రాలేదు. మెలుకువ వచ్చాక అతను చాలాసేపు తికమక పడ్డాడు తనక్కడ ఎందుకున్నదీ తెలియక. కొంతసేపటికి అతన్ని అతను గుర్తించడానికి వీలయింది. గుమాస్తాకి థాంక్స్ చెప్పి ఇన్నీసు పేట గోదావరి ఒడ్డుకి వెళ్ళి మొహం కడుక్కుని మెట్లమీద కూర్చున్నాడు. విశాలంగా చల్లగా పారుతూన్న గోదావరి ముందు అతను చటుక్కున ఏకాకిలా ఫీలయాడు. క్రమ్ముకుంటూన్న లేత చీకటిలోకి బద్ధకంగా చూస్తూ కూర్చున్నాడు. అతనికి చిన్ననాటి రోజులు జ్ఞాపకం వచ్చాయి. చుట్ట నములుతూ మాట్లాడే తండ్రీ, తులసి కోటకి రోజూ పూజ చేసే తల్లీ, పకోడీల కొట్టూ, సర్కసూ, తెలుగు మేష్టారూ, శ్రీరామ నవమి ఉత్సవాలూ.. అతనికి లోపల్లోపల దాగివున్న కోరిక ఒక్కసారి బయటపడింది. ఒక్కరాత్రి అయినా భోగం దానితో అనుభవించాలని ఉబలాటపడిపోయింది అతని మనస్సు. పుష్పలత అందంగా ఉంటుందనీ బాగా అభినయిస్తుందనీ అంటారు. ఓసారి మెరకవీధిలో వెళుతుంటే పుష్పలత మేడని చూపించారు మిత్రులు. ఈవాళ ఎలాగయినా తాకట్టు పెట్టటానికి టైమయిపోయింది రేపటి సంగతి రేపు చూచుకోవచ్చుననిపించింది. మెరక వీధిలో మేడవుంది. ఇంకేం అనుకున్నాడు లేచి బయల్దేరాడు.

విద్యుద్దీపాల కాంతిలో రాజమండ్రి సందులు చవకరకం ఆడదానిలా మెరుస్తున్నాయి. తికమకగా ఉన్న జుట్టుతో మాసిన చొక్కాతో తిన్నగా పుష్పలత మేడ గుమ్మం ముందు నిలబడ్డాడు. ఏం చెయ్యాలో, ఎలా పిలవాలో అతనికి సరిగ్గా తెలియదు. దగ్గాడు. కొంతసేపయాక మళ్ళీ దగ్గాడు. చివరకి "ఏమండీ" అని పిలిచాడు. అతనికి సిగ్గుగా భయంగా ఉంది. ఇంతలో ఓ గళ్ళచీర కట్టుకున్న యాభై ఏళ్ళ స్త్రీ వచ్చి "ఏం కావాలి?" అంది జుట్టు పల్చబడి ఆమె తల పెంకు అక్కడక్కడ కనిపిస్తూ అసహ్యంగా ఉంది.

"ఈ మేడలో పుష్పలత ఉందా?" అన్నాడు బెరుగ్గా.

"ఆఁ ఉంది. ఎవరేనా పంపించారా నిన్ను?"

"కాదు. నాకే కావాలి"

"నీకా?!" ఆమె విరగబడి నవ్వింది. నవ్వినప్పుడు గొగ్గిపళ్ళు కనిపిస్తున్నాయి.

"నా దగ్గర అరకాసు బంగారం ఉంది" అన్నాడు ధీమాగా.

ఆమె ఎగాదిగా చూసి, "ఆగు కనుక్కుని చెపుతాను" అని లోపలికి వెళ్ళి కొంత సేపటికి తిరిగివచ్చి "రాత్రి తొమ్మిది దాటాక రండి" అంది.

లక్ష్మీ మోహనరావు ఉత్సాహంగా బజారు వైపు నడిచి ఒక క్షౌరశాలలోకి వెళ్ళాడు. అక్కడ ఎవరూ లేరు, యజమాని తప్ప.

"ఏం సార్ క్రాఫ్ వెయ్యమంటారా?" అన్నాడు వాడు.

"కాదు కొంచెం తలకి నూనె రాసి పెట్టాలి. పౌడరు కూడా కావాలి. డబ్బులు తీసుకు రాలేదు. ఎప్పుడైనా ఇటు వచ్చినప్పుడు ఇస్తాను? " అన్నాడు లక్ష్మీ మోహనరావు ప్రాధేయ స్వరంతో. క్షౌర శాలాధిపతి ఇతన్ని నిదానించి చూసి "ఏం గిరాకీ పంతులూ? " అన్నాడు.

"ఏముంది..?"

"పిల్లేదైనా దొరికిందా?"

ఆశ్చర్యంతో లక్ష్మీ మోహనరావు "నీ కెలా తెలిసింది?" అన్నాడు.

"ఒస్.. అందరి వయినం ఇట్టే పసిగట్టగలను. అనుభవం. అంతే! అనుభవం. నిన్ను చూడగానే అనుకున్నాను. ఈడెవడో నాసిరకంరా  బాబూ అని" అన్నాడు కొట్టువాడు.

ఇలా లోకువ చేసి మాట్లాడడం కష్టమనిపించింది లక్ష్మీ మోహనరావుకి. అయినా చేసేది లేదు. తల దువ్వుకుని పౌడరు రాసుకుని తొమ్మిదయేవరకు అక్కడే ఒక బల్ల మీద కూర్చున్నాడు. ఒళ్ళంతా బరువుగా ఉంది. ఒక పక్కన చెయ్యకూడని పని ఏదో చేస్తూన్నట్టు ఉంది. అంతలోనే విపరీత శక్తుల మీద తిరుగుబాటు చేస్తోన్న నాయకుడిలాగా గర్వంగా అనిపించింది. తన ఒక్క కోరిక గర్వంగా అనిపించింది. తన ఒక్క కోరిక ఎందుకు తీర్చకోకూడదు? అతనిలో తెలియని సంతోషం వ్యాపించింది.

ఇదివరకు వెళ్ళిన మెరకవీధి మేడ దగ్గరకు వెళ్ళాడు. ఇందాకటావిడ గుమ్మం దగ్గర కూర్చుని కాళ్ళకి తైలం రాసుకుంటోంది. ఇతన్ని చూ సి "ఆ మెట్లెక్కి పైకి వెళ్ళు, అక్కడుంటుంది" అంది, ఏకవచన ప్రయోగానికి ఒళ్ళు మండింది. కోపంగా చూచి మెట్లెక్కాడు, డాబామీద పిట్టగోడ నానుకుని విలాసంగా నుంచుందొక యువతి. పొడుగాడి వాల్జడ మధ్య బంగారపు చామంతి పువ్వు ఉంది. మెళ్ళో నెక్లెసూ, ఒక ఒంటి పేట గొలుసూ ఉన్నాయి. రొమ్ములు ఎత్తుగా ఉన్నాయి. పౌడరు పూసిన మొహం తెలుపూ చేతుల ఛామనఛాయ రంగు విడివిడిగా అసందర్భంగా ఉన్నాయి.

ఇతన్ని చూసి నవ్వుతూ "రాండి" అంది ఆమె, ఆమె వెనకాలే గదిలోకి వెళ్ళాడు. గది చిన్నదైనా పందిరి పట్టెమంచం, ఒక సోఫా, ఒక డ్రాయరూ ఇరుకుగా సర్ది ఉన్నాయి. పరుపులమీద మొఖమల్ పరచి ఉంది. డ్రాయరు మీద మిఠాయిలూ, అరటి పళ్ళూ, మరచెంబూ, టేబులు ఫానూ ఉన్నాయి. గోడమీద వెంకటేశ్వరుడి పటానికి ఇటూ అటూ సినీతారల బొమ్మలూ, క్యాలండర్లూ ఉన్నాయి. ఓ పక్కగా ఉన్న ఒక్క కిటికీ మూసేసి ఉంది. గదిలోకి వెళ్ళగనే లక్ష్మీ మోహనరావుకి నిలవవున్న గాలి వాసనా, ఒకరకం ముదురు సెంటు వాసనా కలిసి గమ్మత్తుగా ఉంది.

ట్యూబ్ లైటు కాంతిలో ఆమెను తదేకంగా చూస్తూ నిలబడ్డాడు. ఆమె నవ్వి "అలా చూస్తున్నారేం, బావులేనా?" అంటూ దగ్గరకు వచ్చి చెంపల్ని తాకి సోఫాలో కూర్చోపెట్టింది. అతనికి ఒళ్ళు పులకరించింది. ఆమె అంత అందంగా కనబడలేదు. అయినా ఆమె చొరవలో, చనువులో ఉద్రేకపరిచే గుణం ఉంది.

తనని పరీక్షగా చూస్తోందని తెలుసుకుని "మీ పేరు పుష్పలతేనా?" అని అడిగాడు.

కిలకిల నవ్వి ఆమె అతని పక్కగా కూర్చుని "ఇలాంటి చోటుకి రావటం మీకు కొత్తా?" అంది.

"ఏం?"

"నన్ను 'మీరు' అని గౌరవిస్తున్నారేం?"

"మిమ్మల్ని గౌరవించకూడదా?"

"ఊహూం -" అని కళ్ళు కుంచించి అతని మీదికికొంచెం ఒరిగి "మీది ఈ ఊరు కాదా?" అని అడిగింది.

"కాదు!" అబద్ధమాడాడు లక్ష్మీ మోహనశావు.

"మరి ఏ ఊరు?"

"అమలాపురం"

"ఏం చేస్తోంటారు?"

"వ్యవసాయం - అక్కడ నాకు భూములున్నాయి"ధైర్యంగా అనేశాడు.

ఆమె తీవ్రంగా చూచి మళ్ళీ నవ్వుతూ "ఈనాందార్లన్నమాట. ఏమాత్రం కమతం ఉందీ?" అంది.

"యాభై ఎకరాలు" తనని లోకువ కట్టేస్తుందేమోనని నిచ్చెన మెట్లెక్కి పోతున్నాడు లక్ష్మీ మోహనరావు.

"మరి ఈ మాసిన బట్టలూ వేషమూ ఇలాగే వస్తారా మా దగ్గరికి? అయ్యో రామ" అని చెంగు నోటికి అడ్డం పెట్టుకుని నవ్వుతోంది.

"పెట్టె బెడ్డింగూ పోయాయి వస్తోంటే. ఈ ఊర్లో పనుంది మరి ఏం చెయ్యను" కంగారు పడ్డాడు లక్ష్మీ మోహనరావు.

"ఊహూఁ-" ఆమె ఏదో ఆలోచిస్తున్నట్టు ఉంది.

"పుష్పలతంటే మా వైపు మంచి పేరు."

"నేను పుష్పలతని కాను."

"మరి నువ్వూ.."

"నన్ను పాప అంటారు. పుష్పలత మా అక్కయ్య. ఓ లక్షాధికారి మా అక్కయ్యను సొంతంగా ఉంచేసుకున్నాడు."

"ఓహో!" అన్నాడు లక్ష్మీ మోహనరావు. పోనీ ఇదైతేనేం దాని చెల్లెలేకదా అని సమాధాన పరచుకున్నాడు.

"నన్ను కూడా మీరు తీసుకుపోయి ఉంచుకోరాదూ?" చిలిపిగా నవ్వుతూ అడిగింది.

"నేనా - ఎక్కడ ఉంచుకోవటం? ఎలాగ?" తడబడుతూ అన్నాడు లక్ష్మీ మోహనరావు.

ఆమె ఏదో పసిగట్టినట్టు "భోంచేశారా?" అంది.

"లేదు."

"ఏం?"

అతను జవాబివ్వలేదు. ఎందుకో అతని మనసంతా కలత పడిపోయింది. అతనికి కొడుకుని శ్మశానికి మోసుకుపోవడం జ్ఞాపకం వచ్చింది ,

"మరి బంగారం ఏదీ?" అడిగిందామె.

"బంగారం ఏఁవిటీ?" అన్నాడతను.

"మా పిన్ని చెప్పింది అరకాసు బంగారం ఉందని."

"ఓహ అచ్చా - ఓహ మర్చిపోయాను" జేబులోంచి మంగళసూత్రాలు పొట్లం తీసి ఆమెకిచ్చాడు.

"భలేవారే మీరు. ఇంతవరకూ ఇవ్వకుండా నన్నాడిస్తున్నారా" అంటూ ఆమె పొట్ల విప్పి చూచింది. పసుపుతాడుకి మంగళ సూత్రాలు కట్టబడి ఉన్నాయి. అప్రయత్నంగా ఆమె "సరే!" అంది. ఆమె చెక్కిళ్ళలోంచి రక్తం దిగిపోయింది. సందేహంగా అతనికేసి చూసింది.

"అరకాసు ఉండదనా నీ సందేహం?" అని అడిగాడతను.

"ఉంటయ్యేమోలే -" ఆమె పొట్లం కట్టి చేత్తో పట్టుకుని "కొంచెం మిఠాయి తినండి. ఇప్పుడే వస్తాను" అని గదిలోంచి వెళ్ళి పోయింది.

అతనికి ఉత్సాహం తగ్గిపోతున్నట్టని పించింది. మధ్యాహ్నంలో భోజనం లేని కారణాన ఏమో అనుకున్నాడు. మంచి చలాకీనే ఈ పాప. తనని లేనివాడని కనిపెట్టేసిందా. అయితేనేం, బంగారం ఇచ్చాడుగా, ఇంకేం అనుకున్నాడు. టేబుల్ మీద పళ్ళెంలో మిఠాయి తీసుకుని తాపీగా తిన్నాడు. కింద నుంచి ఏవో కేకలు వినిపిస్తున్నాయి. పాప ఎవరిమీదో బహుశా ఆ గొగ్గిపళ్ళ పిన్నిని తిడుతుందేమో అనుకున్నాడు. రెండు చక్కరకేళీ అరటి పండ్లు ఒల్చుకుని తిన్నాడు.

క్రమంగా అతనికి బలం వచ్చింది. దాంతో అతని మీద అతనికి నమ్మకం కలిగింది. ఇందాకట్నుంచీ నీరసం వల్ల కాబోలు అలా బెదురుగా ఉన్నాననుకున్నాడు. ఇప్పుడు చూడమను తన ప్రజ్ఞ తనూ చమత్కారంగా మాట్లాడగలడు. పాపచేత జావళీ అభినయింప చెయ్యాలి 'తూరుపు తెలవారె' అంటే అతనికి ఇష్టం. మరచెంబు తీసి నీళ్ళు తాగి తేన్చాడు. రాబోయే సుఖాన్ని తలచుకుంటుంటే అతనికి ఒళ్ళు మళ్ళీ పులకరించింది. లేచి వెళ్ళి మంచం మీద పడుకున్నాడు చిరునవ్వు నవ్వుకున్నాడు తృప్తిగా.

గదిలోకి గొగ్గిపళ్ళావిడ వచ్చింది. ఇదొచ్చిందేమిటి అని కంగారు పడ్డాడు లక్ష్మీ మోహనరావు.

"లేలే పంతులూ మంచం మీద దొరలాగా పడుకున్నావు కాని" అంది మోటుగా ఆవిడ.

"ఏం?"

"ఇనస్పెట్టరొత్తున్నాడు. కబురొచ్చింది. ఎల్లుబాబూ నువెల్లిపో -"

"ఎక్కడికి వెళ్ళను?" కోపం వచ్చింది లక్ష్మీ మోహనరావుకి. "నేనెందుకు వెళ్ళాలి?" అన్నాడు.

"సాల్లే - ఇనస్పెట్టరొస్తే నన్నూ నిన్నూ జెయిల్లోకి తోస్తాడు. దయచెయ్యి పంతులూ పంతులూ ఇదిగో నీ బంగారం -" ఆమె పొట్లం మీదికి విసిరింది.

"పాప ఏదీ? ఇలా రమ్మను" మెల్లగా అడిగాడు రావు.

"పాపే చెప్పింది నిన్ను పంపించెయ్యమని, నడు నడు ఊఁ" అంది.

కోపంతో పొట్లం తీసుకుని లక్ష్మీ మోహనరావు గబగబా కిందికి దిగాడు. ఇటూ అటూ చూశాడు. గుమ్మం పక్కగా పాపనుంచుని ఉంది.

"నన్ను పొమ్మన్నావేం - వాడెవడు ఆ ఇనస్పెక్టరు, నాకేం భయం!" అన్నాడు గట్టిగా.

పాప నవ్వి "కోప్పడకు పంతులూ, మళ్ళీ ఎప్పుడైనా ఒద్దువుగానిలే, నా మాట విని వెళ్ళు."

"ఏం?"

"ఇదిగో - ఈ పది రూపాయలూ దగ్గరుంచుకో, నాకూ తెలుసు కష్టం ఏమిటో!"

ఎందుకో ఏ అవ్యక్త స్మృతివల్లనో చటుక్కున అతని కోపం పోయి సిగ్గుతో అవమానంతో తన మీద తనకి జాలితో బలహీనుడైపోయాడు లక్ష్మీ మోహనరావు. ఆమె జేబులో పదిరూపాయలు పెడుతూంటే తోసి వేయాలనుకున్నాడు కానీ, అతని నరాలూ, ఇంద్రియాలూ స్తంభించిపోయాయి. అలాగే నుంచునిపోయాడు. కోపంగా కేకలేద్దామనుకున్నాడు. కానీ మాట రావడంలేదు.

"వెళ్ళు పంతులూ" - పాప జాలిగా చూసి అంది.

లక్ష్మీ మోహనరావు జేబులోంచి నోటు తీసి ఆమె మీదకు విసిరివేశాడు. ఒళ్ళంతా అవమానంతో దహించుకుపోతోంది. నిర్జనంగా ఉన్న రాజమండ్రి రోడ్లమీద నడచిపోతున్నాడు. లక్ష్మీవారం పేట, తుమ్మలా నడిచిపోయాడు. పాప జాలిగా చూడడం అతనికి మరీ మరీ గుర్తుకు వస్తోంది.

తను దరిద్రుడని తెలిసిపోయింది. తన శక్తి అంతా ఈ ప్రమాదం రాకుండా ధారపోసినా లాభం లేకపోయింది. తనకి వ్యభిచరించే అర్హత కూడాలేదు. ఎంత దూరం ఆ చీకట్లో అలా నడిచాడో తెలియదు. కానీ అతను తనకి తెలియకుండానే తన ఇంటికి వెళ్ళాడు. అతని ఒంట్లోంచి సత్తువంతా ఎవరో తోడేసినట్లయింది. కాళ్ళు వణికాయి. తన ఇంటి మెట్లమీద చతికిలపడ్డాడు. మొహం చేతులతో కప్పుకున్నాడు. అతని గొంతు నుంచి మూలుగు హీనస్వరంతో బయటికి వచ్చింది.

ఇంటి తలుపు తెరిచి భాగ్యలక్ష్మి తొంగి చూసింది. "ఇంతదాకా ఎక్కడెక్కడున్నారు? రండి లోపలికి - అలా బెంగపడి పోతే ఎలాగ" అంటూ అతని చేయి పట్టుకుని లోపలికి తీసుకువెళ్ళింది.

"మీరు కూడా ఏమయ్యారో అని భయంతో ఛస్తున్నాను. చచ్చిన కొడుకెల్లానూ రాడు. మీరు కూడా.." ఆమె కంఠం రుద్ధమయింది.

"పడుకోండి ఇలాగ" అంటూ అతన్ని మంచం మీద పడుకోబెట్టింది.

లక్ష్మీ మోహనరావు కళ్ళు మూసుకుని పడుకున్నాడు. కనుకొలకుల నుంచి కన్నీటి బిందువులు రాలుతున్నాయి. లక్ష్మి అతని కళ్ళు తుడిచి "కాస్త విశ్రాంతి తీసుకోండి" అని తన కళ్ళు తుడుచుకుంది. లక్ష్మీ మోహనరావుకి కాస్సేపటికి నిద్రపట్టింది.

